# శ్రీతాళ్ళపాక
# అన్నమాచార్యుల జీవితచరిత్రము

తాళ్ళపాక చిన తిరువేంగళనాథుడు



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# శ్రీ తాళ్ళపాక
# అన్నమాచార్యుల జీవితచరిత్రము

రచయిత

తాళ్ళపాక చిన తిరువేంగళనాథుఁడు

(చిన్నన్న)

తొలి పరిష్కారము - పీఠిక

వేటూరి ప్రభాకరశాస్త్రి

తృతీయముద్రణ పరిష్కర్త

గౌరిపెద్ది రామసుబ్బశర్మ

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2001

SRI TĀḶḶAPĀKA
ANNAMĀCHĀRYULA JĪVITHACHARITHRAMU

*By*
Tāḷḷapāka China Tiruveṅgaḷanāthuḍu (Chinnanna)

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No : 566

First Edition : 1949
Third Edition : 1978
Re-print : 2001

Copies : 5,000

*Published by*
**P. KRISHNAIAH, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

తాళ్ళపాక కవులలో అన్నమయ్య ప్రథముడూ ప్రసిద్ధుడూ. ఆయన భగవంతుని నందకాంశంలో అవతరించాడని ప్రాజ్ఞుల పరిగణనం. బాల్యం నుంచీ పరమేశ్వర భక్తి ప్రవాహంలోనే ఈదులాడిన ఆ మహనీయుడు తన 16వ ఏటనుంచి సంకీర్తనలు వ్రాయడం ప్రారంభించాడు. అన్నమాచార్యుల వారు 32 వేల సంకీర్తనలతో శ్రీ వేంకటేశ్వరస్వామి పాదపద్మాల్ని అర్చించడమేగాక, సంస్కృతంలో వేంకటాచలమాహాత్మ్యము, సంకీర్తన లక్షణము, తెలుగున ద్విపద రామాయణము, శృంగార మంజరి, వేంకటేశ్వర శతకము మొదలయిన గ్రంథాలనుకూడా రచించాడు. సంస్కృతాంధ్ర భాషల్నీ, సంగీత సాహిత్యాల్నీ ఆపోశనంపట్టిన ఆచార్యులవారిని హరికీర్తనాచార్యుడు, పదకవితాపితామహుడు, పంచమాగమసార్వభౌముడు అని విద్వాంసులు ప్రశంసించారు. అన్నమయ్య ఆడిన మాటెల్ల అమృతకావ్యంగా, పాడిన పాటెల్ల పరమగానంగా భాసించాయి. ఆయన రచించిన ప్రతిపాటా శరణాగతి తత్త్వం ముల్లెగట్టిన ముత్యాల మూట!

ఆకాశవాణి, దూరదర్శన్‌లద్వారా ఈనాడు అన్నమాచార్యుల వారి సంగీతామృతాన్ని చవిచూడని ఆంధ్రు-డుండడు. ఆ భాగవతోత్తముని రచనలలోని వివిధాంశాలపై సిద్ధాంత గ్రంథాల్ని వెలువరించిన, వెలువరిస్తున్న పరిశోధకులకు, ఆంధ్రసాహిత్యారాధకులకు అన్నమయ్య రచనలు స్ఫూర్తిదాయకాలని చెప్పవచ్చు.

అన్నమాచార్యుల జీవితచరిత్రలోని విశేషాంశాలెన్నో తాళ్ళపాక చిన తిరువేంగళనాథుడు(చిన్నన్న) రచించిన ఈ గ్రంథంద్వారా మనకు తెలుస్తూవున్నాయి. ప్రముఖ విమర్శక పండితులు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారు చిన్నన్న రచనను ఆధారంగా గ్రహించి అన్నమయ్య జీవితచరిత్రకు వివరణాత్మకమైన పీఠికలు వ్రాశారు. తిరుమల

తిరుపతి దేవస్థానాలద్వారా 1949వ సంవత్సరంలో వెలుగుచూచిన ఈ గ్రంథం ఇప్పటికి మూడుమార్లు ముద్రించబడింది. బహుళజనాభిప్రాయాను సారం పునర్ముద్రణ నందిన ఈ అన్నమయ్య జీవిత చరిత్రను పాఠకలోకం ఎప్పటిలాగే ఆహ్లాదంతో ఆదరిస్తుందని,

" మనసునఁ గపటంబు మాని సద్భక్తి
ననఘమౌ నీ యన్నమాచార్య చరిత
వినిన వ్రాసినఁ బేరుకొనినఁ జదివిన
జనులకు నిష్టార్థసౌఖ్యంబు లొదవు"

నని మా ఆశయము, ఆకాంక్ష.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# పీఠిక -- విషయసూచిక


| | | పుట సంఖ్య. |
|---|---|---|
| 1. | అవతరణిక | ... 1 |
| 2. | అన్నమయ వంశము | ... 2 |
| 3. | అవతారము | ... 2 |
| 4. | బాల్యము | ... 3 |
| 5. | స్వామి సాక్షాత్కారము | ... 4 |
| 6. | తిరుపతికిఁ బయనము | ... 5 |
| 7. | శేషాద్రి దర్శనము | ... 9 |
| 8. | తలయేరు గుండు | ... 11 |
| 9. | శ్రీపాదములు | ... 11 |
| 10. | కురువనంబి | ... 13 |
| 11. | పెద్ద యెక్కుడు | ... 14 |
| 12. | కర్పూరపుఁ గాలువ | ... 14 |
| 13. | మోఁకాళ్ళ ముడుపు | ... 14 |
| 14. | త్రోవ భాష్యకారులు | ... 16 |
| 15. | స్వామి పుష్కరిణి | ... 17 |
| 16. | దేవాలయ ప్రవేశము | ... 18 |
| 17. | విష్వక్సేనుఁడు | ... 19 |
| 18. | హనుమంతుఁడు | ... 19 |
| 19. | ప్రసాదములు | ... 20 |
| 20. | స్వామి దర్శనము | ... 21 |
| 21. | స్వామి యుభయహస్తము | ... 22 |
| 22. | స్వామి మహిమలు | ... 23 |
| 23. | శుక్రవారాభిషేక దర్శనము | ... 29 |
| 24. | అన్నమయ పాడుట | ... 46 |
| 25. | అన్నమయ శృంగార సంకీర్తనములు | ... 47 |

పుట సంఖ్య.



| | | |
|---|---|---|
| 26. | రాజ ధిక్కారము | ... 49 |
| 27. | ఆచార్యునికి సంకెల | ... 51 |
| 28. | రాయల కైంకర్యములు | ... 54 |
| 29. | నాఁటి యన్నమయ | ... 54 |
| 30. | కొండకుఁ బయనము | ... 55 |
| 31. | అన్నల జోల | ... 56 |
| 32. | అన్నమయ జోల | ... 57 |
| 33. | అన్నమయ లాలి | ... 58 |
| 34. | అన్నమయ మహిమలు | ... 60 |
| 35. | అన్నమాచార్య పురందరదాసులు | ... 62 |
| 36. | సంకీర్తన సంఖ్య | ... 64 |
| 37. | ద్విపద రామాయణము | ... 65 |
| 38. | వేంకటాచల మాహాత్మ్యము | ... 65 |
| 39. | ఇతర గ్రంథములు | ... 68 |
| 40. | అన్నమాచార్య విగ్రహము | ... 68 |
| 41. | సంగీత రచన | ... 71 |
| 42. | అన్నమయ సంతానము - నరసింహకవి | ... 75 |
| 43. | పెదతిరుమలయ్య | ... 78 |
| 44. | సంకీర్తన భండారము | ... 84 |
| 45. | చినతిరుమలయ్య | ... 84 |
| 46. | పెదతిరువెంగళనాథుఁడు | ... 86 |
| 47. | చిన్నన్న | ... 86 |
| 48. | కోనేటి తిరువెంగళనాథుఁడు | ... 89 |
| 49. | తిరువెంగళప్ప | ... 90 |
| 50. | తిరుపతి శాసనములు | ... 90 |
| 51. | నేఁటి తాళ్ళపాకవారు | ... 92 |
| 52. | నందవరీకులు - వైష్ణవత | ... 92 |

పుట సంఖ్య.

| | | |
|---|---|---|
| 53. | అన్నమాచార్యాదులు తిరిగిన దేశములు | ... 93 |
| 54. | కీర్తించిన వేల్పులు | ... 93 |
| 55. | సంకీర్తన ముద్రా సామ్యములు | ... 94 |
| 56. | అన్నమాచార్యుని పలుకుబళ్ళు | ... 94 |
| 57. | ఛాయాపహారులు | ... 95 |
| 58. | భాషా విశేషములు | ... 97 |
| 59. | కవితారీతులు | ... 99 |
| 60. | ఆళ్వార్లు - అన్నమాచార్యుఁడు | ... 113 |
| 61. | ఆంధ్ర సంకీర్తనములు - ద్రవిడ పాశురములు | ... 113 |
| 62. | శ్రీ వేంకటేశ్వర వైభవము | ... 115 |
| 63. | అన్నమాచార్య చరిత్ర పరిశోధనము | ... 118 |
| 64. | స్వామి యనుగ్రహము! | ... 121 |


* * *









పెద్ద తిరుమలాచార్యులు




అన్నమాచార్యులు



సంకీర్తనముల తేకులు



సంకీర్తనముల తొలిరేకు





ంక గంగమ్మగుడి




తాళ్ళపాక గంగమ్మ



శ్రీలక్ష్మీనారాయణ స్వామి (కపిలతీర్థం)




జస్వామి (నృసింహతీర్థం)



శ్రీకోదండరామస్వామి గుడి







పాదాల మంటపము













పెద్ద యెక్కుడు (పాతగోపురంతో)



నామాలగోపురం







మోకాళ్ళమిట్ట (కొత్తగోపురంతో)



అఖండం - పురావస్తుసంగ్రహాలయము



పెద్దగోపురము (మహాద్వారగోపురము)





సంపంగి ప్రదక్షిణము







బలిపీఠము
















స్వామితో పెద తిరుమలాచార్యులు మరియు అన్నమాచార్యులు




కొండపై అన్నమాచార్యుల మండపము



c


శ్రీవారి పార్వేట మండపము














# వివేకదీపిక

శ్రీవేంకటేశ పాదాబ్జ భృంగత్వాత్త తనూరుచే!
స్వపుత్ర పౌత్ర సంక్రాన్త కవిత్వాయాఽన్న తే నమః.

ఇందు తాళ్ళపాక అన్నమాచార్యుల పౌత్రుడు, పెదతిరుమలాచార్య పుత్రుడు, 'చినతిరువేంగళనాథ' ఇత్యాది వ్యవహార నామములతో ప్రసిద్ధుడైన చిన్నన్న రచించిన "అన్నమాచార్యచరిత్రము" (ద్విపద), దానిని ఆధారముగా గొని ఆ చరిత్రములోని కొన్ని సన్నివేశములకు అన్నమాచార్యుల సంకీర్తనములను కొన్నింటిని సాక్ష్యముగ నిచ్చుచు కీ॥శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు రచించిన 'అన్నమాచార్యచరిత్రపీఠిక'యు మూడవసారిగ ముద్రితములగుచున్నవి.

చిన్నన్న రచించిన 'అన్నమాచార్యచరిత్ర'ద్విపద 50పేజీలతో ముగియగా, శ్రీశాస్త్రిగారి పీఠిక 123 పేజీలతో విస్తరిల్లినది. చద్దికి మూడింతలూరగాయగా పీఠిక నెవ్వరైన పేర్కొనవచ్చునేమోగాని, పెక్కు చారిత్రకాంశములతో నానా సంకీర్తన సాక్ష్యములతో ఆపీఠిక అంతగా పెరిగినదని పెద్ద లూహింపగలరు. ఈ పీఠికా, చరిత్రములు రెండును జోడించి 1949వ సంవత్సరమునందు మొదటిసారిగా శ్రీ శాస్త్రిగారి పర్యవేక్షణముక్రిందనే అచ్చైనవి. అందు వారే 'విపులమైన పీఠికతో' అని పేర్కొనియున్నారు. చరిత్రాంశములకు సంకీర్తనలను సాక్ష్యమిచ్చుచూ, ఆ సంకీర్తనకు తగిన చరిత్రము(మా.పుట 33)(ద్విపద) ఇత్యాదిగా ఉదాహరించుచూ పీఠికను నిర్మించిరి.

తరువాత ఇదే గ్రంథము తిరుపతిదేవస్థానమువారిచేతనే (పరిష్కర్తలెవ్వరో?) 1966న ద్వితీయముద్రణ మందినది. అందు చిన్నన్న రచించిన ద్విపదచరిత్రము తొలగించి శ్రీ శాస్త్రిగారి పీఠికనుమాత్రము యథాపూర్వముగ ముద్రించిరి. కాని పీఠికలో చిప్పగుర్తులో (మా. 11,12. పుటలు)

ఇల్యాదిగా నున్నవానిని యథావస్థితముగనే ఉంచిరి. దీనివలన ఎక్కడ యీ పుటలు మాచుకొనవలెనో తెలియక చదువరులు శ్రమపడియుందురు. ఈ రెండవముద్రణమునందుగూడ చిన్నన్న ద్విపదను జోడించి ముద్రించి యున్నచో చిప్పగుర్తులో చూపిన పుటలకు సార్థక్యముండెడిది. జరిగినదానికి విచారింపవలసిన పనిలేదు.

## మూడవముద్రణము

1978 ఏప్రిల్ నాటికి మూడవముద్రణము వెలువడుచున్నది. ఇందు పీఠిక రెండవ ఫారమునుండి గ్రంథమంతయు నాచేతిమీదుగా పరిష్కరింప బడవలసివచ్చినది. మొదటిఫారము పరిష్కరించినవారు 'సప్తగిరి' సంపాద కులు శ్రీ కాట్రపాటి సుబ్బారావుM.A.గారు.

ఈ రెండవఫారమునుండి పైగ్రంథమును పరిష్కరణకు తీసికొందును గదా, చాలస్థలములందు పీఠికలోని పాటలను రేకులతో సరిచూచిగాని ప్రక-టింపరాదని తోచినది. అట్లే మరికొన్ని విషయములందుకూడ నా మతికి తోచిన సవరణలు చూపవలసివచ్చినది. నా మతికి తోచిన వాని నన్నింటిని * నక్షత్రముగుర్తుతో పాదదీపికలో(Foot Note) మనవిచేసికొన్నాను. రేకులతో సరిచూచినప్పుడు పాటలలో సవరణలున్నచో రేకుల పాఠమునే నేనిందు గుర్తించుచూ, రేకులపాఠమునకు భిన్నముగ సబబైన శాస్త్రిగారి సవరణలేవైన నున్నచో ఆ పాఠములను ప్రక్కన ప్రశ్నార్థకములోబాటు చిప్ప గుర్తులో(?) గుర్తించుచూ చూపియున్నాను. శేషాచార్యుల వ్రాతప్రతి మూలము నేను చూడలేదు. సుప్రసిద్ధులగు శ్రీశాస్త్రిగారి పరిష్కరణమును త్రోసిరాజని నేను కొన్ని పాఠములను రేకులలో నున్నవిగా చూపినచో కొందరు సందేహింపవచ్చును. దానికై నే నెట్టి స్థలములలో రేకుల పాఠమునే ప్రకటింపవలసివచ్చినదో మచ్చునకు కొన్ని ఉదాహరించి వివరించుచున్నాను.

1. పీఠిక 18 పేజి పూర్వముద్రితము:-

దేవుని కిదే వునికి నీ తెప్పల కోనేరమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా ॥పల్లవి॥

సవరించినది:

దేవునికి దేవికిని తెప్పం కోనేటమ్మ

(అన్న. అధ్యా. రే. 185, సం. 7-192 కీ.)

(ప్రస్తుత ముద్రణ, 17 పుట.)

ఇందు పూర్వముద్రిత పాఠములో నీ తెప్పలకోనేరమ్మ అని యెట్లు సంబోధింపవలెనో? వేవేలు మొక్కులు కోనేరమ్మకే చెల్లుతాయి. 'దేవునికి ఇదే వునికి' అన్నచో దేవాలయ మేమైనట్లు? కావున 'నీ తెప్పం కోనేరమ్మ' లోని 'నీ' హ్రస్వమై 'దేవునికి దేవికిని' అని సవరించిన పాఠములో అన్వయము సుఘటితమగుచున్నది. వేవేలు మొక్కులు దేవునికీ, దేవికినీ చెల్లుతాయి. 7వ సంపుటమున రేకులోనిపాఠము యథావిధిగనే ముద్రింపబడినది. ఈ రేకులపరిష్కరణమున 'యా' తప్ప హల్లులపైని ఇ ఈ, ఎ ఏ, ఒ ఓ ల హ్రస్వ దీర్ఘ స్వరూపములు పరిష్కరించువారి శక్తికి, అర్థశుద్ధికి సంబంధించినవిగ నుండును. రేకులలో హ్రస్వ దీర్ఘములకు నేటి వ్రాతమాదిరి విడివిడిగ గుర్తులు రేవు. సందర్భము ననుసరించి పదస్వరూపమును గుర్తించి మనమే నేటి వ్రాతమాదిరికి అనుకూలముగ మలచుకోవలెను. ఈ చిక్కు అందరకూ సహజమే.

2. పీఠిక 20 పేజి పూర్వముద్రితము:-

నీవేకా చెప్పఁ జూప నీవేకా

సవరించినది:

నీవేకా చెప్పఁ జూప నీవె నీవెకా

(అన్న. అధ్యా. రే. 42 సం. 5-158)

(ప్రస్తుత ముద్రణ, 19 పుట.)

దీనిలో అర్థగతికి భంగమురాదుగాని, ఒక 'నీవె' రేకుండుటచే తాళ గతికి భంగము కలుగుచున్నది. పై రెండుపాఠములను సంపుటములలో చక్కగనే యున్నవని చూపియున్నాను.

3. పీఠిక 36 పేజి పూర్వముద్రితము:-

యిడుమతెల్లాఁ బాపె నేగురుఁడు

యిడుమతెల్లాఁ బాపె నేమరుదు (సం.16. పా.52)

సవరించినది:

యిడుమతెల్లాఁ బాపె నేమరుఁడు

(వి.తి. అధ్యా. రేకు.9.)

(ప్రస్తుత ముద్రణ, 34 పుట.)

ఇది చినతిరుమలయ్య కీర్తనగావున ఆతడు అన్నమాచార్యుని 'గురుడు' అని పేర్కొనియుండవచ్చు -- అని ఊహించి శ్రీ శాస్త్రిగా రట్లు చేసి యుందురు. దీనిలో అర్థము కొంత సుఘటితమైనదని చెప్పవచ్చును. కాని మూలపాఠమును సవరించునపుడు మన యభిప్రాయమును విడిగ చిప్పగుర్తు (బ్రాకెట్టు)లో సూచించుట మంచిదిగదా. ఇదే పాటను 16వ సంపుటమున ప్రకటించినవారు "నేమరుదు" అని పరిష్కరించిరి. ఈ రేకుల వ్రాతలో 'దు', 'దు'లు గుర్తించుట ఒక్కొకసందర్భమున కష్టమేయైనను, 'దు' ముందున్న అరసున్న ఇక్కడ ఆ క్లేశమును పరిహరించుచున్నది. 'అరుదు'లో అరసున్న లేదుగదా? 'మరుఁడు'ను 'మరుదు'గా సవరింపదలచినచో వారైన సూచన లిచ్చియుండవలసినదే గదా?

'మరుఁడు' స్మరశబ్దభవముగదా? "స్మర్యతే ఇతి స్మరః" అని దాని వ్యుత్పత్తి. 'మరల మరల స్మరింపబడు' అను యౌగికార్థమున స్మరశబ్దభవమైన 'మరుఁడు'ను గురువాచకముగ ప్రయోగించిరా -- అని నా సందేహము. పెదతిరుమలాచార్య, చినతిరుమలాచార్య, చిన్నన్నలు గట్టి పండితవీరుల కోవకు చేరినవారు కావున, నే నట్లూహించితిని. ఇది బలవంతముగ లాగిన అర్థమనుకొన్నచో శ్రీ శాస్త్రిగారి పాఠమే రుచిర్మైనది.

4. పీఠిక 38 పేజి పూర్వముద్రితము:-

దాఁచుకొని పాదాలకుఁ దగ నేఁ జేసిన పూజ లివి

(సంపు. 7-104 పాట)

సవరించినది:

దాఁచుకో నీ పాదాలకుఁ దగ నేఁ జేసినపూజ లివి

(అన్న. అధ్యా. రేకు 169)

(ప్రస్తుత ముద్రణ, 36 పుట.)

ఈ పాట, పీఠికలోను, సంపుటమునందును ఒకేతీరుగ ప్రకటింప బడినది. దీనిలోని భావము అన్నమాచార్యులు వేంకటేశ్వరునకు నిస్స్వార్థ-మైన తన సంకీర్తనపూజావిధి నివేదించుట. 'దాఁచుకొని' అని క్త్వాంతముగ చెప్పినచో - ఎవరు దాచుకొని, ఎక్కడదాచుకొని, ఎందుకు దాచుకొని - ఇత్యాది ఆకాంక్షలు సదుత్తరము లేక నిలుచుచున్నవి. ఊరకే "పాదాలకు" అన్నచో ఎవరి పాదాలకు అని ఆకాంక్ష ఎదురగుచున్నది. నీ పాదాలకు నేను చేసిన పూజ లివి (సంకీర్తనములు) 'దాఁచుకో=దాఁచుకొమ్ము' అని అన్న మయ్య వేంకటేశ్వరునకు విన్నవించినట్లు సుఘటితాన్వయ మగుచున్నది. కావున సవరింపవలసివచ్చినది. రేకులవ్రాతలో అచ్చులపైని హ్రస్వదీర్ఘములు మన వ్యుత్పత్తిపై ఆధారపడియుండుటచేతనే ఇట్టి తడబాట్లు జరుగుచున్నవి.

5. పీఠిక 54 పేజి పూర్వముద్రితము:-

బలికే నంటాఁబోయి పయిఁడి వచ్చుకతన
పతి యవసరమునఁ బ్రాణమిచ్చీవి (పీఠిక)
బలికేనంటాఁబోయి పయిఁడి వుచ్చు కతన (సం. 6. పాట 13)

సవరించినది:

బలికేనంటాఁబోయి పయిఁడి వుచ్చుక తన-
పతియవసరమునఁ బ్రాణ మిచ్చీవి (అన్న.అధ్యా.రే. 103)

(ప్రస్తుత ముద్రణ, 50 పుట.)

ఇక్కడ 'వుచ్చు' అను పాఠమును నిరర్థకముగ భావించి శ్రీ శాస్త్రిగారు 'వచ్చుకతన' యని సవరించియుందురు. సవరణకు సూచన చూపలేదు. 'డబ్బువచ్చుటవలన' అని వారి యర్థముగాబోలు. ఆరవ సంపుటమున ఈ పాటను పరిష్కరించినవారైనా అర్థవిషయమున సందేహించినట్లు కాన

రాదు. శ్రీ శాస్త్రిగారి సవరణ కొంత సందేహించినట్లైనా తెలుపుచున్నది. ఆరవ సంపుటమును పరిష్కరించినవారు 'పయిఁడి వుచ్చు కతన' అని విభజించి వ్రాయుటలో అర్థమేమిగా నూహించిరో తెలియుటలేదు. 'వుచ్చుక' లోని 'క' పొరపాటుతో 'తన'తో కలిసి 'కతన' అయినదేమో?

హరి సంకీర్తనములేక వ్యర్థముగ కాలక్షేపముచేయు మనసును మందలించుట ఈ పాటలోని ప్రధానార్థము. ఏ యే ఊహలతో, ఏ యే త్రోవలలో నడచి మనుజుడు చెడిపోవునో అవి ఒక్కొక్క చరణమున ప్రత్యేకముగ వింగడింపబడినవి. 'బ్రతికేనంటాఁ బోయి పయిఁడి వుచ్చుక = పుచ్చుకొని, తనపతి యవసరమున అను పై పాదముతో సమన్వయించినచో, బ్రదుకాసతో ప్రభువుదగ్గర ధనము పుచ్చుకొని, వాని యక్కరకు విలువైన తన ప్రాణ మిచ్చుచున్నాడని మందమతిని బోధించినట్లు భావము స్పష్టమగునని నా యూహ.

మరి పీఠిక *103వ పేజీలో "వెఱ్ఱులాల మీకు వేడుక గలిగేను" అనుపాటలోని 5వ చరణము మూడవపాదములో కడపట 'ముట్టు' అని (అన్న.అధ్యా.రేకు 196 పాఠము). దానిని శ్రీశాస్త్రిగారు 'మట్టి' అని సవరించిరి. నేను రేకుపాఠమును యథావిధిగ చూపి శ్రీశాస్త్రిగారి పాఠమును దానిప్రక్కనే చిప్పగుర్తులో ప్రశ్నార్థకముగ చూపితిని. 'ముట్టు పెంచు' అర్థము సరిపడదని కాబోలు శ్రీ శాస్త్రిగారు 'ముట్టు'ను 'మట్టి'గా సవరించిరి. "ముట్టుపెంచు = అంటుపడినవారు తాకిన మట్టిపెంకు" అని కవియభిప్రాయముగ నే నూహించుచున్నాను. ఛాయాపహారులనుగూర్చి అన్నమయ ఈ పాటలో ఘాటుగ దూషించినాడు. దాని భావతీవ్రతకు నా యభిప్రాయ మనుకూలముగ నున్నదనుకొందును. ఈ పాట సం.7-260 పాటగ 'ముట్టు' శబ్దముతోనే ముద్రింపబడినది.

చూపదలచుకొన్నచో గుర్తించుకొన్న వింకనూ గలవు. వానిలో చాలాభాగము 'నక్షత్రము' గుర్తుతో అక్కడక్కడ గుర్తించియున్నాను.

---

* చూ.ప్రస్తుత ముద్రణ 95 పుట.

ఈ రేకుల వ్రాతలో ద్విరుక్తాక్షరమునకు ముందున్న 'నిండు సున్న' నిండుసున్నగా, ద్విరుక్తములుకాని పరుష సరళములకు ముందున్న 'నిండు సున్న' అరసున్నగ శాసనముల వ్రాతమాదిరి చదువుకొనవలసియున్నది. దానిని నేటివ్రాత కనుకూలముగ పరిష్కరించి ముద్రింపించుట పరిష్కర్తల భారము. ఈ పీఠికలో చూపిన చాల పాటలలో పెక్కుతావుల పై అర్ధానుస్వార, పూర్ణానుస్వారపద్ధతి గుర్తింపబడినట్లు లేదు.

అది ప్రథమ పరిష్కరణముగాబట్టి, అప్పటి కముద్రితములైన రేకుల-లోని పాఠములనే ఎవరెవరిచేతనో చదివింపించి శ్రీ శాస్త్రిగారు తొందర తొందరగ ఈ పీఠికను నిర్మించియుందురు గావున, పై విల్లరదోషములు దొరలియుండవచ్చు. "చెఱకునకు వంకపోతేమి చెడునె తీపు" అని రసికు లూహింపగలరు.

పీఠిక 17వ పేజీలో "అన్నమయ కొండ నెక్కునాఁటి కెనిమిదేండ్ల వాడని యున్నదిగాని, దాని నుపనయనముచే ద్విజత్వము వచ్చినదాదిగా నని యన్వయించికొని యెనిమిదేండ్లవాఁడని, మాతృగర్భముననుండి పుట్టినదాది పదునాఱేండ్లవాఁడని సరిచూచుకోవలెను. "కొండనెక్కునాఁటి కాతఁడు సంకీర్తనకర్త" అని శ్రీశాస్త్రిగారు అన్నమయ కొండ జేరు నాటికి పదునాఱేం డ్లవాడై యుండవచ్చునని, దానికి ఉపనయనమైన దాదిగ నెనిమిదేండ్లు కూడినచో పదునాఱేండ్లు కాగలవని, దూరదూరముగ ఎందు కన్వయించిరో తోచకున్నది. అసలు చిన్నన్న వ్రాసిన చరిత్రములో --

"ఇంతయై యంతయై యాడేటి బుద్ధి-
మంతుండై పంచవమంబులైనంత
నియతిమై గురుఁ డుపనీతుఁ గావించి
నయవేది నధ్యయనంబు సేయించె"

(అన్నమాచార్యచరిత్రము పు. 13)

అని యున్నది. అన్నమయ్యకు అయిదవయేటనే ఉపనయన మైనదని అన్నమాచార్యచరిత్రకర్త చిన్నన్న చెప్పుచుండగా, ఆతనికి ఎనిమిదేండ్ల కుప-

నయనమైనదని అదియొక జన్మముగా తీసికొని, ఆ తరువాత ఎనిమిఁదేండ్లకు (16 యేండ్లకు) కొండ నెక్కియుండవచ్చునని మన మూహింపవలసినపని యేమి? తీక్ష్ణబుద్ధియగు అన్నమయ్యకు అయిదవయేట ఉపనయనము జరిగియుండుననుట అసంభావ్యమూ గాదు; అశాస్త్రీయమూ గాదు. శ్రీ శంకరాచార్యులకు అయిదవయేటనే ఉపనయనము జరిగినట్లు చరిత్ర చెప్పుచున్నది.

"ఉపనయనం బ్రాహ్మణస్యాష్టమే" 1.7.

"పంచమే నవమే వా కామ్యమ్" 1.8.

"గర్భాదిః సంఖ్యా వర్ణానామ్" 1.9.

"తద్ద్వితీయం జన్మ" 1.10.

"తద్యస్మాత్ స ఆచార్యః" 1.11 --

అని గౌతమధర్మసూత్రములు. "నవమే త్వాయుష్కామమ్ పంచమే బ్రహ్మవర్చస కామమ్" అని, 1.8గ గౌతమ ధర్మసూత్ర వ్యాఖ్యానమున మస్కరిభాష్యము స్మృత్యంతరముగ నుదాహరించినది. కావున ఐదవయేట ఉపనయనము శాస్త్రీయము. చురుకైన బుద్ధిగలవారికి ఏ కొందరికో మాత్రమే జరుగుట సంప్రదాయము.

స్వామినందకాంశభవుడై మేటిమేధావియై ఐదేండ్లకే ఉపనయనము చేయించుకొన్నవాడు ఎనిమిదేండ్లకు సంకీర్తనము లల్లలేడా? పదునారేండ్ల నుండి స్వామి యాదేశముచేతనో తన సంకల్పముచేతనో అవి నియతముగ సాగియుండవచ్చు.

ఇక, దుర్బలాహారులగు నేటివారుగూడ కాలినడకన ఎనిమిఁదవ యేటనే కొండనెక్కుచుండుట ప్రత్యక్షమైన విషయమే. అట్లు అన్నమయ్యయు, పుట్టినదాది యెనిమిదవయేటనే కొండ నెక్కియుండుట వింతగాదు.

"ఈ లీల నెనిమిదియేఁడుల పిన్న-
బాలుఁడయ్యును నిష్ఠఁ బనిఁబూని యతఁడు
... ... ... ... ... ... ... ... ...

వితతవృత్తంబుల వేంకటపతికి
శతకంబు కుతుకంబు సమకూరఁజేసి
పదిరెండు నామముల్ బాగుగాఁ దీర్చి
పరమలాచారుఁడై చనుదెంచి యతఁడు"

(అన్నమాచార్యచరిత్రము పే. 26-27)

అని చిన్నన్న, తాతగారి చరిత్రమును దగ్గరకాలములో విన్నవాడు చెప్పుచుండగా, శ్రీశాస్త్రిగారు కోమలమతులుగాన, అన్నమయ్యను సుకుమారునిగ భావించి ఎనిమిదవయేట కొండనెక్కించుటకు సందేహించిరి.

ఎక్కడో ఏవో కొన్ని చిల్లరమల్లరదోషములను ఎత్తిచూపవచ్చుగాని, శ్రీశాస్త్రిగారివలె ఇంత పరిశ్రమించి, నానావిషయములను సేకరించి, చిన్నన్న వ్రాసిన చరిత్రమునకనువుగా సాక్ష్యమిచ్చునట్టి సంకీర్తనములను అముద్రితములై రాగిరేకులలో మ్రగ్గిపడియున్నవానిని, కొండంత ఓపికతో, ఒడలు జడివాన గురియు నిండుశ్రమతో, పరమ భక్తిభావముతో జతగూర్చి ఇంత పెద్దపీఠికను సంతరించుట అందర కలవియైన పని గాదు. ఏ గ్రంథమైనను ఒకటికి పలుమార్లు పరిష్కరింపబడునపుడు కొన్ని సత్యములు, లోపములు వెలికి వచ్చుచుండుట సహజమే. అంతమాత్రమున ప్రథమ పరిష్కర్తల భారము, జ్ఞానము చిన్నది గాబోదు. మొదటివారే తరువాతివారికి మార్గదర్శకులని భావించు రసికులకు వేరుగ విన్నవింప పనిలేదు.

"వర్త్మ కర్షతు పురః పరమేకః తద్గతానుగతికో న మహార్ఘః" అనిన శ్రీహర్షుని వచనము మరువరానిది.

"త్రిస్రోతసం తాళ్ళపాక కవి విష్ణుపదోద్భవాం ।
సమాస్వాద్యాం కృతీ చక్రే ప్రభాకర భగీరథః ॥"

* * *

# వివేకదీపిక - 2

మనప్రాచీనకవులలో ఆత్మచరిత్రము వ్రాసికొన్నవారుగానీ, వ్రాయించుకొన్నవారుగానీ అరుదు. తెలుగు కవులయందేకాక సంస్కృత కవులయందు గూడ వారి చరిత్రసందేహము లీనాటికీ పెక్కులు కలుగు చుండుట కిదియే కారణము. ఒకవిధముగ చరిత్రపరిశోధకుల కిది యొక పండుగ. ఎవరంతకు వారు నాసాంతఃకేశలుంఛనముగ కవుల చరిత్రలు చిత్రింపవచ్చు.

సుప్రసిద్ధులైన పూర్వకవులలో తిక్కననుగూర్చి కేతన, శ్రీనాథునిగూర్చి దగ్గుపల్లి దుగ్గన - రాధామాధవ కవియు, పండితారాధ్యులనుగురించి సోమ నాథుడు ఇత్యాదులు సంగ్రహముగ చెప్పినట్లు వారి గ్రంథములు సాక్ష్య మిచ్చుచున్నవి.

తెలుగు కావ్యములలో, కృతిపతి వంశము, కృతికర్తృ వంశము అను శీర్షికలలో రెండవదానిక్రింద కొందరు తమ వంశచరిత్రను సంగ్రహముగ చెప్పకొనియున్నారు. కాని ఆ చరిత్రముగూడ కొన్నిపట్టుల సందేహ సంకులమే. ఒకే పేరితో తాతలు, మనుమళ్లు ఉండుటచే ఆ కవులకు ఆశ్రయు లైన రాజులకాలము నాధారముచేసికొని స్థూలారుంధతీన్యాయముగ వారి దేశ కాలములను నిర్ణయింపవలసియున్నది.

మన తాళ్ళపాకకవుల విషయమునందు అట్టి సందేహములకు తావు లేదు. ఈ వంశపుకవికుటుంబమునకు తాళ్ళపాక అన్నమాచార్యులు మూలపురుషులు. ఆయన తరువాత కొడుకులు, మనుమళ్ళుగూడ కవులుగా వెలసిరి. ఇదియు అపూర్వమే. పండితపుత్రన్యాయ మిక్కడ మొక్కవోయినది.

అన్నమాచార్యుల పౌత్రుడు, పెద్దతిరుమలాచార్యుల నాలుగవ పుత్రుడు నగు చిన్నన్న స్వయముగా తన తాతగారి చరిత్రము ద్విపదప్రబంధముగ వెలయించినాడు. కాలముచేతను, వంశమర్యాదలచేతను, దగ్గర కాలమున

తన వంశపురుషులనుగూర్చి వినియుండుటచేతను, ఈతనికి తాతగారి చరిత్ర అసందిగ్ధముగ తెలిసినదనియే నమ్మవచ్చును. తనవారే తన కథ వ్రాయునంతటి చరిత్ర ప్రశస్తి గలవాడు అన్నమయ్యగూడ.

ఈ అన్నమాచార్యచరిత్ర (ద్విపద) మూలప్రతి ఒక్కటే కలదు. అది తప్పుల కుప్ప. దానిని కీ॥శే॥వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఎంతో పరిశ్రమించి ఈ రూపమునకు తెచ్చి 1949లో మొదటిసారిగ ముద్రింపించినారు. మూల గ్రంథమును, ముద్రిత గ్రంథమును ప్రక్కప్రక్కన ఉంచుకొని చూచిన-వారికిగాని శ్రీశాస్త్రిగారి పరిశ్రమ తెలియదు. ఇంతగా శ్రీశాస్త్రిగారు పరి-ష్కరించినను ఏవో కొన్ని జారుబాటులు మనకు కనిపించుచునే యున్నవి. అంతమాత్రమున శ్రీ శాస్త్రిగారి ప్రసిద్ధి, పరిష్కరణము మొక్కపోదు. ఒకే మూలప్రతితో పరిష్కరణము సాగించుట ఎంత కష్టమో ఆ పనిచేయువారికే యెరుక.

ఈ చరిత్రగూడ చిన్నన్న కావ్యశైలిలోనే రచించినాడు. అతని చేతిలో ద్విపద, గౌరన రంగనాథులశైలి ననుకరించుచు, తనకాలమునకే ద్విపదలో ప్రసిద్ధి గనిన శైవకవుల ద్విపదశైలినిగూడ చప్పరించుచు, కమ్మచ్చులో బంగారుకమ్మి తీరినట్లు సాగును. దానికి --

" చిన్నన్న ద్విపద కెఱఁగును
పన్నుగఁ బెదతిరుమలయ్య పదమున కెఱఁగున్
మిన్నంది మెఱయు నరసిం-
గన్న కవిత్వంబు పద్యగద్యశ్రేణిన్"

అనిన తెనాలి రామలింగని చాటువే సాక్షి.

ఈ చరిత్రముమాత్రము రెండవసారిగ ముద్రితమగుచున్నది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాధికారుల యనుమతితో, వారి ప్రాచ్యలిఖిత భాండాగారమునందలి దీని మూలప్రతిని తీసి శ్రీశాస్త్రిగారి ముద్రితప్రతితో సరిచూచి దీనిని ప్రకటించుచున్నాము. మా కీ యవకాశమిచ్చిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాధిపతులకు నిండు మనసుతో మా కృతజ్ఞత తెలుపుకొనుచున్నాము.

ఇందు నా మదికి తోచినవానిని అక్కడక్కడ నక్షత్రముగుర్తుతో పాదదీపిక(Foot note)లో పొందుపరచియున్నాను. వానిలో కొన్నింటినిమాత్రము ఇందు వివరించి నా సవరణమునకు కారణములు విన్నవించుకొందును.

1. అన్నమాచార్యచరిత్రము ద్విపద మూడవపంక్తిలో "శ్రీవేంకటేశుఁ బోషితపద్మకేశు" అని యుండగా, శ్రీశాస్త్రిగారు "....కోశు" అని సవరించిరి. 'కేశ'శబ్దమునకే, 1.తలవెంట్రుక; 2.గుఱ్ఱపుమెడవెంట్రుక; 3.కిరణము; 4.యోని ఇత్యాదిగ అర్థములు గలవని సూ.ని., వా.ని. చెప్పుచున్నవి. ప్రౌఢకవియగు చిన్నన్న ఆ తరగతి ప్రయోగమునే చేసియుందునేమో యని నే నూహించుచున్నాను. శ్రీ శాస్త్రిగారి 'కోశు' పరిష్కరణము స్పష్టార్థమనుటలో సందేహములేదు. చేయకుండినను అర్థము దెబ్బతినియుండదని మాత్రమే చెప్పవచ్చు.

2. చరిత్ర 11వ పేజీలో "తనయుండు గల్గిన తన పెట్టుబెల్ల" అని మూలము. "... ... ... పుట్టుబెల్ల" అని శ్రీ శాస్త్రిగారి సవరణ. మూలపాఠమే ఒకవిధమైన లోకోక్తి కనుగుణముగా కవి వాడెనేమో యని భావింపవచ్చు. "దానముకొద్దీ బిడ్డలు - పూజకొద్దీ పురుషుడు" అని లోకోక్తి, 'తామెంత మంచివస్తువులను దానమిస్తే అంతమంచి బిడ్డలు పుట్టారు' అని దీని భావము. దానికి మూలపాఠ మనుగుణము. 'జన్మ ధన్యమగునట్లు' అను సాధారణార్థమున శ్రీ శాస్త్రిగారి వ్రాతయు సబబే. పాఠము మార్చకుండినను పరవాలేదనిమాత్రమే భావన.

3. 13వ పేజీ 6వ పంక్తిలో "కొండలప్పనికి మ్రొక్కుమటంచు ననకు యొందులాగుల జత లొనరించఁ దతఁడు" అని మూలము. "... ... జతు" అని శ్రీశాస్త్రిగారి సవరణ. అది 'జోత'గా నుండవచ్చునని అనుకొందు. గణభంగము కాదు. జతి=సంగీతములో యతి. జోత= నమస్కారము. మ్రొక్కుమటంచుమని చెప్పినపుడు 'జోత' లొనరించుట సహజమే కాని 'జతు' లొనరించుట సహజముకాదు. చిన్నబిడ్డల నాడించునపుడు 'ఏడు కొండలవాడా జోత'; 'వెంకటరమణా జోత' -- ఇత్యాదిగ చెప్పట నేటికిని సుప్రసిద్ధమే.

" ... ... ... ... గట్టురా -
మూలి యనుంగుసామికివి జోతలు జోతలటంచు"
(పారంగధర చరిత్ర 1-44)

ఇత్యాది మహాకవి ప్రయోగములు సుప్రసిద్ధములే.

4. చరిత్ర 16వ పేజీ 10వ పంక్తిలో

"కానిక రూకల కణఁజాలవాఁడె" అని మూలము. "కానిక రూకలఁ గనఁజాలువాఁడె" అని శ్రీ శాస్త్రిగారి సవరణ. కణఁజాలు=గాదెలు. స్వామికి బంగారు కణజాలున్నట్లు 24వ పేజి 24వ పంక్తి "బంగారు గాదెల పజ్జ" అని చరిత్రలో గలదు. 'కానిక రూకల కణఁజాలవాఁడె' అను సమస్తపదమైన మూలపాఠమే సరిపోవునుగదా.

5. 24వ పేజి 15వ పంక్తిలో

" గుట్టున మది మ్రొక్కుకోరా కానుకలు
పెట్టరో దండముల్ పెట్టరో యిపుడె"

అని మూలము. "... ... మ్రొక్కికోరా" అని శ్రీశాస్త్రి గారి సవరణము. 'మ్రొక్కుకొన్న' అని యుండుట బాగేమో. 'రహస్యముగా మీరు మ్రొక్కుకొన్న కానుకలను ఇపుడు బాహాటముగ స్వామికి సమర్పింపు'డని అర్థము సరిపోవునుకదా!

6. 28వ పేజీ 4వ పంక్తి "అల తలుపులు ఫెళఫెళన తెరచుటయు" అని మూలము. "ఫెళ్ఫెళన" అని శ్రీశాస్త్రిగారి సవరణ. ఈ సవరణవలన మూలములో ఒక అక్షర మెక్కువగుచున్న ఛందోదోషము తొలగినది గాని, యతిస్థానము స్పష్టపడలేదు. 'ఫెళ్ఫెళని' అని యుండవచ్చు ననుకొందు. 'ఫెళ్ ఫెళ్'+అనిలో అకారము యతిస్థానమై నిలుచును. శ్రీశాస్త్రిగారి పాఠములో 'ఫెళన' ప్రక్కన అరసున్నయుండి 'తె' 'దె' గా సరళమైయున్నచోగూడ సరిపోయియుండెడిదే.

7. 31వ పేజీలో 19వ పంక్తిదగ్గర శ్రీశాస్త్రిగారు గ్రంథపాతమన్నారు. అక్కడనున్న అసందర్భపాఠమునకు శస్త్రచికిత్సచేసి సరియైన పాఠముతో తరువాతి గ్రంథమును సాగించుటకు చాల శ్రమపడియుందురు. "దుల గుచు ... ..." ఇత్యాది అనన్వితభాగమును త్రోసిపుచ్చి "వేద్యంబులగు" ఇత్యాదిగ తరువాతి భాగమును పరిష్కరించిరి. ఒకే మూలప్రతియైనందున ఏమిపోయినదో ఎంతపోయినదోగూడ గుర్తించుట కష్టము. అన్నమయ్యకు వైష్ణవమిచ్చి, పంచసంస్కారములు చేసిన శ్రీవైష్ణవుల ప్రక్రియాపద్ధతియు, అన్నమయ్యతల్లి ఆతని వెదకికొనుచువచ్చి, విరక్తుడైన కొడుకును రక్తునిగ మార్చుటకు ఆతని గురువుల పజ్జ పడినపాటులు ఆ గ్రంథ పాతమున ఉండవచ్చునని తోచుచున్నది.

8. 45వ పేజీలో 18, 19, 20, 21 వ పంక్తులు ప్రాసభంగముతో ముద్రితములైనవి. ఇది కేవలము కనుజారుబాటే.

" యోగమార్గంబున నొక కొన్ని, బుధులు
రాగిల్ల శృంగార రసరీతిఁ గొన్ని
సారసనేత్రుపై సంకీర్తనములు
సరసత్వమునఁ దాళ సముఖముల్ గాఁగ
పరమతంత్రములు ముప్పదిరెండువేలు"

అని మూలము. ఇక్కడ 'సారసనేత్రుపై' అనుపాదము గుర్వాదిగా ర ప్రాసతో నొకటే యున్నది. దానినట్లే విడిచిన ద్విపదకాక ఏకపద కావలసివచ్చును. శ్రీ శాస్త్రిగారు ఆ యొంటిపాదమును జంటచేయదలచి "వైరాగ్యరచనతో వాసింపఁ గొన్ని" అని తామేపూరించి యుందురు. సందర్భోచితమైన చక్కని పూరణము. ఈ పరిష్కరణ పరిశ్రమలో కొంత తడబాటు గలిగి,

" యోగమార్గంబున నొక కొన్ని బుధులు
వైరాగ్యరచనతో వాసింపఁ గొన్ని
రాగిల్ల శృంగార రసరీతిఁ గొన్ని
సారసనేత్రుపై సంకీర్తనములు"

అని ప్రాసభంగముతో అచ్చైనది. ఈ చిన్నదోషము ఇప్పుడు సవరింపబడినది[1].

---

[1] చూ. ప్రస్తుత ముద్రణ, పుట 48.

9. 46వ పేజిలో 17వ పంక్తి "వినిన వ్రాసినఁ జదివినఁ బేరు కొనిన" అని మూలము. అది "వినిన వ్రాసినఁ బేరుకొనినఁ జదివిన" అని ముద్రితమైనది. మూలపాఠము యతి కనుగుణము.[1] ముద్రితపాఠములో ప్రాసయతికి పాల్పడవలసివచ్చును.

10. (1) పనిమంతుఁడు (27వ పే. 2వ పంక్తి), (2) శిరసావహించి (29వ పే. 15వ పంక్తి), (3) వాద్యదండెయు (36 వ పే. 6-7 పంక్తులు) వంటి ప్రయోగములను వ్యాకరణము త్రోసిపుచ్చినను, లోకసిద్ధిని పురస్కరించుకొని ప్రయోగించి, తాళ్ళపాకకవుల తెగువను, వ్యావహారికపదప్రీతిని చూపినట్లున్నది.

తప్పుల తడకగానున్న మూల పుస్తకమును పఠన యోగ్యముగ పరిష్కరించినందులకు శ్రీశాస్త్రిగారికి ఆంధ్రసాహిత్యలోకము ఋణపడియున్నది. నేను పైని జూపిన కొన్ని చిల్లరదోషములు, రెండవ ముద్రణము వారి చేతిమీదుగనే సాగియుండినచో సుపరిష్కృతములై యుండెడివి. కాని శ్రీ శాస్త్రిగారు ఒకటి రెండుస్థలములందు తప్ప ఎక్కడను మూలపాఠములు చూపలేదు. సవరించితిననియు చెప్పలేదు. ఆ మూలపాఠము అంతటా చూపకుండుట మంచిదే. అది అంత సంస్కారముగల ప్రతి. సవరించితినని చెప్పియుండినచో ఈ పరిష్కరణమున ఈ మాట కవసర ముండదు.

అన్నమయ్య మనుమడే ఇంచుమించు సమకాలికుడు, ప్రామాణికుడు, రచనాధురీణుడునై దీనిని రచించుటచే ఈ చరిత్ర విలువ చాల గొప్పది. అందువలన దీనిని పీఠికతో జోడించి ముద్రించుటయేగాక, విడిగ కొన్నిప్రతులు ముద్రించి సాహిత్యజిజ్ఞాసువులకు అందించుచున్నాము. ఇట్లు రెండువిధముల ముద్రించుట కంగీకరించి, ఈ తాళ్ళపాక కవుల వాఙ్మయ పరిష్కరణ ప్రకాశములకు గొప్పగా తోడ్పడుచున్న తి.తి.దే.కార్య నిర్వహణాధికారులు శ్రీ P.S. రాజగోపాలరాజు I.A.S. గారికి, దేవస్థానం ధర్మకర్తలమండలి అధ్యక్షులు డా॥ చెలికాని అన్నారావు గారికిని మా హార్దమైన

---

[1] చూ. ప్రస్తుత ముద్రణ, పుట 49.

ధన్యవాదములు. మా యీ కార్యములందు చేదోడు వాదోడుగానున్న శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలాధ్యక్షులు డా॥ కాశీభట్ల - సేతు రామేశ్వరదత్తా గారికి, అచ్చుపనులయందు కడుజాగరూకులై మాకు తోడ్పడిన తి.తి.దే. ప్రెస్ మేనేజరు శ్రీ M. విజయకుమార్‌రెడ్డిగారికిని మా యభినందనములు. శ్రమయనక దిద్దినవాని నన్నింటిని సవరించి వీలైనంత నిర్దుష్టముగ కూర్చిన అచ్చు కూర్పరులకు ప్రశంసావచనములు దక్క వేరేమీయుగలను. నాకీ పరిష్కరణకార్యములయందు అన్ని పనులలో యథాశక్తి సహకరించిన చిరంజీవి శ్రీ K. రామచంద్రరాజుగారికి నా మంగళాశాసనములు.

"తప్పులుండుట మానవధర్మమంద్రు" అనిన రీతి మా కనుగప్పి దొరలిన దోషములను సరసులు మన్నించి తెలియపరచినచో పై పై ముద్రణములందు మెలకువగ నుండగలము.

శ్లో॥ శ్రీ వేంకటేశ చరణాబ్జ మధువ్రతాయ
సంకీర్తనైకనిధయే ప్రపితామహాయ ।
తచ్ఛిన్నయః కృతి మిమాం 'ద్విపదో' జ్జ్వలార్థాం
భక్త్యా సమర్ప్య కవితా పరమార్థమాప ॥

తిరుపతి,
22-3-1978.

బుధవిధేయుడు
గౌరిపెద్ది రామసుబ్బశర్మ,
ఆంధ్రశాఖాధ్యక్షుడు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి.
(తాళ్ళపాక వాఙ్మయ పరిశోధకుడు)

# అన్నమాచార్యచరిత్ర పీఠిక

* * *

## అవతరణిక

అన్నమాచార్యచరిత్రము[1] కథాపురుషుని మనుమఁడే రచించినది కాఁబట్టి విలువగల ప్రామాణిక చరిత్ర గ్రంథము. తెనుఁగున ప్రాచీన కాలపుఁ జరిత్రగ్రంథములు కవీశ్వరులవి, ప్రాచీనులే ఆ యా కవీశ్వరుల దగ్గఱి కాలమువారే కవితతో రచించినవి చాలఁ దక్కువ.

బసవపురాణము, పండితారాధ్యచరిత్రము, తిక్కనచరిత్రము (దశకు-౧ ఆ.), కృష్ణరాయచరిత్రము, రఘునాథనాయకాభ్యుదయము, నృసింహ గురుచరిత్రము ఇట్టివి కొన్నిమాత్రమే వ్రేళ్ల లెక్క కెక్కియున్నవి. అం దీ యన్నమాచార్యచరిత్రము మతపాండిత్య కవితాప్రఖ్యాతిగన్న మహనీయుని చరిత్రమై చాలఁగా జరగిన విషయములనే సవదరించునదిగా నిరూపణ కెక్కి నా కెక్కువ మక్కువ గొల్పినది.

దీనిరచయిత చినతిరువెంగళనాథుఁడని నిండుపేరుగల చిన్నన్న. ఈతని విషయము 'అన్నమాచార్యసంతతి' అనుపట్టున వివరింతును.

---

1 ఈ యన్నమాచార్య చరిత్ర కాగితపువ్రాఁతపుస్తకమును కడపజిల్లా రాయచోటి తాలూకా పుడితాడుగ్రామవాసి శ్రీతాళ్ళపాక సూర్యనారాయణయ్యగారు తిరుపతి వేంకటేశ్వర ప్రాచ్యగ్రంథాలయమున కొసఁగిరి. ప్రాఁత తాటాకుప్రతి ననుసరించి వారు దానిని 1940వ సంవత్సరములో వ్రాసిరట. దానితో రేవణూరి వెంకటాచార్యుని శ్రీపాదరేణు మాహాత్మ్యమును, తాళ్ళపాక చిన్నన్న తామ్రశాసనమునుగూడ వారీ గ్రంథాలయమున కొసఁగిరి. తామ్రశాసనమును శ్రీమా. రామకృష్ణకవిగారు ఇక్కడి జర్నల్ వాల్యుం1, పార్టు1లో ప్రకటించిరి. ఈ యన్నమాచార్యచరిత్ర వ్రాఁతప్రతిలో గ్రంథము ముగిసినతరువాత 7వ పుటలో "తాళ్ళపాక తిరువెంగళనాథుని జీవితచరిత్రము కార్వేటినగర సంస్థానములో ఉన్నది చూడవలెను." అని కలదు. అట్టిది కార్వేటినగరమునఁ గలదేమో.

ఈ యన్నమాచార్యచరిత్రమునుబట్టియేకాక, అన్నమాచార్య రచితము లయిన సంకీర్తనములఁబట్టి, తత్ప్రసక్తములయిన శాసనములఁబట్టి, అన్న మాచార్యుల పుత్ర పౌత్రాదులు రచించిన సంకీర్తన కావ్యాదులనుబట్టి కూడఁ దచ్చరిత్రము కొంత గుర్తింపనగును. నలుదెఱఁగుల సాధనములను గ్రుచ్చి యెత్తి హృద్యమయిన తచ్చరిత్రము నుద్ధరింప యత్నింతును.

## అన్నమయ వంశము

అన్నమాచార్యుఁడు నందవరవైదికబ్రాహ్మణవంశమున జన్మించినాఁడు. ఈ వంశమువారు ఋగ్వేదులు, ఆశ్వలాయన సూత్రులు, భరద్వాజ గోత్రులు. పొత్తపినాఁటిలోని తాళ్ళపాక గ్రామమున[1] నుండినవారు. మాకు లభించిన తాళ్ళపాకవారి యితర గ్రంథములలో నెందుఁగాని యన్నమయ పితృ-పితామహాదుల ప్రశంస లేదు. ఇందే అది కలదు. (చూ. 7వ పుట నుండి 11వ పుటవరకు). అన్నమాచార్యుని తాత విద్యాభ్యాసమునకు ఊటుకూరను బంధుగ్రామమున కరిగినట్లున్నది.[2]

## అవతారము

అన్నమాచార్యునితల్లి లక్కమాంబ మాడుపూరి[3] మాధవ స్వామి భక్తు రాలట. అది యామె పుట్టినింటివారి యూరు గాఁబోలును. అన్నమయ (శక.1346) క్రీ.శ. 1424 క్రోధి వైశాఖమాసమున విశాఖా నక్షత్రమున జన్మించినాఁడు. పన్నిద్దరాళ్వార్లలో ముఖ్యులగు నమ్మాళ్వార్లు (శఠకోప యతి) కూడ వైశాఖ విశాఖనే జన్మించిరి. జన్మోత్సవము పుట్టిన నక్షత్రమును బట్టియును, నిర్యాణోత్సవము చనిపోయిన తిథినిబట్టియును జరుపుట సంప్ర దాయము. వైశాఖమాసమున విశాఖానక్షత్రము ప్రాయికముగా పూర్ణిమా తిథికి వచ్చును. కనుక వైశాఖపూర్ణిమ జన్మతిథిగాఁగూడ నిర్ణయింప

---

1 తాళ్ళపాక నేఁటి కడపజిల్లా రాజంపేట తాలూకాలోనిది.

2 చినతిరుమలయ్య ఊటుకూరి చెన్నరాయునిమీఁద సంకీర్తనములు రచించెను. ఊటుకూరు తాళ్ళపాక దగ్గఱనే రాజంపేట తాలూకాలోనే నేఁడున్నది.

3 మాడుపూరు కడపజిల్లా సిద్ధవటము తాలూకాలో నున్నది.

వచ్చును.(శక.1424.)క్రీ.శ.1503 దుందుభి ఫాల్గుణ బహుళ ద్వాదశినాఁ డాతఁడు దివ్యధామ మందినాఁడు. ఆతని జీవితపరిమాణము 79 ఏండ్లు. ఇటు చూడఁగా నేఁటి కాతఁడు జన్మించి 524 ఏండ్లయినది[1]. దివ్యత్వమంది 445 ఏండ్లయినది.[2]

వేదాంతదేశికులు శ్రీ వేంకటేశ్వరస్వామివారి గుడిఘంట యంశమున నవతరించిరని ప్రఖ్యాతి. మన యన్నమాచార్యులు స్వామి నందకము (ఖడ్గము) నంశమున నవతరించిరని ప్రఖ్యాతి. (మా.11,12 పుటలు)

## బాల్యము

అన్నమాచార్యునకు బాల్యమునఁ దల్లిదండ్రులు, వదినెయన్నలు పనులు చెప్పుటయు, భగవద్భక్తిపరాయణుఁడై యాతఁడు వానినిఁ జేయఁజాలక చీకాకు పడుటయు జరిగెను. (మా. 14,15 పుటలు.) కుటుంబము-వారివలనఁ దాను జీకాకుపొందుటను సూచించు సంకీర్తనములు కొన్ని యన్నమాచార్య సంకీర్తనములలోఁ గలవు, అందొకటి:--

### సామంతం

అయ్యో పోయఁ బ్రాయముఁ గాలము
　ముయ్యంచు మనసున నే మోహమతి నైతి ॥పల్లవి॥
చుట్టంబులా తనకు సుతులుఁ గాంతలుఁ జెలులు
　వట్టియాసఁ బెట్టువారే కాక
　నెట్టుకొని వీరు గడు నిజ మనుచు హరి నాత్మఁ
　బెట్టనేరక వృథా పిరివీకు లైతి ॥అయ్యో॥
తగు బంధులా తనకుఁ దల్లులునుఁ దండ్రులును
　వగలఁ బెట్టుచుఁ దిరుగువారే కాక
　మిగుల వీరల పొందు మే లనుచు హరి నాత్మఁ
　దగిలించలేక చింతాపరుఁడ నైతి ॥అయ్యో॥

---

[1] క్రీ.శ. 1977 నాటికి 553 సం.
[2] 474.

అంత హితులా తనకు నన్నలునుఁ దమ్ములును
వంతువాసికిఁ బెనఁగువారే కాక
అంతరాత్ముఁడు శ్రీ వేంకటాద్రీశుఁ గొలువ కిటు
సంతకూటముల యలజడికి లోనైతి ||అయ్యో||

అన్న. అధ్యా. 29 రేకు.
సంకీ. 179 - సంపు. 1 (1980)

## స్వామి సాక్షాత్కారము

అన్నమయకుఁ బదునాఱవయేఁట స్వామి ప్రత్యక్షమయిన ట్లాయన సంకీర్తనముల తొలిరాగి రేకుమీఁదఁ జెక్కఁబడియున్నది. నాఁటనుండియే స్వామి యానతిచొప్పున నాతఁడు సంకీర్తనములు రచింప నారంభించెను. నమ్మాళ్వార్లు(శఠకోపయతి)కూడఁ బదునాఱవయేఁటనే ప్రజ్ఞాపూర్ణులై దివ్యప్రబంధరచన సాగించిరి. అన్నమయ తనకు స్వామి బాల్యమున దర్శనమిచ్చుట నిట్లు సంకీర్తనములఁ జెప్పుకొన్నాఁడు.

భూపాళం

ఇప్పు డిటు కలగంటి నెల్లలోకములకు-
నప్పఁడగు తిరువెంకటాద్రీశుఁ గంటి ||పల్లవి||

అతిశయంబైన శేషాద్రిశిఖరము గంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి
శతకోటిసూర్యతేజములు వెలుఁగఁగఁ గంటి
చతురాస్యుఁ బొడఁగంటిఁ జయ్యన మేలుకంటి ||ఇప్పు||

కనకరత్న కవాటకాంతు లిరుగడఁ గంటి
ఘనమైన దీపసంఘములు గంటి
అనుపమ మణిమయమగు కిరీటము గంటి
కనకాంబరము గంటిఁ గ్రక్కన మేలుకంటి ||ఇప్పు||

అరుదైన శంఖచక్రాదు లిరుగడఁ గంటి
సరిలేని యభయహస్తము గంటిని

తిరువేంకటాచలాధిపునిఁ జూడఁగఁ గంటి
హరిఁ గంటి గురుఁ గంటి నంతట మేలుకంటి ॥ఇప్ప॥

అన్న. అధ్యా. 6 రేకు.
సంకీ. 38 - సంపు. 1 (1980)

పాడి

*సందేహ మెక్కడా లేదు సంతోషించుకొంటి నేను
కందువ బ్రహ్మానందము గైకొంటి నేను ॥పల్లవి॥

నున్నఁగా సంకీర్తన నానోరి కిచ్చితి గనుక
నన్ను రక్షింతువే యనుచు నమ్మితి నేను
పిన్ననాఁడే నీవు నన్నుఁ బేరుకొంటివి గనుక
యెన్నఁగ నీడేర్తువని యియ్యకొంటి నేను ॥సందే॥

శ్రీకాంతుఁడ నీ మూర్తి నా చిత్తములో నిల్వఁగాను
నాకు నీవు గలవని నమ్మితి నేను
దాకొని లోకములో నీ దాసుఁ డనిపించఁగా
ఈకడ నేలితివని యెఱిఁగితి నేను ॥సందే॥

కైవసమై నీవు నాకుఁ గలలో నానతియ్యఁగా
నావద్ద మన్నాఁడవని నమ్మితి నేను
ఏవేళా శ్రీవేంకటేశ యెదుటనే వుండఁగాను
పావనమై యిన్నిటాను ప్రబలితి నేను ॥సందే॥

అన్న. అధ్యా. సంపు. II (1936), 244 పుట.

## తిరుపతికిఁ బయనము

అన్నమయ కాడిన మాటెల్ల నమృతకావ్యముగాను పాడిన పాటెల్లఁ బరమగానముగాను గాఁజొచ్చినవి. తిరుపతియాత్రకుఁ బయన మయ్యెను. పరుసగుంపువారిట్లు పాడఁజొచ్చిరి. (చూ. 15,16 పుటలు)

---

* ఈ సంకీర్తన పెదతిరుమలాచార్యుల అధ్యాత్మసంకీర్తనములలో కలిసియున్నది.
చూ. సంకీ. 414 - సంపు. 21 (1974)

వేఁడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని ॥పల్లవి॥
ఆమటిమ్రొక్కులవాఁడే ఆదిదేవుఁడే వాఁడు
తోమని పళ్యాలవాఁడే దురితదూరుఁడే ॥వేడు॥
వడ్డికాసులవాఁడే వనజనాభుఁడే పుట్టు
గొడ్డురాండ్రకు బిడ్డలవిచ్చే గోవిందుఁడే ॥వేడు॥
ఎలమిఁ గోరినవరా లిచ్చే దేవుఁడే వాఁడు
అలమేల్మంగా శ్రీవేంకటాద్రినాథుఁడే ॥వేడు॥

తాళ్ళపాక శేషాచార్యులుగారి వ్రాఁతప్రతి.

దిగువతిరుపతి క్షేత్రము పొలిమేరలో తాళ్ళపాకగంగమ్మ యను గ్రామ దేవత గలదు. తాతాయగుంట గంగమ్మ[1] అంకాళమ్మ ఇత్యాది నామముల గ్రామసీమాదేవత లింకను గలరు. అందరకంటెఁ దాళ్ళపాక గంగమ్మ

---

[1] తాతాయగుంట గంగమ్మనుగూర్చి యీ కథ గలదు:- ఎప్పుడో తిరుపతి నుండి తిరుమల తాతాచార్యులవారు శిష్యసంచారము చేయుచు కడపప్రాంతముల నొకయూరి కరుగఁగా జరిగినది. ఆ యూర నెన్నఁడో వెలసియున్న గంగానమ్మ భయంకర వ్యాధులచే ప్రతివత్సరము నసంఖ్యాకజనమును నాహుతి కొనుచుండుటయు నొకప్పుడు జాత్ర జరుగుచుండఁగా నామె జాలిదలఁచి యేఁడాది కొక నరబలి యిచ్చుచో నీ మారణ మాపివేయుదు ననుటయు గ్రామస్థు లందుల కంగీకరించుటయు జరిగెను. ఏఁటేఁట జాతరనాళ్ళలో బాటసారిగా వచ్చిన పరాయి యూరివాని నొకని బలిపెట్టుట జరుగుచుం- డెను. ఒక యేఁట తాతాచార్యులుగారు చిక్కిరి. గురువుగారిని గోల్పోవుటా యని యూరివారు తటపటాయింపసాగిరి. ఎట్లో తెలిసి ఆచార్యులవారు భీమునివలె బలి యగుదునని వెలపు మాన్పిరి. బలిగాపలసిననాఁడు జాతర చోట అష్టాక్షరీ, నారాయణ కవచాదుల ననుసంధించుచు శిష్యులకుఁ జేయు శంఖ చక్ర ముద్రాంకితముల తీరునఁ గాక కణకణ నిప్ప రగిల్చించి శంఖచక్ర ముద్రల నెఱ్ఱగాఁ గాల్చి యుంచిరి. జాతరలో నమ్మవారి పూనకముతో నొకబత్తుఁడు బలిబలి యనుచు వారిమీఁదికి దూఁకెను. ఆచార్యులవారు పట్టుకార్లతో శంఖచక్ర ముద్రల నా పూనకమువాని రెండు భుజములమీఁద గట్టిగా నంటించఁబోయిరి. శివశక్తి పొటిపోఁజూచి వెను- దిరిగెను గాని మంత్రప్రభావముచే నడుగు సాగక నిలిచిపోయెను. ముద్ర వీపుమీఁదఁ బడెను. తాతాచార్యులుగారి ముద్ర భుజము దప్పినా వీపు

ప్రాచీనదేవతయట. ఇప్పటికి నా దేవి తిరుపతి పొలిమేరలోనే కలదు. పూర్వము తిరుపతియాత్రకు వచ్చు యాత్రికు లా క్షేత్రదేవత నర్చించి క్షేత్రప్రవేశము చేయుచుండెడివారట. అన్నమయ యా దేవతకు మ్రొక్కు చెల్లించెను. (చూ. 16,17 పుటలు.) తొలుత నా దేవతను తాళ్ళపాక యన్నమయ యర్చించుటచేతనేమో యామెకు తాళ్ళపాక గంగమ్మ యని పేరయ్యెను. తిరుపతిలో నేఁటేఁట జరుగు గంగమ్మ జాతర యీ గంగానమ్మలకై యేర్పడినదే.

అన్నమయ యంతటఁ దిగువతిరుపతికి విచ్చేసి యిట్లు సంకీర్తనము చేసెను.

మలహరి

అదె చూడు తిరువేంకటాద్రి నాలుగు యుగము
    లందు వెలుఁగొందీ ప్రభ మీఱఁగాను ॥పల్లవి॥

తగ నూటయిరవై యెనిమిది తిరుపతులం గల
    స్థానికులును చక్రవర్తి పీఠకములును
అగణితంబైన దేశాంత్రుల మఠంబులును
    నధికమై చెలువొందఁగాను

మిగుల నున్నతములగు మేడలును మాడుగులు
    మితిలేని దివ్యతపసు లున్న గృహములును
వొగి నొరగుఁబెరుమాళ్ళ వునికిపట్టయి వెలయు
    దిగువ తిరుపతి గడవఁగాను ॥అదె॥

---

తప్పదన్న సామెత తడాదిగా వెలసెను. గంగానమ్మ యా యాచార్యులవారి కాళ్ళపై వాలి శరణాగతురాలయ్యెను. ఆమెకు శిష్యత ననుగ్రహించి యాచార్యులవారు తిరుపతికిఁ దోడ్తెచ్చి, యూరివెలుపల నెలకొల్పిరి. నాఁటితో నా గ్రామపువారి కామెపలని పీడ తొలఁగెను. నాఁటనుండి తిరుపతిలో తాతాచార్యులవారియనుమతి నామె కేఁటేఁట జంతుబలులతోను మద్యపుఁజాఱులతోను నిన్నటిదాఁక జాతర సాగినది. మహాత్ముల యనుగ్రహమున నేఁడామె శుద్ధ సాత్త్వికురాలై మద్యపుఁజాఱును జంతుబలిని విడనాడినది.

పొదలి యరయోజనము పొడవుననుఁ బొలుపొంది
పదినొండు యోజనంబుల పరపుననుఁ బరగి
చెదర కే వంకఁ జూచిన మహాభూజములు
సింహ శార్దూలములును
కదిసి సురవరులు కిన్నరులు కింపురుషులును
గరుడ గంధర్వ యక్షులును విద్యాధరులు
విదితమై విహరించు విశ్రాంతదేశముల
వేడుకలు దైవాఱఁగాను ॥అదె॥

ఎక్కువల కెక్కువై యెసఁగి వెలసిన పెద్ద
యెక్కు డతిశయముగా నెక్కి నంతటిమీఁద
అక్కజంబైన పల్లవరాయని మఠము
అల యేట్ల పేడ గడవఁ
చక్క నేఁగుచు నవ్వచటి గడచి హరిఁ దలఁచి
మ్రొక్కుచును మోఁకాళ్ళ ముడుగు గడచినమీఁద
నక్కడక్కడ వేంకటాద్రీశు సంపదలు
అంతంతఁ గానరాఁగాను ॥అదె॥

బుగులుకొను పరిమళంబుల పూవుఁదోఁటలును
పొందైన నానావిధంబుల వనంబులును
విగిడి క్రిక్కిఱిసి పండిన మహావృక్షముల
నీడలను నిలిచి నిలిచి
గగనంబు దాఁకి శృంగారరస భరితమై
కనకమయమైన గోపురములనుఁ జెలువొంది
జగతీధరుని దివ్య సంపదలుగల నగరు
పరగుననుఁ గానరాఁగాను ॥అదె॥

ప్రాకటంబైన పాపవినాశనములోన
భరితమగు దురితములు సగిలి పొలుచునుండ
ఆకాశగంగ తోయములు సోఁకిన భవము
లంతంత వీడిపాఱఁగను

ఈకడనుఁ గోనేట యతులుఁ బాశుపతుల్ మును
　లెన్న నగ్గలమై వున్న వైష్ణవులలో
నేకమై తిరువేంకటాద్రీశుఁ డాదరిని
　యే ప్రొద్దు విహరించఁగాను ॥అదె॥

అన్న. అధ్యా. 37 టీకు.
సంకీ. 227 - సంపు. 1 (1980).

## శేషాద్రి దర్శనము

### శ్రీ రాగం

అదివో అల్లదివో హరివాసము
　పదివేల శేషుల పడగల మయము ॥పల్లవి॥
అదె వేంకటాచల మఖిలోన్నతము
　అదివో బ్రహ్మాదుల కపురూపము
　అదివో నిత్యనివాస మఖిలమునులకు
　నదె చూడుఁ డదె మ్రొక్కుఁ డానందమయము ॥అది॥
చెంగట నల్లదివో శేషాచలము
　నింగి నున్న దేవతల నిజవాసము
　ముంగిట నల్లదివో మూలనున్న ధనము
　బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము ॥అది॥
కైవల్యపదము వేంకటనగ మదివో
　శ్రీవేంకటపతికి సిరు లయినది
　భావింప సకలసంపదరూప మదివో
　పావనముల కెల్లఁ బావనమయము ॥అది॥

అన్న. అధ్యా. 4 టీకు.
సంకీ. 23 - సంపు. 1 (1980).

### రామక్రియ

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
　తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ ॥పల్లవి॥

వేదములే శిలలై వెలసినదీ కొండ
యేదెసఁ బుణ్యరాసులే యేఱులైనదీ కొండ
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ
శ్రీదేవుఁ డుండేటి శేషాద్రి యీ కొండ ॥కట్టె॥

సర్వ దేవతలు మృగజాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచఱులైన కొండ
వుర్విఁ దపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపు టంజనాద్రి యీ పొడవాటి కొండ ॥కట్టె॥

వరములు కొటారుగా వక్కాణించి పెంచే కొండ
పరగు లక్ష్మీకాంతు సోబనపుఁ గొండ
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైన దిదివో శ్రీవేంకటపుఁ గొండ ॥కట్టె॥

అన్న. అధ్యా. 282 రేకు.
సంకీ. 471 - సంపు. 3 (1986).

ఆహిరి

తోరణములే త్రోవెల్లా
మూరట బారట ముంచిన లతల ॥పల్లవి॥

కూరిమి మటములు గోపురంబులును
తేరుపడగలే తెరువెల్లా
కోరిన పండ్లు గురిసేటి తరువులు
తోరములైన వెదురు జొంపములు ॥తోర॥

ఆటలుఁదిరుపులు నందపు టురుపులు
పాటలు వనవైభవమెల్లా
కూటువ నెమిళ్ళ కోవిల గుంపులు
పేటలఁ దేటల పెనుఁగూటములును ॥తోర॥

వింజామరలును విసనకట్టలును
గొంజెగొడుగులే కొండెల్లా
అంజనగిరిరాయఁడు వేంకటపతి
సంజీవని పరుషల కొదవఁగను ॥తోర॥

అన్న. అధ్యా. 20 రేకు.
సంకీ. 119 - సంపు. 1 (1980).

అన్నమయ దిగువతిరుపతినుండి వేకువజామున బయలుదేరి అడిపడి నరసింహుని, తలయేరుగుండును, పెద్దయెక్కుడును, కపురపుఁగాలువను దర్శించుచు జామెక్కుసరికి మోఁకాళ్లముడుపుకడ కేఁగెను.

## తలయేరుగుండు

అడిపడిదగ్గఱనే గొప్ప చింతచెట్టు నేఁడును గలదు. శ్రీ వేంకటేశసేవాక్రమమున నది ప్రస్తుతి గన్నది. అన్నమాచార్యుఁడు దీనిఁ బేర్కొన్నట్లు లేదు.

చించా మున్నిద్రసుభగాం దివ్యాం తన్మూలత శ్శుభే ।
శ్రీనివాసపదాంభోజే స్వసంకల్పాత్ సముత్థితే ॥
తన్మూలత స్స్వయంవ్యక్తాన్ సరోయోగిముఖానపి ।
లక్ష్మీనృసింహం శేషాద్రిం ప్రణిపత్య కృతాంజలిః ॥

శ్రీ వేంకటేశసేవాక్రమః.

చింతచెట్టు దాటిన తర్వాత నరసింహస్వామి, తలయేరుగుండు, అక్కడనే శ్రీపాదములు నున్నవి. కొండమీఁది కెక్కువారును దిగువారును తలనొప్పి, కాలునొప్పి కలుగకుండుటకై యా గుండును దలతో, మోఁకాళ్ళతోఁ దాఁకుదురు. కనుకనే దానికిఁ దలయేరుగుండన్న పేరయ్యెను. (చూ. 17వ పుట.)

## శ్రీపాదములు

శ్రీరామానుజాచార్యులవారు తిరుపతికి విచ్చేసి కొండపై స్వామి సన్నిధిని మూన్నాళ్లు వసించి యటుపై దిగువ తిరుపతిలో నొక వత్సరము

నెలకొని తిరుమలనంబిగారికడ రామాయణరహస్యార్థములఁ దెలిసికొనిరట! తిరుమలనంబి ప్రొద్దుట స్వామిని సేవించి కొండ దిగి యడిపడికడఁ దంయే రుగుండు దగ్గఱి మండపమునకు రాఁగా రామానుజాచార్యులవారు గోవిం దరాజ సన్నిధినుండి యక్కడికరిగి రహస్యార్థములఁ దెలిసికొనుచుండెడి వారట. తిరుమలనంబి యొకనాఁడు స్వామిసన్నిధిని మధ్యాహ్నపూజ సాగ-దయ్యెఁగదా యని ఖిన్నుఁడు కాఁగా స్వామి నీ కా కొఱఁత తొలఁగిపోఁగలదు దుఃఖింపకుమని స్వప్నోద్బోధము కావించిరట. మఱునాఁడు ప్రాతఃకాల పూజ చేసి వచ్చి రామానుజుల కుపదేశము చేయుచుండగా మధ్యాహ్నపూజా సమయమునకు దివ్యకుసుమ తులసీ మృగమద కర్పూర సుగంధముతో స్వామిపాదములు ప్రత్యక్షమయ్యెనట. తదాది శ్రీపాదముల కక్కడ ప్రతిష్ఠ కలిగెను. ఇతిహాసమాలలోనే ఈ కథ.

ముఖారి

బ్రహ్మ గడిగిన పాదము
    బ్రహ్మము దానె నీ పాదము ॥పల్లవి॥

చెలఁగి వసుధ గొలిచిన నీ పాదము
    బలి తల మోపిన పాదము
    తలఁకక గగనము దన్నిన పాదము
    బలరిపు గాచిన పాదము ॥బ్రహ్మ॥

కామిని పాపముఁ గడిగిన పాదము
    పాము తల నిడిన పాదము
    ప్రేమపు శ్రీసతి పిసికేటి పాదము
    పామిడి తురగపుఁ బాదము ॥బ్రహ్మ॥

పరమ యోగులకుఁ బరిపరి విధముల
    పర మొసఁగెడి నీ పాదము
    తిరువేంకటగిరి తిరమని చూపిన
    పరమపదము నీ పాదము ॥బ్రహ్మ॥

అన్న. అధ్యా. 31 రేకు.
సంకీ. 191 - సంపు. 1 (1980).

## కురువనంబి

తలయేరుగుండు దాటిన తర్వాత కుమ్మరమండపమని యొక స్థలము గలదు. అది నేఁడు చెడినది. అక్కడి ఱాళ్లు మెట్లకుఁ బ్రక్క గోడ ఱాళ్లుగా మాఱినవి. ఆ ఱాళ్ళమీఁదఁ గురువనంబి కథా శిల్పము లున్నవి.

ఒక కుమ్మరి స్వామికిఁ బ్రతిదినము వంటకుండలుచేసి యర్పించుచు దాని యాయతిచే జీవించుచుండెను. అనుదినము నెడతెగక యీ పని యుండుటచే నాతనికి స్వామిదర్శనము తఱచుగా లభింపదయ్యెను. కొయ్యతో శ్రీనివాసమూర్తిని గల్పించుకొని యాతఁడు కుండలు చేయఁగా మిగిలిన మట్టితోఁ బుష్పములు గావించి యా మూర్తి నర్పించుచుండెను. తొండమానుఁడను రాజు ప్రతిదినము స్వామికి బంగారుపూలతోఁ దొలి పూజ జరుపుచుండెను. ఒకనాఁడు రాజు స్వామిపాదములంపై నర్పించిన బంగరు పూ లొకప్రక్కకు జాఱియుండుటయు మట్టిపూవులు శ్రీపాదము లపై నుండుటయుఁ గానవచ్చెను. రాజు చూచి విచారింపఁగా కుమ్మరి తన యున్నచోట నర్పించుచుండిన పూవు లవి యగుట తెలియవచ్చెను. రాజు కుమ్మరిని దర్శించి, తన కట్టియోగ్యత నర్థించెను. స్వామి కుమ్మరికిని, అహంకృతి తొలఁగించుకొనిన రాజునకును సాన్నిధ్య మొసఁగెను. ఈ కథ వేంకటాచలమాహాత్మ్యమునను గలదు.

### కాంబోది

కురువనంబి తిరుమల కురువనంబి నీ
చరణములే కొలిచి బ్రతికె కిరీటము గలరాజు ॥పల్లవి॥

దవ్వులామటనుండి నీవు పువ్వులఁ బూజించితే అవి
చివ్వన అప్పని యడుగుఁదామెరలంపై చెలఁగి యప్పుడే నిలిచె
పువ్వులకు టెక్కులున్నవో లేక పుండరీకాక్షుని మహిమో
నివ్వటిల్లు నీ భక్తియోకాని నేఁడు నాతోఁ జెప్పవే ॥కురు॥

పాంకపుదోపిటి యడుసున లెస్స పారలిన గన్నేరుఁబువ్వులు
కుంకుమగంధ మాకల్పములపై కోరి వేఁడి నిలిచె

బంకమన్నది యెంత వాసనో లేక పారిజాతముల కెక్కుడో
వేంకటపతి కెంత వేడుకో నాకు వివరింపవె అప్పయ్య ॥కురు॥
దోసిటిలోపలఁ బెట్టిన శ్రీతులసి సేవంతిపువ్వులు
వాసిగ జగమెల్ల కుక్షిలో నిడుకొన్నవాని మేనెల్ల నిండె
వేసదారి యలమేలుమంగ శ్రీవేంకటేశ్వరుని మహిమో నీ
దాసరితనము బలమో కాని తలఁపు నాతోఁ జెప్పవే ॥కురు॥

శేషాచార్యులుగారి వ్రాఁతప్రతి.

## పెద్దయెక్కుడు

ఇక్కడ మెట్లు నిట్టనిల్వునను చాలాయెత్తుగాను నుండును. తిరుమల యెక్కుటలో నెక్కువ శ్రమకరమయిన యెక్కుడిది.

## కర్పూరపుఁగాలువ

"కపురంపుఁదావులు గదు నూలుకొలుపు కపురంపుఁగాలువ" యట. పెద్దయెక్కుడు దాటిన తర్వాత మోఁకాళ్ళ ముదుపునకుఁ బూర్వ మీ కాలువ గలదట. అక్కడ నా సెలయేటి జాలు నీళ్ళు సుగంధము గలిగియుండునట. సేవాక్రమమున నిట్లున్నది. "తతః కర్పూరసురభి తీర్థం కర్పూరనిర్ఝరమ్".

## మోఁకాళ్ళ ముదుపు

సాలగ్రామమయమైనది గనుక నికమీఁదఁ బర్వతము పాదములతోఁ గాక మోఁకాళ్ళతో నడచుట జరిగెడిదట. కాన మోఁకాళ్ళ ముదుపని పే రయ్యెనందురు. ఒక్కొక్క మెట్టు మోఁకాలి యెత్తుగలిగి మోఁకాళ్లు ముదుచుకొనుచు నెక్కవలెను. కనుక నా పేరయ్యెననియు నందురు.

"అలమేలుమంగకు నాశుమార్గమున
సలలితంబుగ నొక్క శతకంబుఁజెప్పె" చూ. 21 పుట.

తెలియక చెప్పుఁగాళ్ళతోఁ గొండ నెక్కుచు బడలి మోఁకాళ్ళ ముదుపు దగ్గఱ నన్నమయ వెదురుపొదక్రింద నొకబండపై మైమఱచి నిద్రించు

ముండఁగా నలమేలుమంగాంబ దర్శనమిచ్చి యూఱడించి, చెప్పులు విడిచి కొండ నెక్కుమని తెలిపి దివ్యప్రసాదము ప్రసాదించి యాకలిదీర్చి యరుగుట, మెలకువగొని కళవళమంది యాతఁడది నిజమో కాదేమో యని సంశయించి, కడకు నమ్మి యాశుకవితగా నమ్మవారిమీఁద శతకము చెప్పుట జరిగినది.

చ॥ అరిసెలు నూనెబూరియలు నౌఁగులుఁ జక్కెరమండెఁగల్ వడల్
బురుడలు పాలమండెఁగ లపూపము లయ్యలమేలుమంగ నీ
కరుదుగ విందువెట్టుఁ బరమాన్నశతంబుల సూపకోట్లతో
విరతి వినిర్మలాన్నముల నేతులసోనల వేంకటేశ్వరా!

ఉ॥ చొచ్చితిఁ దల్లి నీ మఱుఁగు సొంపుగ నీ కరుణాకటాక్ష మె
ట్లిచ్చెదొ నాకు నేఁడు పరమేశ్వరి యో యలమేలుమంగ నీ
మచ్చిక నంచు నీ తరుణిమన్నన నే నినుఁ గంటి నీకు నా
బచ్చెనమాట లేమిటికి బ్రాతివి చూడఁగ వేంకటేశ్వరా!

ఉ॥ యోగ్యత లేని కష్టుఁడ నయోగ్యుఁడ నన్నిటఁ జూడ గర్భ ని
ర్భాగ్యుఁడ నీ కృపామతికిఁ బ్రాప్తుఁడ నో యలమేలుమంగ నా
భాగ్యము నీ కృపాగరిమఁ బ్రాప్యము కావు మటంచు సారె నీ
భాగ్యవతీశిరోమణినిఁ బ్రస్తుతిచేసెద వేంకటేశ్వరా!

ఉ॥ అమ్మకుఁ దాళ్ళపాకఘనుఁ డన్నఁడు పద్యశతంబుఁ జెప్పెఁ గో
కొమ్మని వాక్ప్రసూనములఁ గూరిమిలో నలమేలుమంగకుఁ
నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మద మంది వర్ధిలుము జవ్వనలీలల వేంకటేశ్వరా!

'వేంకటేశ్వరా' యని పద్యాంతసంబోధనమున్నను నిందుఁ బ్రతి పద్యమును నలమేలుమంగాంబికా ప్రస్తుతిపరమే. కడ పద్యములో కవికూడ - అమ్మకు అలమేల్మంగకు పద్యశతము చెప్పితినని - కనుక నిది *యలమేల్మంగాంబికాస్తుతి శతకమే యనఁదగినది.

---

* దీనిని వావిళ్ళవారు ప్రకటించిరి.

అన్నమాచార్యచరిత్రలో నన్నమయ కొండ నెక్కునాఁటి కెనిమిదేండ్ల వాఁడని యున్నది గాని, దాని నుపనయనముచే ద్విజత్వము వచ్చిన-దాదిగా నని యన్వయించుకొని యెనిమిదేండ్లవాఁడని, మాతృ గర్భమున నుండి పుట్టినదాది పదునాఱేండ్లవాఁడని సరి చూచుకోవలెను. కొండనె క్కునాఁటి కాతఁడు సంకీర్తనకర్త. పదునాఱవయేఁట స్వామిప్రత్యక్షమై సంకీర్తన రచనానుగ్రహము చేసినాఁడని రాగిరేకుమీఁద నున్నది.

## స్తోత్రభాష్యకారులు

### దేసాళం

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము ||పల్లవి||

ఈతని కరుణనేకా యిల వైష్ణవులమైతి -
మీతనివల్లనే కంటి మీ తిరుమణి
యీతఁడే కా వుపదేశ మిచ్చె నష్టాక్షరిమంత్ర -
మీతఁడే రామానుజులు ఇహపరదైవము ||గతు||

వెలయించె నీతఁడేకా వేదపురహస్యములు
చలిమి నీతఁడే చూపె శరణాగతి
విలిపినాఁ డీతఁడేకా నిజముద్రాధారణము
మలపి రామానుజులే మాటలాడే దైవము ||గతు||

నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే
నయమై శ్రీవేంకటేశునగ మెక్కి వాకిటను
దయఁజూచీ మమ్ము నిట్టే తల్లి దండ్రి దైవము ||గతు||

అన్న. అధ్యా. 175 రేకు.

సంకీ. 372 - సంపు. 2 (1980).

అన్నమయ కొండ నెక్కి స్వామిపుష్కరిణిని దర్శించి లోలుత నందు స్నానముచేసినాఁడు. (చూ. 21 పుట.)

అప్పుడు పుష్కరిణి నిట్లు ధ్యానించినాఁడు.

## స్వామి పుష్కరిణి

### గుండక్రియ

*దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ
  వేవేలు మొక్కులు లోకపావని నీ కమ్మా ॥పల్లవి॥

ధర్మార్థకామమోక్షతతులు నీ సోపానాలు
  అర్మిలి నాలుగువేదా లదె నీ దరులు
  నిర్మలపు నీ జలము నిందు సప్తసాగరాలు
  కూర్మము నీలోఁతు వో కోనేరమ్మా ॥దేవు॥

తగిన గంగాదితీర్థములు నీ కడళ్ళు
  జగతి దేవతలు నీ జలజంతులు
  గగనపుఁ బుణ్యలోకాలు నీ దరి మేడలు
  మొగి నీ చుట్టుమాఁకులు మును లో యమ్మా ॥దేవు॥

వైకుంఠనగరము వాకిలే నీ యాకారము
  చేకొను పుణ్యములే నీ జీవభావము
  యేకడను శ్రీవేంకటేశుఁడే నీ వునికి
  దీకొని నీ తీర్థ మాడితిమి కావవమ్మా ॥దేవు॥

అన్న. అధ్యా. 185 రేకు.
సంకీ. 426 - సంపు. 2 (1981).

పెద్దగోపురమును, నీడతిరుగనిచింతచెట్టును,[1] గరుడగంభమును, చంపక ప్రదక్షిణమును, దివ్యప్రసాదము లొసఁగు ప్రదేశమును, అక్కడి

* రేకులతో పరిచూచి యిందలి పాటలు సవరింపబడినవి.

[1] ఈచింతచెట్టు శేషాంశమట. సేవాక్రమమునను వేంకటాచలమాహాత్మ్యమునను పరమయోగి విలాసమునను నీ చింతచెట్టుస్తుతి కలదు. ఈచెట్టు నేఁడు లేదు కాని సేవా క్రమమున పర్వతారోహణోపక్రమమునఁగూడ నొక చింతచెట్టున్నట్టు వర్ణన మున్నది. ఆ చింతచెట్టు నేఁడును గలదు.

ప్రసాదములను, నడగోపురమును శ్రీనివాసుని భాష్యకారులను[1] నరసింహుని, జనార్దనుని, అలమేలుమంగను, యాగశాలను, ఆనందనిలయమును, కళ్యాణ మంటపమును, బంగారుగరుడుని, శేషుని, పునుఁగుచట్టలను కాచి తైలము వడియఁగార్చు ప్రదేశమును, స్వామిని స్తుతించు చిలుకల పంజరములను, శ్రీభండారమును, బంగారుగాదెలను, బంగారువాకిటిని దర్శించి స్తుతించి లోనికి స్వామిని సేవింప నరిగెను. ఈసందర్భములలోఁ బెక్కింటికీ సంకీర్తనములున్నవి.

## దేవాలయ ప్రవేశము

### పాడి

సేవించి చేకొన్న వారి చేతిభాగ్యము
వేవేగ రారో రక్షించీ విష్ణుఁ డీడను ||పల్లవి||

గరుడగంభముకాడ కడుఁబ్రాణాచారులకు
వరము లొసఁగీని శ్రీవల్లభుఁడు
తిరమై కోనేటిచెంతఁ దీర్థఫలములెల్ల
పరుషల కొసఁగీని పరమాత్ముఁడు ||సేవించి||

సేనమొదలారివద్ద చిత్తములో సుజ్ఞానము
నానాగతిఁ బుట్టించీని నారాయణుఁడు
కానుకపైఁడిగాదెలకాడఁదన నిజరూపు
ఆనుక పాదచూపీని అఖిలేశుఁడు ||సేవించి||

సన్నిధి గర్భగృహాన చనవిచ్చి మాటలాడి
విన్నపాలు వినీ శ్రీవేంకటేశుఁడు
ఎన్నికఁ బాదాలవద్ద ఇహము పరముఁ జూపీ
మన్ననల నలమేలుమంగవిభుఁడు ||సేవించి||

అన్న. అధ్యా. 288 రేకు.
సంకీ. 511 - సంపు. 3 (1986)

---

1 "శ్రీభాష్యకారులను" కావచ్చు.

## విష్వక్సేనుఁడు

లలిత

నీవేకా చెప్పఁజూప నీవె నీవెకా
శ్రీవిభుప్రతినిధివి సేనమొదలారి ॥పల్లవి॥

నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద
దేవతలఁగనిపించే దేవుఁడవు
యేవంక విచ్చేసినాను యిందిరాపతికి నిజ-
సేవకుఁడవు నీవేకా సేనమొదలారి ॥నీవేకా॥

పసిఁడిబద్దలవారు పదిగోట్లు గొలువ
దెసలఁ బంపులు వంపే ధీరుఁడవు
వసముగా ముజ్జగాలవారి నిందరిని నీ-
సిసువులఁగా నేలిన సేనమొదలారి ॥నీవేకా॥

దొరలైన యసురులఁ దుత్తుమురు సేసి జగ-
మిరవుగా నేలితి వేకరాజ్యమై
పరగు సూత్రవతిపతివై వేంకటవిభు-
సిరులపెన్నిధి నీవె సేన మొదలారి ॥నీవేకా॥

అన్న. అధ్యా. 42 రేకు.
సంకీ. 255 - సంపు. 1 (1980)

## హనుమంతుఁడు

సాళంగనాట

మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు
యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు ॥పల్లవి॥

పెట్టిన జంగలోడి పెద్దహనుమంతుఁడు
పట్టెను యెడమచేత బలుముష్టి
మెట్టినాఁడు పాదముల మించు రాకాసితలలు
కొట్టెనను చు నెత్తె గొప్ప వలకేలు ॥మొక్కరో॥

వంచెను శిరసుమీఁద వాలుగాఁ దనతోఁక
పెంచెను మిన్నులుమోవ పెనుదేహము
నించినాఁడు రౌద్రము నిడుపాటిదవడల
కాంచనపు పుట్టుకాసె కడు బిగియించెను ॥మొక్కరో॥
పెనఁచి తొడలుదాఁక పెద్దపదకము వేసె
తనువుపై వ్రేలాడే దండలతోడ
అనయము శ్రీవేంకటాద్రిదేవుని బంటు
వెనుబలమై యున్నాఁడు విట్ఠలములోనను ॥మొక్కరో॥

అన్న. అధ్యా. 252 రేకు.
సంకీ. 301- సంపు. 3 (1986)

## ప్రసాదములు

### దేసాక్షి

ఏ పొద్దు మాచిన దేవుఁడిట్లానే యారగించు
రూపుంతోఁ బదివేలు రుచులై నట్లుండెను ॥పల్లవి॥
మేరు మందరాలవలె మెఱయు నిడ్డెనలు
సూరియ చంద్రులవంటి చుట్టుఁబళ్ళేలు
ఆరని రాజాన్నాలు అందుపై వడ్డించఁగాను
బోరన చుక్కలు రాసివోసినట్లుండెను ॥ఏపొద్దు॥
పలు జలధులవంటి పైఁడి వెండి గిన్నెలు
వెలిఁగొండలంతలేసి వెన్నముద్దలు
బలసిన చిలుపాలు పంచదార గుప్పఁగాను
అలరు వెన్నెలరస మందిచ్చినట్లుండెను ॥ఏపొద్దు॥
పండిన పంటలవంటి పచ్చళ్లుఁ గూరలును
వండి యలమేలుమంగ వడ్డించఁగా
అండనె శ్రీవేంకటేశుఁ డారగించి మిగులఁగ
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను ॥ఏపొద్దు॥

అన్న. అధ్యా.252 రేకు.
సంకీ. 299 - సంపు. 3 (1986)

## స్వామి దర్శనము

శంకరాభరణం. అటతాళం

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము-
నెడయకవయ్య కోనేటిరాయఁడా ॥పల్లవి॥

కోరి మమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువఁ జిత్తములోని శ్రీనివాసుఁడా ॥పొడ॥

భావింపఁ గైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేరఁ గాచినట్టి చింతామణీ
కామించి కోరిక లిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా ॥పొడ॥

చెడనీక బ్రదికించే సిద్ధమంత్రమా, రోగా-
లడఁచి రక్షించే దివ్యౌషధమా
బడిఁబాయక తిరిగే ప్రాణబంధుఁడా, మమ్ము
గడియించినట్టి శ్రీవేంకటనాథుఁడా ॥పొడ॥

రామక్రియ. అటతాళం

కంటిఁగంటి నిలువుచక్కనిమేను దండలును
నంటుఁజూపులను జూచే నవ్వుమోముదేవుని ॥పల్లవి॥

కనకపుఁబాదములు గజ్జెలు నందెలును
ఘనపీతాంబరము పైకట్టు కటారి
మొనసి యొడ్డాణపు మొగపుల మొలనూలు
ఒనర నాభీకమల ముదరబంధములు ॥కంటి॥

గరిమ వరదహస్త కటిహస్తములును
పరప నెత్తిన శంఖచక్రహస్తములు
ఉరముపై కౌస్తుభ మొప్పగు హారములు
... ... ... ... ... ... ... ... ... ... ॥కంటి॥

కట్టిన కంటసరులు ఘనభుజకీర్తులు
కట్టాణిముత్యాల సింగారనామము
నెట్టన శ్రీవేంకటేశ నీకుఁ గర్ణపత్రములు-
నట్టె సిరసుమీఁద నమరే కిరీటము

శేషాచార్యులుగారి వ్రాఁతప్రతి.

భూపాళం

పావనము గావో జిహ్వ బ్రదుకవో జీవుఁడా
వేవేల కితని నింక వేమాఱునుఁ బాడి ॥పల్లవి॥

హరినామములే పాడి, అతని పట్టపురాణి
ఇరవై మించినయట్టి యిందిరఁ బాడి
సరి నిరువంకలాను శంఖచక్రములఁ బాడి
వరద కటిహస్తాలు వరుసతోఁ బాడి ॥పావ॥

ఆదిపురుషునిఁ బాడి, అట్టే భూమిసతిఁ బాడి
పాదములఁ బాడి నాభిపద్మముఁ బాడి
మోదపుబ్రహ్మాండాలు మోచే వుదరముఁ బాడి
ఆదరానఁ గంబుకంఠ మంకెతోఁ బాడి ॥పావ॥

శ్రీవేంకటేశుఁ బాడి శిరసుతులసిఁ బాడి
శ్రీవత్సములోదురముఁ జెలఁగి పాడి
లావుల మకరకుండలాల కర్ణములు పాడి
ఆవటించి యితని సర్వాంగములుఁ బాడి ॥పావ॥

అన్న. అధ్యా.173 లేకు.
సంకీ. 359- సంపు. 2 (1981)

## స్వామి యభయహస్తము

### సామంతం

ఇందరికి నభయంబు లిచ్చు చేయి
కందువగు మంచి బంగారు చేయి ॥పల్లవి॥

వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుకుగుబ్బలిక్రిందఁ జేర్చు చేయి
కలికియగు భూకాంతఁ గౌఁగిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ వాఁడి చేయి ॥ఇందు॥

తనివోక బలిచేత దానమడిగిన చేయి
ఒనరంగ భూదాన మొసఁగు చేయి
మొనసి జలనిధి యమ్ముమొనకుఁ దెచ్చిన చేయి
యెనయ నాఁగేలు ధరియించు చేయి ॥ఇందు॥

పురసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబుఁ బరపెడి దొడ్డ చేయి
తిరువేంకటాచలాధీశుఁడై మోక్షంబు-
తెరువు ప్రాణుల కెల్లఁ దెలిపెడి చేయి ॥ఇందు॥

అన్న. అధ్యా. 65 టీకు.
సంకీ. 334 - సంపు. 1 (1980)

## స్వామి మహిమలు

### శంకరాభరణం

ఎటువంటివాఁడవో నీ మహిమ-
లెట్టు దెలియవచ్చును
విటలలోచనుఁడు అజుఁడు తెలియలేరు
వి న్నెట్లు దెలిపేరు మానవులు ॥పల్లవి॥

తిరుమలనంబి తా తాత యన్నాఁడె
తెలిపెఁబో మీ పెద్దతనములు
కురువనంబిగారి చేతి బంకమట్టిపువ్వులు
కొన్నాఁడె తెలిపె మీ భోగము
మఱియు ననంతాళువారి చెఱువు గట్ట
మన్ను మోయఁగా దెలిపె మీ నటనలు
గరుడగంభముకాడ కాసు కొక్కవరమిచ్చి
గడియించఁ దెలిపె మీ సంపద ॥ఎటు॥

తొండమాంజక్రవర్తికి సంపద
    తొలుత నియ్యఁగాఁ దెలిసె మీ యీవులు
అండ యెఱుకువారి కొట్టిచేని యెన్ను-
    లారగించఁగాఁ దెలిసె మీ రుచులు
వుండి గొల్లల కావిళ్ల పాలెల్ల
    వుట్టుకోఁగఁ దెలిసె మీ నేమములు
దండిగ సంపంగిమాఁకుల నడిపించ
    దైవరాయ తెలిసె మీ విద్యలు ||ఎటు||

మును దాసుతిమ్మన్న తుంబురుకొండకు
    మోక్ష మియ్యఁగాఁ దెలిసె మీ బుద్ధులు
పనివడి తాళ్ళపాక అన్నమయ్యగారి-
    పదములలోఁ దెలిసె మీ వోజలు
యెనయ శ్రీవేంకటనాథ యలమేల్మంగ-
    నెద నుంచఁగాఁ దెలిసె మీ గోప్యము
వెనుకొని పరుషవారి కెదురువోయి
    వెంటరాఁగాఁ దెలిసె మీ రాజసము ||ఎటు||

శేషాచార్యులుగారి వ్రాఁతప్రతి.

బౌళి

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవూ
    అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లూ
||పల్లవి||

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
    పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మమనుచు
    తలఁతురు మిము శైవులు తగిన భక్తులను శివుఁడనుచు
    అలరి పొగదుదురు కాపాలికులు ఆదిభైరవుఁడనుచు ||ఎంత||

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీ వనుచు
    దరిసెనములు(ల?)మిము నానావిధులను తలఁపులకొలఁదుల
భజింతురు

సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలఁచినవారికి నల్పం బవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁడవు
॥ఎంత॥

నీవలనఁ గొఱఁతేలేదు మఱి నీరుకొలఁది తామెరవు
ఆవల భాగీరథిదరిబావుల ఆ జలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్న దైవమని
యీవల నే నీ శరణనియెద నిదియే పరతత్త్వము నాకు ॥ఎంత॥

అన్న. అధ్యా. 179 రేకు.
సంకీ. 393 - సంపు. 2 (1981).

బౌళి

ఏమి వలసిన నిచ్చు నెప్పుడైనను
ఏమఱక కొలచిన నీతఁడే దైవము ॥పల్లవి॥

ఘనముగా నిందఱికిఁ గన్ను లిచ్చుఁ గాళ్ళిచ్చు
పనిసేయఁ జేతు లిచ్చు బలియుఁడై
తనుఁ గొలువుమని చిత్తము లిచ్చుఁ గరుణించి
వొనర లోకానకెల్ల నొక్కఁడే దైవము ॥ఏమి॥

మచ్చిక తనుఁ గొలువ మనసిచ్చు మాట లిచ్చు
కుచ్చితములేని కొడుకుల నిచ్చును
చొచ్చిన చోటే చొచ్చి శుభ మిచ్చు సుఖ మిచ్చు
నిచ్చలు లోకానకెల్ల నిజమైన దైవము ॥ఏమి॥

పంతమాడి కొలిచినఁ బ్రాణ మిచ్చు ప్రాయ మిచ్చు
యెంతటి పదవులైన నిట్టె యిచ్చు
వింతవింత విభవాల వేంకటేశుఁ డిదే మా-
యంతరంగమున నుండే అరచేతిదైవము ॥ఏమి॥

అన్న. అధ్యా. 28 రేకు
సంకీ. 172 - సంపు. 1 (1980).

స్వామిదర్శనము (చూ. 25 పుట.) ఇక్కడి వర్ణనమువంటిదే పరమ యోగివిలాసముననుు స్వామివర్ణనమున్నది.

ఆవరణంబుల కాదియై మిగులఁ
గొమరారు వైకుంఠగోపురంబునకుఁ
బ్రమదంబుతో మున్ను ప్రణమిల్లి యంతఁ
జనుదెంచి గారుడ స్తంభంబు చక్కి
వినతుఁడై చెంతఁ గ్రొవ్విరిసాల కేఁగి
వలనొప్ప చంపకావరణంబు వేగ
వలచుట్టి వచ్చి యా స్వామిపుష్కరిణీ-
తోయంబు లాని యుత్తుంగభాగమున-
నా యహికులపతి యవతారమగుచుఁ
దిరుగని చింతలం దెఱలించు నీడ-
దిరుగని చింత కెంతే భక్తి మ్రొక్కి
రమణ రెండవ గోపురము దాఁటి లోని-
కమల మహానసాగార సేవించి
నెలకొని యానందనిలయాఖ్య మగుచుఁ
నలువొందు మణివిమానంబు సేవించి
పటుమహామణిమంటపంబు సేవించి
యట వచ్చి తురగతార్క్ష్యాహినాయకుల
సేవించి దనుజారి సేనాధినాథు
సేవించి నరసింహు సేవించి తార్క్ష్యు
సేవించి నిత్యుల సేవించి కూర్మి-
నావేళ లోనికి నరుదెంచి యచటి-
పంచాస్త్రకోటుల భావంబు మించి
పంచవిగ్రహముల భాసిల్లి పసిఁడి-
గజ్జెలు నందియల్ కనకాంబరంబు
గొజ్జంగిముత్యాల కుచ్చుకటారి
బెడఁగుగాఁ గటిమీఁద బెరసినకేలు

నుడుగక వరముల నొసఁగు కెంగేలు
నుదరబంధంబు కేయూరహారములుఁ
బొదలు తావుల తట్టుపునుఁగు మైపూఁత
కుడిబొమ్ము మచ్చ, యక్కున నెలకొన్న-
కడలికన్నియ దివ్యకంఠసరంబు
ధళధళఁ దులకించు దరము, చక్రంబు
బలపి చూపట్టెడు పాణిపద్మములు
బింబాధరంబు, నొప్పెడు కపోలములు
కంబుపోతంబు నెక్కసమాడు గళము
మకరకుండలములు, మణికిరీటంబు
వికసితధవళారవిందనేత్రములు
చల్లనిచూపును జారునాసికయుఁ
దెల్లని మెఱుఁగు ముత్తియపు నామమును
గలిగి యెంతయును శృంగారభావంబు
మలయు నయ్యలమేలుమంగా మనోజ్ఞ.

పరమయో. 8 ఆశ్వా.

బంగారుగజ్జెలుఁ బసిఁడియందియలుఁ
జెంగావిచాయ మించిన పైఁడివలువ
మొగపుల మొలనూలు ముత్యాలకుచ్చు
బిగిసి చూపట్టు ముప్పిడికఠారంబుఁ
గటి సంఘటించిన కరపల్లవంబుఁ
బటువరంబుల నిచ్చు పాణిపద్మంబు
వలమురి నెలవాఁడివలయపుఁగత్తి
బలపి చూపట్టెడు పాణియుగ్మమును
బొడ్డుమావికము కెంపులబిటారించు-
వొడ్డాణమును మించు నుదరబంధంబు
భుజకీర్తులును బాహుపురులు తాయెతులు
భుజగభూషలుఁ దట్టుపునుఁగు మైపూఁత

యక్కున నెలకొన్న యలమేలుమంగ
యక్కజంబగు వైజయంతిసరంబుఁ
దారహారములు పుత్తడిజన్నిదములుఁ
జారుమౌక్తిక కంఠసరముఁ బేరురము
కంబుకంధరమును గౌస్తుభమణియు
బింబాధరంబు నొప్పెడి కపోలములు
మందస్మితంబును మకరకుండలము-
లిందుబింబము హసియించు నెమ్మోము
తెలిదమ్మికన్నులుఁ దిలనాసికంబుఁ
దెలిమించు నాణిముత్తియపునామంబు
కనకపిప్పలదళ కలితపట్టంబు
ననుపమ మణిమయంబగు కిరీటంబు
గలుగు శ్రీవేంకటగ్రావాధినాథు."

పరమయో. 2 ఆశ్వా.

పై యన్నింటను స్వామిముఖమున ముత్యాలనామ మున్నట్లు వర్ణన మున్నది. అది యాభరణరూపము.

స్వామికి శుక్రవారమునాఁటి తిరుమజ్జనోత్సవమును అన్నమయయు దత్పుత్రులును పదింబదిగా వర్ణించిరి.

అది యీ నాఁట నిట్లు సాగుచున్నది:- పునుఁగుతైలపు టభ్యంజ-నమును, క్షీరఘటాభిషేకమును, కుంకుమపూవు, కస్తురి, కప్రము నూఱి బంగరుగిన్నెం నించిన యనుకుతో నలుఁగును, స్వల్పజలాభిషేకమును అనుకు నలుఁగుతోఁ గలసిన యా తీర్థము స్వామిపాదతీర్థముగా సేకరమయిన మీఁద విరివిగా జలాభిషేకమును జరుగును. తలకుఁ దడియారఁగా బొడి వలువ పిడిచుట్టుచుట్టి దివ్యమంగళవిగ్రహమునెల్లఁ బొడివలువతో దుడిచి, నీరుపూఁతగా ముఖమున దూమెఱుఁగుగా సర్వాంగమున పునుఁగుతైలము పూఁత, ముఖమునఁ గర్పూరచూర్ణముతో నామము సాఁతుట, యా నామమునకు నడుమఁ గస్తూరీతిలకము దిద్దుట, అలమేల్మంగ హారము

(మంగతాళి) మొదలగు దివ్యాభరణములను పీతకౌశేయములను ధరింపించుట జరుగును. తాళ్ళపాకవారినాఁట నిట్లు సాగెడిది:-

ఆపాదమస్తకము పునుఁగుతైలపుటభ్యంజనముచేసి, కుంకుమ పూవు మొదలగువాని యనుకుతో నలుఁగువెట్టి, పన్నీటను శుద్ధోదకమునను జలకమార్చి తుడిచి, సర్వాంగములందు నారఁగాఁ గర్పూరధూళి చల్లి మేదించి, దానిపై నారఁగాఁ బునుఁగు తైలము రాచి, ముత్యాల తిరునామము, మంగతాళి మొదలగు దివ్యాభరణములను వస్త్రములను పుష్పహారములను నలంకరించు టయ్యెడిది.

అభిషేకసమయమునఁ దాళ్ళపాకవారు దగ్గఱనుండి నలుఁగుపాటలు అభిషేకపుఁబాటలు మొదలగునవి పాడుట, అభిషేకానంతరము వారి కొక యభిషేకపుఁబన్నీటిచెంబును తాంబూలచందనాదులను నొసఁగి సత్కరించుట జరిగెడిది. తిరుమజ్జనోత్సవ మిట్లు శాశ్వతముగా జరుగుటకుఁ దాళ్ళపాకవారే స్వామి కగ్రహారముల నర్పించిరి.

## శుక్రవారాభిషేక దర్శనము

కంటి శుక్రవారము గడియ లేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని ॥పల్లవి॥

సొమ్ములన్నీ కడఁబెట్టి సొంపుతో గోణముగట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు రొమ్ము తల మొల చుట్టి
తుమ్మెద మైచాయతోన నెమ్మదినుండే స్వామిని ॥కంటి॥

పచ్చకప్పురమె నూఱి పసిఁడిగిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ దిగ నలఁది
అచ్చెరపడిచూడ అందరికన్నుల కింపై
నిచ్చమల్లె పూవువలె నిటు తా నుండే స్వామిని ॥కంటి॥

తట్టుపునుఁగె కూర్చి చట్టలు చేరిచి నిప్ప
పట్టి కరఁగించి వెండిపళ్యాల నించి
దట్టముగ మేనునిండ పట్టించి దిద్ది
బిట్టువేడుక మురియుచుండే బిత్తరి స్వామిని ॥కంటి॥
శేషాచార్యులుగారి వ్రాఁతప్రతి.

## శ్రీరాగము

ఒకపరి కొకపరి కొయ్యారమై
మొకమునఁ గళలెల్లా మొలచినట్లుండె ॥పల్లవి॥

జగదేకపతిమేనఁ జల్లిన కర్పూరధూళి
జిగిగొని నలువంకఁ జిందఁగాను
మొగిఁ జంద్రముఖి నురమున నిలిపెఁ గనక
పొగరువెన్నెల దిగఁబోసినట్లుండె ॥ఒక॥

పొరి మెఱుఁగుఁజెక్కులఁ బూసిన తట్టుపుణుఁగు
కరఁగి యిరుదెసలఁ గారఁగాను
కరిగమన విభుఁడు గనక మోహమదము
తొరిగి సామజసిరి దొలఁకినట్లుండె ॥ఒక॥

మెఱయ శ్రీవేంకటేశు మేన సింగారముగాను
తఱచయిన సొమ్ములు ధరియించఁగా
మెఱుఁగుఁబోణి యలమేలుమంగయుఁ దాను
మెఱుపు మేఘముగూడి మెఱసినట్లుండె ॥ఒక॥
పె.తి. శృంగా. 91 రేకు.
సంకీ. 485 - సంపు. 23 (1976).

## శ్రీరాగము

పులుగడిగినయట్టి పురుషోత్తముఁడు వాఁడే
ఎంమి నారతులు మీ రెత్తరే దేవునికి ॥పల్లవి॥

గొప్ప యింద్రనీలాలకొండ మంచు గప్పినట్టు
నెప్పుమింట పాలవెల్లి నెరసినట్టు
విప్పునీలమేఘముపై వెన్నెల గాపినయట్టు
కప్పురధూళి మేనఁ గప్పిరి దేవునికి ॥పు॥

నిందు నైరావతముపై నీలిజగ గప్పినట్టు
వెండి మేడపైఁ జీఁకటి విడిపినట్టు
పుండరీకపుఁగొలను పారిఁ దేంట్లాఁగినట్టు
మెండగు తట్టుపునుఁగు మెత్తిరి దేవునికి ॥పు॥

అదె నల్ల గలువల నకరువు లుండినట్టు
మెదిగి కస్తూరిభూమి మేరువున్నట్టు
యెదుట శ్రీవేంకటేశునెద నలమేల్మంగను
గుదిగుచ్చి సొమ్ములెల్లా గుప్పిరి దేవునికి ॥పు॥

పె.తి.శృంగా. 94 రేకు.
సంకీ. 506 - సంపు. 23 (1976).

శంకరాభరణం

ఏమని చెప్పుదమమ్మ యీతని సౌభాగ్యము
కోమలపు జవ్వనము గుఱుతై నట్టుండే ॥పల్లవి॥

ఒట్టుమఁ గప్పురకాపు ఉడిగపువారెల్లా
అట్టె దేవునికి నలఁదఁగాను
దట్టముగ మంచి తెల్లఁదామెరపువ్వునకు
ముట్టి అవయవములు మొలచినట్టుండే ॥ఏమని॥

తనివొంద గిన్నెలలోఁ దట్టుపుణుఁగులు దెచ్చి
పొలుపొందఁ దిరుమేనఁ బుయ్యఁగాను
పనివడి గొప్ప నిడుపాటి నేరేడుఁబండు
కనుపట్టఁ బురుషాకారమైనట్టుండే ॥ఏమని॥

అలమేలుమంగ నురమందుఁ బెట్టి సొమ్ము రెల్లా
పలువిధముల నించి భావించఁగాను
అలర శ్రీవేంకటేశుఁ డనెడి పుష్పాడిరాశి
వెలయ మరుఁడు ముద్రవేసినట్లుండే ॥ఏమని॥

పె.తి. శృంగా. 94 రేకు.
సంకీ. 508 - సంపు. 23 (1976).

నేఁడు స్వామి నామపుఁగర్పూరచూర్ణమును తిలకపుఁగస్తూరిని బునుఁగు తైలమును గలిపి శ్రీపాదరేణువని వేఱుగాను, అభిషేకపు సుగంధి తీర్థమును బాదతీర్థమని వేఱుగాను భక్తులకుఁ బ్రసాదించుట జరుగుచున్నది. రేవణూరి వేంకటాచార్యుఁడు రచించిన శ్రీపాద రేణుమాహాత్మ్యమున స్వామి మేనెల్ల మేదించిన, మేదించుటలో శ్రీపాదములందుఁ దొరగిన కర్పూర ధూళితోడి పునుఁగు తైలమును దన్మిశ్రమయిన పాదతీర్థమును శ్రీపాదరేణు నామమునఁ బ్రస్తుతి గన్నది.

తాళ్ళపాకవారి సంకీర్తనములలో నిప్పటికి నేఁ జూచినంతలో పునుగు తైలముతోడి కస్తూరీ కర్పూరమిశ్రితమయిన పాదతీర్థమే ప్రస్తుత మయినది గాని, నేటి శ్రీపాదరేణు సంకలనరీతిగాని శ్రీపాదరేణునామముగాని కానరాలేదు. ఒక సంకీర్తనము:-

శంకరాభరణము

*శ్రీహరిపాదతీర్థంబే చెడని మందు
మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు ॥పల్లవి॥

కారమై కంటగించని కడుఁజల్లని మందు
నూఱని కాచని యట్టి నున్నని మందు
కోరికతో వెంవెట్టి కొనితే వల్లని మందు
వేరువెల్లంకులు కూర్చనట్టి వెందువోని మందు ॥శ్రీహరి॥

* దీని కాకరము చూపలేదు. యతిప్రాసలలో రేఫ ఱకార సాంకర్యమూ చింత్యమే.

గుఱుతైన రోగములు గుణముచేసే మందు
దురితములు పెడఁబాపే దొడ్డ మందు
నిరతము బ్రహ్మాదులు నేరుపుతో సేవించే మందు
నరకము సారనట్టి నయమయిన మందు ॥శ్రీహరి॥

పొంకముతో భయములు పొందనియ్యని మందు
మంకుబుద్ధులు మాన్పి మన్నించే మందు
పంకజాక్ష వేంకటరమణ ప్రపన్నుని మందు
సెంకించక తనదాసులఁ జేపట్టే మందు ॥శ్రీహరి॥

అన్నమాచార్యుని సంకీర్తనములలో గురుస్తుతిపరములుగా రచనలు చాలఁగలవుగాని ఆ గురువు పేరేమో సరిగాఁ దెలియరాలేదు. ముద్రాధారణానంతరము వైష్ణవు లీతని బంతి నిడుకొని భుజించిరట (చూ. 31వ పుట). అన్నమాచార్యునినాఁడే యీ వంశము వారు వైష్ణవుల యిరి. ఈ విషయము నీతని పెద్దమనుమఁడు చినతిరుమలాచార్యుఁ డిట్లు చెప్పుకొన్నాడు.

దేసాళం

ఎట్టిహితోపదేశకుఁ డెటువంటి దయాళువు
అట్టె తాళ్ళపాకన్నమాచార్యుడు ॥పల్లవి॥

పచ్చితామసుల మమ్ముఁ బరమసాత్వికులఁగా
యిచ్చటనె సేసినాఁడు యెంతచిత్తము
ఇచ్చగించి మాకులాన నెన్నఁడు లేని వైష్ణవ-
మచ్చముగాఁ గృపసేసె నన్నమాచార్యుఁడు ॥ఎట్టి॥

ముదిరిన పాపకర్మములు సేసినట్టి మమ్ము
యెదుటఁ బుణ్యులఁ జేసె నెంత సౌర్యము
కదిసి యే జన్మానఁ గాననిసంకీర్తన-
మదన నుపదేశించె నన్నమాచార్యుఁడు ॥ఎట్టి॥

గడుసుఁదనపు మమ్ముఁ గడువివేకులఁ జేసి
యిడుమలెల్లాఁ బాపె నేమరుఁడు (గురుఁడు?)
నడుమనే యున్నడుఁ గానని శ్రీవేంకటనాథు-
నడియాలముగ నిచ్చె నన్నమాచార్యుఁడు ॥ఎట్టి॥

వివతిడు. అధ్యా. 9 రేకు.
సంకీ. 52 - సంపు. 16 (1962).

అన్నమాచార్యచరిత్రమున(చూ. 31,32 పుటలు.)నిక్కడఁ గొంత గ్రంథపాత మున్నది. అందుఁ గొన్ని యేండ్లకాలమేమో గురు సన్నిధి నన్నమాచార్యుఁడుండుట, అతని వెదకికొనుచు నాతని తల్లి తిరుమలకు వచ్చి కొడుకును జూచి యింటికి రమ్మని పిలుచుట, అతఁడు సమ్మతింప కుండుట, అందుపై గురుఁడేవో దివ్యోపదేశములు చేసి యింటికిఁ బొమ్మని, మీ వంశమునఁ బుట్టఁబోవువారు మహనీయులు కాఁగలరని యాశీర్వదించుట ప్రధానముగా నుండఁదగిన కథాంశము. తొలుత నింటికిఁబో సమ్మతింప కున్నను గుర్వాజ్ఞ గనుక నన్నమాచార్యుఁ డెట్టకేలకందుకు సమ్మతించెను. ఈ సందర్భమున సంకీర్తనము లున్నవి:-

మలహరి

సర్వోపాయముల జగతి నా కితఁడే
పుర్వీధరుఁడు పురుషోత్తముం డితఁడే ॥పల్లవి॥

సకల గంగాది తీర్థస్నానఫలము లివి
స్వామిపుష్కరిణీజలమే నాకు
సకల పుణ్యక్షేత్రావాసయాత్ర లివి
సరి వేంకటాచలవిహార మిదియే
సకల వేదాధ్యయనశాస్త్రపాఠంబు లివి
శౌరిసంకీర్తనం బిదియే నాకు
సకల కర్మానుష్ఠానముల యితని కిచ్చుటఁ
జాతుపడికైంకర్య మిదియే ॥సర్వో॥

ఉపవాసతపము లివి యితనిప్రసాదంబు-
లొగి భుజింపుటే నాకు దినదినంబు
జప రహస్యోపదేశంబు లితని పాద-
జలజంబులు శరణనేటిసేవ యొకటే
ఉపమింపఁ బుణ్యపురుషుల దర్శనము నాకు-
నొగి నిచటి బహువృక్షదర్శనంబు
యెపుడుఁ బుణ్య కథాశ్రవణంబు లిచ్చోటి-
యెన్నఁగల బహుపక్షికలకలంబు ॥సర్వో॥

తలఁపుగల యోగంబులందు శ్రీవైష్ణవులఁ
దగులు సంవాస సహయోగంబు
వెలయ నిందుమహోత్సవంబు లిన్నియు నితని-
విభవంబు లెసఁగు తిరునాళ్ళు నాకు
చెలఁగి యిటు దేవతాప్రార్థనింతయు నాకు
శ్రీవేంకటేశ్వరుని శరణాగతి
అలరు నా సంపదలు యితని పట్టపురాణి-
అలమేలుమంగ కడకంటిచూపు ॥సర్వో॥

అన్న. అధ్యా. 133 రేకు.
సంకీ. 132 - సంపు. 2 (1981).

బౌళి

పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పదిరెండువేళల రాగాలను ॥పల్లవి॥

తనువే వాళవు తలయే దండెకాయ
ఘనమై వూర్పులు రెండు కట్టిన త్రాళ్లు
మనసె నీబద్దితాడు మటి గుణాలె జీవాళి
మొనసిన పుట్టుగే మూలమైన కరడి ॥పాడే॥

పాపపుణ్యా లిరువంక పైఁడివెండి యనుసులు
పైపైఁగుత్తికె మేటి పై చనిగె
కోపుల నాలికె లోనఁ గుచ్చి కట్టినట్టి లాడు
చూపరాని సంసారమే సూత్రపుఁగణికె ॥పాదే॥

జీవునికిని దండె సేసినవాఁడవు నీవు
వావాతిమాటలే నీపైవన్నె పదాలు
ఈవి మాకు నిహపరా లిచ్చితివి మెచ్చితివి
శ్రీవేంకటేశ నీవే చేకొన్న దాతవు ॥పాదే॥

అన్న. అధ్యా. 281 రేకు.
సంకీ. 467 - సంపు. 3 (1986).

గుండక్రియ

దాఁచుకో నీపాదాలకుఁ దగ నేఁ జేసినపూజ లివి
పూఁచి నీ కీరితిరూపపుష్పము లివి యయ్యా ॥పల్లవి॥

ఒక్కసంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
తక్కినవి భండారాన దాఁచి వుండనీ
వెక్కసమగు నీనామము వెల సులభము ఫలమధికము
దిక్కై నన్నేలితి విఁక నవి తీరని నా ధనమయ్యా ॥దాఁచు॥

నా నాలికపై నుండి నానాసంకీర్తనలు
పూని నాచే నిన్నుఁ బొగడించితివి
వేనామాల వెన్నుఁడా వినుతించ నెంతవాఁడ
కానిమ్మని నా కీ పుణ్యము గట్టితి వింతేయయ్యా ॥దాఁచు॥

ఈ మాట గర్వముగాదు నీ మహిమే కొనియాడితిఁగాని
చేముంచి నా స్వాతంత్ర(త్ర్య?)ము చెప్పినవాఁడఁగాను
నేమానఁ బాడేవాఁడను నేరము లెంచకుమీ
శ్రీమాధవ నే నీదాసుఁడ శ్రీవేంకటేశుఁడవయ్యా ॥దాఁచు॥

అన్న. అధ్యా. 169 రేకు
సంకీ. 338 - సంపు. 2 (1981).

లలిత

బల్లిదులు నీకంటెఁ బరులున్నారా నన్నుఁ
దొల్లిటిబారి నిఁకఁ దోయకు మోయయ్య ||పల్లవి||

చిక్కుల భవములఁ జేరఁ జిక్కి వోపలేక
వెక్కి నీ మరఁగు చొచ్చి నిలిచితిని
అక్కజమై యల్లనాఁడే(టి?) అప్పులకర్మము లెల్ల
ఇక్కడనె చుట్టుముట్టీ నేమి సేతునయ్య ||బల్లి||

లచ్చి సంసారమునకు లగ్గ మచ్చి తీరలేక
యిచ్చట నిన్నుఁ గొలిచి యెక్కువైతిని
పొచ్చముల నల్లనాఁటిపూఁట దీరదని కొన్ని
బచ్చెన బంధాలు వచ్చెఁ బాపఁగదవయ్య ||బల్లి||

అంచల నింద్రియముల కరివెట్టి పెట్టలేక
ముంచి నీపాదాలకు మొఱవెట్టితి
పొంచిన శ్రీవేంకటేశ భువనరక్షకుఁడవు
పంచల నున్నాఁడ నన్నుఁ బాలించవయ్య ||బల్లి||

అన్న. అధ్యా. 361 రేకు.
పుట 44, సంకీ. 65, సంపు.XI (1955)

నారాయణి

ఏలికవు నీవట యింకా దైన్యమేల
తాలిమి నీ చేఁతలకుఁ దగవు గాదనరా ||పల్లవి||

ఘనకర్మానుభవమె కావరె నొండె నాకు
వనజాక్ష నీసేవే వలె నొండె
కినుకఁ బూఁటయు సంకెలయు రెండు నేల
ననిచి ఇందుకు నిన్ను నవ్వేరు సుమ్మీ ||ఏలి||

పై కొని నేఁజేసినపాపమె కావరె నొండె
తూకొని నీ నామముచేఁ దుంచుట యొండె
సాకిరి వంకదుడ్డు శరణార్థి రెండు నేల
మేకొని యీమాట వింటె మెత్తురా నిన్నును ||ఏలి||

ఇరవుగా మఱపొండె యెఱుక గావలెనొండె
పరప రెండును నైన పంగతౌనా
గరిమ శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
పరి బేపి జంటమాట జఱపకు మీఁకను ॥ఏరి॥

అన్న. అధ్యా. 335 రేకు.
సంకీ. 203 - సంపు.X (1952)

ఎట్టకేల కన్నమాచార్యుఁడు తిరుమల వీడి తల్లితో నింటికిఁ జేరెను. నవయౌవనమున నున్న కుమారునికిఁ దల్లిదండ్రులు పెండ్లిప్రయత్నములు చేసిరి. తిరుమలమ్మయని అక్కలమ్మయని భార్యల నిద్దఱ నిచ్చి పెండ్లి చేసిరి. అన్నమాచార్య చరిత్రమున నిర్వురను సమకాలముననే పెండ్లాడె ననదగినట్లు రచనమున్నది. (మా. 32,33 పుటలు.)

తాళ్ళపాకలో, తిరుమలమీఁద, అహోబలమున, ఇంక ననేక పుణ్య స్థలముల వర్తించుచు, గార్హస్థ్య మనుభవించుచు, నన్నమాచార్యుఁడు నవ యౌవనమున స్వామిమీఁదఁ జాల శృంగారకీర్తనములు విరచించెను.

అహోబలనృసింహస్వామి గురువై తానే త్రిదండమును మంత్రములను ననుగ్రహింపఁగా హయగ్రీవానుగ్రహముఁ బడసి సన్న్యసిస్తు వేదాంత దేశికుని సంప్రదాయము ననువర్తించుచున్న శఠకోపమునియొద్ద సకల వేదాంత శాస్త్రము నన్నమయ యధ్యయనము గావించెను. ఈ శఠకోపముని అహోబలమఠ ప్రతిష్ఠాపనాచార్యులయిన యాదివన్ శఠ కోపమునీశ్వరు లగుదురు. అన్నమయనాఁట నీ శఠకోపయతులే వర్తిల్లిరి. ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణ దేవరాయలవా రీ శఠకోపయతిని సన్నుతించిరి. (మా. VI ఆశ్వా., 66 వచనము). అన్నమాచార్యుఁ డీ యతివర్యు నిట్లు కీర్తించెను.

భైరవి

చూడుఁ డిందరికి సులభుఁడు హరి-
తోడునీడయగు దొరముని యితఁడు ॥పల్లవి॥

కైవల్యమునకుఁ గనకపుతాపల-
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై

పావన మొకరూపమై విరజకు
నావై యిదె యున్నాఁ డితఁడు ||మాడు||

కాపాడఁగ లోకములకు సుజ్ఞాన-
దీపమై జగతికిఁ దేజమై
పాపా లడఁపఁగ భవ పయోధులకు
తేపై యున్నాఁ డిదె యితఁడు ||మాడు||

కరుణానిధి రంగపతికిఁ గాంచీ-
వరునకు వేంకటగిరిపతికి
నిరతి నహోబల నృకేసరికిఁ ద-
త్పరుఁడగు శఠగోప(o)ముని యితఁడు ||మాడు||

అన్న. అధ్యా. 19 రేకు.
సంకీ. 117 - సంపు. 1 (1980).

అన్నమాచార్యుఁడు మంచి ప్రాయముననే రామాయణమెల్ల సంకీర్త నాత్మకముగా వెలయించెను. (చూ. 33 పుట.) అన్నమాచార్యుని సంకీర్తనములలో రామాయణకథా ఘటితములు చాలఁ గలవు. అన్నమయ సంకీర్తనపద్ధతి జగన్మోహనమై ప్రఖ్యాతి కెక్కెను. అది విని సాళ్వనర సింగ రాయఁ డన్నమయ దర్శన మపేక్షించెను. ఈ నరసింగరాయఁడు టంగుటూరి[1] పాలకుఁడని నాళీక బాంధవాన్వయుఁడని యిందున్నది (చూ. పుట 34). ఆతఁడు చంద్రవంశమువాఁడని శాసనములందును గ్రంథము-లందు నున్నది. ఇందునాళీక'బాంధవా' ఉండుట, 'శాత్రవా' ఉండుటకు వ్రాయసగాని చేతప్పు గాఁబోలును. నరసింహరాయఁడు విజయనగరపుఁ బ్రథమ రాజ వంశ్యుఁడగు విరూపాక్షరాయల తర్వాత నా వంశము నుత్పా-టించి రాజ్యమాక్రమించుకొన్నాఁడు. ఇంచుమించుగా నాతఁ డన్నమయ వయసువాఁడు. అతఁడు తొలుత దండనాథుఁడుగా విద్యానగరరాజుల క్రింద నుండి యా రాజుల దౌర్బల్యముచే సనసన్నగఁ బెంపొంది తుదికి విద్యానగరాధీశ్వరుఁ డయినాఁడు. విద్యా నగర మాక్రమించుకొనక పూర్వము క్రీ.శ. 1450 ప్రాంతముల నీతఁడు పొత్తపినాఁటిలోని టంగుటూర దండ-

---

[1] టంగుటూరు కడపజిల్లా రాజంపేట తాలూకాలో నున్నది.

నాథుఁడై ప్రాభవమున వర్తిల్లుచుండఁబోలును. అన్నమాచార్యచరిత్రమున నాతఁడు 'రాచమూఁకలలోఁ బరాక్రమశాలి' యని కలదు. అతఁ డన్నమాచార్యుని వేఁడికొని తనయూరికిఁ బిలుచుకొనిపోయినాఁడు. అపుడు "శ్రీకృష్ణు మన్ననఁ గ్రీడి భూచక్ర, మేకచక్రంబుగా నేలినపగిది, నాఁగు మీ సహాయము నాకుఁగలుగ, నేలుదు ధర యెల్ల నేకచక్రముగ" నని తన కోర్కి తెల్పుకొన్నాఁడు. రాయఁడు నన్నమయయుఁ బొంది పొసఁగి టంగుటూరఁ గొన్నాళ్ళుండిరి. అన్నమయ యాశీస్సుచే శ్రీ వేంకటేశ్వరస్వామి దయచే నరసింగరాయఁడు విజయనగరరాజ్య మాక్రమించుకొనెను. తిరుపతి శాసనములఁబట్టియు సాళ్వాభ్యుదయమునుబట్టియు నాతఁడు కొన్నాళ్లు తిరుపతిదగ్గరి చంద్రగిరిలో రాజ్యమేలినట్లు తెలియనగును. టంగుటూ రాతని జన్మస్థలమో దండనాయకతా స్థానమో కాఁబోలును.

విజయనగర రాజ్యపు విప్లవ (విరూపాక్ష చంద్రశేఖర రాయల) కాలమునఁ గాఁబోలును కపిలేశ్వరగజపతి యొకమాఱును, పురుషోత్తమ గజపతి యింకొక మాఱును విజయనగరముమీఁదికి దండెత్తి వచ్చిరి. తొలితూరి కొంత కప్పము చెల్లించి విరూపాక్షరాయఁడు గాఁబోలును విజయనగరమును రక్షించుకొనెను. రెండవతూరి పురుషోత్తమ గజపతికి సాళ్వనరసింహరాయఁ డుదయగిరి రాజ్యము నొసంగి విజయనగరమును గాపాడఁగలిగెను.

కపిలేశ్వరగజపతి:-

ప్రసహ్య కర్ణాటమహీపతేః పురీం నిరుధ్య విద్యానగరీం విజై ర్భరైః,
సమున్నతం మానమివోచ్ఛ్రియం కరం సమాదదే కర్కశచక్రవిక్రమః.

పురుషోత్తమగజపతి:-

యస్మై నిత్యతరప్రతాప దహనజ్వాలాయమానధ్వజ-
స్తంభాబద్ధకుసుంభ రక్తవసనప్రేక్షావిభగ్నద్విషే,
సంధాయాభయ యాచనాంజలి మహోదల్పోదయాద్రిం భయా-
దాత్మానం ముముచే నృసింహనృపతిః కర్ణాటదేశాధిపః[1]

[1] చూ. అనంతవరం తామ్రశాసనము. ఆంధ్ర పత్రిక - విభవ (1928) సంవత్సరాదిసంచిక లోను, కళింగదేశ సంచికలోను ప్రకటితము.

చరిత్రకారు లీసందర్భము నిట్లు గుర్తించిరి--

"విషయాసక్తుఁడగు విరూపాక్షరాయని నాతని పెద్దకుమారుఁడగు రాజశేఖరరాయలు చంపించెను(1478). ఇతనిని ఈతని తమ్ముఁడగు రెండవ విరూపాక్షరాయలు చంపించెను. కాని యీ భ్రాతృహంత పరిపాలనము ప్రజల కిష్టమైనది గాదయ్యెను. ఆతని దండనాయకుఁడగు సాళువ నరసింహరాజు సర్వజనులు తనకు అనుకూలురు కాఁగా రాజును వెడలఁగొట్టి రాజ్యమును ఆక్రమించుకొనెను. అంత నీ ప్రథమవంశ మంతరించెను.(1487). తర్వాత సాళ్వ నరసింహరాజు క్రీ.శ.1487 నుండి 1490 దాఁక రాజ్యమేలెను."[1]

సాళ్వనరసింగరాయనికి బ్రహ్మహత్యాపాపము చుట్టుముట్టఁగా దానిని మాధ్వమతాచార్యులగు శ్రీపాద రాయలవారు విడఁగొట్టిరట. ఈ బ్రహ్మ హత్య కారణముగాఁ దిరుపతి వేంకటేశ్వరస్వామి యర్చనము నిలిచి పోఁగా వ్యాసరాయలు పండ్రెండేండ్లు స్వామియర్చనము సలిపి నెమ్మదిగా మరల వైఖానసులఁ జేర్చిరట! శ్రీపాదరాయాష్టకములో నీ శ్లోకమున్నది--

శ్రీమద్వీరనృసింహరాయనృపతే ర్భూదేవహత్యావ్యథాం
దూరీకృత్య తదర్చితోజ్జ్వల మహాసింహాసనే సంస్థితః,
శ్రీమత్పూర్వకవాటనామకపురే సర్వేష్టసిద్ధిప్రదః
శ్రీశ్రీపాదయతీంద్రశేఖరమణి ర్భూయా త్స నః శ్రేయసే.[2]

క్రీ.శ. 1440 నాఁటికిఁ బదునాలేండ్లవాఁడయిన యన్నమాచార్యుఁ డీ రాజ్యోపప్లవముల నెల్ల నెఱిఁగియున్నాఁడు. నరసింహ రాయల ప్రార్థనమునఁ గాబోలును తఱచుగా విద్యానగరమున కరుగుచు నక్కడ వెలసియున్న వేల్పులపై పెక్కుసంకీర్తనముల రచించినాఁడు. ఆ యా కాలములలో నాతని కక్కడి రాజుల దౌర్జన్యములు ప్రత్యక్షమౌలగుచుండెడివి. రాజ్యలక్ష్మికై నాఁటి రాజులు చేసిన పితృ భాతృ పుత్ర హత్యాదుల నాతఁడు సంకీర్తనములలో వివరించి విలపించినాఁడు--

---

1 మహమ్మదీయమహాయుగము.

2 దీనిని దొలుత కర్ణాటచరిత్రకారులు గుర్తించిరి.

శ్రీరాగం

వెఱతు వెఱతు నిందు వేడుకపడ నిట్టి-
కుఱుచబుద్ధుల నెట్టు గూడుదునయ్య ॥పల్లవి॥

దేహమిచ్చినవానిఁ దివిరి చంపెడువాఁడు
ద్రోహిగాక నేఁడు దొరయట
ఆహికముగ నిట్టి అధమ్రవి(వృ?)త్తికిఁ నే
సాహసమున నెట్టు చాలుదునయ్య ॥వెఱ॥

తోడఁబుట్టినవానిఁ దొడరి చంపెడువాఁడు
చూడ దుష్టుఁడుగాక సుకృతియట
పాడైనయిటువంటి పాపబుద్ధులు సేసి
నీడ నిలువ నెట్టు నేరుతునయ్య ॥వెఱ॥

కొడుకు నున్నతమతిఁ గోరి చంపెడువాఁడు
కడుఁబాతకుఁడుగాక ఘనుఁడట
కడలేని యిటువంటి కలుష్వి(వృ?)త్తికి నాత్మ
వొడఁబఱపఁగ నెట్లోపుదునయ్య ॥వెఱ॥

తల్లిఁ జంపెడువాఁడు తలఁప దుష్టుఁడు గాక
యెల్లవారల కెల్ల(కన్న?) నెక్కుడట
కల్లరి యనుచు లోకము రోయు పని యిది
చెల్లఁబో నే నేమి సేయుదునయ్య ॥వెఱ॥

యింటి వేలుపు వేంకటేశ్వరుఁ దనవెంట-
వెంటఁ దిప్పెడువాఁడు విభుఁడట
దంటనై యాతని దాసానుదాసినై
వొంటి నుండెద నేమి నొల్ల నోయయ్య ॥వెఱ॥

అన్న. అధ్యా. 38 శ్లో.
సంకీ. 235 - సంపు. 1 (1980).

విజయనగరరాజ్యముమీదికి (కపిలేశ్వర, పురుషోత్తమ) గజపతులు దండెత్తి వచ్చునపుడో యింకెపుడో అన్నమయ్య విజయనగరములోనో

స్వగ్రామముననో ఉండఁగా, నాతని దేవతార్చన విగ్రహములను శత్రువు రెత్తుకొనిపోవుటో, స్థలముమార్పు గజిబిజిపాటులో నేమో అయిపోవుటో జరిగి కానరాకపోఁగా సంకీర్తన రూపమున నిట్లు విలపించినాఁడు--

బౌళి

ఇందిరారమణుఁ దెచ్చి యియ్యరో మా కిటువలె
పొంది యీతనిఁ బూ ంచఁ బొద్దాయ నిపుడు ॥పల్లవి॥

ధారుణి మైరావణు దండించి రాముఁ దెచ్చి
నేరుపు మించిన యంజనీతనయా
ఘోరనాగపాశములఁ గొట్టి వేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా ॥ఇంది॥

నానాదేవతలకు నరసింహుఁ గంభములో
పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదుఁడా
మానవుఁడై(డౌ?) కృష్ణు మహిమల విశ్వరూపు
పూని బండి నుంచుకొన్న పోటుబంట యర్జునా ॥ఇంది॥

శ్రీవల్లభునకు నశేషకైంకర్యముల
శ్రీవేంకటాద్రివైన శేషమూరితీ
కైవశమైనయట్టి కార్తవీర్యార్జునుఁడా యీ-
దేవుని నీవేళ నిట్టె తెచ్చి మాకు నియ్యరే ॥ఇంది॥

అన్న. అధ్యా. 373 రేకు.
పుట 91, సంకీ. 135 - సంపు. XI (1955).

క్రీ.శ. 1440 ప్రాంతములనో తర్వాతనో తురుష్కులు గాఁబోలును జరిపిన దౌర్జన్యము నన్నమాచార్యు డిట్లు చెప్పి చెప్పి చింతిల్లినాడు.

రామక్రియ

తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయఁ జెప్ప నేఁడు కలికాలమహిమ ॥పల్లవి॥

తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె భూతములు యెట్టు మోఁచెనో
అటు బాలుల రొదలు ఆకాశ మెట్టోరిచెనో
కటకటా యిట్లాయఁ గలికాలమహిమ ॥తతి॥

అంగలాచే(ర్చే?)కామినుల యంగభంగపుదోఁపు-
లింగితాన మింట సూర్యుఁ డెట్టు చూచెనో
పొంగు నానాజాతిచేత భువన మెట్లానెనో
కంగి లోక మిట్లాయఁ గలికాలమహిమ ॥తతి॥

అరుదు గోహత్యలు పేయఁగ దూడ లంగలావ(ర్చ?)
పరి ధర్మదేవ తెట్టు సమ్మతించెనో
పరధనచూఱ కెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ యెం దణఁగెనో కలికాలమహిమ ॥తతి॥

దేవాలయాలు నానాదేశములెల్లాఁ జొచ్చి
దేవఁగా నెట్లుండిరో దేవతలు
తావులేలే రాజులకు దయ గొంత వుట్టదాయ
కావరమే ఘనమాయఁ గలికాలమహిమ ॥తతి॥

నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను
తెరల కెట్టుండిరో దిక్పాలులు
విరసవర్తను లుండే విపరీతకాలమున
గరువాలుఁ గపటాలె కలికాలమహిమ ॥తతి॥

వుపమించి దంపతులు వొకరొకరినిఁ జూడ
చపల దుఃఖములతో సమయఁగాను
తపములు జపములు ధర్మము లెందణఁగెనో
కపురుఁ బాపాలు నిండెఁ గలికాలమహిమ ॥తతి॥

తలలువట్టీదువఁగా తల్లులు(ల?) బిడ్డల వేయ
తలఁపెట్టుండెనో యంతర్యామికి
మలపి ముక్కులు గోయ మరుఁడెట్టు వోరిచెనో
కలఁకలే ఘనమాయఁ గలికాలమహిమ ॥తతి॥

దీనత లోఁబడి గుండెదిగు లసురుసురులు
వాని నెట్లు*లోగానో వాయుదేవుఁడు
గూను వంచి తల్లి చూడఁ గొడుకుఁ గుత్తిక గోయఁ
గానఁబడె నింతేసి కలికాలమహిమ ॥తతి॥

పలుమాఱు నమ్మించి ప్రాణములు గొనఁగాను
యిలఁ దమలోఁ బ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీవేంకటేశ నీవే యెరుఁగుదువు
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమ ॥తతి॥

అన్న. అధ్యా. 373 రేకు.
పుట 89, సంకీ. 133 - సంపు. XI (1955).

గజపతులు విద్యానగరము నాక్రమించినప్పు డాతఁ డొడ్డెబాస నేర్చుకో-వలసినవాడయినాఁడు గాఁబోలును. దీనిని సంకీర్తనమునఁ జెప్పుకొన్నాఁడు:-

మాళవి

అన్నియు నాయందె కంటి నన్నిటివాఁడా నేనే
మున్నె నా భావముతో ముడిచివేసినది ॥పల్లవి॥

చెలఁగి సంసారమే చింతించి సంసారినైతి
ములిఁగి ముక్తి దలఁచి ముక్తుఁడనైతి
పలుమతాలు దలఁచి పాషండబుద్ది(ద్ధి?)నైతి
చెలఁగి శ్రీపతిఁ దలఁచి వైష్ణవుఁడనైతి ॥అన్ని॥

పాపఁగఁ బుణ్యముసేసి పుణ్యాత్ముఁడనైతి
పసలఁ బాపముచేసి పాపకర్ముఁడనైతి
వెస బ్రహ్మచారినైతి వేరె యాచారమున
ముసిపి(ఁగి?) మటొకాచారమున సన్యాసినైతి ॥అన్ని॥

---

'లోఁగానో' 'లోఁగానెనో'కు వ్యావహారికము గావచ్చు.

వాగి నొడ్డెభాష లాడి వొడ్డెవాఁడనైతిని
తెగి తెలుఁగాడనేర్చి తెలుఁగువాఁడనైతి
అగడై శ్రీవేంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీ దాసుఁడనై దాసరి నేనైతి ॥అన్ని॥

అన్న. అధ్యా. 266 రేకు.
సంకీ. 379 - సంపు. 3 (1986).

విజయనగరరాజ్య ప్రధానరాజధాని విజయనగరమే అయినను నరసింహ రాయఁ డందు స్థిరవాసము చేయలేదేమో! రాజ్యసర్వస్వాక్రమణానంతరమో తత్పూర్వమో కొన్నాళ్ళాతఁడు గొప్పదుర్గమగు పెనుగొండలోఁగూడ నుండెను గాఁబోలును. అన్నమాచార్యునిఁ బెనుగొండకు రావించుకొని సంకీర్తనములు వినిపింపవేఁడెను.

## అన్నమయ పాడుట

తేనెలంపై తేట తిన్ననిచెఱకు-
పానకముల నేరుపటిచినమేలు
చక్కెరలో తీపు చల్లఁదెమ్మెరలు
చిక్కని కపురంబు జీవరత్నములు
కల యమృతంబు మీఁగడమీఁదిచవులు
చిలుకుచుఁ గవులెల్లఁ జేయెత్తి మ్రొక్క- (మా. 30 పుట.)

నన్నమయ పాడెను. తిరుమలాచార్యుఁడుగాఁబోలును అన్నమాచార్యు సంకీర్తనముల నిట్లు సన్నుతించెను--

సురలకు నరులకు సొరిది విన విన
అరుదు తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥పల్లవి॥

చక్కెరై చవిచూపీ జాలై తావి చల్లీ-
నక్కజపుమాఁతువజ్రాలై మెఱపీని
వెక్కుటర్థములై మా నిలువునీడలు చూపీ-
నక్కర తాళ్ళపాకాన్నమయ్యపదములు ॥సుర॥

పచ్చిదై పైఁబూపిఁ గప్రంబై చలువ రేఁచీ
మిన్నగలముత్యములై మెయినిండీని
వెన్నుబలములై మావెంటవెంటఁ దిరిగీని
అన్నిట తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సుర॥
నెట్టన వేదాంతములై నిత్యములై పాడచూపీ
పుట్టుతోనె గురువులై బోధించీని
గట్టి వరాలిచ్చే శ్రీవేంకటనాథుని మెప్పించీ-
నట్టె తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సుర॥

శేషా. ౹ాఁతప్రతి.

వానిని విని యానందపరవశుఁడై నరసింహరాయఁ డాచార్యునిఁ జాల సత్కరించెను. పచ్చలకడియాలు మొదలుగా నాభరణాలు కానుకలొసఁగెను. అన్నమాచార్యుల కాలముననే తాళ్ళపాకవారికి అగ్రహారము లెన్నో ఉన్నట్టు-న్నవి. ఏలనగాఁ దత్పుత్రుఁడు పెదతిరుమలయ్య చాలా అగ్రహారములను స్వామికి సమర్పించెను. అందుఁ గొన్నియేని యన్నమాచార్యుఁడు నరసింగరాయాదులవల్ల నార్జించియుండును. అన్నమాచార్యచరిత్రలో 46వ పుటలో నిట్లున్నది. "వేంకటాద్రిచెంగటను తనయగ్రహారమై తనరుచునున్న [1]మరులుంకు (?) నొకజీడిమామిడిదాన"

అన్నమాచార్యుఁడు రాజసముతోఁ జాల వైభవముతోఁ గొన్నాళ్లు వెలుఁగొందెను. (చూ. 37,38 పుటలు).

## అన్నమయ శృంగారసంకీర్తనములు

ఈ రాయఁడు మరల నన్నమాచార్యుని నొకనాఁడు పిలిపించి స్వామి వారిపై రచించిన శృంగారసంకీర్తనములు గొన్ని పాడవేఁడెను. అన్నమయ పాడెను. (చూ. పుట 39) అందు:--

---

1 ఇది "మరువాకర" కావచ్చును. ఈ పేరి యగ్రహారమును అన్నమాచార్యుల కొమారుఁడు పెదతిరుమలాచార్యుఁడు స్వామికి సమర్పించెను.

చెలులార! వేంకటశిఖరినాయకుని-
"కలికికిఁ గడగంటఁ గనుపట్టునెఱుపు
చెలువ మేగతి నుండెఁ జెప్పరే" యనిన
"నలువునఁ బ్రాణేశు నాటిన చూపు
నిలువునఁ బెఱుక నూనిన శోణితంబు
తలపోయఁ గాదుగదా యన్నపదము
పలుమఱుఁ బాడించి పాడించి చొక్కి"నాఁడట.

ఆ శృంగార సంకీర్తనమిది--

## నాదరామక్రియ

ఏమొకో చిగురుటధరమున యెడనెడఁ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు గదా ॥పల్లవి॥

కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచిన-
చెలువం బిప్పు డిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాటిన యా కొనచూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు కాదు గదా ॥ఏమొ॥

పడఁతికి చనుఁగవమెఱుఁగులు పైపైఁ బయ్యెద వెలుపల
కడుమించిన విధమేమో కను గొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁ బ్రియుఁడొత్తిన నఖశశిరేఖలు
వెడలఁగ వేసవికాలపు వెన్నెల కాదు గదా ॥ఏమొ॥

ముద్దియచెక్కుల కెలఁకుల ముత్యపుజల్లుల చేర్పుల-
వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపుఁజెమటల అందము కాదుగదా ॥ఏమొ॥

అన్న. శృంగా. 14 రేకు.
సంకీ. 82 - సంపు. 12 (1976)

## రాజధిక్కారము

రాయఁడు గర్వించి మైమఱచి వేంకటపతిమీఁది పదములవంటి పదములు నామీఁదఁ జెప్పుమని కోరఁగా అన్నమాచార్యుఁడు "హరి ముకుందునిఁ గొనియాడు నాజిహ్వ నినుఁగొనియాడంగ నేర" దని చెప్పి తిరస్కరించినాఁడు. (చూ. 40 పుట.) ఇట్టి కథయే తిరుమళిశై ఆళ్వార్ల చరిత్రమునను గలదు. (చూ. పరమ. ఆశ్వా 2. పుట 92.)

### లలిత

తలఁగరో లోకులు తడవకురో మమ్ము
కలిగిన దిదె మాకాపురము ||పల్లవి||

నరహరికీర్తన నానిన జిహ్వ
ఒరుల నుతింపఁగనోపదు జిహ్వ
మురహరుపదముల మ్రొక్కిన శిరము
పరుల వందనకుఁ బరగదు శిరము ||తల||

శ్రీపతినే పూజించిన కరములు
చోఁపి యాచనకుఁ జొరవు కరములు
యేపున హరికడ కేఁగిన కాళ్లు
పాపులయిండ్లకుఁ బాఱవు కాళ్లు ||తల||

శ్రీవేంకటపతిఁ జింతించు మనసు
దావతి నితరముఁ దలఁచదు మనసు
దేవుఁ డతని యాధీనపు తనువు
తేవల నితరాధీనము గాదు ||తల||

అన్న. అధ్యా. 135 రేకు.,
సంకీ. 144 - సంపు. 2 (1981)

### పాడి

పుట్టుభోగులము నేము భువి హరిదాసులము
నట్టనడిమిదొరలు నా కియ్యవలెనా ||పల్లవి||

పల్లకీలు నందలాలు పడివాగె తేజీలు
వెల్లవిరి మహాలక్ష్మివిలాసములు
తల్లి యాకెమగనినే దైవమని కొలిచేము
వొల్లగే మా కీసిరులు వొరు లియ్యవలెనా ॥పుట్టు॥

గ్రామములు రత్నములు గజముఖ్యవస్తువులు
ఆమనిభూకాంతకు నంగభేదాలు
భామిని యాకె మగని ప్రాణధారి లెంకలము
వోమి మా కాతఁడె యిచ్చీ నొరు లియ్యవలెనా ॥పుట్టు॥

పసగలపదవులు బ్రహ్మనిర్మితములు
వెస బ్రహ్మతండ్రి శ్రీ వేంకటేశుఁడు
యెసఁగి యాతఁడే మమ్ము నేలి ఇన్నియు నిచ్చె
వొసఁగిన మా సొమ్ములు వొరు లియ్యవలెనా ॥పుట్టు॥

అన్న. అధ్యా. 316 రేకు.
సంకీ. 94 - సంపు. X (1952).

## శుద్ధవసంతం

చీచీ వివేకమా చిత్తపువికారమా
యేచి హరిఁ గొలువక హీనుఁడాయ జీవుఁడు ॥పల్లవి॥

బలికేనంటాఁ బోయి పయిఁడి వుచ్చుక తన-
పలియవసరమునఁ బ్రాణమిచ్చీని
బలు కందులోన నేది పసిఁడి యెక్కడ నుందు
గతి హరిఁ గొలువక కట్టువడె జీవుఁడు ॥చీచీ॥

దొడ్డవాఁడ నయ్యేనని దొరలఁ గొలిచి వారి-
కడ్డము నిడుపు మొక్కు నతిదీనుఁడై
దొడ్డతన మేది యందు దొర యాడ నున్నవాఁడు
వొడ్డి హరిఁ గొలువక వోడుపడె జీవుఁడు ॥చీచీ॥

చావనేల నోవనేల సారెc గిందుపడనేల
యీవల శ్రీవేంకటేశుc డింట నున్నాcడు
దేవుc డాతcడే నేcడు తెలిసి కొలిచేcగాని
భావించ కిన్నాళ్ళుదాcకా భ్రమc బడె జీవుcడు ॥చీచీ॥

అన్న. అధ్యా. 103 రేకు.
సంకీ. 13 - సంపు. 2 (1981).

వరాళి

ఎవ్వరివాcడాc గాను యేమందు నిందుకు
నవ్వుచు నాలోని హరి నన్నుc గావవే ॥పల్లవి॥

కోపుల రాజులనెల్ల కొలిచి కొన్నాళ్ళు మేను
చూపుదుcబూcట వెట్టితి సాగిసి నేను
యేపున సంసారమున యిదిగాక కమ్మటాను
దాపుగ తొర్లుcబూcట తగిలించుకొంటిని ॥ఎవ్వ॥

మొదలc గర్మములకు మోసపోయి యీ బ్రదుకు
కుదువవెట్టితి నే గుఱిగానక
వెరకి కామునికి విషయములకు నే-
నదివో నావయసెల్ల నాహివెట్టితిని ॥ఎవ్వ॥

ఇప్పుడే శ్రీవేంకటేశ యీడేర్చి నామనసు
కప్పిన గురుcడు నీకు క్రయమిచ్చెను
వొప్పించి రిందరు బలువుcడు చేపట్టె నను చు
అప్పులెల్లc బాసి నీసొమ్మైతి నయ్యా ॥ఎవ్వ॥

అన్న. అధ్యా. 325 రేకు.
సంకీ. 142 - సంపు. X (1952).

## ఆచార్యునికి సంకెల

రాయc డన్నమాచార్యునికి మూరురాయరగండమని పేరుగల సంకెల వేయించి చెరసాలలోc బెట్టించెను. "సంకెల లిడువేళc జంపెడు వేళ-

నంకిలి ఋణదాత లాఁగెడు వేళ" ఇల్యాదిగా నాతఁడు సంకీర్తనము చెప్పి సంకెల విదలించుకొన్నాడు. (మా. 41 పుట.)

ముఖారి

ఆఁకటి వేళల నలపైన వేళలను
తేఁకువ హరినామమే దిక్కు మఱి లేదు ॥పల్లవి॥

కొఱమాలివున్న వేళ కులముచెడిన వేళ
చెఱవడి వొరులచేఁ జిక్కినవేళ
వొఱపైన హరినామ మొక్కటే గతిగాక
మఱవి తప్పిననైన మఱి లేదు తెఱఁగు ॥ఆఁక॥

ఆపద వచ్చిన వేళ యాఱడిఁబడిన వేళ
పాపపు వేళల భయపడిన వేళ
వోపినంత హరినామ మొక్కటే గతిగాక
మాపుదాఁకాఁ బొరలిన మఱి లేదు తెఱఁగు ॥ఆఁక॥

సంకెళ(ళ్ళ?)ఁబెట్టినవేళ చంపఁ బిలిచిన వేళ
అంకిలిగా నప్పులవా రాఁగిన వేళ
వేంకటేశు నామమే విడిపించ గతిగాక
మంకుబుద్ధిఁ బొరలిన మఱి లేదు తెఱఁగు ॥ఆఁక॥

అన్న. అధ్యా. 26 రేకు.
సంకీ. 158 - సంపు. 1 (1980).

దేసాక్షి

నీ దాసుల భంగములు నీవు చూతురా
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా ॥పల్లవి॥

పాలసముద్రముమీఁదఁ బవళించినట్టి నీకు
బేలలై సురలు మొఱవెట్టినయట్టు
వేళతో మా మనవులు విన్నవించితిమి నీకు
యేల నిద్దిరించేవు మ మ్మిట్టె రక్షించరాదా ॥నీదాసు॥

ద్వారకానగరములో తగ నెత్తమాడే నీకు
  చీరాన ద్రౌపది మొఱవెట్టినయట్టు
  ఘోరపు రాజసభలఁ గుంది విన్నవించితిమి
  యేరీతి పరాకు నీకు నిఁక రక్షించరాదా ॥నీదాసు॥

యెనసి వైకుంఠములో నిందిరఁ గూడున్న నీకు
  పెనఁగి గజము మొరవెట్టినయట్టు
  చనవుతో మా కోరికె సారె విన్నవించితిమి
  విని శ్రీవేంకటేశుఁడ వేగ రక్షించరాదా ॥నీదాసు॥

అన్న. అధ్యా. 247 రేకు.
సంకీ. 266 - సంపు. 3 (1986).

## సామంతం

దాసవర్గముల కెల్లా దరిదాపు మీరే కాన
  వాసికి నెక్కించరాదా వసుధలో మమ్మును ॥పల్లవి॥

సేనాధిపతి నీవు చేరి విన్నవించరాదా
  శ్రీనాథునికి నేము సేసే విన్నపము
  ఆనుక భాష్యకారులు అట్టె మీరుఁ జేయరాదా
  మానక విన్నపము మా మనవి చనవులు ॥దాస॥

వేయినోళ్ళ భోగి నీవు విన్నపము సేయరాదా
  వేయేసి మావిన్నపాలు విష్ణునికిని
  ఆయితమై గరుడఁడ అట్టె మీరుఁ జేయరాదా
  యేయెడ విన్నపము మా కేమి వలసినాను ॥దాస॥

దేవులమ్మ యిందిర మాదిక్కై విన్నవించరాదా
  శ్రీవేంకటపతికి చిత్తమందను
  ఆవేళ శేషాచలమ అట్టె మీరుఁ జేయరాదా
  యీవేళ మావిన్నపము లీడేరె నిఁకను ॥దాస॥

అన్న. అధ్యా. 247 రేకు.
సంకీ. 266 - సంపు. 3 (1986).

ఆచార్యుని మాహాత్మ్యమున కచ్చెరువడి నరసింగరాయఁడు శరణు వేఁడి యాతనిచే ననుగృహీతుఁడయ్యెను (చూ. చరిత్రము 43-44 పుటలు.)

## రాయల కైంకర్యములు

విజయనగర రాజ్యమున సురక్షితుఁడై నరసింగరాయఁడు క్రీ.శ. 1495 దాఁక రాజ్యమేలెను. సంస్కృతమునఁదచ్చరిత్రము సాళ్వాభ్యుదయమని రచితమయ్యెను. రాయఁడే రామాభ్యుదయమను కావ్యము రచించెను. *వీరన యాతనిని శ్రీ వేంకటాద్రినాథ దయావర్ధితరాజ్యుడని, రత్నాంశుమత్కాంచీ వేంకట కాళహస్తినగరీ కళ్యాణ సౌధాంచల ప్రాంచద్యాసనుఁడనీ తాను గృతిచేసిన జైమినిభారతమున వర్ణించినాఁడు.

శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామి కీతఁ డనేకోత్సవ విశేషములు, నైవేద్య విశేషములు, ఆభరణవిశేషములు, ప్రాకార మండప సోపానాది నిర్మాణ విశేషములు ధనవ్యయముతో వెలయించినాఁడు. వానినిగూర్చిన శాసనములు పదునాలు గున్నవి. స్వామి కైంకర్యపరాయణులై కొండమీఁదఁ ప్రఖ్యాతి గాంచియున్న కందాళరామానుజ జియ్యంగారి కీతఁడు శిష్యుఁ డయ్యెను. పై కైంకర్యములు స్వామికిఁ గావించుటలో నన్నమాచార్యులయు నా జియ్యంగార్లయు నుపదేశముల నాతఁడు పాటించుచుండవచ్చును.

## నాఁటి యన్నమయ

ఆ నాళ్ళలో నన్నమాచార్యుఁడు తన యగ్రహారములలోను దాళ్ళపాక లోను గొంతకాలము వసించుచువచ్చినను, దిగువతిరుపతిలోను గొండమీఁద స్వామిసన్నిధిని నెక్కువకాలము గడపుచువచ్చెను. ఆ చోట్ల గృహాదివసతు లాతని కాలముననే యేర్పడెను. ఆతని కుమారుని నాళ్ళలోఁ గొండ మీదను దిగువ తిరుపతిలోను దమగృహముల ముందు మండపముల గట్టించి యక్కడ స్వామిని వేంచేపు చేయించి యుత్సవాదులు జరపించుట సాగెను.

---

* ఈ కవి పూర్తిపేరు పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి.

గుండక్రియ

కోటికిఁ బడగయెత్తి కొంకనేల
　యీటులేని పద మెక్కి యిఁక నేల చింత ॥పల్లవి॥

పెట్టినది నొసలను పెద్దపెద్ద తిరుమణి
　కట్టినది మొలఁ జిన్న కౌపీనము
　పట్టినది శ్రీహరిపాదపద్మమూలము
　యెట్టయినా మాకు మేలే యిఁక నేల చింత ॥కోటి॥

చిక్కి నా లోనైనది శ్రీవైష్ణవధర్మము
　తొక్కినది భవముల తుదిపదము
　యెక్కినది హరిభక్తి యిది పట్టపేనుఁగ
　యెక్కువ కెక్కువే కాక యిఁక నేల చింత ॥కోటి॥

చిత్తములో నిండినది శ్రీపతిరూపము
　హత్తినది వైరాగ్య మాత్మధనము
　యెత్తలఁ జూచిన మాకు నిదివో శ్రీవేంకటేశుఁ-
　డెత్తి మముఁ గావఁగాను యిఁక నేల చింత ॥కోటి॥

అన్న. అధ్యా. 307 రేకు.
సంకీ. 40 - సంపు. X (1952).

## కొండకుఁ బయనము

అన్నమాచార్యుఁడు పెనుగొండ (రాయల యాస్థాని) నో తాళ్ళపాకనో వీడి స్వామిని దర్శింప రాఁగోరి చెప్పిన సంకీర్తనము:--

లలిత

రామ కృష్ణ నీవు నందే రాజ్య మేలుచుండుదువు
　యేమిసేసే విక్కడ నీ యిరవుకే పదవే ॥పల్లవి॥

లంక విభీషణు నుంచ లక్ష్మణుని నంపినట్టు
　లంకె సుగ్రీవుఁ గిష్కింధ కంపినయట్టు
　వంకకు సంజీవి దేను వాయుజుని నంపినట్టు
　వేంకటాద్రి పొంతనుండ వేగ మమ్ము నంపవే ॥రామ॥

ఘనకిరీటము దేను గరుడని నంపినట్టు
అనుఁగుఁగపుల నిండ్ల కంపినట్టు
వానర గోపిక లొర్ది కుద్ధవుని నంపినట్టు
ననుపు శేషాద్రి నుండ నన్ను నంపవే ॥రామ॥

పెండిలికిఁ బరుషలఁ బిలువఁగ నంపినట్టు
అండనె ముందరఁ గంత కంపినయట్టు
వెండియు శ్రీవేంకటేశ వెంట వచ్చి మరలితి
వుండ(దు?) చోట నుండి నన్ను వూడిగాన కంపవే ॥రామ॥

అన్న. అధ్యా. 275 రేకు.
సంకీ. 432 - సంపు. 3 (1986).

## అన్నల జోల

అన్నమాచార్యుఁడు శృంగారమంజరి[1] యను మంజరీచ్ఛందోమయ రచనను భాషచే భావముచే శృంగారసుందరమైన దానిని శ్రీవేంకటేశ్వరస్వామివారిపై రచింపఁగాఁ జిత్తగించి స్వామి యన్నమాచార్యు నిట్లనుగ్రహించెను: (చూ. చరిత్రము 44-45 పుటలు.)

శృంగారమంజరిఁ జేసి శేషాద్రి-
శృంగవాసునకు నర్పించి యిచ్చుటయు,
నాడుచుఁ బతకమాకన్నలజోల
పాడఁగ నాఁడెల్లఁ బసిబిడ్డనైతి-
నా కృష్ణమాచార్యు నధ్యాత్మవినుతి-
రాకఁ గొన్నాళ్లు విరక్తుండనైతి
జగతి నీశృంగారసంకీర్తనముల-
కగపడి మంచిప్రాయపువాఁడ నయితి-
నని వేంకటేశ్వరుఁ డన్న మాచార్యుఁ
గనుఁగొని వ్రాకుచ్చి గారవింపుటయు

[1] ముద్రితము. చూ. తాళ్ళపాక కవుల లఘురచనలు, వాల్యూం I (1935).

పై గ్రంథభాగమునఁ దొలుత పతకమాకన్నంజోల తర్వాత కృష్ణమాచార్యు నధ్యాత్మవినుతి కలవు. కృష్ణమాచార్యుఁడు కాకతీయ ప్రతాపరుద్రుని నాఁటివాఁడు. కాన యాతని వినుతికి ముందు గల పతకమాకన్నం జోల యంత కింకను బ్రాచీనము కాఁబోలును. అది యెట్టిదో యెక్కడేని కలదేమో తెలియఁజాలకున్నాను. వాక్యము సరిగానున్నదో లేదో కూడఁ దెలియదు. పతకమాక ఊరిపేరేమో! అది పతకమాకో లేక పతకమూరో పాతకమూరో ఇంకేదో ఆ యూరివాఁడయిన అన్నయ అనుగేయకవి జోంపాట రచించి యాదుచు నొండె, స్వామి బాలుఁడై యాడఁగానొండెఁ బాడెడివాఁడని యర్థము కాఁబోలును. పయి పతకమాకయన్నంజోం సుప్రఖ్యాతమయి తాళ్ళపాకవారు మెచ్చినదయి యుండును.

రాగితేకులలో అన్నమాచార్యుఁడు రచించినవే యనేకములు జోంలున్నవి. వేలకొలఁదిగా నున్న యా శృంగారసంకీర్తన లెల్ల నిఁక సుపరిశోధితములు ముద్రితములును గావలసియున్నవి.

## అన్నమయ జోల

ఇటీవల నొక జోంపాటను లోకమున వ్యాపించిన దానిని నన్నమాచార్యుని పేరనుండుట గుర్తించితిని.[1]

రాగం. అటతాళం.

జో వచ్యుతానంద జోజో ముకుంద
  రావె పరమానంద రామగోవింద ॥జో॥

అంగజునిగన్న మాయన్న యిటు రారా
  బంగారుగిన్నెలోఁ బాలు పోసేరా
  దొంగ నీవన సతులు పొంగుచున్నారా
  ముంగిట నాడరా మోహనాకారా ॥జో॥

[1] (శ్రీచిప్పా అప్పారావుగారి యింట వారిపూర్వులు వ్రాసియుంచుకొన్న పంచి సంకీర్తనముల సంచయములోనిది. చిరంజీవి తి.కోదండరామయ్య 8-9-48 ఆంధ్రవారపత్రికలోఁ బ్రకటించెను.)

గోవర్ధనంబెల్ల గొడుగుగాఁ బట్టి
కావరమ్మున నున్న కంసుఁ బడగొట్టి
నీవు మధురాపురము నేలఁ జేపట్టి
ఠీవితో నేలిన దేవకిపట్టి ॥జో॥

అంగుగాఁ దాళ్ళ పాకాన్నయ్య చాల
శృంగార రచనగాఁ జెప్పె నీజోల
సంగతిగ సకలసంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల! ॥జో॥

ఈ జోలలో అన్నమాచార్యుని పేరున్నది గాని యది తిరుపట్ల బాల గోపాలదేవునిముద్రతో మాత్రమే యున్నది. నేను ముప్పదేండ్లకుఁ బూర్వము తంజావూరిలైబ్రరినుండి ఈజోల కొన్ని చరణములు వ్రాసి యుంచుకొనుట నిటీవలఁ జూచితిని. అది వేఱుతీరుగా నున్నట్టున్నది. అందీచరణమున్నది:--

అలిగి తృణావర్తు నవనిఁ గూల్చితివి
బలిమిమైఁ బూతనఁ బట్టి పీల్చితివి
చెలఁగి శకటాసురునిఁ జేరి డొల్చితివి
తలఁచి మద్దులు రెండు ధరణి వ్రాల్చితివి.

అన్నమయ శ్రీ వేంకటేశ్వరస్వామిమీఁదనే కాక యింక ననేకపుణ్యక్షేత్రములలోని దేవతలమీఁదఁగూడ సంకీర్తనములు రచించినాఁడు. ఆ సంకీర్తనములలోఁ బెక్కింట నాయా క్షేత్రముల దేవతలపేర్లతో నభేదము గల్పించి తుదిచరణమున శ్రీతిరుపతి వేంకటేశ్వరస్వామి నామ ముద్రికను నెట్టుకొల్పుచుండును. ఈ జోలలో స్వామి నామముద్ర లేదు. ఇది యిక్కడి రాగి రేకులలో నున్నదో లేదో.

## అన్నమయ లాలి

తంజావూరి పుస్తకశాలనుండి యిటీవలఁ గొన్ని తాళ్ళపాక సంకీర్తనములు వ్రాయించి తెప్పించితిమి. అందు మీఁదిజోలవంటి దొక లాలి కలదు. దానఁగూడ గఁడవరపు బాలగోపాలుని నామాంక మున్నదిగాని

శ్రీ వేంకటేశ్వరస్వామి నామాంకము గానరాదు. అన్నమయపేరందు లేకపోయినను గండవరము తాళ్ళపాకవారికిఁ జెల్లుమవచ్చిన గ్రామమని తెలియుటచేఁ దమయూరి స్వామిమీఁద నన్నమాచార్యుఁడో తత్పుత్రపౌత్రులో దానిని రచించియుందు రనుకొంటిని. అదియిది:--

## శ్రీరాగం. జంపెతాళం

లాలనుచు నూచేరు లలన లిరుగడల
 బాల గండవరగోపాల నినుఁ జాల ॥పల్లవి॥

ఉదుటుగుబ్బల సరము లుయ్యాల లూఁగ
 పదరి కంకణరవము బహుగతుల మ్రోఁగ
 వొదిగి చెంపల కొప్పు లొక్కింత వీఁగ
 ముదురు చెమటల నళికములు తొప్పఁదోఁగ ॥లాలి॥

సొలపు తెలిగన్నుఁగవ చూపు లిరువంక-
 మలయు రవళులకుఁ బలుమాఱును బెళంక
 కొలఁది కోవిల గములు క్రోలు మదనాంక-
 ములఁ గ్రేణిసేయు రవములు వడిఁ దలంక ॥లాలి॥

పరసపదములు జంగవాఁపుచేఁ బాయ
 గురులీల మీఁగాళ్ళఁ గుచ్చెళ్ళు రాయ
 కరమూలముల కాంతి కడుఁజాయఁ జేయ
 సరస నురుకుసుమవాసన లెదురు డాయ ॥లాలి॥

కొలఁది నునుమేను లతకూన లసియాడ
 మెలఁకువలొ నొకరొకరి మెచ్చి సరిగూడ
 తలలూఁచి చొక్కి చిత్తరుబొమ్మ లాడ
 అలరి యెల్లరు మోహనాకృతులు చూడ ॥లాలి॥

లలిత తాంబూలరస కలితంబులైన-
 తళుకుదంతములు కెంపులగుంపు లీన
 మొలకవెన్నెల డాలు ముసురుకొని లోన
 చెలఁగి పెలవుల ముద్దుచిఱునవ్వు లాన ॥లాలి॥

మలయమారుత గతులు మాటికిఁ జెలంగ
పలుకుఁగపురపుతావి పై పై మెలంగ
బలు గానలహరి యింపుల రాల్గరంగ
బలసి వినువారి చెవి బడలిక దొలంగ ||లాలి||

లలనా జనాపాంగ లలితసుమచాప
జలజలోచన దేవ సద్గుణకలాప
తలఁపులోపల మెలఁగు తత్త్వప్రదీప
భళిర గండవరేశ పరమాత్మరూప! ||లాలి||

# అన్నమయ మహిమలు

మండెమురాయనామక నరసింహదండ నేత్రు(త్ర?)న కీష్టధనబల స్ఫూర్తి నిత్యాదివాక్యములకు (చూ. చరిత్రము 46 పుట) స్పష్టముగా నర్థమెఱుఁగ రాదు. మండెమురాయఁడన్న పేరు మండెము గ్రామ మున వెలసిన నరసింహ స్వామికిఁ గలదు. చండనేత్రుఁ డనియో? దండనేత్రుఁడనియో? దండనేత్రుఁడని దిద్ది దండనాథుఁడని యర్థము గుదుర్చుకొనఁగా నాతఁడు సాళువనరసింహరాయని విద్యానగర సామ్రా జ్యలాభమునకుఁ జాలఁ దోడుపడినవాఁడును, నరసింగ రాయని తర్వాత నిమ్మడినరసింహరాయఁడను తత్పుత్త్రుఁడు స్వల్ప కాలము రాజుగా నున్నను, విద్యానగర సామ్రాజ్యము నాక్రమించుకొన్న వాఁడును నగు నరసింహదండనాథుఁడు కాఁగలఁడు. అన్నమాచార్యు నగ్రహారము మరు లుంకు (మరువాకరై?) ఆ దండనాథున కీష్టమగు ధనబలస్ఫూర్తి కలది గాఁబోలును. (చూ. చరిత్రము 46 పుట.) ఆ గ్రామమునఁ గల జీడి కంపు పుల్ల మామిడి పండ్లను స్వామికి నివేదనచేసి తా నార గింపఁగా నన్నమాచార్యునకుఁ బండ్లు పులిసెను. అపచారము క్షమింప స్వామిని వేఁడి దానిని దియ్యమామిడిని జేయ నర్థింపఁగా స్వామి యనుగ్రహమున నది తియ్యమామిడి యయ్యెను. ఈ విషయము నీ యన్నమాచార్యచరిత్రమేకాక పెదతిరుమలాచార్యునిఁ గూర్చియున్న సంకీ- ర్తనము కూడ నిరూపించుచున్నది.

(రాగము పేరు లేదు)

కరము జీడిపులుసు గలిగిన మామిడి కరము సోకినయంతనే
పరవిఁ జక్కెరవలెఁ జవి గలిగించువాని చనవరి సుతుఁ డితఁడే ॥ప॥

వేఁకరి మండెముకోట వెళ్లుతా విచ్చనవిడి రాఁగా వాక-
వీఁకతో వేసిన కత్తి తునుకలాయ వెన్ను సోఁకినయంతనే
ఆ కాలమునాఁడు రాతి నాతిఁ జేసె అతఁడేపో యీతఁడు
వాకుచ్చి పొగడరో ఘనపుణ్యము తాళపాక తిరుమలయ్యను ॥కర॥

గుములు గూడి యలుఁగులు తిరుగఁబాటి చుట్టుకొన్న కురువదోవ
నతఁడు
కమలనయనునిఁ దలఁచినమాత్రాన కకపికలై పాతెను
అమరఁ బాంచాలికి వలువలొసఁగి నతఁడెవో యీతఁడు
ప్రమదముతోడుత పేరుకొనరే తాళపాక తిరుమలయ్యను ॥కర॥

దేవుఁ డొకకన్ను దయచేసి తనవద్దికి నంపిన నతఁడు
పావను డితఁడు తా నొక్క కన్నిచ్చె పరుషలు చూడఁగా
శ్రీ వెంకటప్పని సేవ చేయఁగోరి చేకొన్నతను వితఁడు
భావించి పొగడరో భాగ్యము గల తాళపాక తిరుమలయ్యను ॥కర॥

శేషాచార్యులవారి వ్రాఁతప్రతి.

ఈ సంకీర్తనమున, 2,3 చరణముల విషయములు పెదతిరుమలా-చార్యునికి సంబంధించినవి. ప్రజ లన్నమయ మాహాత్మ్యమును, వశ్యవాక్కును దెలిసికొని యేవేవో యర్థించి వెంటాడసాగిరి.

ఆవార్త విని జను లరుదందికొనుచు
వావిరి నొడి వళావళికిఁగాఁ బెగడి
చెలువొందు నాగురు శ్రీపాదరక్ష
తలనిడి తమయాపదల వీడుకొనిరి;

చూ. చరిత్రము 47 పుట.

అమాయికప్రజల యీ యలజడికి జడిసి చేసిన సంకీర్తనము:--

ముఖారి

పరమాత్మ నిన్నుఁ గొల్చి బ్రదికేము
విరసపుజాలిఁ జిక్కి వెతఁబడ నోపము ||పల్లవి||

మగఁడు విడిచినా మామ విడువనియట్లు
నగి నామనసు రోసినా లోకులు మానరు
తగిలేరు పాగిలేరు దైన్యమే చూపేరు
మొగమోటలను నేను మోసపోవ నోపను ||పర||

పాసఁగ దేవుఁడిచ్చినా పూజరి వరమీఁడు
విసిగి నే విడిచినా విడువరు లోకులు
కొసరేరు ముసరేరు కోరిక దీర్చుమనేరు
పసలేని పనులకు బడల నే నోపను ||పర||

నుదుగులు దప్పినా నోము ఫల మిచ్చినట్లు
కడఁగి వేఁడుకొన్నాఁ గానిమ్మనరు లోకులు
తడవేరు తగిలేరు తామే శ్రీవేంకటేశ
బుడిబుడి సంగాతాలఁ బొరల నే నోపను ||పర||

అన్న. అధ్యా. 238 రేకు.
సంకీ. 220 - సంపు. 3 (1986).

## అన్నమాచార్య పురందరదాసులు

కర్ణాట భాషలో వేలకొలఁది సంకీర్తనములు రచించి మహానుభావుఁడని ప్రఖ్యాతి గాంచిన శ్రీపురందరదాసుఁ డన్నమాచార్యుని దర్శింప వచ్చి యతని సంకీర్తనములు విని తనిసి నీవు శ్రీ వేంకటేశ్వరుని యవతారమవే యని సన్నుతింపఁగా నన్నమాచార్యుఁడు, పురందర దాసుని సంకీర్తనములు విని తనిసి నీవు శ్రీ పాండురంగవిట్ఠలుని యవతారమవే యని సన్నుతించెనట. (చూ.48 పుట.) పురందరదాసులవారు శ్రీవ్యాసతీర్థులవారి శిష్యులని ప్రతీతి. వ్యాస తీర్థులవారు సాళ్వనరసింగరాయని కాలమునఁ గూడఁ గలరు. శ్రీకృష్ణరాయలకు వారు గురువులు. వయసున చిన్నవార యినను వ్యాసతీర్థులను సన్న్యాసాశ్రమ స్వీకారముచే గురువర్యులనుగాఁ

బురందరదాసులవారు పూజించియుందురు. అన్నమాచార్యుని వార్ధకమునఁ బురందరదాసులవారు చాలఁ జిన్నవారై దర్శించి యుందురు. పురందర దాసులవా రన్నమాచార్యుల సంకీర్తనముల ననుకరించి సంకీర్తనముల రచించిరి. మచ్చున కొక్కటి:--

మాళవి రాగం

శరణుశరణు సురేంద్రసన్నుత శరణు శ్రీపతివల్లభా
శరణు రాక్షసగర్వసంహర శరణు వేంకటనాయకా ||పల్లవి||

కమలధరుఁడును కమలమిత్రుఁడు కమలశత్రుఁడు పుత్రుఁడు
క్రమముతో మీకొలువు కిప్పుడు కాచినా రెచ్చరికయా ||శర||

అనిమిషేంద్రులు మునులు దిక్పతు లమర కిన్నర సిద్ధులు
ఘనతతో రంభాదికాంతలు కాచినా రెచ్చరికయా ||శర||

ఎన్నఁగల ప్రహ్లాదముఖ్యులు నిన్నుఁ గొలువఁగ వచ్చిరీ
విన్నపము వినవయ్య తిరుపతి వేంకటాచలనాయకా ||శర||

భజనపద్ధతిలో అన్నమాచార్యునిదిగా నాఁటనుండి నేఁటిదాఁక సాగుచున్న యీ పై సంకీర్తనమును జదివి, పురందరదాసుగారి యీ క్రింది సంకీర్తనమును గూడఁ జదువుఁడు.

మాళవి రాగం

శరణు శరణు సురేంద్రవందిత శరణు శ్రీపతి సేవిత
శరణు పార్వతితనయ మారుతి శరణు సిద్ధివినాయక ||పల్లవి||

నిటలనేత్రన దేవిసుతనె నాగభూషణప్రియనె
తటిల్లతాంకితకోమలాంగనె కర్ణకుండలధారనె ||శర||

బటువు ముత్తిన పదకహారనె బాహు హస్త చతుష్కనె
ఇట్టితొడగియు హేమకంకణ పాశ అంకుశధారనె ||శర||

కుక్షియొళు మహాలంబోదరనె ఇక్షుచాప గెలిదనె
పక్షివాహన నాద పురందరవిట్ఠలన నిజదాసనె ||శర||

అన్నమాచార్యులవారి సంకీర్తనచ్ఛాయనే పురందరదాసులవారి కీర్తన మున్నది.

## సంకీర్తన సంఖ్య

అన్నమాచార్యుఁడు యోగ వైరాగ్య శృంగార మార్గములలో ముప్పది రెండువేల సంకీర్తనముల జెప్పెనని కలదు. (మా. చరిత్రము 49 పుట.) ఆతఁడు తన పదునాఱేండ్ల వయసున నుపక్రమించి దివ్యధామ మందుదాఁక దినమున కొక సంకీర్తనము చొప్పున సంకీర్తనములు రచించినట్లున్నది.[1] అట్లు లెక్కింపగా నించుమించుగా నిర్వది మూఁడు వేల సంకీర్తనములు లెక్కకు వచ్చును. ఇందు ముప్పది రెండువేల సంకీర్తనములు రచించినట్లున్నది. "పరమతంత్రమ్ము లిర్వది రెందు వేలు" అనియుండవలెనో. కానిచో ఆ రాగిరేకుమీఁది వాక్యమునకుఁ బ్రతిదినము నొక్కదానికిఁ దక్కువ కానీక సంకీర్తనములు రచించుచుండెనని యర్థము చెప్పికొనవలెనో. రెండవతీ రనుకొందుమేని ముప్పది రెండువేల సంకీర్తనములు రచించె ననుట సంగతమే. రచించిన యా సంకీర్తనములెల్ల రాగిరేకుల కెక్కనే లేదో? ఎక్కినను నిప్పుడు మనకు దొరకలేదో? తిరుపతిదేవస్థానమునఁ గాక అహో బలమునకుఁ గొన్ని రేకులు చేరియున్నట్లు తెలియుచున్నదిగదా. ఇంక నెన్ని యెప్పు డెక్కడికిఁ జేరినవో? క్రీ. 1560 ప్రాంతములదాఁక సంకీర్తనములను రాగిరేకుల మీఁదఁ జెక్కించుట జరిగినట్లున్నది.[2] విద్యానగర విప్లవము

---

[1] (మా.) అన్నమాచార్యుల శృంగార సంకీర్తనముల మొదటి రేకు, అధ్యాత్మ సంకీర్తనముల మొదటి రేకు.

[2] తిరుపతిదేవస్థానమున గల రాగిరేకులలో నన్నమాచార్యుల రచనము లనుకొనఁదగినవి యించుమించుగా రెండువేల నాల్గువందలుండును. సంకీర్తనములు పదునాల్గు వేలుండును. అన్నమాచార్యుని సంకీర్తనముల తొలిరేకున నామాంకము గలిగి ఒకటి, రెండు, మూడు, నాలుగు -- ఇత్యాది క్రమ సంఖ్యాంకములతో రేకుల యుద్దము నిడుపుల సమపరిమాణముతో నున్న రేకుల సంఖ్యను, ఇంచు మించుగా రేకున కాఱుపాటలచొప్పున నున్న పాటల సంఖ్యను బరిగణించి, యీ మొత్తము గుర్తింపఁగల్గితిమి. అట్లె తొలిరేకుపై పెదతిరుమలాచార్యుల నామాంకముతో 1,2,3 -- సంఖ్యాక్రమముగల రేకులను

మూలమున దక్కినవానిఁ జెక్కించుట సాగక తాళపత్రముల మీఁదనే యుంపఁగా కాలవశమున నవియుఁ జెడియుండును. క్రీ.శ.1560కి పూర్వమే కొన్ని సంకీర్తనములు తంజావూరికిఁ జేరియుండును. అక్కడ సంకీర్తనము లన్నియుఁ దిరుపతిరాగిరేకులమీఁద నున్నవో లేవో? శేషాచార్యులవారి తాళపత్ర ప్రతిలోని సంకీర్తనములు గూడ నన్నియు రాగిరేకులమీఁది కెక్కినవో లేవో? పెదతిరుమలాచార్యుఁడుగూడ దినమున కొక సంకీర్తనముచొప్పునఁ దండ్రియానతిని రచించెను. అవి కొన్ని వేలుండవలెనుగదా! కానరావు.

## ద్విపద రామాయణము

అన్నమాచార్యుఁడు ద్విపదముగా నవముగా రామాయణమును గూడ రచించెనట. ద్విపదరచన మంతకుముం దింకొకటి కలదని సూచించుటకు నవముగా ననుట. ఈతని రామాయణరచనము నేఁడు గానరాదు. కాని రామాయణకథాప్రసక్తములు సంకీర్తనము లనేకము లున్నవి. రాగిరేకుల మీఁద నన్నమాచార్యుల సంకీర్తనములను శృంగారమంజరిని మాత్రమే తత్పుత్రుఁడు పెదతిరుమలాచార్యుఁడు చెక్కించెనుగాఁబోలును.

## వేంకటాచలమాహాత్మ్యము

సంస్కృతభాషలో శ్రీ వేంకటాచలమాహాత్మ్యము నన్నమాచార్యుఁడు రచించెను. (మా.చరిత్రము 49 పుట.) వరాహపురాణాదులలోనిదిగా సంఘటితమయి పదునేడు పదునెనిమిది శతాబ్దముల పిదప తెల్గు పరివర్తనము పడసి, ప్రాచీనతాళపత్రప్రతులు గలిగి, యిప్పుడు నాగ రాంధ్రాక్షరములలో ముద్రితమై వ్యాప్తిగాంచియున్న వేంకటాచలమాహాత్మ్యము నాఁడు తాళ్ళపాక

---

వానియుద్దము నిడువుకొల్తల పృథక్త్వమును గమనించి పెద తిరుమలాచార్యుల సంకీర్తనముల సంఖ్యను, చిన్నతిరుమలాచార్యుల సంకీర్తనముల సంఖ్యను గుర్తింపఁగల్గితిమి.

కాని, యన్నమాచార్యుల రేకులని కొల్తలపరిమాణము, సంఖ్యానుపూర్వియు గల రేకులలోగూడఁ గొన్ని యన్నమాచార్య ప్రసక్తములు తత్పుత్రుఁడో పౌత్రుఁడో రచించినవికూడఁ గలవేఁగాఁబోలునని కొన్ని సంకీర్తనములలోని విషయములఁబట్టి సందేహింప నవకాశము కలిగినది.

యన్నమాచార్యుఁడు రచించినది యయినను గావచ్చును. అష్టాదశ పురాణములలోఁ జేరినవిగాఁ గానవచ్చు స్థలమాహాత్మ్యముల నన్నింటిని సమకూర్చి గ్రంథసంఖ్యను గణించినచో నష్టాదశపురాణములకుఁ బ్రాచీనులే పరిగణించిన గ్రంథసంఖ్యకంటె నీ స్థలమాహాత్మ్యముల గ్రంథసంఖ్య చాల మీఱిపోఁగలదు. వ్రాఁతప్రతులు గలిగి పురాణక్రమ నిర్వచనమునఁ జెప్పఁబడిన యానుపూర్వి గలిగి యనేకస్థలములం దుపలభ్యమానము లగుటచే ముద్రితములయిన యష్టాదశపురాణములలో నా యా స్థలపురాణములు నూటికిఁ దొంబది తొమ్మిది వంతులు గానవచ్చుటే లేదు. పురాణపు ముద్రాపకులు కొన్ని స్థలపురాణములను నేఁటి పురాణముద్రణములందుఁ జేర్చుటయు జరగకపోలేదు. అది యొక మహత్తరచర్చ. అధ్యాయసంఖ్యలు, పురాణముల పేళ్లు ఉన్నను నేటి స్థలపురాణములెల్ల నా యా పురాణములలో దొరయిత రచితములు గావనుట ప్రఖ్యాత సత్యార్థము. ఇంచుమించుగా నిట్టి స్థల మాహాత్మ్యములు పదుమూఁడు పదునాల్గు శతాబ్దములనుండి నిన్నటినేఁటిదాఁకఁగూడ నుప్పతిల్లుచునే యున్నవి. కాన అన్నమాచార్యుఁడు రచించినాఁడన్న వేంకటాచల మాహాత్మ్య మిప్పుడు ప్రఖ్యాతముగానున్న వేంకటాచలమాహాత్మ్యము కావచ్చుననుట విదూరపడవలసిన విషయముకాదు. అతఁ డేదో సంస్కృతము ననుసరించి తెల్గున స్థలమాహాత్మ్యము రచించె ననఁగాదు. "దివ్యభాష నా వేంకటాద్రిమాహాత్మ్య మంతయును గావించె"[1] నని కలదు. జియ్యర్ రామానుజయ్యంగా రనువారు క్రీ.శ. 1491 నాఁడు (అప్పటి కన్నమాచార్యుఁ డఱువదియేడేండ్ల వయసువాఁడు) తాను విన్నపముచేసిన తిరువేంకటాచల మాహాత్మ్యమునకు శ్రీ స్వామివారు స్వీకారము చిత్తగించి ఆలకింప ననుగ్రహించునట్లు చేయుటకును, గొన్ని యుత్సవములు జరుపుటకును, ఉభయముగాఁ గొంత ద్రవ్య మొసఁగి స్థానాధిపతులచే శిలాశాసనము చెక్కించుకొన్నారు[2]. ఆ రామానుజ జియంగారు కవీశ్వరుఁడయిన యన్నమాచార్యునిచే వేంకటాద్రిమాహాత్మ్యమును రచింపించి తన సమర్పణముగా స్వామిసన్నిధిని విన్నపింపఁ గోరి యుండవచ్చును.

---

[1] చూ. చరిత్రము 49 పుట.

[2] చూ. తి.తి. దేవస్థాన శాసనములు వాల్యూం II, నెం.95.

పెదతిరుమలాచార్యుఁడు స్వామి సన్నిధిని వేంకటాచలమాహాత్మ్యమును బఠించుటకుఁగాను అనంతాచార్యులనువారికిఁ గొంత జీవిక యేర్పఱిచెనట. అది పితృదేవ రచితమన్న యభిమానముచేఁ జేసినదయినఁ గావచ్చును. అంతకుఁ బూర్వమే యీ స్థలమాహాత్మ్యసముచ్చయము కందని నిరూపింపఁగల సాధనములు గానరానంతవఱకు నిది యన్నమాచార్య రచితమని తలఁచుట యసంగతము గాదు. ఇప్పుదున్న పురాణములలోని వేంకటాచలమాహాత్మ్య భాగములు వేర్వేఱు రచనము లనుకొన్నచో నందుఁ గొన్నియయినను నీతని రచనములు గావచ్చును.

వరాహ బ్రహ్మాండములలో వేంకటేశ్వర విషయమున్నట్టీ క్రింది సంకీర్తనమున నన్నమాచార్యుఁడో పెదతిరుమలాచార్యుఁడో చెప్పినాఁడు.

బౌళి

శ్రీ వేంకటేశుఁడు శ్రీపతియు నితఁడే
పావనపు వైకుంఠపతియును నితఁడే ॥పల్లవి॥

భాగవతములోఁ జెప్పే బలరాము తీర్థయాత్ర -
నాగమోక్తమైన దైవ మాతఁ డీతఁడే
బాగుగా బ్రహ్మాండపురాణపద్ధతి యాతఁ డీతఁడే
యోగమై వామనపురాణోక్త దైవ మీతఁడే ॥శ్రీవేంక॥

వెలయ సప్తఋషులు వెదకి ప్రదక్షిణము -
లలరఁ జేసిన దేవుఁ డాతఁ డీతఁడే
నెలవై కోనేటిపొంత నిత్యముఁ గుమారస్వామి
కలిమిఁ దపము సేసి కన్న దేవుఁ డీతఁడే ॥శ్రీవేంక॥

యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు
తక్కక కొలిచియున్న తత్త్వ మీతఁడే
చక్క నారదాదుల సంకీర్తనకుఁ జొక్కి
నిక్కిన శ్రీవేంకటాద్రి నిలయుఁడు నీతఁడే ॥శ్రీవేంక॥

అన్న. అధ్యా. 87 రేకు.
సంకీ.425 - సంపు.1 (1980).

నేఁటి వేంకటాచల మాహాత్మ్యకథలు సంకీర్తనములలో నంతగాఁ గానరాకున్నవి. కొన్ని స్థానిక దేశిగాథ లున్నవి. (చూ. పీఠిక 23,24 పుటలు)

## ఇతర గ్రంథములు

అన్నమాచార్యుఁడు పండ్రెండు శతకములు రచించెనట. సకల భాషలందును ప్రతిలేని నానాప్రబంధములు రచించెనట. అన్నమాచార్యుని వేంకటేశ్వరశతక మొకటి నేను ప్రకటించిన ప్రబంధరత్నావళిలో నుదాహృతమయినది. దేవస్థానపు రాగి రేకులలోఁ గానరాదు. అలమేల్మంగాంబమీఁద నీతడు రచించిన శతక మిదే. (చూ. పీఠిక 15 పు.) మఱి మిగిలిన *పదిశతకములు నే యే వేల్పులమీఁద రచితము లయ్యెనో వానిపే ళ్ళేమో తెలియరాదు. ఇవిగాక యన్నమాచార్యుని పౌత్రుఁడు చినతిరుమలాచార్యుఁడు సంకీర్తన లక్షణమునఁ దనతాత యన్నమాచార్యుఁడు సంస్కృతమున సంకీర్తనలక్షణము రచించినట్లును దానికిఁ దనతండ్రి పెదతిరుమలాచార్యుఁడు వ్యాఖ్య చెప్పినట్లును వాని ననుసరించి తాను తెలుఁగు రచన చేసినట్లును జెప్పుకొన్నాఁడు. ఆ సంస్కృతసంకీర్తనలక్షణమును గానరాదు.

## అన్నమాచార్యవిగ్రహము

సంకీర్తనభండారమనీ, తాళ్ళపాకవారి యర అనీ పేర్కొనఁబడుచుండు కొట్టు సరిగా భాష్యకారులసన్నిధికిఁ బ్రక్కగా నున్నది. స్వామిదర్శనము చేయువారు బంగారువాఁకిటికడ నిలిచి ముందు చూచిన స్వామి దివ్య విగ్రహమును, గుడిచేతి ప్రక్కకేసి చూచిన భాష్యకారుల విగ్రహమును గానఁగల్గుదురు. భాష్యకారులతోపాటు దర్శనీయులుగా నన్నమాచార్యుల విగ్రహము సంకీర్తనభండారము ద్వారము నెడమప్రక్క నున్నది. ఆ ద్వారమునకుఁ గుడిప్రక్కను పెదతిరుమలాచార్యుల విగ్రహమును గాననగును. బంగారువాకిలి దగ్గఱనుండి ఒక కంట స్వామిని, ఇంకొక కంట భాష్యకారులను (చిదంబరమున కనకసభాపతిని, *వరదరాజులను దర్శించునట్లే)

---

* పదొకండు శతకములు గావలె గదా?

* గోవిందరాజస్వామి గదా?

అన్నమాచార్యుని తత్పుత్రుని గూడ దర్శింపనగును. సరిగా నీ యర్థ
మును నిరూపించునవిగాఁ జినతిరుమలాచార్యుఁడుగాఁబోలును రచించిన
సంకీర్తనము లున్నవి--

## దేవగాంధారి

అటిముటిఁ జూడఁబోతే నజ్ఞాని నేను
మఱఁగు చొచ్చితి మీకు మహిలో నారాయణా ||పల్లవి||

విన్ను ధ్యానము సేసీని నిచ్చనిచ్చఁ దాళ్ళపాక -
అన్నమయ్యగా రెదుట నదిగోవయ్యా
పన్ని యాతనినే చూచి పాతకులమైన మమ్ము
మన్నించవయ్య వో మధుసూదనా ||అటి||

సంకీర్తనలు చేసీ సారెఁ దాళ్ళపాకన్నయ్య
అంకెల నీ సన్నిధినే అదిగోవయ్యా
అంకించి నే వారివాఁడనని దుష్టుఁడనైనా నా -
సంకె దీఱఁ గావవయ్య సర్వేశ్వరా ||అటి||

పాదాలం దున్నాఁడు తాళ్ళపాక అన్నమయ్య మీకు
ఆదరాన ముక్తుఁడై అదిగోవయ్యా
ఈదెస శ్రీవేంకటేశ యీ సంబంధాననే నన్ను
నీ దయ వెట్టి రక్షించు నెమ్మది భూరమణా ||అటి||

అన్న. అధ్యా. 223 రేకు
సంకీ.127 - సంపు.3 (1986).

## దేసాళం

ఈతఁడే ముక్తిదోవ యీతఁడే మా యాచార్యుఁ-
డీతఁడు గలుగఁబట్టి ఇందరు బదికిరి ||పల్లవి||

అదివో తాళ్ళపాక అన్నమాచార్యులు
యిదె వీఁడె శ్రీవేంకటేశు నెదుట
వెదవెట్టి లోకములో వేదములన్నియు మంచి-
పదములు సేసి పాడి పావనముసేసెను ||ఈతఁడే||

అలరుచుఁ దాళ్ళపాక అన్నమాచార్యులు
నిలిచి శ్రీవేంకటనిధియే తానై
కలిదోషములు వాప ఘనపురాణములెల్ల
పలుకుల నించి నించి పాడినాఁడు హరిని ॥ఈతఁడే॥

అంగవించెఁ దాళ్ళపాక అన్నమాచార్యులు
బంగారుశ్రీవేంకటేశు పాదములందు
రంగుమీఱ శ్రీవేంకటరమణుని యలమేలు-
మంగను యిద్దఱిఁ బాడి మమ్ముఁ గరుణించెను ॥ఈతఁడే॥

అన్న. అధ్యా. 232 రేకు.
సంకీ.183 - సంపు.3 (1986).

## శ్రీరాగం

హరి యవతార మీతఁడు అన్నమయ్య
అరయ మా గురుఁ డితఁ డన్నమయ్య ॥పల్లవి॥

వైకుంఠనాథునివద్ద వడిఁ బాడుచున్నవాఁడు
ఆకరమై తాళ్ళపాక అన్నమయ్య
ఆకసపు విష్ణుపాదమందు నిత్యమై వున్నవాఁడు
ఆకడీకడఁ దాళ్ళపాకలన్నమయ్య ॥హరి॥

క్షీరాబ్ధిశాయి నిట్టే సేవింపుచునున్నవాఁడు
ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య
ధీరుఁడై సూర్యమండలతేజమువద్ద నున్నవాఁడు
ఆ రీతులఁ దాళ్ళపాక అన్నమయ్య ॥హరి॥

యీవల సంసారలీల నిందిరేశుతో నున్నవాఁడు
ఆవటించి తాళ్ళపాక అన్నమయ్య
భావింప శ్రీవేంకటేశుపాదములందె వున్నవాఁడు
హావభావమై తాళ్ళపాక అన్నమయ్య ॥హరి॥

అన్న. అధ్యా. 117 రేకు.
సంకీ. 100 - సంపు. 2 (1981).

భాష్యకారులకుఁబోలె నన్నమాచార్యులకును విగ్రహమును వెలయించి తాళ్ళపాక యరలో ప్రతిష్ఠయే జరుపవచ్చునుగాని యానాఁ డన్నమాచార్యుని నట్లు పూజింపుటకు స్థానపతుల సమ్మతి దొరకవలెను. ఆ యరగోడ మీఁద వారివిగ్రహము చెక్కించుటకే దొరకెనేమో. అన్నమాచార్యునివలె గొప్ప విద్వాంసుఁడు, సంకీర్తనాదికర్త, మహాభక్తుఁడు, స్వామి కగ్రహారము లనే కములు సమర్పించినవాఁడునగు పెదతిరుమలాచార్యునిమూర్తికూడ నుండ వలసినదయ్యెను. పిన తిరుమలాచార్యుఁ డీకొఱఁత తీరుటకు మంగా-పురమున గుడి కట్టించి మఱొక వేంకటేశ్వరస్వామినే వెలయించి ప్రతిష్ఠించి యక్కడ నాళ్వార్లతో భాష్యకార్లతో దేశికులతోసహ అన్నమాచార్యుని విగ్రహ-మునుగూడఁ బ్రతిష్ఠించి పూజా పురస్కారములు కల్పించెను. తాళ్ళపాక యర ద్వారమున కిరుప్రక్కలనున్న విగ్రహములలో నొకటి ముదివయసుది ఇంకొకటి లేవయసుదిగా నున్నది. అన్నమాచార్యచరిత్రము (చూ. 37, 38 పుటలు) లో నున్న వర్ణనమున కనుగుణముగానే యిక్కడ రూపకల్పనమున్నది.

## సంగీత రచన

ద్రవిడ కర్ణాటాంధ్రభాషలలో కెల్లఁ బ్రాచీనములయిన సంకీర్తనము లన్నమాచార్యునివే. సంకీర్తన శాస్త్రమును గల్పించినవాఁడు నన్నమా చార్యుఁడే. కనుకనే యాతనికిఁ బదకవితాపితామహుఁడని, సంకీర్తనా చార్యుఁడని, హరి కీర్తనాచార్యుఁడని బిరుదులు గలిగెను. కన్నడమునఁ బురందరదాసులవారును, ప్రాకృతమున వేంకటమఖియు, నీయనకుఁ దర్వా తనే సంకీర్తనములను గీతములను రచించిరి. ప్రాఁతవగు కృష్ణాచార్యుని సంకీర్తనములు తాళగంధి వచనములేకాని పల్లవి చరణములు గల పదకవితా రచనలు కావు. అట్టి తాళగంధి వచనరచనలను పెదతిరుమలాచార్యుఁ డుగూడ వైరాగ్య వచన మాలికా గీతములని పేర్వెట్టి రచించినాఁడు. అవి వేంకటేశ్వరవచనములని వేంకటేశ్వర విన్నపములని మద్రాసు తంజావూరు లైబ్రరీలలో నుండగా నేను గుర్తించి ప్రకటించితిని.

జాజఱలు, చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెద పదములు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, జోజో, జేజే, జయజయ, విజయీభవ, శోభన, మంగళ, వైభోగములు, మేలుకొలుపులు, నలుఁగులు, దంపుళ్లు, కొట్నాలు, కూగూగులు, గుజ్జనగూళ్లు, చందమామ గుటకలు, నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయమంగళాలు, ఆల్లోనేరేళ్ళు, వాఁగుబళాలు, బళాబళాలు, సాసముఖాలు, అవధానములు, తందానలు, వెన్నెలలు, చిత్తమా, మనసా, బుద్ధి(సంబోధనలు) మొదలగు మధురకవితారచనావిశేషము లీ సంకీర్తనములలోఁ జాలఁ గలవు. అన్నమాచార్యుఁడు సంకీర్తన లక్షణమున వీనిలోఁ గొన్నింటిని బేర్కొనుటచే నంతకుఁబూర్వముననుండియు నివి వాడుకలో వచ్చుచున్నవే యనవలెను. తుమ్మెద పదములు, ప్రభాత పదములు, పర్వత పదములు, ఆనంద పదములు, శంకర పదములు, నివాళి పదములు, వాలేశు పదములు, గొబ్బి పదములు, వెన్నెల పదములు, సెజ్జ వర్ణన గణవర్ణన పదములు పాల్కురికి సోమనాథుఁడు తనగ్రంథములలోఁ బేర్కొన్నాఁడుగాని యవి యిప్పుడు గానరావు. అవి యేవొ పాడిపాడిగా వెల సిన లఘురచనలయి యుండునుగాని, ప్రఖ్యాతకవు లానుపూర్వితో రచించినవి గావేమో! త్యాగరాయల కృతులకుఁ బూర్వ మాంధ్రగాయకు లాలాపించు-చుండిన గేయములేవి? యని పరిశీలింపఁగాఁ జాలినంత సమాధానము దొరకకున్నది. నేఁటిగాయకు లందఱును త్యాగరాయాదులను నూటేండ్ల క్రిందటి వారినే యెఱుఁగుదురు. సింగభూపాలుఁడు, పెదకోమటివేమా-రెడ్డి, ప్రౌఢదేవరాయఁడు (సంగీత రత్నా కరః అనఁబడినవాఁడు) మొద లగు సంగీతగ్రంథకర్తలు, అన్నమాచార్యుని కించుక పూర్వులు. బయకార రామామాత్యుఁడు, కృష్ణరాయఁడు, అచ్యుతరాయఁడు, తిరుమలరాయఁడు సంగీతగ్రంథములకుఁ గర్తలు, కారయితలును. వెంకటగిరి కాళహస్తి కార్వేటి-నగరము నూజివీడు చల్లపల్లి ముక్త్యాల పిఠాపురము పెద్దాపురము విజయ నగరము గద్వాల వనపర్తి ఆత్మకూరు మొదలగు రాజాస్థానములు సంగీత వినోదము లేనివి గావు. దక్షిణాంధ్ర రచనలలో తంజాపుర్యాదులలో వెలసిన గేయరచనలు సురక్షితములుగా నున్నవిగాని తెలుఁగుదేశపు రచనలు పసిగా దొరుకుట లేదేల? కృష్ణరాయలమీఁది గేయరచనలైనఁ గానరావే. అను-

పూర్వితో క్షేత్రయపదములు ఏగంటి చిలుకపాటిపదములు రామదాసుకీర్తనలు ముత్తేవివారి కీర్తనలు తాడంకివారి కీర్తనలు నల్లఁబాటివారి కీర్తనలు సారంగపాణి పదములు గుత్తెనదీవి రామాయణకీర్తనలు అధ్యాత్మరామాయణ కీర్తనలు శోభనాద్రీశ్వర సంకీర్తనలు నని కొన్ని గలవు గాని యవియెల్ల నంత ప్రాచీనములు గావు. మద్రాసు ప్రాచ్యలిఖితపుస్తకశాలలోఁగొన్ని పాడిపాడి గేయ రచన లున్నవి గాని, యందుఁ గొన్ని ప్రాచీనతరము లయినను గావచ్చును గాని యవి యానుపూర్వితో కర్తృనామాంకముతో లేవు. యక్షగానములు కొన్ని, వానిలోని గేయ రచనలు కొన్ని కలవుగాని మొదటి కా యక్షగానములే యంత ప్రాచీనములు గావు. తెలుఁగునఁ దొలుత శ్రీనాథుఁడే యక్షగానములఁ బేర్కొన్నవాఁడు. దాక్షారామమున సంగీతనాట్య విద్యా వినోదములు జరుగుట నాతఁడు వర్ణించినాఁడుగాని యానాఁటిగేయము లేవో సరిగాఁ దెలియరావు. చాళుక్యరాజుల గ్రంథములలో (అభిలషితార్థ చింతామణి, సంగీత చూడామణి) సంగీత విషయములు చాలఁ గలవు గాని వానిలో వర్ణితములయిన సంగీత ప్రబంధము లంతముఖ్యమయినవి గావు. ఏలలు ధవళములు చర్చరులు ఏకతాళులు శరభలీలలు చిందులు మొదలయినవేవో కొన్నిమాత్రమే చిన్నిచిన్ని రచన లందుఁ జెప్పఁబడినవి. అందు గొన్ని నేఁడును వాడుకలో నున్నవి. వానినిగూర్చి యభిలషితార్థ చింతామణి సంగీతచూడామణులలోని ముక్కలు కొన్ని:-

"కథాసు షట్పదీ యోజ్యా వివాహే ధవళ స్తథా
ఉత్సవే మంగళో గేయ శ్చర్యా(ర్యా?) యోగిజనై స్తథా"
"పదేపదే భవే ద్రాగః తాళశ్చాన్యః పదేపదే
పదాన్తే స్వరతాళాభ్యాం గేయ శ్శరభలీంకః"
"షోడశమాత్రాః పాదేపాదే యత్ర భవన్తి నిరస్తవివాదే
పద్ధళికా జగణేన వియుక్తా చరమగురు స్సా పద్భి రిహోక్తా"
"రాగో హిందోళక స్తాళః చర్చరీ బహవోఽంఘ్రయః
యస్యాం షోడశమాత్రాస్స్యు ర్ద్వౌ ద్వౌ చ ప్రాససంయుతౌ
సా వసంతోత్సవే గేయా చర్చరీ ప్రాకృతైః పదైః"
"పదమన్త్యం సమాదాయ యమకస్థితిభూషితః
ఆవృత్త్యా గీయతే యస్తు చక్రవాళ స్స ఉచ్యతే

గద్యే వా పద్యబంధే వా పుణ్యనామాంతశోభితః
నామాంతే స్వరసంయుక్తో గీయతే చక్రవాళకః"

లక్ష్యమ్

శశాంక శకలం కలంకి కుముదం ముదం న వహతే హతే హిమకరే
*<u>కరే తరసమం సమం వివసితం</u> పితం విజయతే తవ యశః

"నిరంతర మనుప్రాసో యతి ర్యత్ర పదేపదే
క్రియతే గీతతత్త్వజ్ఞైః సా స్మృతా త్వేకతాళికా"
"ధవళాదిపదైః పాదై రాశీర్వాదసమన్వితైః
ఛందసా యేనకేనాపి కర్తవ్యో ధవళాభిధః"

పైగ్రంథములలో లక్ష్యములు గొన్ని కర్ణాటభాషలో నున్నవి. చాళుక్యులు కర్ణాటకులగుటచేతను, రాజులగుటచేతను తొలుత సంగీత సంప్రదాయ మధికముగాఁ గన్నడమున బెంపొందించి యుందురు. మొదట కీ గానము నకే కర్ణాటగానమని పేరయ్యెను. సంగీతశాస్త్రమున స్వరపద్ధతికి ధాతువని, సాహిత్యపద్ధతికి మాతువని పేరు. శరీరమున సప్తధాతువు లుండుటఁబట్టి తత్సాదృశ్యమున సప్త స్వరములకు ధాతుసంజ్ఞ కుదిరెను. 'మాతు' కర్ణాట భాషాపద మనుకొందును. మాతు=మాట. ఈశాస్త్రము తొలుత కర్ణాటమున వెలయుటచే సాహిత్యమునకు 'మాతు' అన్న కర్ణాటపదము గొనుటయ్యెను గాఁబోలును.

పై లక్షణ శ్లోకములలో నున్న చర్చరియే జాజర యయినది. అన్నమాచార్యసంకీర్తనములలోని జాజరపాటలన్నియు గోవాళ్ళు వసంతోత్సవములోఁ బాడునవిగా నున్నవి.

ఒకటి--

ముఖారి

చాలుఁ జాలు నీజాజర నన్ను
  జాలిఁ బరచె నీజాజర ॥పల్లవి॥

---

* అందువలన పైరెండును, కాంతివిషయమున పోలనివై ఒకసారిగ నెట్టివేయబడినవి; అని భావము కావచ్చు. "బలిహస్తాంశవః కరాః" అని అమరము.

వలపువేదనల వాడేను యీ-
తలనొప్పులచేఁ దలఁకేను
పులకలమేనితోఁ బొరలేను కడు-
జలిగొని చల్లకు జాజర ॥వాలు॥

ఒల్లని నినుఁగని వుడికేను నీ-
చిల్లరచేఁతలఁ జిమిడేను
కల్ల గందవొడిఁ గాఁగేను పైఁ
జల్లకు చల్లకు జాజర ॥వాలు॥

తివిరి వేంకటాధిప నేను నీ-
కవుఁగిటి కబ్బితి గదు నేను
రవరవ చెమటఁ గరఁగి నేఁడు యిదె
చవులాయను నీ జాజర ॥వాలు॥

అన్న. శృంగా. 87 రేకు.
సంకీ. 332 - సంపు. 12 (1976).

నాచనసోమనగూడ వసంతవిలాసమున జాజఱ నిట్లు వర్ణించినాఁడు:-
"వీణాగానము వెన్నెలలేట, రాణమీఱఁగా రమణులపాట
ప్రాణమైన పిన బ్రాహ్మణు వీట, జాణలు మెత్తురు జాజఱపాట"

ఇంతకుఁ జెప్పవచ్చిన దేమనఁగా విద్యానగర వినాశముపిదప ఆంధ్ర దేశమున సంగీతమన్నఁ గొంత యశ్రద్ధ పెరిగినదనుట. అది కారణముగాఁ బ్రాచీన గేయరచన లెన్నో అంతరించిపోయినవి. దాగియున్నను రాగి రేకులమీఁది కెక్కియుండుటచే నేఁటికయినను దాళ్ళపాక సంకీర్తనములు పైకి రాఁగల్గినవి.

## అన్నమయ సంతానము - నరసింహకవి

అన్నమాచార్యుని ప్రథమభార్యయగు తిరుమలమ్మకు నరసింగన్న, నరసయ్య, నరసింహాచార్యుఁడు అని పేర్కొనఁబడువాఁడు, చాలా గొప్ప కవీశ్వరుఁడు కొడుకుండెను. నిరుపమాన సుకవితా నిర్వాహకుఁడయిన

తెనాలి రామకృష్ణకవి తన సమీప కాలమువారగు తాళ్ళపాకకవుల నిట్లు సన్నుతించెను--

క॥ చిన్నన్న ద్విపద కెఱఁగును
పన్నుగఁ బెదతిరుమలయ్య పదమున కెఱఁగున్
మిన్నంది మొరసె నరసిం-
గన్న కవిత్వంబు పద్యగద్యశ్రేణిన్.[1]

ఈ పద్యమునఁ దనతో క్రీ.శ.1560 దాఁక వర్తిల్లినవాఁడగు చిన్నన్నను, అతని తండ్రియు క్రీ.శ.1553 దాఁక వర్తిల్లినవాఁడగు పెద తిరుమలాచార్యుని, ఆతని యన్నయగు నరసింగన్నను మెచ్చినాఁడు.

ద్విపదమునకుఁ జిన్నన్న వ్రాలును; పదములకుఁ బెదతిరుమలయ్య వ్రాలును; పద్యగద్య(ని)శ్రేణిని నరసింగన్న మిన్నంది మ్రోఁగును! అని దీనియర్థ మనుకొందును. నరసింగన్న యిం దధికముగాఁ బ్రస్తుతుఁడ య్యెను. కాని యాతడు రచించినగ్రంథము లేవో తెలియరావు. "పాడఁ జెప్పఁగ వర్ణపద్ధతి నీడుజోడు లేఁడన సభఁ జొచ్చి వాదించి పరగిన ధీశాలి ప్రతివాది దైత్యనరసింహుఁడనఁ గల్గె నరసింహగురుఁడు," అని చిన్నన్న యష్టమహిషీ కళ్యాణమున నాతని స్తుతించెను. ఆతని కుటుంబవృద్ధిని గూడ వివరించెను. చిన్నన్న పేర్కొనుటేకాని దేవస్థానశాసనము లలోఁగాని, తాళ్ళపాకవారి యిండ్లలోఁ గాని, లోకమునఁ గానీ యాతని విషయమే దియు గానరాకున్నది. చిన్నన్నయే క్రీ.శ.1546లో కొండవీటిసీమలోని చెందలూరు మల్లవర గ్రామములను స్వామికైంకర్యములకై సమర్పించుచు, నందు మాఘశుద్ధచతుర్థీ తిథిని తనపెదతండ్రిగారయిన నరసయ్యంగారి ప్రత్యాబ్దికదినమున నర్చనావిశేషముల నిర్వహణము కూడఁ జేర్చినాఁడు[2] ఇది క్రీశ.1546నాఁటికి నరసింగన్న దివ్యధామముఁ బడయుటను, జిన్నన్న కాతనిపై గౌరవమును దెలుపుచున్నది.

---

1 రామకృష్ణునికిఁ జిన్నన్నకు, నూటేండ్ల తర్వాత నప్పకవీయమున నీ పద్య ముదాహృత మయినది.

2 చూ:- తి.తి. దేవస్థాన శాసనములు, వాల్యుం V, నెం.·71, 190 పుట.

శ్రీ వీరేశలింగము పంతులుగారు కవిచరిత్రమున కవికర్ణరసాయనకర్త కృష్ణదేవరాయలనాఁటి వాఁడని, కృష్ణరాయని "ఆందోళికలయందు నంతర చరులౌట సవికృతాకృతుల పిశాచ జనులు......ప్రభు దురాత్ముల నెవ్వాఁడు ప్రస్తుతించు" నని గర్హించెనని వ్రాసినారు. వృద్ధానుశ్రుతినిబట్టి వ్రాసిన యీ వ్రాఁత విశ్వాస్యమే యనుకొందును. కవికర్ణరసాయనకర్త నరసింగన్న తాళ్ళపాకనరసింగన్న కాఁగూడు ననుకొందును. లక్షణగ్రంథములందు సుంకసాల నరసింగన్న అని కలదు. సంకుసాల అని లోకమువాడుక. "సుంకేసుల" అను గ్రామములు రాయలసీమలో నున్నవి.

క॥ ఇంకా నవ్వే వచ్చే*(చ్చీ?)
సుంకేసుల మ్రానిక్రింది సుద్దులు దలఁపన్
లంకించుకొన్న రాజవు
వేంకటగిరివాస! విబుధవినుత విలాసా!

క॥ టెంకాయ చిప్పలోపల
వంకాయా పెసరపప్పు వరివంటకమున్
ఇంకాఁ బెట్టేఁ దినరా
వేంకటగిరివాస! విబుధ వినుత విలాసా!

ఇత్యాదిగా నెవరు రచించినవో రుచిగల కందపద్యములు గొన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి పేర నున్నవి. సుంకసాల సంకుసాల సుంకేసులలు ఒక యూరి పేరి వికారములేమో! కృష్ణరాయఁడు తాళ్ళపాక గ్రామమును వ్యాసతీర్థుల వారి కగ్రహారీకరించుటచే నరసింగన్న తాళ్ళపాక విడిచి పై గ్రామము చేరి సుంకసాల యింటిపేరివాఁడయ్యేనేమో! కవికర్ణ రసాయన మున నాతఁడు తన కులగోత్రములను తలిదండ్రులను బేర్కొనఁడయ్యెను. గ్రంథాదిని "గురువర భట్టపరాశర చరణసరోరుహ సముల్లసన్మానసుఁడన్" అని గురుస్తుతి చేసినాఁడు. తుదిని "ఆదిమ శఠకోపాది" అని యాశ్వాసాంత పద్యమునఁ జెప్పినాఁడు. వీనినిబట్టి యాతఁడు భట్టపరాశరాహ్వాయుని శిష్యుఁడనీ, రెండవ శఠకోపయతియైన యహోబలమఠ ప్రతిష్ఠాపక వణ్ శఠకోపయతి నెఱిఁగిన వాఁడనీ గుర్తింపనగును. వేదాంతదేశికుల శిష్యులు,

గీతావ్యాఖ్యాత భట్టపరాశరు లొకరు గలరు గాని, అయినను రామానుజుల నాఁటి పరాశర భట్టారకుల వంశజులందఱకు పరాశరభట్టనామము సాధారణ మనికూడ వాడుక గలదు. క్రీ.శ.పదునైదవ శతాబ్ది యుత్తరార్ధమున వన్శఠకోపయతులు గలరు గాన, యీతఁడు వారినాఁటివాఁడో వారి తర్వాతివాఁడో అగుటచే నన్నమయ పుత్రుఁడగుట నిర్బాధమగును.

కవికర్ణ రసాయనమున వైష్ణవమతాభిమానము, అద్వైతమతద్వేషము, అన్నమాచార్య సంకీర్తనచ్ఛాయలు నిండార్లుగా నున్నవి. నన్నిచోడ కుమార సంభవమును, ఎఱ్ఱన నృసింహపురాణమును, ఉత్తరహరివంశమును, శ్రీనాథ రచనలను ననుకరించునవిగా పలుకుబళ్ళు, కూర్పులీర్పులు, పద్యచ్ఛాయలు, నిందుఁ జాలఁగలవు. కవికర్ణరసాయనము తాళ్ళపాకనరసింగన్న రచనమే యగుచో నందు రాజాశ్రయగర్హ సహేతుకమే యగును. కారణము సుస్పష్టము కాదు కాని, బహువారములు తిరుపతికి విచ్చేయుచు వచ్చినవాఁడు, కవి-విద్వాంసుఁడునగు శ్రీకృష్ణరాయఁడు సంస్కృతాంధ్ర విద్వాంసులు మహనీయులు కవులు గాయకులు నగు నరసింహ పెదతిరుమల పినతిరుమలాచార్యాదుల నేలొకో యాదరింపఁడయ్యెను. పైఁగా వారి నివాసగ్రామమగు తాళ్ళపాకను వ్యాసతీర్థుల కగ్రహారీకరించెను. అచ్యుతరాయలవారు మాత్రము తాళ్ళపాక వారి నాదరించి యాదృతుఁడయ్యెను.

## పెదతిరుమలయ్య

అన్నమాచార్యుని రెండవభార్యయగు అక్కలాంబయం దీతఁడు జన్మించెను. ఈతనికి నరసమ్మ, తిరుమలమ్మయని యిర్వురు చెలియండ్రును గలరు. ఈ తిరుమలాచార్యుఁడు క్రీ.శ.*1453 దాఁక జీవించినాఁడు. క్రీ.శ. 1503 దాఁక జీవించిన యన్నమార్యుఁ డీ పెదతిరుమలయ్య పెదకుమారుఁడగు చినతిరుమలయ్యగారికి బ్రహ్మోపదేశముఁ జేసినాఁడు. 1500 ప్రాంతముల చినతిరుమలయ్య యుపనయనము జరగిన దనుకొన్నచో 1493 ప్రాంతముల జన్మించిన చిన తిరుమలయ్యతండ్రి యప్పటి

---

* 1553 కాబోలు. పె.తి. 1458-1554 అని శ్రీ వేటూరి ఆనందమూర్తి. చూ. తాళ్ళపాక కవుల కృతులు వివిధ సాహిత్యప్రక్రియలు, 66 పేజి.

కిర్వదేండ్లవాఁడే యనుకొన్నను 1473 ప్రాంతముల జన్మించినవాఁడగును. ఈతని నిందు యౌవనము *శ్రీకృష్ణరాయలవారి కాలమున నడచినది. కృష్ణరాయల పరిపాలనకాలమున నీతఁడు శ్రీవేంకటేశ్వరస్వామికిఁ గొన్ని కైంకర్యములు జరిపినను, నందు సాళ్వతిమ్మరుసును నాతని తమ్ముఁడగు గోవిందయ్యయు నిర్వాహకులుగా నుండిరి. ఆ శాసనములలో శ్రీకృష్ణరాయల పేరు లేదు. పెదతిరుమలయ్యకును నాతని యన్నయగు నరసింహకవికిని శ్రీకృష్ణరాయనితో వైరస్యముగల దనుకొనుట కింకొకసాధనము:-

"మండెము రాయ నామక నరసింహ దండనేత్రు(తృ?)న కీష్ట ధన బలస్ఫూర్తి" నని యన్నమాచార్యచరిత్రమున నున్న వాక్యమునకు మండెము రాయఁడను నామాంతరముగల నరసింహదండనాథుఁడని యర్థము గావచ్చునని, ఆతఁడు శ్రీకృష్ణరాయని తండ్రి యగు తుళువ నరసింహ దండనాథుఁడు గావచ్చునని యనుకొంటిమి. (చూ. పీఠిక 60 పు.)

పయిమండెము కడపమండలమున ఏనమండెములనీ, చిత్తూరు మండలమున గాజులమండెము ఏఱుమండెము[1] అనీ కల గ్రామములలో నొకటయి యుండఁబోలును. ఆయూర పెదతిరుమలయ్య నెవరో కత్తితో నఱికిరట. ఆకత్తివే టాతనికిఁ గలువదండ యైనదట!

మండెము కోటలో మండలం బెఱుఁగ
మండలాగ్రాహతి మహనీయ పుష్ప-
దామమై ధర్మాంగదస్థితిఁ బొలిచె
నే మహామహుని యహీనగాత్రమున-

నని చిన్నన్న చెప్పినాఁడు.[2] దేవకీపుర వాస్తవ్యుఁడగు నరసింహ దండనాథుఁ డిందు ప్రయోజకుఁడేమో! ఈవిషయము పెదతిరుమలాచార్యుడే యిట్లు సంకీర్తనమునఁ జెప్పుకొన్నాఁడు.

---

* ఇదెట్లుపొసగును?

* పెద్ద మండ్యము గూడ కలదు. ఇది చిన్నమండ్యమునకు సమీపముగూడ.

1 చూ. అష్టమహిషీకల్యాణము, 1 ఆశ్వా., 5 పుట.

శంకరాభరణం

నాఁటికి నాఁడు గొత్త నేఁటికి నేఁడు గొత్త
నాటకపు దైవమవు నమో నమో ||పల్లవి||

పిరుల రుక్మాంగదుచేతి కత్తిధార దొల్లి
వరుస ధర్మాంగదుపై వనమాలాయ
హరి నీ కృపకలిమి నట్లనే అరులచే-
కరఖడ్గధార నాకుఁ గలువదండాయ ||నాఁటి||

మునుపు హరిశ్చంద్రు మొనకత్తిధార దొల్లి
పొనిఁగి చంద్రమతికిఁ బూవుదండాయ
వనజాక్ష నీ కృపను వరశత్రు లెత్తినట్టి-
ఘనఖడ్గధార నాకుఁ గస్తూరివాటాయ ||నాఁటి||

చలపట్టి కరిరాజు శరణంటే విచ్చేపి
కలుషముఁ బెడఁబాపి కాచినట్టు
అలర శ్రీవేంకటేశ ఆపద లిన్నియుఁ బాపి
ఇల నన్నుఁ గాచినది యెన్నఁ గతలాయ ||నాఁటి||

అన్న. అధ్యా. 115 రేకు.
సంకీ. 85 - సంపు. 2 (1981).

ఈ *కీర్తనమునఁ జెప్పఁబడినదేకాక (చూ. పీఠిక 61 పుట) సంకీర్తనమున వర్ణితమయిన విషయములుగూడఁ బెదతిరుమలాచార్యుని మాహాత్మ్యమును వెల్లడించు చున్నవి. ఆ సంకీర్తనమును జినతిరుమలా చార్యుఁడు రచించి యుండఁబోలును.

అచ్యుతరాయలవారు పూండి, సంగమకోటగ్రామములఁ దామ్రశాసన పూర్వకముగా దానము చేయఁగాఁ, బెదతిరుమలాచార్యుఁడు వానిని స్వామికే సమర్పించెను. ఆతఁ డచ్యుతరాయల జన్మనక్షత్రమునాఁడు తన ద్రవ్యముతో స్వామికిఁ గైంకర్యములఁ గల్పించెను. అచ్యుతరాయలనాఁ డాతఁడు విజయ

* పై సంకీర్తనము అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలలో కలిసియున్నది -- చూ. సంపు.2 (1981), 57-58 పుటలు.

నగరములో విట్ఠలేశ్వరస్వామి కైంకర్యములకై గొప్ప భూసమర్పణము చేసెను. పెదతిరుమలయ్య స్వామికి అర్పించినగ్రామములు:- కావనూరు, మరువాకరై, కుప్పము, కీళంగున్రము, మన్నసముద్రము, పూండి, సంగమకోట, (ఈరెండూళ్ల సంవత్సరపు రాఁబడి 1000 రేఖ పొన్నులు), రాయలపాడు, సోమయాజులపల్లి, కత్తమువారిపల్లి, ఎట్టిగుంటపల్లి, పల్లిపురము (133 వరహాల సంవత్సరాదాయము కలది.), గండతిమ్మాపురము (100 రేఖ పొన్నులు సంవత్సరాదాయము గలది.) ఈ గ్రామములు గాక -- భిన్న భిన్న సమయములలో 4600 పణాలు, 5203 పణాలు, 2000 వరహాలు, 450 పణాలు, 1900 పణాలు, 1020 నర్పణాలు, 2300 నర్పణాలు సమర్పించినారు.

శ్రీస్వామివారికిని, ఎగువ దిగువ తిరుపతులను, కడమ చోట్లను వెల సిన వేల్పులకు బహువిధ భక్ష్యభోజ్యాది నివేదనలను, నిత్యోత్సవ పక్షోత్సవ మాసోత్సవ వర్షోత్సవాదులలో నింక ననేక విధముల కైంకర్యములను, వనభోజన వినోదములను తమ వంశపారంపర్యముగా తమ పేర జరిపించు-టకు బయిగ్రామములను ధనమును శ్రీభండారమున నర్పింపఁగాఁ, గోవెల స్థానపతు లందుకు సమ్మతిగా శాసనములు చెక్కించిరి.

ఇవిగాక వీరు కట్టించిన కట్టడములు వగైరాలు:-- స్వామిపుష్కరిణి జీర్ణోద్ధారము, మెట్లు, మండపములు, నీరాడుమండపము, కొండమీఁద తాళ్ళపాకవారి యింటి ముందు మండపము, సంకీర్తన (సంకీర్తనములు చెక్కిన రాగిరేకులు దాచి ఉంచినది) భండారము, అక్కడ దీపారాధనలు, అక్కడ సంకీర్తనలు పాడే వైష్ణవులకు జీతాలు, గుడిగ్రామాలలో చెరువులు, కాలువలు బాగుచేయించుటకు ధనదానము, ఆళ్వారుతీర్థముదగ్గఱ శ్రీలక్ష్మీనారాయణస్వామి ప్రతిష్ఠ ఇత్యాదులు.

కొన్ని ఉత్సవములలోని ముఖ్యాంశములు:-- శ్రీనివాసమూర్తికి ప్రతి శుక్రవారము తిరుమంజనము పిదప పునుఁగుతైలము పూయునప్పుడు పన్నీరుచెంబు సత్కారముపడయుట, (తాళ్ళపాక వారు సంకీర్తనములు అప్పుడు పాడేవారు.) అచ్యుతరాయల జన్మనక్షత్రమగు మృగశిరనాఁడు

ఉత్సవము జరుపుట, స్వామిపుష్కరిణి గట్టున తాళ్ళపాకవారు నిర్మించిన రాతిస్తంభముమీఁద సంవత్సరము పొడుగునా ప్రతి గురువారము దీపారాధన, ముక్కోటి ఏకాదశినాఁడు స్వామిపుష్కరిణిగట్టున ముప్పది దీపాలు, సంకీర్తన భాండారముదగ్గర నాల్గు తిరుబోనములు, దీపాల నూనె, ఆ భాండారములో సేవచేసే శ్రీవైష్ణవుల జీతాలు వగైరాలు.

తిరుమలయ్యగారికి శ్రీపతితొన్నడయ్య అనీ, తిరుపతి చేరువనున్న కులశేఖరపుర వాస్తవ్యుఁడు పల్లిపట్టురయ్య అనీ ఇద్దఱు సాతానివైష్ణవులు శిష్యులుండిరి. వారుకూడ స్వామికిఁ గైంకర్యములు జరపిరి. పెదతిరుమలయ్య గారు చేయించిన యుత్సవ విశేషములు సమగ్రముగా వ్రాసిన నదియే పుస్తకమగును.

ఈతఁడు రచించిన గ్రంథములు:--

1. శృంగార సంకీర్తనములు.
2. అధ్యాత్మసంకీర్తనములు.
3. వైరాగ్యవచన గీతాలు.
4. శృంగార దండకము.
5. చక్రవాళ మంజరి.
6. శృంగారవృత్త శతకము.
7. వేంకటేశ్వరోదాహరణము.
8. నీతిసీసశతకము.
9. సుదర్శన రగడ.
10. రేఫ ఱకారములు.
11. భగవద్గీత తెల్గు వచనము.
12. ద్విపద హరివంశము.

పై వానిలో కడపటిరెండు ముద్రితములు గాలేదు. తొలి రెండింటిలోఁ గొంతభాగమును, గడమవి సమగ్రముగాను ముద్రితములయినవి. హరివంశము దొరకనే లేదు.

ఇవిగాక చిన్నన్న పేర్కొన్న యంధ్రవేదాంతము తొలుత కృష్ణమాచార్యుఁడును, తర్వాత తన తాత యన్నమాచార్యుఁడును, పిదప తన తండ్రి తిరుమలాచార్యుఁడును ననుక్రమముగా రచించినది సంకీర్తనాత్మకము. ఇట్లనుటకు సాధకముగా అష్టమహిషీ కల్యాణములోన నిట్లున్నది: "క్ష్మానుత ద్రావిడాగమ సార్వభౌములైన మావారల నాళువారలను, వేదంబులెల్ల ద్రావిడముగాఁజేసి, వేదాంతవిదులు గోవిదులు నైనట్టి, గురుతరులగు పరాం

కుశముఖ్య యోగివరుల" నని ద్రవిడవేదాంతకర్తల సన్నుతి పై "వన జాత జాత సర్వ సురేంద్రముఖులు, గనలేని వేంకట గ్రావాధినాథు, పదముల శోభనాస్పదములౌ తనదు, పదముల బహు దేశపదముల జనులఁ, గనఁజేసి పంచమాగమసార్వభౌముఁ డనఁ బ్రసిద్ధికి నెక్కి యఖిల విద్యలను, నన్నయాచార్యుండెయనఁ దాళ్ళపాక యన్నయాచార్యుఁ డాయత కీర్తిఁ జెలఁగె" "వేదంబు తెనుఁగుగావించి సంసార ఖేదంబు మాన్పిన కృష్ణమాచార్యుఁ ఘనతర పంచమాగమ సార్వభౌము, ననఘు శ్రీతాళ్ళపా కాన్నమాచార్యుఁ దలఁచి" అనియు, "ఉరుయోగసామ్రాజ్యవిభవ జనకుండు తిరుమలాచార్యవర్యుండు, వేదాంతవిద్యాప్రవీణుఁడై యంధ్ర వేదాంత మొన రించి, ద్విపదరూపమున, హరివంశకావ్య మాయత రసస్ఫూర్తి, హరివంశ మిగురొత్త ననువొందఁజేసి" అనియు నాంధ్రవేదాంతకర్తల సన్నుతియుఁ గలదు.

ద్రవిడమున వేదవేదాంతములను పరాంకుశయోగి మొదలగు నాళ్వార్లు ద్రావిడీకరించి ద్రావిడాగమసార్వభౌము లనిపించుకొనఁగా, తెనుఁగున

కృష్ణమాచార్యుఁడు: కృష్ణమాచార్యసంకీర్తనకర్త.

అన్నమాచార్యుఁడు: సంకీర్తనాచార్యుఁడు, సంకీర్తనకర్త, పదకవితా పితామహుఁడు.

పెదతిరుమలాచార్యుఁడు: సంకీర్తనాదికర్త.

ఇట్లీమువ్వురును వేదమును తెనుఁగు గావించి ఆంధ్రవేదాంతకర్తలని, పంచమాగమ సార్వభౌములని, పంచమాగమ చక్రవర్తులని యనిపించుకొనిరి.

తిరుమలయ్యకు శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీరామానుజ సిద్ధాంతస్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కికకేసరి, శరణాగతవజ్ర-పంజర బిరుదములు గలవు.

ఈతనికి వేంకటేశ్వరస్వామి త్రిపురుషపర్యంతముగా ప్రత్యక్షంబును, సప్తపురుషపర్యంతముగా మోక్షంబు నొసంగెదనని వరమిచ్చె నట![1]

---

1 చూ. శకుంతలా పరిణయము, పీఠిక.

# సంకీర్తన భండారము

ఈ పెదతిరుమలయ్యగారే సంకీర్తన భండారమునకుఁ బెంపు వెలయించిరి. తొలుత అన్నమాచార్యుఁడే సంకీర్తనభండారమును నెల కొల్పి నట్టున్నాఁడు. అందుకుఁ దార్కాణముగా సంకీర్తనము. (చూ. పీఠిక పుట .36)

అన్నమాచార్యుని నాఁట సంకీర్తనములు తాటియాకులమీఁద వ్రాసియుంచఁబడెనేమో! ఆతని తర్వాత పెదతిరుమలాచార్యుఁడు వానిని రాగిరేకులమీఁదఁ జెక్కించెను. రాగివిలువయు, చెక్కించుకూలియు నిప్పటి లెక్కప్రకారము లక్షలగును. ఒకరో యిద్దఱో అక్షరములఁ జెక్కువారగుచో నది యొక పురుషాయుషమునంతకాలము జరపినఁ దేంవంసిన పని యగును. రాగిఱేకులను జెక్కినవాఁడు అన్నమరాజు తిమ్మయ్య అని కొన్ని ఱేకుల మీఁద నున్నది.

పెదతిరుమలార్యుని తర్వాత చినతిరుమలాచార్యుని సంకీర్తనములు కూడ రాగిఱేకుల కెక్కినవి. 1540 లో సంకీర్తనభండారముదగ్గఱ సేవచేయు వైష్ణవు లిర్వురుండుట, సంకీర్తనములు పాడేవారు కొందఱుండుట, ఆ భాండారముముందు స్వామిని వేంచేపుచేయించి ప్రసాద వినియోగాదులు, కైంకర్యములు, దీపారాధనలు జరుగుచుండుటయు తాళ్ళపాకవారి శిలా శాసనముల కెక్కి యున్నవి.[1]

ఈ సంకీర్తనభండారము (తాళ్ళపాకవారి అర) ద్వారమున కిరుప్రక్క లనే విగ్రహములున్నవి. అవి యన్నమాచార్య తిరుమలాచార్యులవి.

## చినతిరుమలయ్య

ఈతఁడు పెదతిరుమలయ్య పెద్దకుమారుఁడు. అన్నమాచార్యుఁ డీత నికి బ్రహ్మోపదేశము (ఉపనయనము) చేసెను. ఇందుకు సంకీర్తనము:-

---

1 చూ. తి.తి. దేవస్థాన శాసనములు వాల్యుం IV, నెం. 155.

లలిత

తాళపాకాన్నమాచార్య దైవమవు నీవు మాకు
వేళమె శ్రీహరిఁ గనే వెర వానతిచ్చితివి ॥పల్లవి॥

గురుఁడవు నీవె సుమ్మీ కుమతినైన నాకు
సరవి బ్రహ్మోపదేశము సేసితి
పరమబంధుఁడవైనా పరికింప నీవె సుమ్మీ
వరుస నేఁ జెడకుండ వహించుకొంటివి ॥తా॥

తల్లివైన నీవె సుమ్మీ తగిన విషయాలలో
పల్లదానఁ బడకుండా బ్రదికించితి
అల్లుకొని తోడునీడవైనా నీవె సుమ్మీ
చిల్లర మాయలలోనఁ జెడకుండాఁ జేసితి ॥తా॥

ధాతవు నీవె సుమ్మీ తగు శ్రీవేంకటనాథు
నా తలఁపులో నిలిపి నమ్మఁజేసితి
యేతలఁ జూచినా నాకు నేడుగడయు నీవె
ఆతల నీతల నన్ను నాదుకొని కాచితి ॥తా॥

చి.తి. అధ్యా. 7 రేకు.
సంకీ. 39 - సంపు. XVI (1962).

కాన యీతఁడు క్రీ.శ. 1495 ప్రాంతముం జన్మించినవాఁడనుకొన వచ్చును. క్రీ.శ. 1553 దాఁక నీతనిశాసనము లున్నవి. ఈతఁడు సంస్కృ- తాంధ్రములందు మహాకవి, మహావిద్వాంసుఁడు, అష్టభాషాకవిచక్రవర్తియని బిరుదు గలవాఁడు. తండ్రితాతలవలెనే అధ్యాత్మ శృంగారసంకీర్తనలను- రచించినాఁడు. తెల్గు సంకీర్తన లక్షణము, అష్టభాషాదండకము రచిం చినాఁడు. (ఇవి ముద్రితములు. చూ. తాళ్ళపాక కవుల లఘురచనలు, వాల్యూం I (1936).)

శ్రీవేంకటేశ్వరస్వామికి, దిగువ తిరుపతిలోని వేల్పులకుఁగూడఁ జాలా కైంకర్యములు కావించినాఁడు. అందు ముఖ్యములు గొన్ని:-

గోవిందరాజస్వామికి, పెండ్లి తిరునాళ్ళు (వైవాహికోత్సవము) జరుపుటకు నేడియం అను గ్రామము రాఁబడిలో సగమిచ్చినాఁడు.

గోవిందరాజ విట్ఠలేశ్వరాచ్యుతపెరుమాళ్ రఘునాథ వరదరాజ లక్ష్మీనారాయణులకును హనుమదాలయములోఁ దాను ప్రతిష్ఠించిన నరసింహస్వామికిని కైంకర్యములకై చిత్రిచిత్రానక్షత్రమునఁ దన తిరునాళ్లలో, *వైశాఖ మృగశిరను దన తండ్రితిరునాళ్ళలో గోవిందరాజస్వామి గుడి దగ్గటి సుదర్శనచక్రమునకుఁ గైంకర్యములకై 200 రేఖై పొన్నుల రాఁబడిగల వెదుమప్పాకంగ్రామము నర్పించినాఁడు.

మంగాపురమున కళ్యాణవేంకటేశ్వర దేవాలయ జీర్ణోద్ధారణము గావించినాఁడు. స్వామి దివ్యసుందరమంగళ విగ్రహమునుగూడ నీతఁడే క్రొత్తగా వెలయింపించినట్లున్నాఁడు. ఆళ్వార్లతో భాష్యకార్లతో దేశికులతో సహ తనతాతగారగు అన్నమాచార్యు విగ్రహము నక్కడ ప్రతిష్ఠించినాఁడు. కాని యా విగ్రహము నేఁడు గానరాకున్నది.

## పెదతిరువెంగళనాథుఁడు

ఈతఁడు సాత్త్విక శుభమూర్తి సంగీతసత్కవిత్వాధికుఁడు నని చిన్నన్నచే స్తుతింపఁబడెను. స్వామిసన్నిధి నీతఁడు సంకీర్తనములు పాడుచుండఁగా స్వామి యాడుచుండెడువాఁడట! వేంకటాచార్యుఁడు "విశేషించియు నత్తిరువెంగళనాథుంధు సంకీర్తనంబుఁ బాడిన నాడందొడంగె."[1] నని చెప్పినాఁడు. ఈతఁడు చిన్నన్న జీవించియుండఁగా క్రీ.శ. 1546 పూర్వమే దివ్యధామ మందినాఁడు.

## చిన్నన్న

ఈతఁడే అన్నమాచార్యచరిత్ర కర్త. చినతిరుమలాచార్యున కీతఁడు మూఁడవ తమ్ముఁడు. ఈ యిర్వుర నడుమ అన్నమయ యని, పెద తిరు-

---

* చైత్రమాసముగదా? చూ.౫౧ పేజి.

1 శకుంతలాపరిణయ కృత్యవతరణిక.

వెంగళనాథుఁడనీ యిద్దరు సోదరులు. చిన్నన్న తర్వాత తమ్ముఁడు కోనేరునాథుఁడు. వీరందఱును సుప్రసిద్ధులు. కోనేరునాథుఁడు 1560 తర్వాతఁగూడ నున్నాఁడు. తాళికోటయుద్ధమును విద్యానగరవినాశనమును జూచు దౌర్భాగ్యమునకుఁ బాల్పడక 1565 పూర్వమే వీరందఱు దివ్యధామ మంది యుందురు.

## ధర్మకైంకర్యములు

స్వామి కీతఁడును జాల ధర్మకైంకర్యము లొనర్చెను. అందొకటి:- క్రీ.శ. 1546 లో కొండవీటిసీమలోని చెందలూరు-మల్లవరగ్రామములను స్వామి శ్రీ భండారమున కర్పించెను. రెండు గ్రామములనుండి సంవత్సరపు రాఁబడి 620 గట్టివరహాలు. ఈసొమ్ముతో జరపవలసిన ధర్మకైంకర్యములలో మన కిక్కడ ముఖ్యమయినవి:--

1. వైశాఖమాస విశాఖా నక్షత్రమున తాత అన్నమయగారి జన్మనక్షత్రోత్సవ కైంకర్యము.

2. చైత్రమాసము మృగశిరా నక్షత్రమున పెదతిరుమలయ్యగారిజన్మ నక్షత్రోత్సవ కైంకర్యము.

3. మాఘశుద్ధచతుర్థి తమ పెదతండ్రి నరసయ్యగారి శ్రాద్ధదిన కైంకర్యము.

4. జ్యేష్ఠమాస పూర్వపక్షచతుర్థి తన యన్నగారగు తిరువెంగళప్ప శ్రాద్ధదిన కైంకర్యము.

5. ఆశ్వయుజమాస బహుళత్రయోదశి తమ తల్లిగారైన తిరుమలమ్మ గారి శ్రాద్ధదిన కైంకర్యము.

వీనివల్ల నన్నమాచార్యాదుల జన్మ మాస నక్షత్రములు, నిర్యాణ మాస తిథులు తెలియనయినవిగాని, వాని సంవత్సర నామములు తెలియరాకుండుట కొఱఁతగొల్పుచున్నది. ఒక్క యన్నమాచార్యునివే జనన నిర్యాణ

సంవత్సరములు తెలియవచ్చినవి గాని తక్కిన వారివి తెలియరాలేదు. సూర్య చంద్రాదు లున్నంతదాఁకఁ బైవారి జన్మనక్షత్ర నిర్యాణతిథి కైంకర్యములు సాగుచుండుటకే యా యగ్రహార సమర్పణములు జరిగిననిగాని, యా ధర్మ కైంకర్యములకు "శ్రీవైష్ణవులరక్ష" అనిమాట కలదు గాని, అన్నీ అన్యథా అయి పోయినవి. పరమాచార్యుఁడయిన యన్నమాచార్యుని జన్మనక్షత్ర నిర్యాణ తిథి కైంకర్యములను, స్వామి కనేకాగ్రహారముల నొసఁగి యనేక కైంక-ర్యములు జరపిన మహావిద్వాంసుఁడు-మహాకవియగు తిరుమలాచార్యుని నిర్యాణదిన కైంకర్యములు నేఁకమీఁద నయిన సాగుట యర్థింపఁదగినది.

అష్టమహిషీకళ్యాణము, పరమయోగివిలాసము, ఉషాపరిణయము, అన్నమాచార్యచరిత్రము చిన్నన్న రచించిన గ్రంథములు. ఈతఁడు జలజాత వాసిని చనుబాల పుష్టిచే కవితారచన నేర్చినాఁడట. ఈతనియన్న పెదతిరు వెంగళ నాథుఁడు "సంగీతసత్కవిత్వాధికుడు". సంకీర్తనములు పాడుచుండు నప్పుడు స్వామి యాడుచుండెడువాఁడట. ఈ మహామహులకు (అయిదుగు రికి) స్వామి పాండవులకుఁ గృష్ణునట్లు సహాయమై యుండెడివాఁడట! వీరికి విచిత్రముక్తాతపత్ర రత్నకిరీట ముద్రికా ప్రచండమణిమండిత మకరకుండలో-త్కరాహః కరదీపికా పాదుకాది బహూకరణంబులను స్వామి కరుణించెనట! చిన్నన్న పరమయోగివిలాసాష్టమహిషీ కళ్యాణములలో "రత్నకుంభ దనుపమ శ్రీవేంకటాద్రీశ దత్తమకరకుండల రత్నమండితకర్ణుఁడ" నని, "కావ్యంబు చెప్పి శ్రీ వేంకటేశు మెప్పించి సకలంబు నెఱుఁగ నసాధారణాంకమకర కుండలములు గొన్నవాఁడ" నని, "దినములోననె వేయిద్విపద లింపొంద వినుత వర్ణనలతో విరచించువాఁడ"నని చెప్పుకొన్నాఁడు. ద్విపదలక్షణము నీతఁడే నిష్కృష్టముగా నిర్వచించినాఁడు. లక్షణగ్రంథకారు లెవ్వరుగాని యితనివలె నిర్వచింపఁజాలరయిరి. ఈతఁడు "కస్తురివీఁగఁ గోసిన కరణి, తెలిగప్పురపుఁగ్రోవి దెఱచినసరణి, విరవాదిపొట్లంబు విడిచినమాడ్కి పరిమళించుచుఁ, గవుల్ బళిబళీ యనఁగ" కవిత సెప్పిన సులక్షణకవి.

అర్వాచీనులు కొందఱు 'తాళ్ళపాక చినన్న దండెమీటులు గావు' అనీ, 'అల తాళ్ళపాకచిన్నన్న రోమములైతె తంబురాదండెకుఁ దంత్రులౌనె' అనీ

యీతని గొప్పగాయకునిఁగా స్మరించిరి. చిన్నన్న గాయకుఁడనుట కిక్కడి రాగిరేకులలోఁగాని గ్రంథములలోఁగాని యాధారములు గానరావు. చిన్నన్నకు అన్న తండ్రి తాత గొప్ప గాయకులుగాన, యిటీవలివారు గ్రంథముంఁబట్టి చిన్నన్న నే యెఱిఁగినవారుగాన, వారియోగ్యత నీతనికిఁ జేర్చి చెప్పియుండ-వచ్చును. కాక యీతఁడును గాయకుఁడేమో! గణపవరపువేంకటకవి ప్రబంధరాజమున చిన్నన్న నిట్లు సన్నుతించెను:--

క. ఎన్నఁ దెనుగువకు రాజను,
గ్రన్నన యతిరాజునకును రమణయకును నేఁ
జిన్నను, ద్విపద నొనర్చను
జిన్నన్నను, బిరుదుగద్య చెప్పిన ఘనుఁడన్.

నూలినేతచే వస్త్రములు గల్పించి లోకమును నాగరకపఱచి యుద్ధ-రించువారయిన సాలెవారి కీతఁ డాచార్యపురుషుడు. వారి వంశమర్యాదం కీతఁడు సంరక్షకుఁడుగా నుండెను. సాలెవారు వీరికి పదివేల వరహాలు పాదకానిక సమర్పించిరి. చిన్నన్నవంశపారంపర్యముగా దమ వంశపారంపర్య-ముగా గురుశిష్యతాసంబంధము వర్ధిల్లఁగోరిరి. ఇందుకు తామ్రశాసనము వెలయించిరి.[1]

## కోనేటి తిరువెంగళనాథుఁడు

ఈతఁడు సదాశివరాయలచే క్రీ.శ. 1544,1545లలో అద్దంకి దగ్గఱి బొల్లాపల్లి, ఓంపల్లి అను రెండగ్రహారములఁ బడసినాఁడు. క్రీ.శ. 1559లో కడపజిల్లా పుష్పగిరి చెన్నరాయునికిఁ గొంతభూమి సమర్పించినాఁడు. ఈతఁడు గొప్పవైభవ మనుభవించినాఁడనుట కీ క్రిందిపద్యము సాక్షి.

సీ. మొకరివాలెర కీర్తిముఖము బంగరుదండె-
పాంకి యే గురుం డోలి నెక్కె
శ్రీజగన్నాథు నూర్జిత పదాంభోజముల్
సేవించి యే బుధాశ్రితుఁడు వెలసె

---

[1] చూ. శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్ జర్నల్, పార్టు 1 (మార్చి 1940).

కాయసిద్ధిని లంబికాయోగమార్గంబు
తెలిపి యే ఘనుఁడు సాధించి వెగడె
భక్తితోఁ బట్టాభిషిక్తులు ధర సాగి-
మ్రొక్క నే విభుఁడు పెంపెక్కి వెలఁగె
నతఁడు పొగడొందు హారనీహారగంధ-
సార కర్పూర గోక్షీర సదృశయశుఁడు
ఘనుఁడు పెదతిమ్మదేశిక గర్భజలధి-
కువలయాప్తుండు కోనేటి గురువరుండు"[1]

## తిరువెంగళప్ప

ఈతఁడు గొప్పవిద్వాంసుఁడు. అమరుకావ్యమును దెలిఁగించినాఁడు. నామలింగానుశాసనమునకుఁ దెలుఁగువ్యాఖ్య రచించినాఁడు. కావ్యప్రకాశికకు వ్యాఖ్య రచించినాఁడు. క్రీ.శ. 1554లో అంబత్తూరు, తూప్పిల్ అగ్రహార ములలో కొంతభాగము తిరుపతి గోవిందరాజస్వామి పెండ్లి తిరునాళ్ల జరి-పించుటకుగా సమర్పించినాడు. క్రీ.శ. 1553లో చినకంచిలో అరుళాళ పెరుమాళ్ళకు వల్లత్తంజేరి, పేరీచ్చంబాకము అను గ్రామము లిచ్చినాఁడు.[2]

## తిరుపతి శాసనములు

తిరుపతి దేవస్థానశాసనములెల్ల నరవముననే కలవు. సర్వ స్వతంత్రుఁడు దక్షిణాపథమునకెల్ల సార్వభౌముడునుగాన యొక్క శ్రీకృష్ణదేవరాయఁడు మాత్రము గుడిలో సంస్కృత కర్ణాటాంధ్ర ద్రవిడములలోఁ దనశాసనములఁ జెక్కించుకోఁగలిగెను. తిరుమల తిరుపతి దేవస్థానముల గుడిగోపుర ములలోఁ దాళ్ళపాకవారిశాసనములు నరవముననే యున్నవి. తిరుమల కొండక్రిందనే తాళ్ళపాకవారి యగ్రహారముగానున్న మంగాపురమునఁ

---

1 ఈ పద్యము శ్రీ తాళ్ళపాక సూర్యనారాయణయ్యగారి వ్రాఁత కాగితములనుండి కైకొంటిని.

2 పై చరిత్రవిషయములు పెక్కులు శ్రీసాధుసుబ్రహ్మణ్యశాస్త్రులుగారు రచించి-నశాసనముల రిపోర్టులోని విషయములు, శాసనములు చదివి సమకూర్చినవి.

దాళ్ళపాక చినతిరుమలాచార్యుఁడు తాను గట్టించిన కళ్యాణవేంకటేశ్వర దేవాలయమున శాసనములన్నింటిని తెలుఁగుభాషలోఁ దెలుఁగులిపిలోనే చెక్కించుకొనెను. శుద్ధాంధ్రు లయిన మహనీయులు సాళువ తిమ్మన, గోవిందన, బయకార రామయ మొదలగువారు శ్రీస్వామివారి కర్పించిన యగ్రహారాదుల శాసనములుగూడ ద్రవిడముననే ద్రావిడీకరణముఁ బడసిన పేర్లతోనే యున్నవి. శాసనములెల్ల ద్రావిడముననే యుండుటకుఁ గార ణము దేవస్థాన స్థానపతులు ద్రవిడులగుటయే. గుడిలో శాసనముఁల జెక్కించుట కధికారులు వారే. తిరుమలాచార్యాదులు పదులకొలఁది గ్రామములను స్వామికి సమర్పించుకొన్నారేకాని గుడిలో శాసనముఁల జెక్కించుకోలేదు. ఆ యా దాత లిచ్చిన యీవులను బ్రతిగ్రహీతయగు దేవునికిఁ జెల్లింతుమని దేవస్థానస్థానపతులు బాధ్యత వహించి యుభయు లకు నమ్మికగా శాసనముఁల జెక్కించిరి. దానికి 'శ్రీవైష్ణవరక్ష' పెట్టిరి. తిరుమలాచార్యులనాఁడు శాసనముఁల జెక్కించిన యుద్యోగి తిరునిన్రార్ వుడయన్. స్వామిపుష్కరిణికడ మాత్రము పెదతిరుమలాచార్యుఁ డొక తెలుఁగుశాసనము వేయించుకొనెను. పద్యరూపముగాఁగూడ నది తాళ్ళపాక సూర్యనారాయణయ్యగారి ప్రాఁత కాగితములలో నున్నది. అది యిది:-.

సీ॥ శ్రీశాలివాహనాంచిత శకాబ్దము లెన్న
    నిలవేయునన్నూఁట యేఁబదియును
నాలవయేఁడగు నందనవత్సర
    వైశాఖపూర్ణిమా వాసరమున,
శ్రీవేంకటాధీశ శృంగారసంకీర్త
    నాచార్య తాళపాకాన్నమార్య-
పుత్రతిమ్మార్యుండు పూర్వపుఁగోనేటు
    కట్టించె నవశిలాకలితముగను
తత్తటాంకణ గోపురద్వారములను
భువనసన్నుతుఁడైనట్టి భూవరాహ-
ఘనుని తిరుచుట్టుమాలె ప్రాకారవరము
తానె కట్టించె నాచంద్ర తారకముగ.

## నేఁటి తాళ్ళపాకవారు

తిరుపతిలో స్వామికి సంకీర్తనకైంకర్యము జరుపుచుఁ దాళ్ళపాక శేషాచార్యులుగారు కుటుంబవృద్ధితో నున్నారు. మడితాడు గ్రామవాసి, సూర్యనారాయణయ్యగారు చిన్నన్నకోవలోనివారట. నేఁడు తిరుపతిలోనె వైద్యాదివృత్తులతో సకుటుంబముగా నున్నారు. వీరే తాళ్ళపాకవారి పూర్వగాథలకై చాల శ్రమించుచున్నవారు. అన్నమాచార్యుల దేవతార్చన విగ్రహాదులను మంగాపురమునకుఁ జేర్చినవారు వీరే. ఇంకను కడప జిల్లాలో ముడుంపాడు, ఊటుకూరు, మాచనూరు, రాజుపాలెం, *ఎఱ్ఱవారిపాలెం అనుగ్రామములలోఁగూడఁ దాళ్ళపాకవారు పెదతిరుమలాచార్యుల యయిదుగురు కుమాళ్ళ వంశపరంపరల వారు ఉన్నారట. శ్రీ సూర్యనారాయణయ్యగారా యా గ్రామముల కరిగి యక్కడి విశేషములఁ దెలిసికొనివచ్చిరి. మఱి కొన్ని విగ్రహాదులు మాచనూరు గ్రామమునఁ గలవని తెలుపఁగా, వానిని సేకరింపఁగోరి వారి నాగ్రామమున కంపితిని. కాని వారు విగ్రహముల నీయరయిరట. గ్రంథములు శిథిలమయిపోయినవట. తాళ్ళపాకవారి యిండ్లనుండి (కడపజిల్లా) కొన్ని తాళపత్రగ్రంథము లాంధ్రసాహిత్య పరిషత్తువారు సేకరించినట్లున్నారు. (చూ. 6 వాల్యూం, పరిషత్పత్రిక.)

## నందవరీకులు - వైష్ణవత

అన్నమయ యాదివన్ శఠకోపయతిశిష్యుఁడై వైష్ణవుఁడైనట్టే యా కాలమున నందవరీక బ్రాహ్మణులు మఱికొందరు వైష్ణవము స్వీకరించి శఠకోపయతిశిష్యు లయిరి. అల్లసాని పెద్దనకూడ నందవరీక బ్రాహ్మణుఁడే స్మార్తుఁడే - శఠకోపయతి శిష్యుడై వైష్ణవము పుచ్చుకొన్నాఁడు. ప్రబంధ-రాజ విజయ వేంకటేశ్వర విలాసము రచించిన గణపువరపు వెంకటకవిగూడ నందవరీకుఁడే. వారి పూర్వులు వైష్ణవము పుచ్చుకొన్నవారే. కాని యాతఁడు తాళ్ళపాకవారికిఁ జాలఁ దర్వాతివాఁడు. శ్రీవేంకటేశ్వర స్వామిపై నాతఁడు రచించిన కృతి వేంకటేశ్వరవిలాస మాతఁడన్నట్లు

* నేఁడది చిత్తూరుజిల్లా వాయల్పాడుతాలూకాలో నున్నది. మునుపు తాలూకా కడపమండలములోనిది.

ప్రబంధరాజమే. నందవరీకులు గొందఱు వైష్ణవులగుటకుఁ బ్రధానముగా నన్నమాచార్యుఁడే కారణ మనుకొందును. ఆరాధ్యశైవుఁడగు *తెనాలి రామకృష్ణుడు వైష్ణవుఁ డగుటకుఁగూడ నీ తాళ్ళపాకవారి పలుకుబడి కల దేమో. ఆతని కృతిపతి విరూరి వేదాద్రిమంత్రి నందవరబ్రాహ్మణుఁడేమో. 'విరూరి' యింటిపేరివారు నందవరీకులు నేఁడున్నారట. రామకృష్ణుని గురు వగు కందాడ అప్పలాచార్యుఁడు తాళ్ళపాక పెదతిరుమలాచార్యునకును గురువు. కాన పెదతిరుమలయ్య రామకృష్ణుఁడు సతీర్థ్యులు.

## అన్నమాచార్యాదులు తిరిగినదేశములు

అన్నమాచార్యుఁడు కడప, కర్నూలు, బళ్ళారి, యనంతపురము, చిత్తూరు, చెంగల్పట్టు, ఆర్కాడు, నెల్లూరు, గుంటూరు, తంజావూరు, తిరుచినాపల్లి మండలములలో సంచారముచేసినట్లున్నాఁడు. కృష్ణ, గోదావరి మండలముల నెఱుఁగఁడేమో! అన్నమాచార్యుని మనుమఁడు చిన్నన్న గుంటూరు, కృష్ణామండలములఁగూడఁ దిరిగినవాఁడు. ఆతనికి శిష్యులు పాలెవారు సర్వాంధ్రదేశమున నుండిరి.

## కీర్తించిన వేల్పులు

అన్నమాచార్యుఁడును, ఆయన కొడుకు పెదతిరుమలాచార్యుఁడును, మనుమఁడు చినతిరుమలాచార్యులును నీ క్రింది పుణ్యస్థలములలోని దేవ-తలఁ బేర్కొని సంకీర్తనములు చాల రచించిరి. మాదుపూరి కేశవుఁడు, కృష్ణుఁడు, దాసరిపల్లె రాముఁడు, మండెము నృసింహుఁడు, కదిరి నృసింహుఁడు, కదిరి వసంతుఁడు, చెంజి నవనీతకృష్ణుడు, కళసా హను-మంతుఁడు, అహోబల నృసింహుఁడు, విజయనగర వేంకటేశ్వర, విట్ఠల, నరసింహ, హనుమంతులు, కడప వేంకటేశ్వరుఁడు, తిరుపళాచ్చి విష్ణుఁడు, తిరువళ్ళూరి వీర రాఘవుఁడు, కంచి వరదరాజు, గండవరము గోపాలుఁడు, కుఱునూతుల చెన్నుఁడు, వేగలమట్టి చెన్నుఁడు, వావిలిపాడు రాముఁడు, ఉద్దగిరి కృష్ణుఁడు, గుత్తి-రాముఁడు, వెలుగోటి కేశవుఁడు, మంగాం-

---

* తెనాలివారు ప్రథమశాఖీయులు. ఆ యింటిపేరివా రారాధ్యులలో నున్నారా?

బుధి హనుమంతుఁడు, నల్లఁబల్లి చెన్నుఁడు, ఊటుకూరి చెన్నకేశవుఁడు, కోవెలగుంట్ల గోపాలకృష్ణుఁడు, ఓగునూతుల నృసింహుఁడు, కోన చెన్నరాయఁడు, శ్రీరంగము రంగనాథస్వామి, ఒంటిమెట్ట వీరరఘురాముఁడు, చుక్కపల్లి చెన్నుడును గలరు. కోసువానిపల్లె, చెళ్లపిళ్ల, నెల్లూరులును గలవు. అధ్యాత్మసంకీర్తనములలో చదివిచూచినంతలోఁ గానవచ్చిన వివి. కడముట్టఁ బరిశీలించిన పై నింక నెన్నియగునో!

## సంకీర్తన ముద్రా సామ్యములు

తాళ్ళపాక అన్నయ తిరుమలాచార్యులకు నిన్నూఱు వర్షములకుఁ దర్వాతి కాలమున క్రీ.శ. 1650 ప్రాంతముల వర్ధిల్లిన క్షేత్రయ్యయును, క్షేత్రయ్య కించుమించుగా నిన్నూఱేండ్ల తర్వాత వర్ధిల్లిన త్యాగరాయలవారును నిట్లే యనేక దివ్యస్థలముల దేవతలపై సంకీర్తనముల రచించిరి. తాళ్ళపాకవారా యా దేవతలకుఁ దిరుపతి వేంకటేశ్వరునితో నభేదము గల్పించి వేంకటేశ్వర నామముద్ర యుంచినట్లు క్షేత్రయయు నా యా క్షేత్రముల దేవతలకు మువ్వగోపాలునితో నభేదము గల్పించి మువ్వగోపాల ముద్రను సంకీర్తనములకుఁ గూర్చెను. త్యాగరాయలవా రా యా క్షేత్రముల దేవతలఁ బేర్కొనుచుఁ గడపటి చరణమునఁ దనపేరే ముద్రగా వెలయించిరి.

రాజస్తుతి పరాఙ్ముఖత్వము, దేవతార్చన విగ్రహములను గోల్పోవుట మొదలగువిషయములు కొన్ని యన్నమాచార్యునకును, త్యాగరాజునకును సమానముగాఁ దటస్థించినవి. అన్నమాచార్యుని శృంగారసంకీర్తన రచనాంశము క్షేత్రయ్యగాను, అధ్యాత్మసంకీర్తన రచనాంశము త్యాగయ్యగాను నవతారముదాల్చె ననఁ జెల్లును. అన్నమాచార్యునట్లు సంకెళ్ళు వేసి చెరలో నుంచుట, స్వామికృపవలన నా క్లేశము తొలఁగిపోవుట రామదాసుగారికిని గలిగెను.

## అన్నమాచార్యుని పలుకుబళ్లు

అన్నమాచార్యుని సంకీర్తనముల భాష పశ్చిమాంధ్ర దేశమున వాడుకగన్నది. ఆతని పలుకుబళ్లు చాలా కృష్ణరాయలయుఁ దదాస్థాన కవులయు

రచనలలోని కెక్కినవి. రాయలతోఁ దఱచుగాఁ దిరుపతికి వచ్చి స్వామిసన్ని ధిని తాళ్ళపాకవారి సంకీర్తనములను వినుచుండుటచే నా యా కవులకు వీరి పలుకుబళ్లు సుపరిచితములయి యుండవచ్చును. మచ్చుకుఁ గొన్ని:-

చిగురుఁగొమ్మెనఁ జేవ, మీసాలపై తేనియల్, సందుసుడి మాయలు, తంగేటి జున్ను, నూతులు త్రవ్వితే బేతాళాలు బయల్పడును, కోలగగ్గెర, పోరివిడంగాయములు, గోవాళ్లు, చిందువందు, తలపూ వాడక.

తాళ్ళపాకవారి సంకీర్తనముల ఛాయలు వేమనపద్యములలోని కెక్కి నవి.

## ఛాయాపహారులు

తన సంకీర్తనచ్ఛాయాపహారులను -- వారెవరో పేరు తెలియదు -- అన్నమయ కటువుగా గర్హించెను.

రామక్రియ

వెఱ్ఱులాల మీకు వేడుక గలితేను
అఱ్ఱువంచి తడు కల్లంగరాదా ||పల్లవి||

ముడిచి వేసిన పువ్వు ముడువ యోగ్యము గాదు
కుడిచి వేసిన పుల్లె కుడువఁగాఁ గాదు
బడి నొకరు చెప్పినఁ బ్రతి చెప్పఁబోతేను
అడరి శ్రీహరి కది అరుహము గాదు ||వెఱ్ఱు||

గంపెఁడుముక దినఁగా నొక్క వరిగింజ
తెంపునఁ గలసితే తెలియ నెట్టువచ్చు
జంపులఁ బలవరించఁగ నొక మంచి మాట
ఇంపైతే హరి యందు కిచ్చునా వరము ||వెఱ్ఱు||

ఉమిసిన తమ్మలో నొక కొంత కప్రము
సమకూర్చి చవిగొని చప్పరించనేల
అమరఁగ ఛాయాపహారము చేసుక
తమమాట గూర్చితే దైవము నగఁడా ||వెఱ్ఱు||

చిటికివేసిన గింజ చేతఁ బట్టఁగనేల
గుటుక కెంగిలిబూరె గడుఁగఁగ మఱియేల
తొటుక కవిత్వాల దోషాలఁ బొరలితే
దిటుకార నవ్వఁడా దేవుఁడైనాను ॥వెట్టి॥

మించు చద్దికూటిమీఁద నుమిసినట్టు
మంచి దొకటి చెప్పి మఱి చెప్పనేరక
కంచుఁ బెంచు నొక్కగతి నదికితే ముట్టు(మట్టి?)-
పెంచువలెనే చూచుఁ బెరుమాళ్ళు వాని ॥వెట్టి॥

పుచ్చినట్టిపండు బూఁజి లోననే వుండు
బచ్చనకవితలు బాఁతిగావు యెందు
ముచ్చుఁ గన్నతల్లి మూల కొదిఁగినట్లు
మ్రుచ్చిమి నుతులేల మొక్కరో హరికి ॥వెట్టి॥

ఉల్లి దిన్న కోమ టూరక వున్నట్టు
జల్లెడ నావాలు జాఱిపోయినట్టు
కల్లలు చెప్పి యా కథ కుత్తరములీక
మెల్లనే వుండితే మెచ్చునా దైవము ॥వెట్టి॥

నేతిబీఱకాయ నేయి అందు లేదు
రాతివీరునికి బీరము ఇంచుకా లేదు
ఘాత బూరుగుఁబండు కడుపులోన దూది
ఏతుల నుడుగులు యెక్కునా హరికి ॥వెట్టి॥

ఇరుగువా రెఱుఁగరు పొరుగువా రెఱుఁగరు
గొరబైన మాటలు గొణఁగుచునుందురు
పరులఁ గాదందురు బాఁతిగారు తాము
విరసు లట్టివారి విడుచు దేవుఁడు ॥వెట్టి॥

ఎన్నఁగ శ్రీవేంకటేశుఁ దాళ్ళపాక-
అన్నమాచార్యులు అఖిల దిక్కులు మెచ్చ-

మన్నలితోఁ బాడి రొకఁ డెవ్వఁడో తాను
సన్న నొరసునట సమ్మతా హరికి ॥వెఱ్ఱి॥

అన్న. అధ్యా. 196 రేకు.
సంకీ. 494 - సంపు. 2 (1981).

పాడి

నరసింహ రామ కృష్ణ నమో శ్రీవేంకటేశ
పరుగ నా శత్రుల సంహరించవే ॥పల్లవి॥

బావతిట్లకు శిశుపాలునిఁ జంపిన-
యేవకోపకాఁడవు నేఁడెందు వోతివి
నీవాఁడనని నన్ను నిందించీ శత్రువును
చావఁగొట్టి వాని నిట్టె సంహరించవే ॥నర॥

దాసుని భంగించేటి తటీఁ గస్యపుఁ(గసిపుఁ?) జంపిన
యాసుకోపకాఁడ విపు డెందు వోతివి
మేనుల నీ లాంఛనాల మించి నన్ను దూషించీ
సాపించి శత్రువును సంహరించవే ॥నర॥

కల్లలాడి గూబయిల్లు గైకొన్న గర్దఁ జంపిన-
యెల్లగాఁగఁ గోపకాఁడ వెందు వోతివి
యిల్లిదె శ్రీవేంకటేశ యీ నీ మీఁది పాటలు
జల్లన దూషించు శత్రువు సంహరించవే ॥నర॥

అన్న. అధ్యా. 378 రేకు.
పుట 107, సంకీ. 159, సంపు. XI (1955).

చాలా కోపగాఁడయి యీ సంకీర్తనలు రచించినాఁడు. కవితాశత్రు వెవ్వఁడో యీతనిఁ గాసిపఱిచినట్టున్నాఁడు.

## భాషావిశేషములు

చక్కఁగా గ్రాంథికభాషను నేర్చినవాఁడయినను నీతఁడు సంకీర్తనములలోఁ జాలాచోట్ల వాడుకభాషనే యుపయోగించినాఁడు. సంకీర్తన

లక్షణమున నాతఁడు చెప్పినదానికి మనుమఁడు చినతిరుమలయ్య యిట్లు తెలుఁగు చేసినాఁడు.

క॥ వల్లవ నారీ మ్లేచ్ఛా
ద్యుల్లాప మనోజ్ఞ బంధురోక్తులు చవులై
చెల్లును గ్రామ్యములైనను
హల్లీసక ముఖ్య నాటకాదిక ఫణితిన్.

క॥ జగతిఁ గడుఁ జెల్లుబల్లె
నగి నగి భాషించునట్టి నానుడి పలుకుల్
తగదన రహిచెడుఁ బువ్వుల-
పొగసుదుగన్ బిసికి కంపు సూపిన భంగిన్.

వచ్చీని, పోయీని, చేసీని, ఆడుతా, చేయరంటా, చిముడుతా, ఏమి చెప్పేదమ్మా, అమ్మలాలా, అయ్యలాలా, ఏవూరికేవూరు, యేనాఁటి ఋణము, (సంధికూర్పవలసినచోట్లు కూర్పక వ, య - ఆగమములు చేర్చుట), పోయె, ఆయె - ననుటకు పోయ, ఆయ - అనుట, లోకవాదుక, దినదినకొత్తలు (వైరి సమాసములు) - ఇత్యాదివివిధముల వాదుకభాష నీ కవులు ప్రయత్నముతోఁ గోరి ప్రయోగించినారు. అరవములోవలె నీ కవులు ఉదంతతద్ధర్మార్థక క్రియాజన్య విశేషణములకు సమాసములో ద్రుతము చేర్చిరి. పోవుంద్రోవ, చెప్పంబలుకులు - ఇత్యాదులు. దీమసపుఁబా-రివార(వారలార అనుటకు), కట్టివార(వారలార అనుటకు), ఇట్టి ప్రయోగము నాచనసోమనయు "వెట్టివార పిడుగువేసినఁదలటొప్పి యాగునే" అని చేసెను. నాచన సోమన రచనల యనుకృతు లీ సంకీర్తనములలోఁ జాల గలవు. "ఎదిరికిన్మడఁచువాడు తనకుఁ దగరంబు సఱచు టెంతటి భరమ్ము" నాచన సోమన నానుడి యిది. 'ఎనలేక యెదిరికి యినుమడిచేవానికి తనకు తగర మదువఁ దడవయ్యీనా' అని సంకీర్తనమున కెక్కినది.

నిఘంటువుల కెక్కని దేశి తెలుఁగుపలుకు లీ సంకీర్తనములలో నెన్నో కలవు. అట్టివానినెల్ల సేకరించి వేఱుగా నిఘంటువులకుఁ బరిశిష్టములు వెలయింపఁదగును.

# కవితారీతులు

అన్నమాచార్యుఁడు, నరసన్న(కవికర్ణరసాయనకర్త?), పెద తిరుమలయ్య, చిన్నన్న -- శబ్దార్థశుద్ధి గలిగిన వరకవులు. అన్నమయ మఱీ సరిగాఁ బోతనవలె సహజకవితావిశారదుఁడే. స్వామిపలికింపగాఁ దాను పలికితినని చెప్పుకొన్నాఁడు. ఆతఁ డాడినది యమృతకావ్యము, పాడినది పరమ సంకీర్తనము నయినది. అన్నమయ తెలుఁగు నొడికారమునఁ గడుదిట్ట. సంస్కృతమునఁగూడ సత్కవితారచన నేర్చినవాఁడు. పెదతిరుమలాచార్యా-దులు సంస్కృతాంధ్రాదిభాషలలో నన్నమయవలె విద్వాంసులు. పెదతిరు-మలాదుల రచనలలో పాండిత్యప్రకర్షము పదబంధపుజిగిబిగి యధికముగా నుండును. అన్నమాచార్యసంకీర్తనములును శృంగారమంజరియు తేట తేటగా తేలిక తేలికగా తియతియ్యగా హాయిహాయిగా గోస్తనీద్రాక్షాగుళుచ్ఛములవలె నాస్వాద్యములయినవి. వాని యర్థవిశేషములు శ్రోతల హృదయములలో సులువుగాఁ జొరఁబాఱి వానిని చూఱగొని కొనిపోయి యేడుకొండల నెక్కించి భగవంతుని పాదారవిందముల పజ్జ నడంకువతో నత్తియుండునట్లు చేయఁ గలవి! అన్నమాచార్యుఁడు తిరుపతికొండమీఁద జగదేకనాథుఁడు ప్రత్యక్షమై వెలసియున్నాఁడని, ఓహో ప్రజలారా! నామాట వినుదు; దర్శించి కృతార్థులు కండు; రండు! రండని - రెండుచేతు లెత్తి యాహ్వానించిన తీ రాలకింపఁదగినది.

రామక్రియ

చాటెద నిదియే సత్యము సుండో
  చేటులే దీతని సేవించినను ॥పల్లవి॥

హరినొల్లనివా రసురలు సుండో
  సుర లీతని దాసులు సుండో
  పరమాత్ముఁ డితఁడె ప్రాణము సుండో
  మఱుగక మఱచిన మఱి లేదిఁకను ॥చాటెద॥

వేదరక్షకుఁడు విష్ణుఁడు సుండో
  సోదించె శుకుఁ డచ్చుగ సుండో

ఆదిబ్రహ్మ గన్నాతఁడు సుండో
యే దెస వెదకిన నితఁడే ఘనుఁడు ||వాడెద||

యిహపర మొసఁగను యీతఁడె సుండో
వహి నుతించెఁ బార్వతి సుండో
రహస్య మిదివో రహి శ్రీవేంకట-
మహీధరంబున మనికై నిలిచె ||వాడెద||

అన్న. అధ్యా. 138 రేకు.
సంకీ. 164 - సంపు. 2 (1981).

వైష్ణవు లనఁగా నిట్టివారట:-

ఆహిరి

మదమత్సరము లేక మనసు పేదైపోవ
వదలిన యాసలవాఁడువో వైష్ణవుఁడు ||పల్లవి||

ఇట్టునట్టుఁ దిరుగాడి యేమైనాఁ జెడనాడి
పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కు లాడి
ఎట్టివారినైనా దూటి యెవ్వరినైనాఁ జేరి
వట్టియాసఁ బడనివాడువో వైష్ణవుఁడు ||మద||

గడనకొఱకుం జిక్కి కాముకవిద్యలఁ జొక్కి
విడివి నేమైనాఁ గని నిక్కి నిక్కి
ఒడలిగుణముతోడ వుదుటువిద్యలఁ జాల
వడదాఁకి బడలనివాఁడువో వైష్ణవుఁడు ||మద||

ఆవల వారులఁ జెడనాడఁగ విని విని
చేవమీఱి యెవ్వరినిఁ జెడనాడక
కోవిదు శ్రీవేంకటేశుఁ గొలిచి పెద్దల కృప
వావివర్తన గలవాఁడువో వైష్ణవుఁడు ||మద||

అన్న. అధ్యా. 9 రేకు.
సంకీ. 59 - సంపు. 1 (1980).

ధన్నాసి

వైష్ణవులు గానివార రెవ్వరు లేరు
విష్ణుప్రభావ మీ విశ్వమంతయుఁ గాన ॥పల్లవి॥

అంతయు విష్ణుమయం బట మఱి దేవ-
తాంతరములు గలవననేలా
భ్రాంతిఁ బొంది యాభావము భావించి-
నంతనే పుణ్యులవుట దప్పదుగాన ॥వైష్ణ॥

ఎవ్వరిఁ గొలిచిన నేమిగొఱఁత మరి
యెవ్వరిఁ దలఁచిన నేమి
అవ్వలివ్వల శ్రీహరిరూపుగానివా-
రెవ్వరు లేరవి యెఱుక దోఁచినఁ జాలు ॥వైష్ణ॥

అతిచంచలంబైన యాతుమ గలిగించు-
కతమున బహువిత్తగతులై
యితరులఁ గొలిచిన యెడయక యనాథ -
పతి తిరువేంకటపతి చేకొనుఁ గాక ॥వైష్ణ॥

అన్న. అధ్యా. 6 ఆకు.
సంకీ. 36 - సంపు. 1 (1980).

భూపాళం

ఏకులజుఁ డేమి యెవ్వఁడైన నేమి
ఆకడ నాతఁడే హరి నెఱిఁగినవాఁడు ॥పల్లవి॥

పరగిన సత్యసంపన్నుఁ డైనవాఁడే
పరనిందసేయఁ దత్పరుఁడుగానివాఁడు
అరుదైన భూతదయానిధి యగువాఁడే
పరులఁ దానేయని భావించువాఁడు ॥ఏకుల॥

నిర్మలుఁడై యాత్మనియతిఁ గలుగువాఁడే
ధర్మతత్పరబుద్ధిఁ దగిలినవాఁడు

కర్మమార్గములు గడవనివాఁడే
మర్మమై హరిభక్తి మఱవనివాఁడు ॥ఏకుల॥

జగతిపై హితముగాఁ జరియించువాఁడే
పగలేక మతిలోన బ్రతికినవాఁడు
తెగి సకలము నాత్మఁ దెలిసినవాఁడే
తగిలి వేంకటేశు దాసుఁడయినవాఁడు ॥ఏకుల॥

అన్న. అధ్యా. 47 రేకు.
సంకీ. 292 - సంపు. 1 (1980).

లలిత

విజాతు లన్నియు వృథా వృథా
అజామిళాదుల కది యే జాతి ॥పల్లవి॥

జాతిభేదములు శరీరగుణములు
జాతి శరీరము సరిఁ దోడనె చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
యీతల హరివిజ్ఞానపుదాస్యం బిది యొక్కటె పో సుజాతి॥విజా॥

హరి యిందరిలో నంతరాత్ముఁ డిదె
ధరణి జాతిభేదము లెంచిన
పరమయోగు లీ భావ మష్టమదము భవవికారమని మానిరి
ధరణిలోనఁ బరతత్త్వజ్ఞానము ధర్మమూలమే సుజాతి ॥విజా॥

లౌకిక వైదిక లంపటులకు నివి
కైకొను నవశ్య కర్తవ్యంబులు
శ్రీకాంతుఁడు శ్రీవేంకటపతి పేసిన సంపాదన మిందరికి
మేకొని యిన్నియు మీఱినవారికి మీ నామమే సుజాతి ॥విజా॥

అన్న. అధ్యా. 177 రేకు.
సంకీ. 383 - సంపు. 2 (1981).

నాదరామక్రియ

ప్రపన్నులకు నిది పరమాచారము
విపరీతాచారము విడువఁగ వలయు ॥పల్లవి॥

భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరు శరణము నమ్మి యాచార్యుని
బగి వాయనిదే పరమవైష్ణవము ||ప్రప||

దురహంకారము దుఃఖము సుఖమునుఁ
బొరయక ప్రాకృతుల పొంతఁ బోవక
దరిశనాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము ||ప్రప||

ఉపాయాంతరము లొల్లక భక్తిచేపట్టి
యెపుడూఁ దీర్థప్రసాదేచ్ఛతోడ
నిపుణత శ్రీవేంకట నిలయుఁడె గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము ||ప్రప||

అన్న. అధ్యా. 166 రేకు.
సంకీ. 317 - సంపు. 2 (1981).

లక్ష్మీవిలాసము:-

గుండక్రియ

రూకలై మాడలై రువ్వలై తిరిగీని
దాకొని వున్నచోటఁ దా నుండ దదివో ||పల్లవి||

ఒకరి రాజుఁ జేసు నొకరి బంటుగఁ జేసు
నొకరి కన్నెకల వేలొకరికి నమ్మించు
నొక చోటనున్న ధాన్య మొకచోట వేయించు
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము ||రూక||

కొందరి జాళెలు నిండు కొందరికి సొమ్ములవు
కొందరి పుణ్యులఁ జేసుఁ గొందరి పాపులఁ జేసు
కొందరి కొందరిలోనఁ గొట్లాట వెట్టించు
పందెమాడినటువలెఁ బచరించు పసిఁడీ ||రూక||

నిగనిగమనుచుండు నిక్షేపమై యుండు
తగిలి శ్రీవేంకటేశు తరుణియై తానుండు
తెగని మాయైయుండు దిక్కు దెసయై యుండు
నగుతా మా పాల నుండి నటియించుఁ బసిఁడీ ॥రూక॥

అన్న. అధ్యా. 92 రేకు.
సంకీ. 458 - సంపు. 1 (1980).

తత్త్వవిచారణ:-

భూపాళం

చెప్పవే నన్ను మన్నించి శ్రీపతి నాకు
ఎప్పుడును జింతించే నిదే పనై నేను ॥పల్లవి॥

పొంలసి నీరూప మెట్టు పొడచూపేవో
ఎలమి నా భాగ్య మిఁక నెట్టున్నదో
అలరి నా కే బుద్ధి ఆనతిచ్చేవో
కలిగిన నీమాయ యేగతిఁ గడచేనో ॥చెప్పవే॥

వరుస నా కెట్లాఁ గైవసమయ్యేవో
యిరవై నా జన్మఫల మెట్లున్నదో
పరగ నా మతి నెట్టు పాయకుండేవో
కరుణానిధివి ని న్నే కరణి మెప్పించేనో ॥చెప్పవే॥

పనివడి యెట్లా నీ భక్తి యిచ్చేవో నా-
మనసుచంచల మెట్టు మట్టుపడీనో
యెనలేని నా తలఁపు యెటిఁగి శ్రీవేంకటేశ
నను నేలితివి యెట్లా నా కోరిక చెల్లీనో ॥చెప్పవే॥

అన్న. అధ్యా. 167 రేకు.
సంకీ. 327 - సంపు. 2 (1981).

బౌళి

పట్టినచోనే వెదకి భావించవలెఁ గాని
గట్టిగా నంతర్యామి కరుణించును ॥పల్లవి॥

ఇంటిలోని చీఁకటే యిట్టే తప్పక చూచితే
వెంటనే కొంతవడికి వెలుఁగిచ్చును
ఒంటి కానరాని తన యాతుమ తప్పకచూచు-
కొంటేఁ దన యాతుమయు గొబ్బునఁ గాన్పించును ॥పట్టి॥

మించి కఠినపురాతిమీఁదఁ గడవ వెట్టితే
అంచెలఁ దానే కుదురైనయట్టు
పొంచి హరినామమే యే పొద్దు నాలికతుదను
ఎంచి తలఁచఁదలఁచ నిరవౌ సుజ్ఞానము ॥పట్టి॥

ఒక్కొక్క యడుగడుగే వొగి ముందరఁ బెట్టితే
యెక్కువై కొండైనా నెక్కఁ గొనకు
యిక్కువ శ్రీవేంకటేశు నిటు దినదినమును
పక్కనఁ గొలిచితే బ్రహ్మపట్ట మెక్కను ॥పట్టి॥

అన్న. అధ్యా. 87 రేకు.
సంకీ. 426 - సంపు. 1 (1980).

లలిత

ఆడుతాఁ బాడుతా నీతో నట్టె ముద్దు గునుసుతా
వోడక నీ దండ చేరి వున్నారమయ్యా ॥పల్లవి॥

ఆసఁ దల్లిదండ్రిమోము లట్టె చూచి శిశువులు
యే సుఖదుఃఖములుఁ దా మెరఁగనట్టు
వాసుల శ్రీపతి మిమ్ము వడి నాత్మఁ దలఁచుక
యీసులఁ బుణ్యపాపము లెఱఁగమయ్యా ॥ఆడుతా॥

యేలినవారు వెట్టఁగా నేపునఁ దొత్తులు బంట్లు
ఆలకించి పరులఁ బోయడుగనట్టు
తాలిమి శ్రీపతి మీరు తగ మమ్ము రక్షించఁగా
యేలని యేమియుఁ గోర నెరఁగమయ్యా ॥ఆడుతా॥

చేతఁ జిక్కి నిధానము చేరి యింటఁ గలవాఁడు
యేతులఁ గలిమిరేము లెరఁగనట్టు
ఆతుమలో శ్రీవేంకటాధిప నీ వుండఁగాను
యీతల నే వెలుతులు నెరఁగమయ్యా ॥ఆదుతా॥

అన్న. అధ్యా. 268 రేకు.
సంకీ. 390 - సంపు. 3 (1986).

భైరవి

కరుణానిధి నీవే కనుఁగొంచు న్నాఁడవు
యిరవై నాలో నున్నాఁడ వేది గతి యిఁకను ॥పల్లవి॥

పేరుచున్నవి నాలోనఁ బెక్కువికారములు
వూరుచున్న వెన్నైనా వూహలెల్లాను
చేరుచున్న వాక్కొక్కటే సేనా సేన కోరికలు
యీరీతి నున్నాఁడ నాకు నేది గతి యిఁకను ॥కరు॥

పట్టుచున్నవి నానాప్రకృతుల వోజలు
పుట్టుచున్నవి యనేక భోగేచ్ఛలు
చుట్టుకొనుచున్నవి సులభపువేడుకలు
యిట్టివి నా నడతలు యేది గతి యిఁకను ॥కరు॥

పందడింపుచున్నవి సారెకు నా మమతలు
ముందువెనకై వున్నవి మోహాలెల్లా
చెందె నీపై భక్తి నేఁడు శ్రీవేంకటేశ్వర
యెందునూ నీవే కాక యేది గతి యిఁకను ॥కరు॥

అన్న. అధ్యా. 238 రేకు.
సంకీ. 221 - సంపు. 3 (1986).

లలిత

నమో నారాయణ నా విన్నప మిదివో
సమానుఁడఁ గాను నీకు సర్వేశ రక్షించవే ॥పల్లవి॥

మనసు నీ యాధీనము మాటలు నీ వాడేటివే
తనువు నీ పుట్టించిన ధన మిది
మును నీ పంపున నిన్ని మోచుకున్నవాఁడ నింతే
వెనక నన్ను నేరాలు వేయక రక్షించవే ॥నమో॥

భోగములెల్లా నీవి బుద్ధులు నీవిచ్చినవి
యీగతి నా బతుకు నీవి(కి?)రవైనది
చేగదేర నీవు నన్నుఁ జేసిన మానిసి నింతే
సోఁగల నా యజ్ఞానము చూడక రక్షించవే ॥నమో॥

వెలి నీవే లో నీవే వేడుకలెల్లా నీవే
కలకాలమును నీ కరుణే నాకు
యిల శ్రీవేంకటేశ నీ వేలుకొన్నబంట నింతే
నెలవు దప్పించక నీవే రక్షించవే ॥నమో॥

అన్న. అధ్యా.235 రేకు.
సంకీ. 119 - సంపు. 3 (1986).

పెండ్లి తిరునాళ్లు:--

సామంతం

పసిఁడియక్షంత లివె పట్టరో వేగమే రారో
దెసలఁ బేరంటాండ్లు దేవుని పెండ్లికిని ॥పల్లవి॥

శ్రీవేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి
దైవికపుఁ బెండ్లిముహూర్తము నేఁడు
కావించి భేరులు మ్రోసె గరుడధ్వజంబెక్కె
దేవతలు రారో దేవునిపెండ్లికిని ॥పసిఁడి॥

కందర్పజనకునికిఁ గమలాదేవికిఁ బెండ్లి
పందిలిలోపలఁ దలఁబాలు నేఁడు
గందమూ విడె మిచ్చేరు కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో హరిపెండ్లికిని ॥పసిఁడి॥

అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకును
మొదలితిరుణాళ్ళకు మొక్కేము నేఁడు
యెదుట నేగేరు వీరె యిచ్చేరు వరము లివె
కదిలి రారో పరుష ఘనుల పెండ్లికిని ॥పసిఁడి॥

అన్న. అధ్యా.234 రేకు.
సంకీ. 194 - సంపు. 3 (1986).

రామక్రియ

గరుడధ్వజం బెక్కె కమలాక్షు పెండ్లికి
పరుష లదివో వచ్చెఁ బై పై సేవించను ॥పల్లవి॥

పాడిరి సోబాన నదే భారతియు గిరిజయు
ఆడిరి రంభాదులైన అప్సరలెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీరఁగ శ్రీవిభుని పెండ్లికిని ॥గరుడ॥

కురిసెఁ బువ్వులవాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభిమోఁతలెల్లను
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి
తిరమై మించిన దేవదేవుని పెండ్లికిని ॥గరుడ॥

వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల
పోసి రదే తలఁబాలు పుణ్యసతులు
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
సేసలు వెట్టినయట్టి సింగారపు పెండ్లికి ॥గరుడ॥

అన్న. అధ్యా. 204 రేకు.
సంకీ. 21 - సంపు. 3 (1986).

వేంకటేశ్వరస్వామి పెండ్లి తిరునాళ్ళు మన యన్నమాచార్యుఁడే తొలుత వెలయించినవాడుఁగాఁ దోచుచున్నాఁడు. ఆగమ శాస్త్రమున

వివాహోత్సవము చేయుచున్న మాన్యుఁడే *కన్యాదాతగా వర్తిల్లనగునని కలదట. కనుకనే శ్రీపాదరేణు మాహాత్మ్యమున నిట్లున్నది--

శ్రీలలరంగ మంగమను శ్రీహరి కెన్నఁడు దారవోయుచోఁ
దాళులపాక యన్నమయ దాఁ గడిగెం బదముల్ ధరిత్రి, మా-
తాళులపాక చిన్నన పదంబులు పాడిన నాడె సర్వరాట్ -
శైలవిభుండు తత్పదరజంబును మాకు నొసంగఁజెల్లదే.

శకుంతలా పరిణయ కృత్యవతరణిక నిట్లున్నది--

"అదియునుంగాక నమ్మహాదేవుండు మదీయ మాతామహవంశశిఖా రత్నంబగు నన్నయార్యునకు జామాతరుం డనిపించుకొని, భవదీయ సంకీర్తనంబు లాలింపనని కర్ణంబుల నితరసంకీర్తనంబు లాలింనని ప్రతిజ్ఞా పించె" నట.

దేవాలయములో సంవత్సరోత్సవములను తెలుఁగుదేశమున కళ్యాణో-త్సవములనీ, ద్రవిడదేశమున బ్రహ్మోత్సవములనీ నేఁడు పేర్కొనుట కందుు. ఆలయములలో స్వామిప్రతిష్ఠ జరిగిననాళ్ళే యీ యుత్సవముల నాళ్ళట. శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మప్రతిష్ఠితుఁడు గనుక ఆ ప్రతిష్ఠ జరిగించిన బ్రహ్మ పేర తిరుపతివర్షోత్సవములు బ్రహ్మోత్సవములయ్యెననీ, దాని ననుసరించి దక్షిణ దేశపు దేవోత్సవముల కెల్ల బ్రహ్మోత్సవములని పేరు సంక్రమించెననీ, ఆ యుత్సవములలో కళ్యాణము జరుపుట తెల్గుదేశమున గ్రొత్తగాఁ గలిగిన యాచారమనీ శ్రీపరవస్తు రామానుజస్వామి ఎం.ఏ., గారు చెప్పచున్నారు.

బ్రహ్మోత్సవము:--

ఆహిరి

నానాదిక్కుల నరులెల్లా
  వానలలోననె వత్తురు గదలి ॥పల్లవి॥

---

* తాళ్ళపాకవారిది భారద్వాజ గోత్రము. స్వామిదీ భారద్వాజగోత్రమేనట. పరి యీ మామ-అల్లునితనము గోత్రములతో గాక అగమశాస్త్ర సంపన్నమైనది గాబోలు.

సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు
హితులు గొలువఁగా నిందరును
శతసహస్ర యోజనవాసులు సు-
వ్రతములతోడనె వత్తురు గదలి ॥నానా॥

ముదుపులు జాళెలు మొగిఁ దలమూఁటలు
కడలేని ధనముఁ గాంతలును
కడుమంచి మణులు కరులుఁ దురగములు
వడిగొని చెలఁగుచు వత్తురు గదలి ॥నానా॥

మగుటవర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులుఁ జతురులును
తగు వేంకటపతి దరుశింపఁగ బహు-
వగల సంపదల వత్తురు గదలి ॥నానా॥

అన్న. అధ్యా. 67 తేకు.
సంకీ. 346 -- సంపు. 1 (1980).

అంపకాలు:--

ముఖారి

భోగీంద్రులును మీరుఁ బోయి రండు
వేగన మీఁదటి విభవాలకు ॥పల్లవి॥

హరుఁడ పోయిరా అజుఁడ నీవునుఁ బోయి
తిరిగిరా మీఁదటి తిరుణాళ్ళకు
సురలు మునులు భూసురులుఁ బోయిరండు
అరవిరి విన్నాళ్ళు నలపితిరి ॥భోగీం॥

జముఁడ పోయిరా శశియు నీవును బోయి
సుముఖుఁడవై రా సురలఁ గూడి
గుములై దిక్పతులు దిక్కులకుఁ బోయిరండు
ప్రమదాన విన్నాళ్ళు బడలితిరి ॥భోగీం॥

నారద సనక సనందనాదులు
భూరి విభవములఁ బోయిరందు
దూరముగాఁ బోకిట్టె తొరలి వేంకటగిరిఁ
జేరి నన్నిట్లనే సేవించుఁడీ ॥భోగిం॥

అన్న. అధ్యా. 70 రేకు.
సంకీ. 368 -- సంపు. 1 (1980).

ఇంతవఱకు అధ్యాత్మసంకీర్తనలే ఉదాహరించినవి. శృంగార సంకీర్తనలు గూడ రెండు:-

కేదారగౌళ. అటతాళం

నీవు గాఁగా నేను గాఁగా
నేఁటి కాయఁ బోయను
మీ వంటి మలుకనివారము మేమైతే
మేటైనంతలేసిపనులు నేఁడౌను ॥పల్లవి॥

మంచిగందము నెఱపూఁత పూసుకొని
మావాడ కాతఁడు రాఁగాపోఁగాఁ జూచి
పొంచులు మా యింటి పంచ నుందువట
బోగాలవారమటే
ఎంచనేటికి తప్పు నీ మగఁడైతే
యిలు వెళ్ళకుండ నరికట్టుకొని వల-
పించవలెఁగాక వూరివారిమీఁద
పొంచు లుండవచ్చునా వో చెలియ ॥నీవు॥

ఎమ్మెకాఁ డాతఁడు మా వీథి నిలుచుండి
యెవ్వరితోనో మాటలాడఁగా విని
కొమ్మరో చూపెట్టుకొని వుందువట
గుట్టు విడిచివున్నామా
అమ్మరో ఆతఁడు నీ మగఁడైతే
ఆన లిడుకొని వుండవలెఁగాక

దిమ్మరికత్తెవై మా యింటిచుట్టూ
  తిరుగులాడ నాయమా ॥నీవు॥

నాయముగా అలమేల్మంగ వేంకటనాథుఁడు
  ననుఁగూడి నవ్వినంతలోనే
వోయమ్మ నేఁజెల్ల వూర నాఁట వాట
  వున్న పనులవారమా

పాయక ఆతఁడు నీ పతియైతే పక్క
  పవ్వళించి వుండవరెఁ గాక
కాయని కాపులు పూయని పూతలు గట్టి-
  కాపురాలు గుత్తగొందురటె ॥నీవు॥

శేషా. వ్రాఁతప్రతి.

(రాగము పేరు లేదు)

*కటకటా అయ్యో కాంత నింత యేపుదురా
  అటమటముగాదు నీ యాన సుమ్మీ ఏమయ్య ॥పల్లవి॥

కొసరినా విన్నే కాని కోపించినా విన్నే కాని
  కసరినా విన్నే కాని కాదన్నా విన్నే కాని
  విసరినా విన్నే కాని వేసరినా విన్నే కాని
  ఇసుమంతైనా అన్యమెఱుఁగదయ్యా ॥కట॥

అలసినా విన్నే కాని అఁకొన్నా విన్నే కాని
  పిలిచినా విన్నే కాని పేరుకొన్నా విన్నే కాని
  సొలసినా విన్నే కాని సోఁకనాడినా విన్నే కాని
  కలనైనా తలఁపెందూ కలుగదు గదవయ్యా ॥కట॥

కొనియాడినా విన్నే కాని గుంపించినా విన్నే కాని
  పని(న?)వినా విన్నే కాని పాడినా విన్నే కాని
  మనసిచ్చి యలమేలుమంగపతి వేంకటేశ
  యెనసితివి మా చెలి నింక నేచ నేమిటికయ్యా ॥కట॥

---

* దీని కాకరము చూపలేదు.

## ఆళ్వార్లు -- అన్నమాచార్యుఁడు

ద్రవిడ వేదాంతరచనమునకై శఠకోపయతీంద్రు లవతరించిన విధముగా నంధ్రవేదాంతరచనమునకై యన్నమాచార్యుఁ డవతరించినాఁడు.

శఠకోపయతి వైశాఖమాసమున విశాఖానక్షత్రమున నవతరింపగా, నన్నమాచార్యుదును వైశాఖమాసమున విశాఖానక్షత్రమున నవతరించినాఁడు. శఠకోపయతి పదునాఱేండ్ల వయసువాఁడయిన తర్వాత సర్వవిద్యలు గోచరించి ద్రవిడసంకీర్తనములు రచింప దైవానుగ్రహమందఁగా, నన్నమాచార్యుడును నట్లే పదునాఱవయేఁట స్వామి ప్రత్యక్షమై యుద్బోధింపఁగా సంకీర్తన రచనము సాగించెను. శఠకోపయతి శ్రీతిరువేంగడనాథుని మీఁదను నింక ననేక దివ్యస్థలములలోని విష్ణుమూర్తులమీఁదను సంకీర్తనములు రచింపఁగా నన్నమాచార్యుఁడును ప్రధానముగా శ్రీవేంకటనాథుని మీఁదను నింక ననేక పుణ్యస్థలముల విష్ణుమూర్తుల మీఁదను సంకీర్తనలు రచించెను. శఠకోపయతి స్వామి కౌస్తుభాంశమున జన్మించినట్లు విజ్ఞులు విశ్వసింపఁగా, నన్నమాచార్యుఁడు స్వామి నందకాంశమున నవతరించినట్లు ప్రాజ్ఞులు పరిగణించిరి.

పెరియాళ్వార్లు (విష్ణుచిత్తులు) తులసీవనమున జనించిన గోదాదేవిని రంగనాథస్వామి కొసఁగి పెండ్లిచేసి మామగా రయినట్లే, యన్నమాచార్యులు గూడఁ బద్మసరోవరమున జన్మించిన మంగాంబికను వేంకటేశ్వరస్వామికిచ్చి పెండ్లి చేసి మామగా రయ్యెను.

ఇట్టి మహత్త్వముగలవాఁడు గనుకనే తిరుపతి వేంకటేశ్వరస్వామిసన్నిధి నీతనికి, నీతనివంశమునకుఁగూడ నానాఁ డఖండగౌరవ మలవడినది.

## ఆంధ్ర సంకీర్తనములు -- ద్రవిడ పాశురములు

ఆళ్వార్లు రచింపఁగా నరవమున ద్రావిడవేదమనీ, పంచమాగమమనీ పేర్కొనఁబడు దివ్యప్రబంధము నాల్గువేల సంకీర్తనములు పాట్టులు (సీస పద్యాదులవంటివి) కలది కాఁగా, అన్నమాచార్యుఁ డొక్కఁడే రచించిన

యంధ్ర వేదము ముప్పది రెండు వేల పాటలు గలది. ఈ సంకీర్తనలు దివ్య ప్రబంధముల ననువర్తించియే పరమాత్మునకు భక్తజీవులకు పతి పత్నీ భావము నాయికా నాయక భావము కల్పించి యుజ్జ్వలరసానుభూతి నొదవించుచు, ననేక దేవాలయములలోని యర్చామూర్తుల నభివర్ణించుచు, శరణాగతిమహత్త్వమును బ్రతిపాదించుచు నింక ననేక విధముల లోకనీతి ధర్మోద్బోధ భూతదయాది విశేషాంశముల వెలయించుచు, నెంతో వింతగా వేడుకగా సంగీతసారస్యముతో సవరనిభాషతో వేదవేదాంతేతిహాసాదిసూక్తి తదర్థప్రతిపాదనములతో వెల్విరిసి, పెరియవాచ్చాంబిళ్లై వంటి మహావ్యాఖ్యాత వెలసెనేని యఖండానందతాండవముగాఁ బెదపెద్ద వ్యాఖ్యా చమత్కారములు ప్రవ్వితీయఁదగినట్లు విజ్ఞాననిధులై విరాజిల్లుచున్నవి.

తిరువాయ్‌మొళి మొదలగు దివ్యప్రబంధరచనల కివి తీసిపోవు. దేశ ప్రజాదౌర్భాగ్యముచే నివి వెలసిన నాఁటనుండి నేఁటిదాఁక రహస్యరక్షలో నున్నవే కాని రాణకెక్కవయ్యెను. అన్నమాచార్యులయుఁ దత్పుత్ర పౌత్రులయుఁ బ్రాభవము చెల్లునప్పుదు, వారే స్వామికి వైభవములు కల్పించునప్పు డుత్సవములందేకాక యనుదినమును నీ సంకీర్తనములు స్వామిసన్నిధిని విన్నవించుట జరగినది. తమ తర్వాత నట్లు జరగుటకుఁ గూడ వారు వసతులు గల్పించిరి. తర్వాతఁగొన్నాళ్ళట్లు తనరెనేమో! ఇందుకుఁ దార్కాణగా భజనగోష్ఠులవారు తొలుదొలుత తాళ్ళపాకవారి సంకీర్తనములనే యాలాపింతురు. కాని యిటీవల వీని యెఱుక మఱుగుపడిపోయినది. వీని జన్మస్థానమగు తిరుపతిలోనే వీనిప్రాభవము వెలయ లే దనఁగా నిఁక నితరస్థలముల మాట చెప్పనేల?

ఈ సంకీర్తనములు తెల్గునాఁటి విష్ణ్వాలయములలో దివ్యప్రబంధములుగా నిత్యసంకీర్తనార్హములుగా నెగడఁదగినవి. ఆ యా దేవాలయముల యధికారులును ప్రభుత్వమువారును వీని కర్హమయిన యాదరము కల్గింతురుగాక! త్యాగరాజకీర్తనలవలె నివి సంగీతపుఁజమత్కారములు రాగస్వర విహారములు పుక్కిలించునవిగా నున్నవో లేవో నిరూపించు యోగ్యత నాకు లేదు. గానవిశారదులే దానిఁ గనుఁగొనఁదగినవారు.

ఈ సంకీర్తనఫలములు గాయకుల గానామృతమునఁ దోగి మాగి యాస్వాద్యము లయినప్పుడే వాని తీయన తెలియనగును.

## శ్రీవేంకటేశ్వర వైభవము

ఉపనిషన్మంత్రములవలె శ్రీ వేంకటేశ్వరమూర్తి తొలుత నా యా మతముల వారికిఁ గొంతకొంత యానుకూల్యము గొల్పు నవయవాలంకారాదికముతో వెలసి, తన నిజాంతరంగమును నీరుకొలఁది తామర యన్నట్టుపాసకు లగువారి యోగ్యత కొలఁదిగా గోచరింపించుచు మహిమాభిరామమై రహికెక్కినది. పలుమతములవారు పలుదెఱఁగుల వేంకటేశ్వరుని భావించుచుండుట నన్నమాచార్యుఁడును వివరించినాఁడు.

(మూ. పీఠిక - 24 పుట.)

శివుఁడని, శక్తియని, భైరవుఁడని, జినుఁడని, స్కందుఁడని తమ తమ నిర్ణయముల కనుకూలము లయిన రూప రేఖలను బ్రమాణములను జూపుకొనుచు పలుమతములవారు పలుకుబడి చెల్లించుకొనుచు వైవిధ్యముతో నర్చించుచు వచ్చిన శ్రీవేంకటేశమూర్తిని ఆళ్వారాచార్యుల యభివర్ణనానుగుణముగా విష్ణుమూర్తినిగా శ్రీరామానుజాచార్యులవారు క్రీ.శ. పదకొండవ శతాబ్దిలో విఖ్యాతపఱిచిరి. సింహాచలము, శ్రీకూర్మము మొదలగు స్థలములఁ గూడ నిట్టి నిర్ధారణములే వారు చేసిరట!

పర్వతారణ్య మధ్యస్థమై, దుర్గమమై, పలుమతముల పలుకుబడికి చెల్లుబడికి లోఁబడుచు, పూజాపురస్కారములు సరిగా సాగక, ఎవరో ప్రగాఢ భక్తిపరులగు నిశితవ్రతులే నిలువఁదగినట్లున్న స్వామిసన్నిధిని శ్రీవైష్ణవుల స్థానపతిత్వమును స్థాపించి, శ్రీరామానుజులు తమకు రామాయణోపదేశము చేసిన గురువులు తిరుమలనంబిగారిని, శిష్యులు అనందాళ్వార్లను, ఇద్దఱు జియ్యంగార్లను ఇర్వదినల్గుర నేకాంగులను సదా స్వామిని గాచియుండునట్లుచేసిరి.

వైఖానసాగమ విధానమునకు తిరుపతి ప్రధానక్షేత్రము. ఇది మధ్యరంగముగా నాంధ్ర ద్రవిడ కర్ణాట దేశములందు విష్ణ్వాలయములలో వైఖాన-

సాగమ ప్రకారమునఁ బూజోత్సవాదికము లెప్పటినుండియో సాగుచున్నవి. స్వామి కీ యుభయులు నుభయరక్షులు.

పదునాల్గవశతాబ్దిలో దేశికులవారును వారిశిష్యులును, మనవాళ మహాములు వారిశిష్యులును స్వామివైభవములకు విఖ్యాతి గూర్చిరి. పదునైదవశతాబ్దిలో అహోబలమఠ ప్రతిష్ఠాపకులు శఠకోపయతులును, వారి శిష్యుఁ డన్నమాచార్యుఁడును స్వామివైభవములకుఁ బ్రఖ్యాతిగొల్పిరి. అన్నమాచార్యుఁడొక సంకీర్తనమున:-

" నేనొక్కఁడ లేకుండితే నీ కృపకుఁ బాత్ర మేది
పూని నావల్లనే కీర్తిఁ బొందేవు నీవు."

అనెను. అతఁడు స్వామిసన్నిధి నివసించి సంకీర్తనములు సాయించుట-చేతను, బై యెల్లరు రాజుల నావర్జించుకొని వారి కృతములుగాను, స్వకృత ముగాను ఆలయ, గోపు, రారామ, మార్గసోపానాదినిర్మాణములను, ఉత్సవ విశేషములను బెంపొందించుటచేతను, వైష్ణవమతపు శరణాగతి మాధుర్యము చేతను, 'కలౌ వేంకటనాయక' యన్న సూక్తికిఁ దార్కాణగా లోకరక్షకమై యాపన్నివారకమై ప్రజ్వరిల్లుచుండు స్వామి మాహాత్మ్యవిశేషముచేతను, పదునైదవశతాబ్దిలో తిరుపతిక్షేత్రము భక్తపరిషత్తుల రాక పోక లధికముగా గలదై జనరంజకమై వర్ధిల్లినది. పదునాఱవ శతాబ్దిలో విజయనగరచక్రవర్తి శ్రీకృష్ణరాయఁడు, నంతకుఁ బూర్వుఁడు సాళ్వ నరసింగరాయఁడును దమ విజయము లెల్ల శ్రీవేంకటేశ్వరానుగ్రహమున వెలసినవే యన్న విశ్వాసము గలవారయి దిగ్విజయయాత్రలలో శ్రీవైష్ణవాచార్యులను, కవీశ్వరులను, శ్రీవేంకటేశ్వర విగ్రహమును దోడఁ గొంపోవుచు, శ్రీ వేంకటేశ్వరభక్తిని దేశమెల్ల వెల్లివిరియించిరి. దిగ్విజయ యాత్రారంభములందు విజయ నిర్వా-హాంతములందు వారు శ్రీతిరుపతి వేంకటేశ్వరస్వామిదర్శనము చేసికొని కానుక లర్పించుకొనుచు నుండెడివారు. శ్రీకృష్ణరాయఁడు క్రీ.శ. 1512 నుండి 1523 దాఁక నేడు తూర్లు తిరుపతికి విచ్చేసెను.

తొలితూరి:- ఇర్వురు భార్యలతో వచ్చి స్వామికి నవరత్నఖచిత కిరీట మును, కర్పూరహారతికి ఇర్వైయైదు వెండిపళ్ళెములను, భార్యలచే స్వామి పాలారగింప బంగారుగిన్నెను,

రెండవతూరి:- శ్రీభూదేవుల కనేకాభరణములను,

మూడవతూరి:- 5 గ్రామములను,

నాల్గవతూరి:- ముప్పదివేల వరహాలతో స్వామికి కనకాభిషేకమును, కొన్ని యాభరణములను, తాళ్ళపాకగ్రామమును, (చిన్నాదేవిచే) కంఠమాల పదకము, ఒకగ్రామమును, (తానే) నవరత్నప్రభావలియను మకరతోరణమును,

అయిదవతూరి:- కంఠమాలను, పదకమును, ఆనంద విమానపు బంగారుపూతకు ముప్పదివేల వరహాలను, పులికాపు నిర్వాహమునకు వెయ్యి వరహాలను, ఉదయనైవేద్యమునకు 500 వరహాలను,

ఆఱవతూరి:- కొన్నిభూములను,

ఏడవతూరి:- నవరత్నఖచితమయిన పీతాంబరమును, నవరత్న ఖచితములయిన రెండువింజామరలను, పదకమును, పదివేల వరహాలను సమర్పించెను.

అచ్యుతరాయఁడు ప్రతివత్సరము స్వామికిఁ బ్రబంధ పుష్పాంజలు లర్పించుచుండెను. సదాశివరాయఁడును స్వామి కెన్నో సేవలు చేసెను. దాన శ్రీ వేంకటేశ్వర మాహాత్మ్యము దక్షిణభారతదేశమందెల్లఁ బ్రజ్వరిల్లినది. పదునాఱు పదునేడు శతాబ్దుల తెలుగు ప్రబంధములలో శ్రీవేంకటేశ్వర స్వామికి సమర్పితములే లెక్క కెక్కువగా నున్నవి. పుణ్యక్షేత్ర యాత్రలలో ముఖ్యములయిన యనేక విష్ణ్వాలయ శివాలయ దేవతలతో పాటుగా నంతదాఁకఁ గీర్తనీయమగుచున్న శ్రీ వేంకటేశార్చామూర్తి పదునాఱవ శతాబ్దియారంభమున నుండి సర్వ భారతదేశమునకు ముఖ్యార్చామూర్తి కాఁజొచ్చినది. బ్రాహ్మణులు మొదలుగాఁ బంచముల దాఁక నన్నిజాతుల వారును తమ యిండ్లలో శుభకార్యములు జరుగునప్పుడు మునుముందుగా వేంకటేశ్వర దీపారాధన, సమారాధన జరుపుట, ఇంట నెవరికిఁగాని యనారోగ్యము కలిగినప్పు డాపదమ్రొక్కులవాఁడని స్వామికి ముడుపు గట్టి కొండకు వచ్చి వడ్డితో ముడుపు చెల్లించుకొనుట సంప్రదాయమయినది. తలనీలా

లిచ్చువారు, నిలువుదోపిళ్లిచ్చువారు, అనర్ఘ రత్నాభరణము లిచ్చువారు, బ్రహ్మోత్సవ కళ్యాణోత్సవాదులు జరిపించువారునై ప్రజలు, ప్రభువులు, మహారాజులు తండోపతండములుగా తిరుపతికి రాకపోకలు జరపసాగిరి. భారత దేశమున నెక్కడ గాని ప్రజలు తమకుఁ జేర్వైయున్న దేవాలయా ర్చామూర్తుల పేళ్ళుఁ బెట్టుకొనుట కలదు. కాళహస్తీశ్వరుఁడు, వరద రాజు, మల్లికార్జునుఁడు, పానకాల రాయఁడు ఇత్యాదినామములు దాల్చిన వా రాయా పుణ్య క్షేత్రములచేరిక గ్రామములవారని తెలివిడి కలుగును. కాని వేంకటేశ్వర వేంకటాచలపతీత్యాది నామములు దక్షిణాపథమందెల్ల నూరూర నింటింట సర్వసామాన్యమై వెలయసాగినవి. శ్రీతిరుపతివేంకటేశ్వరస్వామి పోలికగా ననేకప్రదేశములలో వేంకటేశ్వర దేవాలయములు వెలసినవి. దక్షిణాపథదేవాలయములలో శ్రీ తిరుపతివేంకటేశ్వరాలయమున కున్నంత యాదాయ మే దేవళమునకు నుండదు. విజయ నగర రాజ్యము తర్వాత మట్ల, మైసూరు, తంజాపుర్యాది రాజ్యములు, నేటి జమీందారీలు స్వామి కెన్నో కైంకర్యములు జరపినవి. అవి నేఁడు ప్రజాస్వామ్యముచేఁ జిదికిపోయి-నను, పోవుచున్నను గూడ శ్రీవేంకటేశ్వరవైభవము ప్రజాసామాన్యపరమై యఖండమై యలరారుచునే యున్నది.

## అన్నమాచార్యచరిత్ర పరిశోధనము

ఈశ్వరసంకల్ప మెట్టిదోకాని తాళ్ళపాకవారి యధ్యాత్మసంకీర్తనములు చదువుచుండునపుడు నా హృదయతంత్రులలో ననురణనము సాగుచు, పరమానంద పారవశ్యముకలుగుచు, కర్తవ్యమేదో వ్యక్తమగుచున్నట్లుండును. ఈ యన్నమాచార్యచరిత్రము ముద్రించుచు, నందు సాళ్వనరసింహ రాయనిదగ్గఱ నన్నమాచార్యుఁడు పాడిన శృంగారసంకీర్తన ప్రతీకము చదివి ఈ కథనిజమా? ఇట్టికీర్తనము దొరకఁగలదా? ఉన్నను నది వేలకొలఁది సంకీర్తనములలో నెక్కడనున్నదోకదా అనుకొనుచుఁ, జేతనున్న తాళ్ళపాక శేషాచార్యులుగారి వ్రాఁతప్రతిని దెఱతునుగదా సరిగా నా సంకీర్తనమే యందు నా కన్నులెదురఁ గానవచ్చెను. ఆనందమాయెను. నాతోనిందుఁ బరిశ్రమించుచున్న చిరంజీవి శ్రీనివాసాచార్యున కిది చూపి చెప్పి మఱొక

సంకీర్తనము సంకెల విడిపించుకొనుటకుఁ బాడినదాని ప్రతీకమును జదివి, యిదికూడ దొరకిన బాగుగదా యనఁగా ఇదిగో యిప్పుడే యిట్టిసంకీర్తనమును జదివితిని -- అని యాతడంతలోనే దాని నెత్తియిచ్చెను. ఇట్లు నాలుగు మూఁడు నాళ్ళలోనే మాకుఁ గావలసిన సంకీర్తనములెన్నో పుటపుట దొరకసాగినవి! అందు ముఖ్యములఁ గొన్నింటి నీ పీఠికలో వెల్లడించితిని. ఇట్లు సంకల్పసిద్ధిసంతోషములతో పీఠిక రచించుచు, దేవస్థాన శాసనములలో మంగాపురమున తాళ్ళపాక చినతిరుమలాచార్యుఁడు కట్టించిన కల్యాణవేంకటేశ్వర దేవాలయమున అన్నమాచార్యుని విగ్రహపుఁ బ్రతిష్ఠయు జరిగినట్లుండుటచే, నది కలదేమోయని బరిశీలింపఁబోఁదలచి మిత్రునితో ముచ్చటించితిని. మహమ్మదీయవిప్లవముచే పాడుపడి విగ్రహములు విరిగి సర్వధ్వంసమైయున్న యీ దేవాలయము నొక పుణ్యపురుషుఁడు (సుందరరాజరాయస్వామి) స్వప్నోద్బోధమువలన వెదకివచ్చి చేరి వాల శ్రమపడి తిరుపతికొండమీది దివ్యమంగళమూర్తివలెనే మహనీయమై దర్శనీయమై యున్న యక్కడి మూలమూర్తిని చక్కఁజూచుకొని పూజా పురస్కారములు ఉత్సవాదులు కొలఁది యేండ్లనుండి జరుపుచున్నట్లును, వారిప్పుడు తిరుపతిలోనే ఉన్నట్టును తెలియవచ్చెను. వారితో మిత్రులతో మూలమూర్తిని దర్శించి మాటమాటమీద తాళ్ళపాక వారి విషయమెత్తఁగా తాళ్ళపాక వారి దేవతార్చనవిగ్రహాదు లిక్కడికిఁ జేరినవని వారొక పెద్దకథ చెప్పి వానినెల్లఁ జూపిరి. అందు అన్నమాచార్యుని నాఁటి భజన చిఱుతలు, తులసి తావళము, స్ఫటికహారము, సాలగ్రామములు, శ్రీవేంకటేశ్వర, తద్దేవ్యాదుల దేవతార్చనవిగ్రహములు,ఆ విగ్రహముల యిత్తడి మకరతోరణము, వెండిఛత్రములు మొదలగునవి యున్నవి. వానిని శ్రీతాళ్ళపాక సూర్యనారాయణయ్యగా రొసఁగిరని, వారిప్పుడు తిరుపతిలోనే ఉన్నారని యా సత్పురుషుఁడు తెలియఁజెప్పెను. పరమానందముతో తిరుపతికిఁ దిరిగివచ్చి యా శ్రీసూర్యనారాయణయ్యగారిని గలిసికొంటిని. వారే అన్నమాచార్య చరిత్రమును శ్రీతిరుపతి వేంకటేశ్వర ప్రాచ్యవిద్యాలయమునకు ఇచ్చినవారు. కడపజిల్లా మడితాడును బీదరికముచే విడనాడి అన్నమాచార్యాదు లర్చించిన దేవతావిగ్రహములను సరిగా నర్చింప ననువుపడక తిరుపతిలో దేవుని

సన్నిధిఁ నర్పింపఁగోరి తెచ్చితిననియు, దమ పూర్వులే కట్టించిన దేవాలయము పునరుద్ధారము చెంది పూజాపురస్కారములుగలదై యున్నందుకు పరితోషించి యా విగ్రహముల నెల్ల నక్కడ నర్పించితిననియు వారుచెప్పిరి.

ఆనాఁడెప్పుడో యన్నమాచార్యుఁడు తన దేవతార్చన విగ్రహములు పోయినందుకు విలపించిన సంకీర్తనము తలఁపున గోచరించెను. (చూ. పీఠిక - 43వ పుట). నాఁడాతని కవి మరల దొరకెనేమో దొరకినప్పుడెంత సంతోషించెనో ఏమిచేసెనో తెలియదుగాని, యయిదువందల యేండ్లతర్వాత నాతని భజనవిరుతలు తావళములు దేవతార్చన విగ్రహములు వెదకఁబోయిన తీవ కాలఁదవిలినట్లు నా కన్నులెదుటఁ గానవచ్చుట, వారు వెలయించిన దేవళము పూజా పురస్కారములతో మరల వెలయుట, చూడఁగా నాకుఁ బరమాహ్లాదము గలిగినది. శ్రీయన్నమాచార్యుఁడు నిత్యసూరులతో నారదాది మహర్షులతో నాళ్వారులతోఁ గలసి శ్రీవేంకటేశ్వరస్వామి పుష్కరిణీతీరమున ఆకాశగంగాఝురులలో దరులలో సూర్యమండలములో నిత్యానంద విహారము సల్పుచుండెనని యానాఁటివా రానందించిరి. (చూ. పీఠిక - 70వ పుట.) అన్నమాచార్యుఁడు, పరమప్రాప్యము శ్రీ వేంకటేశ్వర సన్నిధానమేయని యనేక సంకీర్తనములలో గొంతెత్తి చేయెత్తి గొప్పగాఁ జెప్పకొనెను. ఆయన పరమపదమందిన ఫాల్గున బహుళద్వాదశి ప్రత్యాబ్దికశ్రాద్ధదినము గాన యాతనికుమారుఁడు పెదతిరుమలాచార్యుఁ డిట్లు తనతండ్రిగారి నాహ్వానించెను --

శ్రీరాగం

దినము ద్వాదశి నేఁడు తీర్థదివసము నీకు
జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే ||పల్లవి||

అనంత గరుడ ముఖ్యులయిన సూరిజనులతో
ఘననారదాది భాగవతులతో
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ
వెనుకొని యారగించ విచ్చేయవే ||దిన||

వైకుంఠాననుండి యాళువారల లోపలనుండి
లోకపు నిత్యముక్తులలోన నుండి
శ్రీకాంతతోడనున్న శ్రీవేంకటేశుఁ గూడి
ఈకడ నారగించ నింటికి విచ్చేయవే ||దిన||

సంకీర్తనములోడ సనకాదులెల్లఁ బాడ
పొంకపు శ్రీవేంకటాద్రి భూమినుండి
లంకె శ్రీవేంకటగిరి లక్ష్మివిభుఁడు నీవు-
నంకెల మాయింటివిందు లారగించవే ||దిన||

అన్న. అధ్యా. 136 రేకు.
సంకీ. 151 - సంపు. 2 (1981).

## స్వామి యనుగ్రహము!

మదరాసు విడిచి శ్రీ తిరుపతి వేంకటేశ్వరుల సన్నిధి సేవ కావింప వచ్చుటలో నా తొల్తటికోరిక తాళ్ళపాకవారి రచనల నన్నింటిని వెల్లడించుట. ఎంతప్రయత్నించినను నడ్డంకులచే నింకిపోవుచున్న నా సంకల్పపు టూటలు చక్కసాగుట కద నిప్పటికి సమకూడినది. ఇక్కడనున్న తాళ్ళ పాక వారి సంకీర్తనముల రాగిరేకు లన్నింటిని స్వాధీనముచేసికొంటిని. అస్మదీయుఁడు నాకుఁ జేదోడుగా ననువర్తించు పరిశోధనకార్య సహాయ విద్వాంసుఁడు చిరంజీవి ఎ.వి.శ్రీనివాసాచార్యుఁడు వేలలెక్క నున్న రాగిరేకుల భరము మోయుచు బడలుచున్నను సంకీర్తనముల స్వారస్యాస్వాదనమున శ్రమతీర్చుకొనుచు సర్వపరిశోధన సందర్భములందు జాగరూకుఁడై తోడ్పడు చున్నాఁడు. మిత్రులైన డైరెక్టరు శ్రీపరవస్తు వేంకటరామానుజస్వామి, ఎం.ఏ. గారు నా కీ కార్యనిర్వాహములో సహాయపడుచున్నారు. దేవస్థానమునఁ బై ముఖ్యాధికారు లిందుకుఁ జాల ముచ్చటపడువారుగా నున్నారు. ఇఁకఁ జక్కగాఁ దాళ్ళపాక సంకీర్తనముల ముద్రణము సాగఁగలదనుకొందును. ముద్రితములయిన సంకీర్తనములఁ గొన్నింటిని సంగీతసాహిత్యపరిపుష్టులు శ్రీఅనంతకృష్ణశర్మగారు స్వరవిన్యాసములోఁ బ్రకటించుచున్నారు. ఇట్లిన్నాళ్ళకుఁ దాళ్ళపాక మహనీయుల స్వామిసేవాఫలము పరిపక్వమై సహృదయాస్వాద్యమగుచున్నది. అన్నమాచార్యాదులారా! ఆనందింపుదు!

అయిదువందలేండ్లకుఁ బిదప మీ యభీప్సితము లన్వర్థములుగావలసిన-ట్లున్నది గాఁబోలును స్వామి యనుగ్రహము!

సీ॥ చెక్కిళ్ళఁ జిఱునవ్వు చిందుద్రాక్కెదు తేఁడ!
యేడుకొండలవాఁడ! యేలుకొమ్ము
అలమేలుమంగాంబ చెలికాఁడ! యదుగద్దు
దండాలవాఁడ! మా కండ వగుము
ఆమటమ్రొక్కుల స్వామి! గోవింద గో
వింద సందడివేల్పు! వందనమ్ము
కలియుగ ప్రత్యక్షకులదైవమా! యెల్ల
డెందాల విహరించు విందు! శరణు

గీ॥ పిండివంటకములు, కుండల వండిన-
యోరెములును, మాత్ర లారగించి
భక్తులకుఁ బ్రసాదపఱుచు మహాభోగి
వరకటాక్ష! పరమపురుష! రక్ష!

సీ॥ నిలువుదోఁపుడు దోఁచు నెఱదొంగతన మేమి?
పాపముల్ హరియించు భావ మొక్కొ!
వడ్డికాసులఁ గూర్చు వ్యాపార మది యేమి?
మేలు పెంపొందించు లీలయొక్కొ!
తలమీఁది నీలాలఁ దొలఁచిపుచ్చుట యేమి?
చిక్కులం దెగటార్చు ఛక్కియొక్కొ!
ఏడుకొండలమీఁద వీడొటయేమి? స
హస్రార వసతిరహస్య మొక్కొ!

గీ॥ ఏటివో యివి పెద్దలనాఁటి మాట-
లీశ్వరుఁడు సర్వభూత సుహృత్తు, సుహృదుఁ-
డాపదపహర్త, యనువార్త కలరి యట్టి-
వాఁడ వను కన్నెఱఁగి కొల్చినాఁడ నిన్నె!

శా॥ ఏరీ కోరి మనోజ్ఞ పుష్పములు నీ కీయెన్మిదే[1] యంచు నా-
త్మారామమ్మునఁ బూవఁజేపితి నహింసాదిప్రసూనంబు లే-
నారాధించెద వీనిచే నిను ననంతాళ్వార్ల కైంకర్యపుం-
దీరుల్ గావవి వేఱుచేసెదవె తండ్రీ! వేంకటాధీశ్వరా!

శా॥ దూరంబేల పరంబు నీ విహమునందుɛ భక్తరక్షార్థ మ-
ర్చారూపంబు ధరించి యుంటివన విచ్చల్ నిన్నె లోకన్ము చె-
న్నారం గాంచెద దేహదేవకుల మూలాధారమం దా సహ -
స్రారంబుɛ సుఖసత్య విత్కలిత దీపారాధనల్ సేయుచున్!

చ॥ కరకరపల్కులɛబిరుసు గల్గిన శర్కర నన్నుఁ బాగుగాఁ
గరఁచి పొరంటికొంటివి నిగన్నిగ మీఁగడపాల వీవు; ని-
ల్వరమున నాకు మార్దవము వచ్చెను; నీకు ఘనత్వ మబ్బె; ని-
ర్వరము రసాయనంబగుట పోలదె యుర్వికిఁ గ్రొత్తకోవగాన్.

వే. ప్రభాకరశాస్త్రి.

---

హింసా ప్రథమం పుష్పం  పుష్ప మింద్రియనిగ్రహః
ంతిః పుష్పం దయా పుష్పం జ్ఞానం పుష్ప మతఃపరమ్।
త్యం పుష్పం తపః పుష్పం భావపుష్ప మథాష్టమమ్
వమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం పరమ్॥

# అన్నమాచార్య చరిత్రము

## విషయసూచిక


| | | పుట సంఖ్య. |
|---|---|---|
| 1 | అవతరణిక | ... 3 |
| 2 | పొత్తపినాడు | ... 5 |
| 3 | తాళ్ళపాక | ... 5 |
| 4 | అన్నమాచార్య వంశ్యులు | 7 |
| 5 | నారాయణుఁడు | ... 7 |
| 6 | నారాయణసూరి | ... 10 |
| 7 | అన్నమయ జననము | ... 11 |
| 8 | అన్నమయ బాల్యము | ... 12 |
| 9 | అన్నమయ విద్యలు | ... 13 |
| 10 | అన్నమయ తిరుమలయాత్ర | ... 14 |
| 11 | అన్నమయకు దేవి ప్రత్యక్షమగుట | ... 18 |
| 12 | అన్నమయ దేవిపై శతకము చెప్పుట | ... 20 |
| 13 | అన్నమయ కొండపై దివ్యస్థలముల దర్శించుట | ... 21 |
| 14 | అన్నమయ స్వామిని దర్శించుట | ... 25 |
| 15 | అన్నమయ స్వామిపై శతకము చెప్పుట | ... 27 |
| 16 | వైఖానసార్చకు లన్నమయమహిమ గుర్తించుట | ... 28 |
| 17 | అన్నమయకు వైష్ణవయతిచే పంచసంస్కారములు | ... 30 |
| 18 | అన్నమయ పెండ్లి | ... 32 |
| 19 | సాళ్వనరసింగరాయఁ డన్నమాచార్యు దర్శించుట | ... 34 |
| 20 | నరసింగరాయఁడు విజయములందుట | ... 35 |
| 21 | అన్నమాచార్యుఁడు సంకీర్తనములు పాడుట | ... 36 |
| 22 | రాయఁ డన్నమాచార్యు సత్కరించుట | ... 37 |
| 23 | రాయఁ డన్నమాచార్యుని మరలఁ బిలిపించుట | ... 37 |
| 24 | మరలఁ బాటలు పాడించుట | ... 39 |

పుట సంఖ్య.


| | | |
|---|---|---|
| 25 | సంకెల వేయించుట | ... 40 |
| 26 | రాయల పశ్చాత్తాపము | ... 42 |
| 27 | అన్నమాచార్యుఁడు రాజు నను(గహించుట | ... 43 |
| 28 | అన్నమాచార్యుని మహిమలు | ... 46 |
| 29 | అన్నమాచార్య పురందరదాసుల చెల్మి | ... 47 |
| 30 | అన్నమాచార్యుల రచనలు | ... 48 |
| 31 | అన్నమాచార్య సంతతి | ... 49 |
| 32 | అంకితము | ... 50 |


* * *

శ్రీః

# అన్నమాచార్య చరిత్రము

* * *

## అవతరణిక

శ్రీయలమేల్మంగఁ జిరకృపాపాంగఁ
గాయజుఁ గనతల్లిఁ గాంతామతల్లి,
శ్రీవేంకటేశుఁ బోషితపద్మ* కోశు
సేవకపరతంత్రు జితదైత్యతంత్రు,
దనుజకర్శనము మాధవ సుదర్శనము,
నినకోటితేజంబు హేతిరాజంబు,
నరహరిసంకీర్తి నవనిధు లొసఁగు-
పరమోపకృతిఁ దాళ్ళపాకాన్నయార్యు-
నాచారవిజితామరాచార్యుఁ దిరుమ-
లాచార్యు ఘను మదీయాచార్యుఁ గొలిచి
యార్యులు విని యన్నమాచార్యవర్యు-
చర్యకు మిగుల నాశ్చర్యంబుఁ జెంద,
జలజాతవాసిని చనుఁబాలపుష్టిఁ
బలికెద నా నేర్పుపరిపాటి నిపుడు,

---

* 'కేశు' అని మాతృక. చూ. వివేకదీపిక.

జననపరంపరా శతసహస్రముల
వెనుకకు మేము దుర్విషయానురక్తిఁ
గుక్షింభరులమైన కొదవెల్లఁ దీఱ
రక్షించి, మా యపరాధము ల్మఱచి
*యేపుట్టువున మిమ్ము నెఱుఁగంగఁజేసి
నీ పాలివారిఁగా నియమించి మమ్ము
హరి! మిమ్మునే కొనియాడు మా జిహ్వ
నొరులను గొనియాడకుండంగఁజేసి
కంటులేనట్టి లక్ష్మణగురు మతము-
వంటి సన్మతము మీవంటి దైవతము
తనవంటి గురుని నందఱలోనఁ దెచ్చి
వనజాక్ష! నేఁడు మావంటివారలకుఁ
గరతలామలకంబుఁ గావించెఁ గనుక,
అరయఁగఁ దాళ్ళపాకాన్నయాచార్యు-
పరమోపకార మెప్పటికి డెందమున
నరయుచుఁ గొనియాడు టది యొప్పఁగనుక,-
నాయనఁ జూచి మాయపరాధకోటు-
లేయెడఁ దలఁచక యెడఁబాయ కెపుడు-
నే యాపదలు మమ్ము నెనయక యుండ
మా యిలువేల్పవై మన్నించుకతన,
నందను సద్వర్తనము తండ్రి ప్రియము-
నొందఁ గీర్తించుట యుచితంబు గనుక,
అఱలేక. యీ యన్నమాచార్యచరిత
వెఱవక నీకు నే విన్నవించెదను;

---

* యీపుట్టువు?

మన్నించి యలమేలుమంగతో నీవు
నిమ్నుఁ బాయని భక్తనికరంబుతోడ
నవధారు శ్రీవేంకటాచలాధీశ!
అవధరింపుఁడు గురుహరిభక్తులార;

## పొత్తపినాడు

అవయము వయము పొంపారు క్రొవ్విరులు
గొనబైన చెంగల్వకొలఁకులు చుట్టి
పొదలు గొజ్జంగపూఁబొదలు క్రిక్కిఱిసి
వదలక వెలుఁగు కైవడి వెలుఁగొందు-
తెరువరుల్ త్రోవ వేతెంచి యేతెంచి
పొరిపొరిఁ గఱ్ఱు గఱ్ఱునఁ బాలుగారు-
రసదాలిచెఱకు తోరపుఁదుంట లంది
మిసిమైన ముంతమామిడిపండ్లు వైవ-
వా రసంబులచేత వచటి రాజనపుఁ
బైరులు ముక్కారుఁ బండు; వెయ్యేడలఁ
బాలవే పెరిగిన పసిఁడిటెంకాయ
పాళెల నెడనీరు పట్టి పెట్టినను
అనఁటిపండులు మేసి యలసి పై దప్పి-
గొనివచ్చి కోవెలల్ గ్రోలు నచ్చటను;
వరిమీఱు వా మేటివాటి నానాఁటి-
సిరు లింక నే మని చెప్పంగవచ్చు.

## తాళ్ళపాక

అట్టి పొత్తపినాటి యూఁదల సిరుల
పట్టుఁగొమ్మ తాళ్ళపాక చెన్నొందు.

ఆ పురిఁ గేశవుండను రమావిభుఁడు
చేపట్టి జనుల రక్షింపుచునుండ
*పరికించి యచ్చటి ప్రజలెల్ల మిగుల
నరుదంద మున్నూటయఱువది నాళ్ళు
ఫలముల చక్కెర పస పెర్గు రేఁగు
చెలరేఁగు నా వేల్పుచెంత నెంతయును;
అఖిలదేవతలకు నది యాటపట్టు
నిఖిల సన్మునులకు నిజ నివాసంబు;
సిరిగొల్పు నవనాథసిద్ధులు మున్ను
పరుసంబు రససిద్ధిఁ బడసినచోటు;
నళినాళి తులసీవనములు వైష్ణవులు
వెలయుదు రెచ్చోట విష్ణుఁ డచ్చోట
సన్నిధిసేయు నిచ్చలు నం(ద్రు మౌను;-
లన్నియు నచ్చోట ననిశంబు నుందు;
నందు వసించు నయ్యఖిలభూసురులు
నిందిరారమణపదైక మానసులు
అతులితవేదవేదాంగ పారగులు
జితసర్వకరణు లంచిత తపోధనులు
కనుట గోవిందు మంగళవిగ్రహంబె
వినుట నారాయణ వృత్తాంతచయమె
చేయుట కౌస్తుభాంచితపూజె, తలఁపు-
సేయుట మాధవ శ్రీపాదయుగమె
కుడుచుట వనమాలి గొను ప్రసాదంబె
నడచుట నందనందను నగరికినె
కాని, దుర్విషయసంగతి కలలోన-

---

* 'పరికించి అచ్చఫలముల చక్కెరపస పెర్గురేఁగు' అని మాతృక. ఇది దూషితపాఠము.

## అన్నమాచార్య వంశ్యులు

నైనఁ జేయఁగ నొల్ల రమ్మహామహులు;
అందులో నొక్క ధరామరేంద్రుండు
నందవరాన్వయార్ణవ సుధాకరుఁడు
గురు భరద్వాజసగోత్రుండు పాప-
హరబుద్ధి యాశ్వలాయన సూత్రశాలి
నారాయణుండను నయవేది వేద
పారాయణుఁడు విష్ణుపదభక్తిరతుఁడు
అనఘుని విట్ఠలాహ్వయుఁ గాంచె; నతఁడు
కనియె నారాయణు ఘనయశోనిధిని
నతఁడు విట్ఠలుఁ గాంచె; నతఁడు లోకైక-
నుతుఁడైన నారాయణుని తండ్రియయ్యె;

## నారాయణుఁడు

అక్కొమరుండు నారాయణాహ్వయుఁడు
చక్కఁగాఁ దనవద్దఁ జదువకయున్న
నూటుకూరను పొరుగూరఁ జుట్టముల-
చాటునఁ గొనిపోయి చదువఁబెట్టుటయు,
ఆ చుట్టములు వేడ్క నయగారియొద్ద-
నా చిన్న పాపని నమరించి నిలుపఁ
గొదుకుచు గురుఁడును గొన్నాళ్ళు తోడఁ-
జదివెడు పడుచులచందంబు చూపి
సామంబుచేతనె చదివించి చూచి
యామీఁదఁ గొన్నినా ళ్ళదలించి చూచి
మఱి కొన్నిదినములు మైనొత్తి చెప్పి
వెఱపారఁ దఱటున వేయించి చూచి

నూఱుమాటలు చెప్పి నులిపెట్టి చెక్కు
నూటిపోసినఁగాని నుడుగు కోరికిని
రాకున్న నిదియెట్టురా గొంటు వీని
పోకలఁ జూడ నబ్బురమయ్యె నాకు
నని యొక్కనాఁడు బిట్టదలించి తిట్టి
మొనసిన కోదండమున వ్రేలవేసి
కోలగగ్గెరఁ ద్రోసి గుంజిళ్లఁ బెట్టి
పైలావు దొరుఁగంగ బడిపెట్టు పెట్టి
యీ లాగు గాసింప నెదురుమాటాడఁ
జాలక కన్నీరు జాఱ బాలకుఁడు,
ఒంటు సేసెదనని యొకకొంతసేపు
వింటివారలఁ జూచి యిటు కొంతసేపు
గడపుచు నందును గడతేరకున్న
బడిబడి పెట్లను బడి చాల బడలి
ఆ యూర నొక చింతలమ్మను శక్తి-
పాయనిగుడిఁ ద్రాఁచుఁబాముందు ననుచు
జనులెల్లఁ జెప్పి యాశ్చర్యంబు నొంద
వెనుకకుఁ దా నది వినియుండెఁ గనుక
కఱవనీ నా బాధకంటె నా పాము
కఱచిన నెగులెల్లఁ గడకేఁగు ననుచు
కోపంబుతోడ నా గుడిలోని కరిగి
ఆ పుట్టలోఁ దనహస్తంబు నిడిన,
దేవి త్రికాలవేదిని గాన శిశువు
భావించి తోడ రూపమున నేతెంచి
బాలక కాలసర్పముసొచ్చు పుట్ట-

నేల కేలిడితి విందేల వచ్చితివి
అనుడు నారాయణుఁడను బాలకుండు
కనుదోయి కన్నీరు గదుర నిట్లనియె;
అఱిముఱిఁ జదువురాదని యయ్యవారు
పఱచు నా పాటులఁ బడనోప కేను
అలసివచ్చితి నిట కన్న నద్దేవి
వలవదు నీకేల వగపు నా తండ్రి!
గొనబుమీఱిన పలుకులజోటి మామ
జనమేజయునకుఁ బ్రసన్నుఁడైనాఁడు
ఆ శంకరాదులు నతని వేదుదురు
కేశవుం డాశ్రితక్లేశనాశకుఁడు
మీ తాళ్ళపాకలో మెఱయుచునుందు-
నా తామరసనేత్రు నాలయంబునకు
వలసుట్టి మ్రొక్కు మవ్వల వాని కరుణ-
నలరుచు సకలవిద్యలు నీకు వచ్చు;
అదియునుఁగాక మూఁడవ తరంబునను
వదలని కీర్తి మీ వంశంబునందు
పరమభాగవతుఁడు ప్రభవించు శౌరి-
వరమున జగదేకవల్లభుండగుచు;
అనుచు నంతర్హితయైన నా పాపఁ-
డనయంబు హర్షించి యరుదందికొనుచు
ఆ తాళ్ళపాకకు నరిగి వేవేగ
జాతరూపాంశుఁ గేశవు గాంచి మ్రొక్క (క్కి?)
స్వామిగేహములకు వలచుట్టి కేలు-
దామరల్ మొగిచి యత్తఱి శరణొంది

స్వామి! కేశవ! సరస్వతిమామ! విద్య
తామసింపక నాకు దయసేయు మనుడు,
ఆ మాధవునికృప నంబుజాసనుని-
భామ యాతనిజిహ్వపైఁ బాదుకొనియె;
సరగున మఱునాఁడు సని యర్భకుండు
గురునకు మ్రొక్కి మక్కువఁ దనతోడఁ
జదివెడుపడుచు లాచార్యుండు శాస్త్ర-
విదులును జూచి నివ్వెఱఁగంది పొగడ
పంచినచోటెల్లఁ బదమును గ్రమము
కొంచించ కతఁడు గ్రక్కునఁ జెప్పి మఱియు
క్రమ శిఖ జటయు వర్ణక్రమసరణి
భ్రమయక నిజవేదపాఠంబు సలిపి
కడమవిద్యలయందుఁ గడునేర్పు గలిగి
కడఁక వారల మెచ్చు గైకొని వచ్చి
జగతి నందఱుఁ జూచి సర్వజ్ఞుఁ డనఁగ
మిగుల వాక్ప్రౌఢిమ మెఱయుచు నుండె;

## నారాయణసూరి

ఆతఁడు గనియె నారాయణసూరి
నాతత సకలవిద్యాధురంధరుని;
నా మహాత్ముఁడు లక్కమాంబను పేరి
భామినీరత్నంబుఁ బరిణయంబయ్యె;
ఆ కల్పకములాకయగు తాళ్ళపాక
యాకడఁ గడలేని యభినవశ్రీల
మాదుపూరను నూర మాధవమూర్తి
తోడునీడై యాపెతో మాటలాడు;-

నా లక్కమాంబతో నా సూరివరుఁడు,
మేలిసంపదల నర్మిలిఁ దెప్పదేలి
కడపట వేవురు గలుగంగ నేమి
కొడు కొక్కరుండైనఁ గుల ముద్ధరించు
తనయుండు గల్గినఁదన*పుట్టుటెల్ల
ననయంబు సఫలమౌనని యిటువంటి
తనయులు లేమి నెంతయుఁ జింతనొంది
మన మింక నే వేల్పుమఱుఁగుఁ జొచ్చెదము
అడిగినయపుడె యిష్టార్థంబులెల్ల
నెడపక చేసేత నియనోపు వేల్పు
గలఁడె లోకమున వేంకటభర్తదక్క
*నల మేలు బలువేలుపై యుండు మనకు
మనకేల వలవని మనికితంబనుచు
చనుదెంచి వేంకటస్వామిసన్నిధికి
దండిమ్రై గారుడ స్తంభంబు దండ
దండంబు లిడుచు సంతానంబువేఁడ
వరదుఁడై వేంకటేశ్వరుఁడు తాఁబూను-
బిరుదుగజ్జియల ముప్పిడి కఠారంబు
కలలోన నొసఁగ నక్కజమంది తపము
ఫలియించె ననుచు దంపతు లేఁగి; రంత

## అన్నమయ జననము

రాజీవనయను వరప్రసాదమునఁ
దేజంబు మతియు నెంతే విస్తరిల్ల

* 'పెట్టు' మాతృక. చూ. వివేకదీపిక.
* 'అలవేలు' అనిమాతృక. అలవేల్పు - గావచ్చు.

లక్కమాంబకుఁ బుణ్యలావణ్యనిధికిఁ
జక్కని గ్రహము లుచ్చమున మూఁడలర
ననుపమ లగ్నంబునందు వైశాఖ-
మున విశాఖను జగంబున నుల్లసిల్ల
జనియించె నన్నమాచార్యుండు శక్తి-
మునికిఁ బరాశరముని పుట్టినటులు;
జనకుఁడు కారణజన్ముఁడైనట్టి
తనయున కాగమోక్తప్రకారమున
జాతకర్మము చేసి సకలవేదాంత-
జాతచోదితమునై *జలజోదరునకు
నామమై వినఁబరిణామమై మున్ను
హేమాంబరుం డానతిచ్చినయట్టి-
అన్నమయ్యాహ్వాయం బతనికి నొసగె;

## అన్నమయ బాల్యము

పన్నినభక్తి నా పసిబిడ్డఁ జూచి
అన్నయ్య అన్నప్ప అన్నమాచార్య
అన్న రమ్మనుచు ముద్దాడుచునుండ
హరినందకాంశజుం డగుట డెందమున
పరమసుజ్ఞానసంపద పొదలంగఁ
బుట్టుచు నతఁడు నేర్పునఁ దల్లి జిడ్డు
పెట్ట రమ్మని యుగ్గు పెట్టఁబోయినను
పనిఁబూని తిరుమలప్పని ప్రసాదంబు
గొనుమని యనక లోఁగొనఁడు కేరుచును;

---

* 'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్' అను శ్రుతి కావచ్చు.

నెడపక తొట్టెలో నిడి యెంతపాటు-
పడి యెంతవడి జోలఁ బాడెనేనియును
వేంకటపతిపేరు వివరించి పాట
పొంకించకుండినఁ బోరూఅడిలఁదు;
కొండలప్పనికి మ్రొక్కుమటంచు ననక
యొందులాగుల *జతు లొనరించఁ డతఁడు
ఈలీల శేషశైలేంద్రునిమీఁద
బాళినే పడియుండుఁ బసిబిడ్డఁడయ్యు-

## అన్నమయ విద్యలు

నింతయై యంతయై యాడేటి బుద్ధి-
మంతుఁడై పంచసమంబు లైనంత
నియతిమై గురుఁ డుపనీతుఁ గావించి
నయవేది నధ్యయనంబు సేయించె;
నన్నమాచార్యున కహినాయకాద్రి
వెన్నుని వరముచే విద్యలన్నియును
నమితంబులగుచు జిహ్వారంగసీమ
తముఁదామె సొచ్చి నర్తన మాడఁదొడఁగె;-
నా పిన్న ప్రాయంబునందు నా మేటి
యేపారఁ దనమది కిచ్చయైనట్లు
ఆడిన మాటెల్ల నమృతకావ్యముగ
పాడిన పాటెల్లఁ బరమగానముగ
తన కవిత్వమునకుఁ దన గానమునకుఁ
గనుఁగొని సకలలోకములు గీర్తింప
వేంకటపతిమీఁద వింతవింతలుగ

* 'జత' అని మాతృక. 'జోత' కావచ్చు.

సంకీర్తనంబులు సవరించు నిచ్చ
అసమాన నిజరేఖ యాత్మఁ*గీలించి
వసుధ నటించు సంవర్తుభావమున

## అన్నమయ తిరుమలయాత్ర

నింటివారలు పిల్చి యేమి చెప్పినను
గెంటనాడక పరికించి సేయుచును
జననియు నన్నయు జనకుండు వదినె
యును గొన్నిపనులు సేయుచుఁ దన్నుఁ బిలిచి
పసులకు కసవుఁ దేఁబనుప బాలుండు
వెస నేఁగి వాఁడి లవిత్రంబు పూని
మరకతాంకూరకోమల భర్మరుచులఁ
గరమొప్పు పచ్చని గఱిక వీక్షించి
పాపవల్లరుల శ్రీపతినామహేతి
నేపారఁ దఱుగు యోగీంద్రుచందమున
కెసిమస నొక పిడికెఁడు గోసి మఱియుఁ
గసవు గోయఁగఁబోయి కడవ్రేలు సోఁకి
వడియు నెత్తురు సూచి వాక్రుచ్చి శౌరి-
యడుగులు దలఁచి శ్రీహరి హరీ! యనుచు
నీ కోఁతకొలఁది నాదెఱిఁగిన వదినె
చేకోఁత పడఁగాదు చీ రోఁత యనుచు
హరి చరాచరదేహి యని పెద్ద లనఁగ
నిరవొంద నెఱిఁగియు నిటుసేయఁదగునె
చిడిముడి నేమి చేసెదనంచు చేతి-

* 'గవించి' అని మాతృక. గ్రహించి - కాబోలు.

కొడవలి నేల గ్రక్కునఁ బాఱవైచె;-
నెన్నటి చుట్టంబు లిటువంటివార-
లెన్నటి బంధుండ నేను వారలకు-
నీ వట్టివెట్టి నాకేల కావింప
భావింప నాలోనఁ బాయ కెల్లపుడు
తల్లియుఁ దండ్రియు దైవంబు గురువు-
నెల్లసంపదలునై యెల్లచందముల
నను(బ్రోచు శేషాద్రినాథునిఁ గొలిచి
మనియెద ననుచు నెమ్మది పాదుపఱిచి
నలుదెసల్ పరికించి నానావిధముల
విలసిల్లు *శ్రీరాగవెల్లువల్ వోలె
దండెలు శ్రుతిగూడి తాళసంగతుల
దండిమద్దెలలు బిత్తరముగా మ్రొట్ట
నానందబాష్పము లడర నాగతుల-
నా నందనందను నంకించి పాడి
తన్మయులగుచుఁ జిత్రపునాట్యగతులఁ
జిన్మయునందునే చిక్కి చొక్కుచును
సనకాదులను పేరఁ జనుదెంచువారి-
ననుపదంబు నిది మహర్లోకమనుచు
గోవింద గోవింద గోవింద యనుచు-
నా వరుసనె నరహరి హరీ యనుచు
తిరుమలప్పను నాదు దీరకమున్న
వరములప్పని మ్రొక్కి వర్ణించువారి

* శ్రీరామ - అని మాతృక.

నెఱులందు రంగువన్నెలు పిసాళించు-
నొఱపైన నిడుద మయూరకంఠములు
నటియించు కృష్ణాజినపుఁగిరీటములు
బటువైన బేగడ పాఱుటాకులును
పీలికుచ్చుల నెక్కు పెట్టిన దిండ్లు
ఫాలరేఖల నిండు పట్టెనామములు
ఘనమైన శంఖచక్రముల ముద్రికలు
పనుపడ దేవరబాణముల్ పూని,
కోనేటిరాయఁడె కొండలవాఁడె
కానికరూకలఁ*గనఁజాలువాఁడె
వరుస బంగరుమేడవాఁడె తిమ్మప్ప
వరముల రాయఁడె వాఁడె తిమ్మప్ప
గొడ్డురాలికినైనఁ గొమరుల నొసఁగి
వడ్డికాసులఁ గొనువాఁడె తిమ్మప్ప
అనుచుఁ బేరెమువారి యదుగుల నిడిన
దినుసైన కంచుటందియలు సారెకును
ఘల్లుఘల్లునఁ బాతకముల గుండియలు
ఝల్లుఝల్లను విలాసములును మెఱయఁ
గరముల బొణిగెలఁ గదురమ్యముగను
పరిషజ్జనంబుల పజ్జ నేఁగుచును,
ముక్తిదాయక పురములు నేదు చూడ
యుక్తి వేంకటగిరి యొద్ద నున్నట్టి-
పల్లెలో *గొల్లలపాలింటి శక్తి-

* కణఁజాలవాఁడె - మాతృక. ఇదే సందర్భానుగుణమైనది.
* గోటా - మాతృక.

యల్లారునని మును లనిశంబుఁ బొగడ
గనుపట్టునట్టి యా గ్రామంపు శక్తిఁ
గనుఁగొని బహు నమస్కారముల్ జేసి
అళిపుళిసింగరి నర్చించి మ్రొక్కి
తలి(ల?) యేఱుగుండు సందర్శించి కదలి
పెద్ద లెక్కుడుగాఁగఁ బేర్కొనుచుండు-
పెద్దయెక్కుడుఁ గూర్మి పెనఁగొన నెక్కి
కపురంపుఁదావులు గడునూలుకొలుపుఁ-
గపురంపుఁగాలువఁ గడచి యంతంత-
వా మహాచలవీథి నలరారు పుణ్య-
భూమిజంబులఁ బుణ్యభూముల జనులఁ
బావనవదుల శోభన వస్తుతతుల
సేవించికొనుచు మచ్చిక వచ్చి వచ్చి
వేకువజామున వెడలి జామెక్కు-
దాఁక మిక్కిలి యెండదాఁకంగ నడిచి
యెన్నఁడు తల్లిపక్కడసి యొండెడల-
నున్నట్టివాఁడు కాకుండుటవలన
కడపవాకిలి దాఁటి కడయిండ్లకడకు
నడచుట మునుపు నెన్నఁడు లేదు గనుక
నాఁకట నసురుసురై బాలకుండు
మోఁకాళ్ల ముడుపు నిమ్ములఁ జేర వచ్చి
కమ్మని గణుపుచెంగట వాటమైన-
తుమ్మెదతొలుల సందుల చల్లగాలి
రాణ దూఱఁగ వింతరాగంబు పొసఁగ
వేణునాదము సేయు వెన్నుఁడో యనఁగ

పరువంపుఁ దలిరుజొంపములఁ బెంపొలయు
మరకతశ్యామ నిర్మల నిజాకృతుల-
నెదురు చల్లనితావు లెసఁగించు వెదురు-
పొదక్రిందఁ గూర్చుండి పొలయు లేఁజెమటఁ
దొడిగిన చెప్పులతోడనే మిగుల
బడలిక నొకరాతిపై శయనింప,

### అన్నమయకు దేవి ప్రత్యక్షమగుట

నితరు లెవ్వరి యాత్మ లెఱుఁగనియట్టి-
యతని యాఁకలి జగదంబ తా నెఱిఁగి
యలమేలుమంగ తియ్యము నెయ్య మెసఁగ
బలుచన్నుఁగవ తుదఁ బాలు చిప్పిలఁగ
మినుకారు క్రొక్కారుమెఱుఁగుచందమున
ఘనపయోధరములఁ గడుఁజూడఁ గలిగి
దినుసైన లేఁబువ్వుఁదీగెకైవడిని
*మెనసిన బలుమొల్లమొగడలఁ దనరి
*పసుపైన రాచిల్కభాతిఁ జక్కెరలు-
గొసరెడు పల్కుల గొనబు చూపుచును
విరివింటివాని చే వెడవింటి నారి
దొరసి నిక్కిన కొప్పుతో నొప్పుమీటి
కమనీయమగు చంద్రకళ సోయగమున
నమృతాధరస్థలి నలరి చూపట్టి
కులుకుఁదావుల తమ్మికొలని భావమునఁ
బొలుచు హంసక నాదములు బిడారించ

మొనసిన - మాతృక. అదియే అర్థానికీ యతికీ సరిపోవుచున్నది.
'పసుపైన' - అని యున్నచో ప్రాసమైత్రి సరిపోవును.

పెద్దముత్తైదువ పేర్మితో బాలు
నొద్దకు నేతెంచి యూఱడింపుచును
పదుచ! యేమిటి కిటఁ బడియున్నవాఁడ-
వద(డ?)లక లేచి రమ్మన్న, నా శిశువు
పైకొన్న యాఁకలి బలుదవ్వు నడచి
రాకఁ గన్నులు గానరావు మా యమ్మ!
అందుల కొక యుపాయముఁ జెప్పి నాకుఁ
గందర్పజనకునిఁ గనజేయుమమ్మ!
యనవుడు కమలామహాదేవి శిశువుఁ
దన కృపామృతధారఁ దనివి నొందించి
బాలక! యీ మహాపర్వతేంద్రంబు
లాలిత సకల సాలగ్రామమయము
ఘనులకు నిది చెప్పఁగాళ్ళ నెక్కంగఁ
జనదు నీ చెప్పులు సడలించి వైచి
కనుఁగొను కన్నులఁ గనవచ్చు ననిన,
విని బాలుఁ డట్ల కావింతు నే ననుచు
గ్రక్కునఁ బాదరక్షలు దీసివైచి
యక్కొండఁ గనుఁగొనునపుడు, గన్నులకు
వనమాలికలచే సువర్ణరేఖలను
గనుపట్టు గొనవెంద్రుకల కురంగముల
వేణు బాణాసన వితతచక్రముల
రాణించి ధరణీవరాహవైఖరుల-
నా రమానారాయణాకృతి గలిగి
శ్రీరామకృష్ణ లక్ష్మీనృసింహాది

మూర్తులన్నియు నొక్క మొత్తమైనట్లు
వర్తింపుచున్న నా వదువు వీక్షించి
మహిత సాలగ్రామమయుమౌ నటంచు
బహువిస్మయము నొంది ప్రణతు లొనర్చి
యా జగజ్జననికి నభివాదనంబు-
లోజఁ గావింప నయ్యువతీలలామ
శౌరియుఁ దాను నిచ్చలు పొత్తుగలసి
యారగించిన ప్రసాదాన్నముల్ దెచ్చి
పరిపరిరుచుల నేర్పడ సేదదేర
పెరిమతో భుజియింపఁబెట్టి యూరార్చి
తిరుమలప్పని దేవదేవునిఁ గొలువ-
వరుగుమటంచు నయ్యరవిందసదన
తొల్లింటికరణి కౌస్తుభరత్న హారు-
నల్లంబుమీఁదట నుండె నుండుటయు,
శ్రీమూర్తులందుల చిహ్నంబు లిపుడు-
నా మహాచలశిలలందు నింపొందు-

## అన్నమయ దేవిపై శతకము చెప్పుట

వత్తఱి నలుదిక్కు లరసి యా శిశువు
చిత్తంబులోన నచ్చెరువందుకొనుచు
కలయొ యాందోళమొ కాక నిక్కంబొ
కలవళంబో దీని కరణి యే కరణి
యని నిక్కమని యాత్మ నలరి యా పద్మ
తనకేల నిడు ప్రసాదప్రభావమున
పరమసారస్వత పారీణుఁ డగుచు
సరసకవిత్వ వాచాప్రౌఢి మెఱసి

యలమేలుమంగకు నాశుమార్గమున
సలలితంబుగ నొక్క శతకంబుఁ జెప్పె;

## అన్నమయ కొండపై దివ్యస్థలముల దర్శించుట

నానావిధావనోన్నతమైనట్టి*
కోనేటి గడలెంచి గురుపుణ్యవారి-
కోనేటి దా నేటికొన్న మన్ననల-
*నీ నేరుపరుదని యెల్లలోకములు
వినుతించు నా తీర్థవిభుని సేవించి
చనుదెంచి యట కృతస్నానుఁడై యతఁడు
సేవంతిపూనీటి సెలయేటి వలితఁ
దావితామరల నిద్దంపుఁ బుప్పొళ్ల
ముగ్గుల పరుసల మురిపెంబుచేత
నగ్గలంబై పొంగు నంబుపూరములు
పెను సోబనాలు చూపెడు సోబనాలు
గనుపట్టు స్వామిపుష్కరిణి సోయగము
వెండియుఁ జూచె సవిస్మయుండగుచు
పుండరీకముల యొప్పులఁ గన్నులయ్యె;
నురగేంద్రు శిరసుపై నొక పాద మూఁది
చరణ మొక్కటి రసాస్థలి మోవఁ జాఁచి
డాకేలు పుడమిపడంతుక నలమి
యా కేలు కటినూఁది యనురక్తిఁ జక్కఁ
బంటవలంతి గుబ్బలతావి మోవి-
పంటిలేనియ లొకపరి యాను తమిని

* మైనయుట్టి? - లేకున్న గణభంగము. 'మయినట్టి' - అనినను సరిపోవును.
* నీనెరి వినదని - మాతృక. 'నీ నెరపరుదని' - అని యుండవచ్చును.

మోముదామరఁ జాఁచి మొగసిరి కేలి-
*తామరలను శ్రుతిద్వయము *నిక్కించి
సంకుచక్రముల హస్తమ్ముల రెంటఁ
బొంకించి కరుణ చూపుల జొబ్బిలంగ-
నాదరిఁ బెంపొందు నాదివరాహు-
నాదరంబునఁ గొనియాడి సేవించి,
వలచుట్టుకొని వచ్చి వచ్చి కుందనపుఁ
బొలుపుల పెద్దగోపురము సేవించి,
తరగని ఫలపుష్పతతితోడ నీడ-
తిరుగని చింత వర్తిల నమ్రుఁడగుచు
పరుసల కిష్టసంపద లిచ్చు పసిఁడి-
గరుడగంబము పేర్మిఁ గని సాఁగి మ్రొక్కి
కారుమించులకును గలరీతి ముద్దు-
గారు పువ్వులు* నొత్తుగాఁబడి రాల
రమణ బ్రహ్మాండకరండ మంతయును
ఘుమఘుమతావులు గులికి వాసింపఁ
గనుపట్టు నా చంపకపుఁబ్రదక్షిణము
చనుదెంచి స్వామిపుష్కరిణిఁ బూజించి,
తిమ్మప్పనికి నివేదితమైన మీఁదఁ
బమ్మి యమ్మెదు పైఁడిపళ్ళెరంబులును
వారక యమృతంపు వారలు వట్టు-
నూరివారలకు నోరూరించు చవుల-

* తామరలన - మాతృక.
* లింకించి - మాతృక. లంకించి - కావచ్చు.
* పువ్వుటసతుకాపడి - అని మాతృక. పువ్వు లసదుగాఁబడి - కావచ్చు.

పరికరంబుల *చేతపడిఁ గదంబించు-
పరిపరివిధముల భక్ష్యభోజ్యములు
వెన్న గాఁచిన నేతి వింతపచ్చళ్ళు
సన్నరాజనపుఁ బ్రసాదంబుతోడ
పెన్నెలగుజ్జు పర్వినవన్నె నున్న-
యున్నతంబైన దధ్యోదనంబులును
అతిరసంబగు వడ లప్పాలు పాలు
అతిరసంబులు మొదలగు ప్రసాదములు
పచ్చకప్రపుఁ గలపంబు కుంకుమము
పచ్చకస్తురి సరివాటుగాఁ జేసి
తిగిచి పన్నీట మేదించి కుందనపు-
బిగువు చూపుచునున్న భృంగారుకలును
కమ్మగా వాసనల్ క్రమ్మఁగాఁ జిత్ర-
రమ్మగు నడగోపురమ్ము సొత్తెంచి
దండడి నవ్వేల్పుతళిఘుల క్రిందఁ
జిందఁగాఁ జేత నూర్చిన నంటివచ్చు-
నొకనాఁటినెయ్యి వేఱొక దేవళమున
నొకయేఁటనైనను నున్నదే యనుచు
తలయూఁచి మెచ్చుచుఁ దనలోనె తాను
పలుమాఱు నాశ్చర్యపడుచు నా పడుచు
శ్రీనివాసుని నమస్కృతిచేసి దండఁ
గానుపించిన భాష్యకారులఁ బొగడి
శ్రీనరసింహుని సేవ గావించి
దానవాంతకు జనార్దను సన్నుతించి

---

* 'చాత్తుపడి' - అను తమిళపదమునుండి యేర్పడిన ప్రయోగము కావచ్చు.

అలమేలుమంగకు నభివందనములు
సలిపి చెంగటి యాగశాలఁ గీర్తించి
మెఱుఁగులు గప్పఁగ్రమ్మినభాతి రుచుల
నెఱయించు నానందనిలయంబు గాంచి,
మరుగురు కల్యాణమంటపంబునకుఁ
గరములు మొగిచి చెంగటితేజి కెఱఁగి
బంగారు గరుడుని భజియించి చెంత
సింగారమైయున్న శేషునిఁ గొలిచి
వాసన నలుదెసల్ వలగొన రాశి-
పోసి యుండెడు గోవ పునుఁగు చట్టలును
గట్టి బంగరుసలాకలఁ గ్రుచ్చి కాఁచి
తట్టుపునుంగు లత్తటి నొత్తువిధము
పసిఁడి పళ్లెరమునఁ బసనిచక్కెరలు
గొసరి గోవింద ముకుంద తిమ్మప్ప
అని పరుసలవార లంతంతఁ జేరఁ
జనుదేర వేంకటశైలభర్తకును
గుట్టున మది *మ్రొక్కికోరా కానుకలు
పెట్టరో, దండముల్ పెట్టరో, యిపుడె
కోరినకోర్కె చేకూరు నటంచు
నేరుపు పంచవన్నియ చిలుకలును
కనకభూషణవస్త్ర ఘనవస్తుతతుల
మొనసిన బండారమును దేరకొనుచు
తడఁబడఁ జుట్టిన తన పంచెకొంగు-
కడనున్న దొక కాసు కానుక వెట్టి

* మ్రొక్కుకోరో - మాతృక. మ్రొక్కుకొన్నకానుకలు - కావచ్చు.

## అన్నమయ స్వామిని దర్శించుట

బంగారుగాదెలపజ్జ సాష్టాంగ-
మంగవింపుచుఁ బులకాంకితుఁడగుచు
గ్రక్కున దగ్గఱఁ గనుపట్టు పసిఁడి-
టక్కుల తలవాకిటను గానవచ్చు-
ధళ ధళల్ తులకించు దరచక్రహస్త-
ములు బొడ్డుమానికమును గఠారమును
మంజీర కింకిణీ మంజులపాద-
కంజద్వయంబును గాంచనాంబరము
కటిమీదఁ జేర్చిన కరపంకజంబు
తటుకున వరమిచ్చు తమ్మి కెంగేలు
కులికెడు మణిమయ కుండల ద్యుతులు
కలకలనగు ముద్దుగారు నెమ్మొగము
మంచిముత్యాల నామంబుపైఁ గాను-
పించు రత్నాంశుదీపిత కిరీటంబు
తట్టుపునుంగు పూఁతయుఁ గిరీటాదిఁ-
జుట్టిన చెంగల్వ చొళ్ళెంపుదండ
వనమాలికయును శ్రీవత్సకౌస్తుభము
అనుపమ దివ్యభూషాదివైఖరులు
గలిగిన దివ్యమంగళ విగ్రహంబు
గలయంగఁ గన్నుల కఱవెల్లఁ దీర
సేవించి తనివోక శ్రీవేంకటేశు
దేవుని మఱియుఁ గీర్తింపంగఁదొణఁగె;
కంటి నయ్యఖిలాండకర్త నే నధికుఁ
గంటి నా యఘము నిక్కము వీడుకొంటి

పావనంబైన పాపవినాశనమ్ము
కోవిదుల్ కొనియాడు కోనేటి గంటి
నావంటి దీను విన్నప ముద్ధరించు
శ్రీవేంకటేశ్వరు సేవింపఁగంటి
అను నర్థ మలవడ నా దేవునెదుట-
ననువుగా సంకీర్తనంబులు సేయఁ
దనుఁజూచి యచట నందఱు మెచ్చి మెచ్చి
చనవిచ్చి తీర్థప్రసాదంబు లిడుచు
ఎదఁజేర్చి శఠకోప మిడుచు దీవింపఁ
దదనుజ్ఞ నొక విడిదల కేఁగె; నంతఁ-
బ్రాయమెక్కుచు విష్ణుపదపల్లవంబు-
చాయ చాయల నెఱసంజఁ జూపట్టె-
నల కలానిధి; భక్తి కా రాత్రిమేను
పులకించెనన మింటఁ బొడమెఁ దారకలు;
గగనాచ్యుతుఁడు సుధాకలశంబు గొన్న-
పగిదిఁ జందురుఁడు చూపట్టె నెంతయును;
అరయ నన్నయగురు ననురక్తి బెరయు-
హరిబింబమోయన హరిబింబ మలరె;
హరిచరణ స్మరణాసక్తుఁ డగుచు
హరివాసరంబైన యమ్మఱునాఁడు-
*నీరీతి నెనిమిది యేఁడుల పిన్న-
బాలుఁడయ్యును నిష్ఠఁ బనిఁబూని యతఁడు
దైత్యుఁదారకు గొంతు దఱిగిన బ్రహ్మ-
హత్య సేనానిఁ బాయఁగఁజేయునట్టి-

'నీ లీల' - అనియుడును. అట్లైన ప్రాసమైత్రి సరిపోవును.

కౌమరధారను, దేవకులములు గొలుచు-
నమరతీర్థమును, నయ్యంజనాదేవి
కనకాంబరుని మెచ్చుఁ గను పనిమంతు
హనుమంతుఁ గాంచిన యాకాశగంగ
సారెకు జనుల దోసములు నీరగుచుఁ
బాటిపోఁజేయు పాపవినాశనమును
బార్థు కోరికలిచ్చు పాండవనామ-
తీర్థంబు మొదలైన దేవతీర్థముల-

## అన్నమయ స్వామిపై శతకము చెప్పుట

నవగాహనము చేసి యా తేటనీట
ధవళంబుగా మును దాఁ గట్టుచీర-
నుదికి యాఱఁగవైచి యొకరాతి దండ-
నది యెండ నాటెదు నంతలోపలనె
వితత వృత్తంబుల వేంకటపతికి
శతకంబు కుతుకంబు సమకూరఁజేసి
పదిరెండు నామముల్ బాగుగాఁ దీర్చి
సదమలాచారుఁడై చనుదెంచి యతఁడు
వరుసతో హరిపరివారంబుఁ గొలిచి
మరుగురు ద్వారసీమకు వచ్చి మ్రొక్కి
యల వేంకటేశ్వరు నపరంజి తగడు-
తలుపులు బీగముల్ దాఁచియున్నెడను,
వేంకటపతిమీఁద వివరస్తవముగ
వేంకటశతకంబు విన్నవించుటయు

### వైఖానసార్చకు లన్నమయ మహిమ గుర్తించుట

గాలంపుఁజిక్కులు గదియించునట్టి
తాళముల్ వీడియుఁ దనుదానె పడిన
అలతలుపులు ఫెళ్ ఫెళన(ని?) తెఱచుటయు,-
నలరుచు నర్చకుం డరుదెంచి చూచి
భళిభళి! యనుచు నబ్బాలకు మెచ్చి
యల దేవుమహిమకు నాశ్చర్యమొంది
గురుభక్తి నతనిఁ దోడ్కొనిపోయి చెంత
గరుడ సేనేశులఁ గపిరాజముఖుల
జనకజా సౌమిత్రి సహితు రాఘవునిఁ
గనుపించుకొని నమస్కారముల్ చేసి
ముందరనే జగన్మోహనాకారుఁ
బొందిన పసిఁడిసొమ్ముల నిమ్ముగొనుచు
కారు మెఱుంగు తీఁగలు చుట్టు నిలుపు-
ధారాధరంబు చందముఁ జూపువాని
పంచాస్త్రకోటిసంపదఁ జక్రసహిత-
పంచబేరాకృతి బాగైనవాని
శ్రీవేంకటేశు నాశ్రితకల్పకంబు
సేవించి, వినతుఁడై చేతులు మొగిచి
బహులాంగరంగవైభవములతోడ
మహితచందన పుష్ప మాల్యవైఖరుల
ధూపనీరాజనాదులతోడ వైది-
కోపచారముల నా యుర్వీధరునకు
మురవైరిరెండవమూర్తియో యనఁగఁ
గరమొప్పచున్న వైఖానసోత్తముఁడు

నంబి వెంగటఁ బూజనము సేయుతఱిని
పంబినభక్తి నబ్బాలుండు మఱియు
వెంకటప్పకు విన్నవించిన తొంటి-
వేంకటశతకంబు విన్నవించుటయు,
పెట్టిన ముత్యాలపే రా యశోద-
పట్టి పాదములపైఁ బడఁ బ్రసాదించె;-
నది చూచి యర్చకుం డరుదంది వచ్చి
ముదమున శఠకోపమును బ్రసాదించి,
యీయన్న బాలుఁడే యెన్నఁ గోనేటి-
రాయని దివ్యవరప్రసాదుండు
కాకున్న నీ నవ్యకావ్యంబు సేయఁ
జేకూరు టెట్టు చర్చింపంగ ననుచు-
నందఱు విన బాలు నాదరింపుచును
జందన తీర్థప్రసాదంబు లొసఁగఁ
జేకొని బాలుండు శిరసావహించి
దాకొని కోనేటిదరి భుజియించి
యాదివరాహు గేహమున సుఖించి
ద్వాదశినాఁడు నా ధవళాక్షుఁ గొలిచి
దేవుని యా పెద్దతిరువీథివెంటఁ
గోవెల వలచుట్టుకొని యేఁగియేఁగి
సారెసారెకు రాగసంగతి గదుర
నారాయణస్మరణంబు సేయుచును-
నకలంకమై చల్లనై చూడఁదగిన-
యొక పంచతిన్నెపై నుండె నుండుటయు,

## అన్నమయకు వైష్ణవయతిచే పంచసంస్కారములు

పాయని తనమీఁది పరమానురక్తిఁ
దోయజాక్షుం డల తొలినాఁటి రాత్రి-
ననఘుండు హరిపరాయణచిత్తుఁడైన
ఘనవిష్ణుఁడను మౌనికలలోన వచ్చి
దయమీఱ నిట్లనుఁ దాళ్ళపాకాన్న-
మయ నామకుండైన మద్భక్తుఁ డొకఁడు
వడుగు నల్లని చిన్నవాఁడు నన్నెపుడు
నడుఁకక సంకీర్తనము సేయు నతఁడు
ముద్దుగారెడువాఁడు మోహనంబైన-
మద్దికాయలవాఁడు మనవాఁడె వాఁడు
గుదిగొన్న నునుపట్టుకుచ్చుల దండె
ముదమున నిజభుజంబున నించువాఁడు
కడవేగ రేపు నీకడ కేఁగుదెంచుఁ
దడయక నీవు ముద్రాధారణంబు
గావింపు నా మాఱుగా వాని కనుచు
దేవుఁడు తనదు ముద్రిక లిచ్చె; నంత
యతి మేలుకొని యరుదంది గోవిందు-
సతమైన భక్తవాత్సల్యంబుఁ బొగడి
యుటిమిటి సూర్యోదయంబునకెల్ల
మఱవక నిత్యకర్మంబులు దీర్చి
కరమున శంఖచక్రపుముద్ర లంది
హరి యాజ్ఞ వాకిటి కరుదెంచి నిలిచి

కేలిమై వెన్నునిఁ గీర్తింపుచున్న-
బాలుని రూపు తప్పక విలోకించి
యెఱుఁగఁగా హరి యానతిచ్చినయట్టి-
గుఱుతులన్నియు దొరకొన సంతసమున-
నన్న నీ పేరేమి యనిన నా వదుగు-
నన్నయ నా నామమని సాఁగి మ్రొక్కి
వినుతింపఁ జూచి సవిస్మయుండగుచు
మునినాథుఁ డాతని ముద్దు సేయుచును
తనచేత నీవు ముద్రాధారణంబు
గొనకొని సేయించుకొనఁగ నోపుదువె
యన విని శిశువు కృతార్థుండనైతి-
నన విని వేదమార్గానుసారమున-
నాతని శంఖచక్రాంకితుఁ జేసి
రీతిగాఁ బంచసంస్కృతులు గావించి
శ్రీనాథుఁ డానతిచ్చిన ప్రకారంబు
తాను వైష్ణవులు నాతఁడు భుజియించి
తన కలగన్న యంతయుఁ దేటపఱచి,
*దులగుచు............

గ్రంథపాతము

వేద్యంబులగు వేద వేదాంతముఖ్య-
విద్యల నధికులై వెలసియుండుదురు
తెల్లంబుగా దేహదేహిభావమున-
నెల్లవస్తువులును నీవెకాఁ దలఁచి

---

* అసందర్భముగ ముగిసినందున గ్రంథపాతముగ గుర్తింపు.

పరచింత లుడిగి నాపైనె విన్యస్త-
భరుఁడవై యుండు శుభంబులన్నియును-
ననఘాత్మ! నినుఁ జెందునని వరంబిచ్చి
జననివాక్యముఁ ద్రోయఁజనదు కుమార!
పోయి రమ్మనిన నప్పుడు మేలుకాంచి
యా యచ్యుతునిఁ గొనియాడి మ్రొక్కుచును
జననియు దాను నిచ్చలుఁ దొంటిపురికిఁ
జనుదెంచి నిజనివాసముఁ బ్రవేశించె;-

## అన్నమయ పెండ్లి

నెలజవ్వనము మేన నిగురొత్తు కొడుకుఁ
దలిదండ్రు లరసి యాతనిఁ దోడుకొనుచు
కులములవారిండ్లకును బోయి సుతున-
కెలమి మీ పడుచుల నీవలె నన్న-
నేవేళఁ జూచిన నితఁడు శ్రీరామ
గోవింద హరి యనుకొనుచుండుఁ గాని
యలవోక సంసార మది యిచ్చఁ దనకు
వలెననఁ డది యెటువంటి గొంటైన
నాచారముల దాసరయ్యను జూచి
చూచి యేగతిఁ బడుచుల నిచ్చు ననిన
వారల కలలోన వారిజోదరుఁడు
దారియు మొనఁ జూపి తనదు భక్తునకు-
నన్నయార్యునకుఁ గన్యకల నిమ్మనిన-
నన్నన్న యని వారు నరుదందికొనుచు
తిరుమలమ్మను నొక్క తిరువాలుఁగంటి-
నరుదైన యక్కలమ్మను నొక్క కన్య

బంగారు ప్రతిమల భావంబుఁ జూప
సింగార మొలపుగాఁజేసి మోదమునఁ
గ్రన్నన నాగమోక్తప్రకారమునఁ
జెన్నుగాఁ బెండిండ్లు చేసి రంతటను;
పరమేశుఁడగు నహోబలనృసింహుండు
గురుభావమునఁ జేరుకొని త్రిదండంబు-
నా నరసింహు చక్రాదిమంత్రములు
తానె ప్రత్యక్షంబు దయసేయఁ గొనుచు,
హరి హయగ్రీవుఁ బ్రత్యక్షంబుఁజేసి
ధర సర్వతంత్ర స్వతంత్రుఁడైనట్టి-
వేదాంతదేశికు వేంకటాచార్యు-
నా దివ్యసంప్రదాయమున వర్తించు-
శఠకోపమునివద్ద సకల వేదాంత-
పఠనంబుఁ జేసి యభంగవిస్ఫూర్తి
హరిపూజ హరిసేవ హరికీర్తనంబు
హరిమననము ధ్యాన మనిశంబుఁ దనకు
ఘనతర సకలభోగంబులుగాఁగ
మనుచు వాల్మీకిరామాయణ మెల్ల
రాగంబుతో ననురాగంబుతోడ
బాగుగా గంధర్వబాగుగాఁ జదివి
పాటలన్నియుఁ దన పాటపిమ్మటన
పాటపాటనె పాటపాడి చూపఁగను
విన్నవారెల్ల నువ్విళ్ళూరి యొక్క (చొక్క?)
ప్రన్నవీనులు నిండుపండువుల్ సేయ

తుంబురుఁడో నారదుఁడొ కాక యీ వి-
ధంబునఁ దిరుగు గంధర్వుఁడో కాక
మనుజుఁడో యీ యన్నమయ యని సర్వ
జనులును గొనియాడి సంతసింపఁగను-

## సాళ్వనరసింగరాయఁ డన్నమాచార్యు దర్శించుట

నావార్త విని విని యట్టి మహాను-
భావునిఁ గన బాళిఁబడుచు డెందమున-
నా చేర్వ టంగుటూరను పురంబేలు-
రాచమూకలలోఁ బరాక్రమశాలి
నాళీకబాంధవాన్వయుఁ డజేయుండు
సాళువ నరసింహ జనపాలుఁ డొకఁడు
పరివారవాద్య సంభ్రమము రెట్టింపఁ
కరమొప్పఁ జేకానికలు గొనివచ్చి
యా తాళ్ళపాకాన్నమయ్యకు సాఁగి
చేతులు మొగిచి మచ్చికఁ బూజచేసి
శ్రీకృష్ణు మన్ననఁ గ్రీడి భూచక్ర-
మేకచక్రంబుగా నేలిన పగిది-
నాలాగు మీ సహాయము నాకుఁ గలుగ-
నేలుదు ధరయెల్ల నేకచక్రముగ
నన్ను మన్నించి విన్నప మాలకించి
క్రన్నన మాయూరికడ కేఁగుదెంచి
మాకు బుద్ధులు సెప్పి మా చేయుపూజ
చేకొని మమ్ము రక్షింపరే! యనిన

సహజవైష్ణవభక్తి సలిపెడువాని-
సహవాసమైన దోసములేదటంచు-
నతఁడు పట్టించిన యందలంబెక్కి
యతఁడు భృత్యప్రాయుఁడై కొల్వ రాఁగఁ
జని టంగుటూరి కేశవమూర్తిఁ గాంచి
వినతుఁడై యతఁడు కోవెలదండఁ దనకు
సకలసంపదలతో సవరించియున్న-
యొక పెద్దనగరిలో నొగిఁ బ్రవేశించె;-

## నరసింగరాయఁడు విజయములందుట

నానాఁట నా నరనాథుండు వేఱు-
లేని కూరిమితోడ లీనమైయుండె;
తన సంపదలు సమస్తము నన్నమయ్య-
వని యెన్ను నడకల నారీతి నడచు-
నే పని గలిగిన నెఱిఁగించికాని
చేపట్టి తనయంతఁ జేయఁడెప్పుడును
హితునిఁగా గురునిఁగా నెల్లబంధులఁగ
నతనినే భావించి యంగవింపుచును
పావనుండగు తాళ్ళపాకాన్నమయ్య-
దీవెనలంది వర్ధిలుచు నా రాజు
బలియుఁడై పరిపంథిబలముల నడఁచి
నలిరేఁగి సింహాసనంబు చేకొనుచు
తన రాజధానియై తనరారు పసిఁడి-
పెనుగొండగతి నుండు పెనుగొండ నుండి
యన్నమాచార్యుల నటకు రావించి
యెన్నిక నెదురుగా నేలెంచి మ్రొక్కి

కనకాంబరాదుల గ్రామసంతతులఁ
గనువారలకు దండగాఁ బూజచేసి
వెన్నునిపై విన్నవించిన లోక-
సన్నుతంబైన మీ సంకీర్తనములు
విన నాకు మిక్కిలి వేడుకయ్యెడును-
ననఘాత్మ వినిపించు మనిన నగ్గురుఁడు

## అన్నమాచార్యుఁడు సంకీర్తనములు పాడుట

కెలనఁ జూపట్టు సంకీర్తనపరులఁ
బిలిచి లెస్సగ వినిపించఁగావలయు-
నిపు డన్న వారలు నెడఁ బాఱఁబాఱఁ
దిపిరిదండెలు శ్రుతుల్ తిన్నగాఁ గూర్చి
దండిమై నెఱగానదండెయు వాద్య-
దండెయుఁ దానసంతానంబు చూప
స్థాయి షడ్జమును బంచమమును జేసి
తాయముల్ కడువింత డాలుగాఁ జూప
తేనెలపై తేట తిన్ననిచెఱకు
పానకముల నేరుపఱచిన మేలు
చక్కెరలో తీపు చల్లఁదెమ్మెరలు
చిక్కని కపురంబు జీవరత్నములు
కల యమృతంబు మీఁగడమీఁది చవులు
చిలుకుచుఁ గవులెల్లఁ జేయెత్తి మ్రొక్క
వేంకటపతికిఁ గావించిన మంచి-
సంకీర్తనముల రసంబు లుట్టఁగను
సింగార మొకకుప్పఁ జేసిన రీతి
రంగైన రాగవర్ణములఁ బాడుటయు,

## రాయఁ డన్నమాచార్యు సత్కరించుట

తవిలి యెన్నినఁ గాళిదాసాదులైన-
కవులందుఁ జిక్కిన కవులందు నిట్టి-
కవితయు నిట్టి శృంగారభావంబు
వివరింపఁ గంటిమే వింటిమే మున్ను
కన్నవిన్నవి గావు గదర! యీ పదము-
లన్నయార్యునివి మోహనమూర్తు లనుచు
వీనులవిందుగా విని చాల మెచ్చి
యానందవార్ధి నోలాడి యా రాజు
పచ్చలకడియాలు బంగారువ్రాఁత-
పచ్చడంబులును *గెంబట్టు కుళ్ళాయి
యంగదంబులు నుభయాతపత్రములు
రంగైన వింజామరలజోడు మంచి-
యుదిరిఁజేసిన గిండియును గళాచికయు
మొదలైనవెల్ల సమ్ముఖమున నొసఁగి
తన పెద్దనగరియొద్దనె యొక్కనగరు-
ననువొందఁ జూపించి యట నుండఁ బనిచి
యనుదినంబును వేంకటాద్రీశుమీఁది-
వినుతులు వేడుక వినుచుండి యుండె
నరనాథుఁ; డట నొక్కనాఁ డన్నమార్యుఁ
బరిచరవర్గంబుఁ బంపి రమ్మనిన

## రాయఁ డన్నమాచార్యుని మరలఁ బిలిపించుట

కనకాంబరుని గుణగణమణుల్ శ్రుతులు
గని చిక్కుగొనురీతిఁ *గను కపోలములు

---

* కళ్ళాయి కుళ్ళాయి-వ్రాఁతప్రతి.
* గనక పొంగళ్ళు - వ్రాఁతప్రతి. 'గనకపోఁగులును' - అయియుండవచ్చు.

నత్తఱి మదిలోని హరికీర్తి మొలక-
లొత్తినగతి నున్న యూర్ధ్వపుండ్రములు
లాలితాచ్యుతభక్తిలలన వరించు-
మాలికగతి తిరుమణివడంబులును
తలనిడు విష్ణుపాదపుఁ దమ్మిపువ్వు
మెలుపైన కెంబట్టు మేలుకుళ్ళాయి
అరవిందనయను కృపామృతధార-
కరణిఁ జూపట్టెడు కంఠమాలికయు
నరహరికై కంకణము గట్టియున్న-
సరణిఁ జూపట్టు పచ్చల కడియములు
ధవళనేత్రుని శారదావిలాసంబు
నివసించునట్లున్న నిలువు పేరణము
వాసుదేవునియాజ్ఞ వడిఁ జుట్టుకొన్న-
యా సత్త్వగుణమన నలరు దుప్పటము
నలవడఁ జతురంతయానంబు నెక్కి
బలసి సంకీర్తనపరులు సేవింప
ఘనతర ధవళ శంఖధ్వాన మడరఁ
జనుదెంచి నృపతి యాస్థానంబుచెంతఁ
బల్లకి డిగి వెంటఁ బరఁగు వైష్ణవుని-
నల్లన చెయ్యూఁది యాలోని కరిగి
కూరిమిఁ దనరాక కోరి వీక్షించు-
నారాజుఁ గదిసి నెయ్యమితియ్య మెసఁగ
సొలవక "శ్రీనివాసో రక్ష" తనుచు
నెలమిఁ జేతిరుమణి నిచ్చె నిచ్చుటయు,

నెదురుగాఁ జనుదెంచి యెలమిఁ జేకొనుచు
ముదమునఁ గరపద్మములు సాఁగి మ్రొక్కి
యన్నమాచార్యుతో నునుఁగు దీపింపఁ
దిన్నని పసిఁడిగద్దియమీఁద నుండి

### మరలఁ బాటలు పాడించుట

కవులు విద్వాంసులు గాయకుల్ భూమి-
ధవులు సామంతులు దనుఁ జుట్టి కొలువ-
నంగజగురుమీఁద నభినవంబైన-
శృంగారయుతపదశ్రేణిఁ బాడింప
"చెలులార! వేంకటశిఖరినాయకుని-
కలికికిఁ గడగంటఁ గనుపట్టునెఱుపు
చెలువ మేగతి నుండెఁ జెప్పరే" యనిన
"నలువునఁ బ్రాణేశు నాఁటిన చూపు
నిలువునఁ బెఱుక నూనిన శోణితంబు
తలపోయఁ గాదుగదా" యన్న పదము
పలుమఱుఁ బాడించి పాడించి చొక్కి
తలయూఁచి "యిది! కవిత్వం" బని మెచ్చి
యనుపమంబైన ద్రోణాచార్యుమహిమ
గనియుఁ ద్రౌపదితండ్రి గర్వించినటుల-
నన్నమాచార్యు మహత్త్వ మంతయును
గన్నారఁ గనియును గర్వాంధుఁడగుచు
పదరక వేంకటపతిమీఁద నుడువు-
పదముల రీతి నాపై నొక్కపదము
చెప్పుమా యనవుడుఁ జెవు లిరుగేల-
నప్పళింపుచు మూసి హరిహరీ! యనుచుఁ

బరమపతివ్రతాభావంబుఁ బూని
హరి ముకుందునిఁ గొనియాడు నా జిహ్వ
నినుఁ గొనియాడంగనేర దెంతైన
నను నెట్లు పలికితి నైచ్యంపుఁబలుకు-
నాయచ్యుతునిఁ దక్క నన్యుల వినుతి-
సేయుట నా కన్న చెలియలి వావి

## సంకెల వేయించుట

నిను నొల్ల నిటువంటి నీపొందు నొల్లఁ
జనియెద వేంకటేశ్వరుఁ గొల్వ నేను
అనుచు దిగ్గన లేచి యరిగెడు గురుని
పనిఁబూని భటులచేఁ బట్టి తెప్పించి
తన బాల్యసఖ్యంబుఁ దలఁచి సంపదలఁ
దనయంతవానిఁగాఁ దనరఁజేసితిని
గబ్బిమై నొక మాట కావలెనన్న
గొబ్బునఁ గోపించుకొన నేలవచ్చె
నీ వేమి సేయుదు నిను నింత సేయు-
నావల్ల నేరము నను నింతసేసె-
నని కనుఁగవ యెఱ్ఱనై నిప్పు లురుల
ననుచరవర్గంబు నదలించి పిలిచి
లోఁగి నే నెంత దాళుచు వేఁడుకొనిన
లోఁగని పుడమివేలుపుదంట కోడె-
ఱంకెలు చన మూరురాయరగండ-
సంకెల నిడి మొగసాలలో నిడుఁడ
యన నాడిగెలవార లాచార్యుఁ దోడు
కొనిపోయి మొగసాలఁ గూర్చుండ నిలిపి

కొంకుచు రాజునకును భయంపడుచు
శంకలేమియు లేక సంకెల వేసి
కావలియై నలుగడ నుండి; రంతఁ
గోవిదుఁడైన యగ్గురువరేణ్యుండు
మునుపు ప్రహ్లాదుండు మురవైరిఁ దలఁచి
దనుజబాధలఁ గాలఁ దన్నిన కరణి
ఫణిరాజశైలేంద్రుఁ బ్రణతార్తిహరుని
గణుతించి హృదయపంకజవీథి నిలిపి
"సంకెల లిడువేళఁ జంపెడువేళ-
నంకిలి ఋణదాత లాఁగెడువేళ
వదలక వేంకటేశ్వరుని నామంబె
విదలింప గతిగాని వేఱొండు లేదు
వనమాలి యతఁడె నావగపెల్ల నుడుపు"-
ననునర్థములతోడ నలవడియుండ
సంకలితాత్ముఁడై సరగున నొక్క-
సంకీర్తనముఁ జెప్పి శరణుసొచ్చుటయు
ఘల్లున వీడి శృంఖల లూడె; గుండె
ఝల్లనఁ జూచి యచ్చటివారు బెగడి
యీవిధం బంతయు నా రాజుతోడ
వేవేగఁ బఱతెంచి విన్నవించుటయు,
నగి వడి సింహాసనము డిగ్గ నుఱికి
పగగొన్న బెబ్బులిపగిది నేతెంచి
అన్నయార్యునిఁ జూచి యయ్యరో! వద్ద-
నున్నవారల కెల్ల నొగి *లించి మించి

---

* లంచమిచ్చి - కావచ్చు.

వేయని సంకెళ్లు వీడె నటంచు
మాయురె! నీ వెంత మాయ వన్నినను
నే నేల పోనిత్తు నిది నిక్కమైన-
నే నుండి తిరుగ వేయించెద నిపుడు
కిదుకక నీదు సంకీర్తనంబునకు
నది వీడెనా నిజంబని యెన్నవచ్చు
నీ పాలిదైవంబు, నిన్ను, నీ మహిమ
బాపురె! యని మెచ్చి పాటింపఁదగును-
ననుచు నొద్దనె యుండి యా నిగళంబు
తనికి చేనెత్తి యిద్దఱు దేర మగుడ
నెగసక్కెమునకు వేయించిన గురుఁడు
నగి తొంటి సంకీర్తనము సేయుటయును
కాలిసంకెల *చిటికనవ్రేలి పలుము-
చీలలు వీడి చెచ్చెర నూడిపడినఁ

### రాయలపశ్చాత్తాపము

బరికించి భూపతి భయమంది యతని-
చరణాబ్జములఁ జక్క సాఁగిలి మ్రొక్కి
కన్నీరు గదుర గద్గదకంఠుఁడగుచు
పన్నిన దైన్య మేర్పడఁగ నిట్లనియె;-
నపరాధి నపరాధి నన్నమాచార్య!
కృపఁజూడు నను నీవు కృపణశరణ్యా!
యెఱుఁగని పసిబిడ్డఁ డేమైనఁ జేయ-
నరుదైన తల్లికి నలుగంగఁదగునె?

---

* 'చిటుకన వ్రేలి పలము' - అయియుండవచ్చు.

నను నీవు పిన్నటనాఁటనుండియును
బనుపడ బంటుగాఁ బనిగొంటి గనుక
మందెమేళమున నీ మహిమఁ జింతింప-
కిందఱవలె నేన యిట్టు చేసితిని-
వేంకటపతివి నీవే మాకు మనసు-
శంక లింకించి ప్రసన్నుండ వగుము
నీ వలిగిన నల్గు నీలవర్ణుండు
నీవు మెచ్చిన మెచ్చు నీరజోదరుఁడు-
నాయర్థ మంతయు నన్నమాచార్య
నీయుందె కంటిమి నిక్కంబు గాఁగ;
నని పట్టమహిషితో నతనిఁ గీర్తించి
పనిఁబూని పన్నీటఁ బాదముల్ కడిగి
బంగారు విరులజొంపములఁ బూజించి
పొంగారువేడుక భూషణావళులఁ
జిత్రాంబరంబులఁ జిత్రవస్తువులఁ
జిత్రంబుగాఁగ భూషించి తోషించి
తనకుఁగా మును పాయితంబైన పసిఁడి-
యనుసుల చతురంతయాన మెక్కించి
భజియించి తనమూఁపు పల్లకికొమ్ము
నిజభుజంబున నిడి నెమ్మి గావింప,-

## అన్నమాచార్యుఁడు రాజు ననుగ్రహించుట

నది గని ముదమంది యన్నయార్యుండు
సదయుఁడై నృపతి నెంజలిఁ బ్రస్తుతించి
మునుపటి నీచేయు మొక్కలంబునకు-
ననుతాపమును జెంది తది కారణమున

మునుకొన్న యపరాధమును తాళుకొనియె
దనుజారి; యింక నింతటనుండి నీవు
నరహరిసంకీర్తనము సేయువారిఁ
బరసమానులుగాఁగఁ బరికింపవలదు
మురవైరి కృతయుగమున సర్వజనుల
నిరత నిజధ్యాననిష్ఠచే మెచ్చుఁ;
గ్రతువులఁ ద్రేతాయుగమున, నర్చనలఁ
బ్రతిలేనియట్టి ద్వాపరమున నలరు;
నా మూఁడు యుగముల ధ్యానాదివిధుల-
నేమేమి నరులకు నిచ్చు నన్నియును
జలజోదరుఁడు నిజసంకీర్తనమునఁ
గలియుగంబున నిచ్చుఁ గావున, నీవు
ప్రతిలేని వేంకటపతిమీఁద భక్తి-
నతని దాసులమీఁద నారీతి భక్తి
వదలక మనుమని వరదుఁడై పలికె;-
నది మొద లా రాజు నలలేని కూర్మి
సభయుఁడై యన్నమాచార్యు శేషాద్రి-
విభునిఁగా నాత్మ భావింపుచునుండె;
సకలలోకములు నా చందాన గురుని
నకలంకగతిఁ గొనియాడంగఁదొడఁగె;-
నా రాజు వీడ్కొని యాదేశికుందు
నారాయణాచలనాథు సేవించి
శృంగారమంజరిఁ జేసి శేషాద్రి-
శృంగవాసునకు నర్పించి యిచ్చుటయు,

నాడుచుఁ బతకమాకన్నలజోల
పాడఁగ నాఁడెల్లఁ బసిబిడ్డ నైతి-
నా కృష్ణమాచార్యు నధ్యాత్మవినుతి-
రాకఁ గొన్నాళ్లు విరక్తుండనైతి
జగతి నీ శృంగారసంకీర్తనముల-
కగపడి మంచిప్రాయపువాఁడ నయితి
నని వేంకటేశ్వరుఁ డన్నమాచార్యుఁ
గనుఁగొని వాత్రుచ్చి గారవించుటయు
వేదముల్ పొగడఁ గోవిదులు నుతింప
నా దేవతలు కొనియాడ గోవింద!
నే నిన్నుఁ గొనియాడ నెంతటివాఁడ
నా నేర్పు నీ నేరు పరసి చూచినను
పలికెడు వీణలోపలి చక్కఁదనము
పలికించునతనిదై పరఁగిన రీతి-
ఐని వినుతించి, యయ్యంబుజోదరునిఁ
దనుఁ గన్నతండ్రి నెంతయు మెచ్చఁజేసి
ప్రతివత్సరంబు తప్పక వృషభాద్రి-
పతికిఁ గావించు నా బ్రహ్మోత్సవములు
సేవించుకొనుచు నా శ్రీశైలనాథు-
పావన వినుతి ప్రభావంబుచేత
జగతిపై సకల వాచాశుద్ధి కలిగి
నగుచునైనను దీవనల నిచ్చెనేని
లలిమీఱఁ గినిసి యొల్లమిఁ దిట్టెనేని
యల రెండు నెపుదు ప్రత్యక్షమై చూపు-

## అన్నమాచార్యుని మహిమలు

నా వరకృత్యంబు లన్నింటి లెక్క
గావింప నాకు శక్యమె, నాఁటివార-
లెఱుఁగుదు; రవి పెద్ద లెఱిఁగింప వినుచు-
నెఱిఁగిన కృతకృత్యు లిపుదును గలరు;
ఐన నందొక కొన్ని యనఘమానసుల-
వీనులవిందుగా వినుతింతు నేను
మందెమురాయ నామక నరసింహ
దండనేత్రున కిష్టధనబలస్ఫూర్తి-
ననుపమంబుగ వేంకటాద్రి చెంగటను
తన యగ్రహారమై తనరుచునున్న
మరులుంకు (?) నొక జీడిమామిడి దాన
సరసంబువోయిన చవిఁ బండ్లు పండు-
నెట్టనై గొప్పవై యేపారు పండ్ల
విట్టివీఁగుచుఁ దనవీథి నెన్నడిమి
మినుకైన మంచిమామిడిరీతి నెదుటఁ
గనుపట్టు నా చెట్టుఁ గని యొక్కనాఁడు
కపటమానసుల యాకారంబు పోలె-
నపు డెంతో దృష్టప్రియంబులై యున్న
శ్రీమాధవునకు నర్పించి యాపండ్లు
తా మారగింప నర్తటఁ బండ్లు పులియ
నమృతంబుతోఁబుట్టువగు పద్మ మోవి-
నమృతంబు దనివోవ నాను వెన్నునికి-
నీయెడ నెఱుఁగక యీ జీడిపులుసు-
కాయ లెట్లొసఁగితిఁ గటకటా యనుచు-

నా చెట్టు ముట్టితి నప్పయ్య దీన-
నేచిన దుర్గుణంబెల్లఁ బోఁజేసి
మించైన తియ్యమామిడి సేయుమనినఁ
బంచదారలవంటి ఫలములదయ్యె;-
నా సుద్ది విని యొకఁ డట పెండ్లియాడఁ
గాసువీసము నాకుఁ గల్గ దీవింపు-
మన విని, యటువలె నౌఁగాక యనిన
వెనుకొని వాఁ డెన్ని వేఁడినఁగాని
కాసువీసంబునే కాని యొక్కరుఁడు
చేసేత నొకరూక చేతిలో నిడఁడు;
అది విని యది యొట్టి(ట్ట?)దని గాయకుందు
తదనుజ్ఞ మహిమగాఁ దలఁచి యేతెంచి
ఓతండ్రి నాపెండ్లి కొదవెడు ధనము
చేతికి రా దయసేయవే! యనుడు-
నటువలె నౌఁగాక! యనిన, నా విప్రుఁ-
డట వీథి కేఁగెదునపుడు రా జొకఁడు-
నాదరంబునఁ బిల్చి యడిగిన ధనము
ద్వాదశీ కన్యకా దాన మిచ్చుటయు-
నా వార్త విని జను లరుదందికొనుచు
వావిరి నొడి వళావళికిఁగా బెగడి
చెలువొందు నా గురు శ్రీపాదరక్ష
తల నిడి తమయాపదల వీడికొనిరి;

## అన్నమాచార్య పురందరదాసుల చెల్మి

గద్య పద్యముల డెబ్బది రెండుమంది-
యాద్యులచేఁ గొనియాడించుకొన్న

రసికుండు శ్రీపండరంగవిఠ్ఠలుఁడు
కొసరెడు భక్తి చేకూరఁ జేసేత-
నెనయు సంధ్యలకు నీళ్ళియ్యఁ జేకొనుచుఁ
దనరు పురందరదాసాహ్వయుండు
పరమ భాగవతుఁడై పరఁగుచు నంద-
వరకులాగ్రణియైన వైష్ణవోత్తముఁడు
సవరించు మురవైరి సంకీర్తనములు
కువలయంబునఁ బేరుకొన్న మాత్రమున
తలఁచిన భూత బేతాళ పిశాచ-
ములు పాఱిపోవ నిమ్ముల శుభం బెసఁగ
విని కనియును లోన వెఱఁగందికొనుచు
చని, తాళ్ళపాకశాసనుఁ డన్నమయ్య
వెన్నునిఁగానె భావించి కీర్తించి
సన్నుతిసేయ నాచార్యవర్యుండు
నతని విఠ్ఠలునిఁగా ననయంబు దలఁచి
ప్రతిలేని గతుల సంభావించె నపుడు;-
నీ రీతి మహిమ లనేకముల్ వెలయ
వారక వరభాగవతులు గీర్తింప

## అన్నమాచార్యుల రచనలు

*యోగమార్గంబున నొకకొన్ని బుధులు
రాగిల్ల శృంగార రసరీతిఁ గొన్ని
వైరాగ్యరచనతో వాసింపఁ గొన్ని
సారసనేత్రుపై సంకీర్తనములు

* పూర్వముద్రణములో నిది క్రమము దప్పినది. చూ: వివేక దీపిక.

సరసత్వమునఁ దాళసముఖముల్ గాఁగ
పరమతంత్రములు ముప్పదిరెండువేలు,
ప్రవిమల ద్విపద ప్రబంధరూపమున
నవముగా రామాయణము, దివ్యభాష
నా వేంకటాద్రిమాహాత్మ్య మంతయును
గావించి, రుచుల శృంగారమంజరియు
శతకముల్ పదిరెండు సకలభాషలను
ప్రతిలేని నానాప్రబంధముల్ చేసి,

## అన్నమాచార్యసంతతి

సిరివరు మెప్పించి చెలఁగి యా దేవు-
వరమునఁ దనయంతవారిఁ బుత్రకుల
నరసయాచార్యు నున్నతయశోధనునిఁ,
దిరుమలాచార్యుని ధీవిశారదునిఁ
గాంచి, వారున. దనకరణి విద్యలను
గాంచనాంబరు భక్తికరిమిఁ బెంపొంద
శౌరికథాసుధాసల్లాప గరిమ
ధారుణి నెంతయుఁ దనరారుచుండె;
మనసునఁ గపటంబు మాని సద్భక్తి
ననఘమౌ నీ యన్నమాచార్యచరిత
*వినిన వ్రాసినఁ బేరుకొనినఁ జదివిన
జనులకు నిష్టార్థసౌఖ్యంబు లొదవు-

* వినిన వ్రాసినఁ జదివినఁ బేరుకొనిన - మాతృక. చూ: వివేకదీపిక.


## అంకితము

నని యలమేలుమంగాధీశు పేర-
నినమండలాంతరా హితమూర్తి పేర-
హరి పేర దరచక్రహస్తుని పేర
ధర నెన్ను మా కులదైవంబు పేర-
నారీలఁ దాళ్ళపాకాన్నమాచార్యు-
నేలిన శ్రీవేంకటేశ్వరు పేర-
నంకితంబుగను శ్రీహరిభక్తపాద-
పంకజార్చక తాళ్ళపాకాన్నమార్య-
తనయ తిమ్మార్యనందన రత్న శుంభ-
దనుపమ శ్రీవేంకటాధీశదత్త-
మకరకుండలయుగ్మ మండితకర్ణ
సకలవైష్ణవపాద సంసేవకాబ్జ-
సదనా వధూలబ్ధ సరసకవిత్వ-
విదితమానస తిరువేంగళనాథ-
*విరచిత సద్భక్తి విభవాన్నమార్య-
చరితంబు జగదేకసన్నుతం బగుచు
నాచక్రశంఖాంక యశముతోఁగూడ
నాచంద్రతారార్కమై యుండుఁగాత.

* * *

---

* విరచితంబైన యీ యన్నమాచార్య - వ్రాఁతప్రతి.





T.T.D. Religious Publications Series No. 566
Price Rs. 25/-

'అన్నమాచార్య చరిత్రము' అటు చరిత్ర, ఇటు సాహిత్యం - ఈ ఉభయ రంగాల్లోనూ మిగుల విలువైన గ్రంథం. చిన్నన్న కవీంద్రుడు రచించిన ఈ మనోజ్ఞకావ్యాన్ని - లభించిన ఒకే ఒక వ్రాతప్రతి ఆధారంతో - చక్కగా పరిష్కరించి, విపులమైన పీఠికను రచించి, ప్రామాణికంగా తీర్చిదిద్దిన ప్రతిభాసముపేతులు, ప్రాతస్స్మరణీయులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

గత శతాబ్ది పూర్వార్ధంలో ప్రచురితమైన ఈ ద్విపద కృతిని మళ్ళీ వ్రాతప్రతితో పరిపోల్చి, సముచితములైన సూచనలతో పరిష్కరించి, దీని తృతీయ ముద్రణను 'వివేకదీపిక'తో ప్రకాశింపజేసిన ప్రజ్ఞాసమంచితులు సుగృహీత నామధేయులు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు.

అన్నమాచార్య వాఙ్మయారాధకులకు 'అక్షరభక్ష్య' అయిన ఈ మధురకృతి ఇన్నేళ్ళకు పునర్ముద్రణ పొంది పాఠకుల అందుబాటులో నెలకొన్నది. "చాటెద నిదియే సత్యము సుండో!; ఇహపర మొసగను ఈతడే సుండో!" - అని చెయ్యెత్తి చాటుతూ వున్న ఆ 'పదకవితా పితామహుని' అమృత సందేశాన్ని సహృదయులెల్లరూ తన్మయులై ఆలకించండి! తత్పరులై ఆచరించండి!! ధన్యులై తరించండి!!!

Published by P. Krishnaiah, I.A.S., Executive Officer, T.T. Devasthanams and printed at T.T.D. Press, Tirupati.